This ... SASBAN Book No ..........

# ప్రభాత్

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు) (పీపుల్స్‌వార్) దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ అధికార పత్రిక

సంపుటి : 2 సంచిక : 1 జన్మదిన ప్రత్యేక సంచిక ఏప్రిల్ 1996

## ఉన్నతస్థాయి గెరిల్లా జోన్‌గా దండకారణ్యాన్ని పెంపొందిద్దాం !

ఏప్రిల్ 22 భారత కార్మిక వర్గానికి, పీడిత ప్రజానీకానికి ఒక మహత్తర దినం. ఆ రోజు భారత విప్లవోద్యమంలో ఒక మైలు రాయి. ఎందుకంటే రివిజనిజం నడ్డివిరిచి నిర్మాణపరంగా నయా రివిజనిస్టుల (సిపిఐ-యం) తో పూర్తిగా తెగతెంపులు చేసుకున్న రోజు, భా. క. పా. (మా-లె) ని ఏర్పరచుకున్న సుదినం. అంటే ఏప్రిల్ 22 భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు) పార్టీ జన్మదినం. నగ్జల్బరీ తరానికి ఇది 28వ పుట్టినరోజు లేదా మా-లె పార్టీకి 27 సంవత్సరాలు పూర్తి అవుతున్న రోజు.



రివిజనిస్టు, నయారివిజనిస్టు పార్టీలయిన సిపిఐ, సిపిఐ-యం లు పార్లమెంటరీ రొంపిలో కూరుకుపోయి వర్గపోరాటానికి తిలోదకాలిచ్చిన సమయంలో 'నగ్జల్బరీ' 'శ్రీకాకుళం'లు ఎజండా మీదికి వచ్చాయి. 'విప్లవ పరిస్థితి అద్భుతంగా ఉంది, అందుకునే భౌతిక శక్తులు అంటే విప్లవ పార్టీ అవసర'మని భావించిన నగ్జల్బరీ పోరాట నాయకత్వం బోల్షివిక్ పార్టీ నిర్మాత కా. లెనిన్ వారసత్వాన్ని పుణికిపుచ్చుకుంది. ఆ పరిణామమే కా. చారు మజుందార్ (సి. యం) నేతృత్వంలో ఏప్రిల్ 22, 1969న కలకత్తా మైదానంలో లక్షలాది ప్రజల సమక్షంలో విప్లవ శిశువు సి. పి. ఐ. (యం. యల్) ఆవిర్భావం. దానికి రక్త మాంసాలు చేకూర్చినదే శ్రీకాకుళ (ఆదివాసీ) రైతాంగ పోరాటం. ఇదంతా '70ల నాటి చరిత్ర.

దేశవ్యాప్తంగా విప్లవకారుల ప్రధాన కేంద్రంగా రూపొందిన భా. క. పా. (మా-లె) సైద్ధాంతికంగా నిర్మాణపరంగా పటిష్టపరచుకోడానికి మే '70లో 8వ కాంగ్రెసు జరుపుకుంది. కాని అనతికాలంలోనే రాజకీయ, నిర్మాణ బలహీనతల వల్ల, అనుభవరాహిత్యం, తీవ్ర నిర్బంధం, అంతర్గతంగా మితవాద అవకాశవాదుల విచ్ఛిన్నకర చర్యల వలన పార్టీ చీలిపోవడం ప్రారంభమై, కా. సియం మరణంతో ముక్కచెక్కలై పోయింది. దీనితో కేంద్ర కమిటీ గాని, కేంద్ర నాయకత్వం గాని లేకుండా పోయింది.

చిత్తశుద్ధితో పనిచేస్తున్న రాష్ట్ర నాయకత్వములున్నచోట ఏదో ఒక మోతాదులో పార్టీ జీవం పోసుకోవడం ప్రారంభమైన కాలం '72 తర్వాతది. అదే సమయంలో జాతీయ స్థాయిలో పార్టీకి ఓ రూపం తేవాలని చేసిన ప్రయత్నాల్లో భాగమే 1973లో మనం కూడ ఉండి ఏర్పడిన సి. ఓ. సి. మరియు మహాదేవ్‌ముఖర్జీ, సత్యనారాయణ

సింగ్, వేణు లాంటి వారు ఏర్పరచుకున్న కేంద్ర కమిటీలు ఎవరికి వారే నేలవిడిచి సాము చేస్తూ 'తమదే సరైనది. తామే నిజమైన యం.యల్. పార్టీ వారసులం' అన్న ఒంటెత్తు పోకడలతో అతివాద దుస్సాహసికులుగానో, మితవాద అవకాశవాదులుగానో మిగిలిపోయి చివరకు ఎవరి కేంద్రం నిలవకుండా నీరుకారిపోయిన దశాబ్దం కాలమే '80 లది.

ఇదంతా ఒక పార్శ్వమైతే చరిత్రకు మరో పార్శ్వం కూడా ఉంది. అదే శ్రీకాకుళ పోరాట వారసత్వాన్ని కొనసాగిస్తున్న భా.క.పా.(యం.యల్) ఆంధ్ర రాష్ట్ర కమిటీ అనుభవం లోని అభివృద్ధి. ఆనాటి ఆంధ్ర రాష్ట్ర కమిటీ ప్రధానంగా సత్యనారాయణసింగ్-షెల్కా ల. ఓ. యస్. సి. పిల మితవాదాన్నెదిరించే క్రమంలో అతివాద ధోరణి నుండి పూర్తిగా బయటపడలేకపోయింది. అయినా సాయుధపోరాటం ప్రధాన పోరాట రూపం మాత్రమే నని గుర్తించి భూస్వామ్య వ్యతిరేక రైతాంగ గెరిల్లా పోరాటంతో పాటు పాక్షిక పోరాటాల నిర్వహణకు, ప్రజాసంఘాల నిర్మాణానికి పూనుకున్న కాలం. ఫలితంగా కార్మిక, కర్షక, విద్యార్థి, మేధావి రంగాలలో విప్లవ ప్రజా సంఘాలు వెలిశాయి. వర్గపోరాటాన్ని తీవ్రతరం చేయాలంటే ప్రజా ఉద్యమాలకు (పాక్షిక పోరాటాలకు) దూరంగా ఉండరాదనే రాజకీయ సంకల్ప ఫలితమే విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ, ప్రత్యేక తెలంగాణ, ప్రత్యేక ఆంధ్ర ఉద్యమాలలో శక్తిమేరకు పాల్గొనడం. అలాంటి ఆచరణలోనే ఆ ఉద్యమాల నాయకత్వం యొక్క వర్గస్వభావాన్ని బహిర్గతపరుస్తూ ('పిలుపు' పత్రికది అలాంటి పాత్రే) విప్లవ రాజకీయాల వైపు వారి మిలిటెన్సీని మళ్ళించడంలో సఫలమైన అనుభవం ఆంధ్ర రాష్ట్ర కమిటీది. ప్రజాసంఘ (మాస్ లైన్) ఏర్పరచుకోడానికి ఈ పునాది చాలదని చరిత్ర తేల్చివేయగా 'ఎమర్జెన్సీ' (అత్యవసర పరిస్థితి 1975-77) తర్వాత కాలంలో పార్టీ 'గ్రామాలకు తరలండి కేంపెయిన్' లు నిర్వహిస్తూ విద్యార్థి యువజనులపై ఆధారపడి రైతాంగాన్ని కదలించడంతో భూస్వామ్య వ్యతిరేక పోరాటాలు విజయవంతంగా చేబట్టిన కాలం. '78లో బద్దలయిన జగిత్యాల రైతాంగ పోరాటం అలాంటి ఆచరణ ఫలితమే. అలా ఏర్పడి ప్రజాపునాది '80ల నాటికి కరీంనగర్-ఆదిలాబాద్ రైతాంగ పోరాటాలుగా అభివృద్ధి చెందింది. రైతు కూలీ సంఘం, సి.కా.స.లాంటి సంస్థల పుట్టుకకు బీజాలు వేసింది. వర్గపోరాటం యొక్క వాసిలో వచ్చిన ఈ మార్పు రాసి నే పెంచింది.

ఫలితంగా ఏప్రిల్ 22, 1980 లో పీపుల్స్‌వార్ పార్టీ ఆవిర్భవించింది. దండకారణ్యం ఉనికిలోకి వచ్చింది. గెరిల్లా దళాలు భూస్వామ్య వ్యతిరేక పోరాట స్థాయి నుండి ప్రభుత్వ సాయుధ బలగాలను ముఖాముఖీ ఎదుర్కొనే స్థాయికి ఎదిగాయి. వర్గపోరాటంలో మారిన ఈ దశే ఉత్తర తెలంగాణ, దండకారణ్యం లను స్పెషల్ జోన్‌లుగా రూపుదిద్దుకునేట్లు చేసింది. ఇది 27 ఏళ్ళ చరిత్ర ఫలితం.

'69లో పుట్టిన యం.యల్. పార్టీ '80ల్లో ఏర్పడిన పీపుల్స్‌వార్ పార్టీ రెండూ వేర్వేరు కావు, భిన్నమైనవీ కావు. మొదటి దాని కొనసాగింపే రెండవది. చారిత్రికంగా ఉద్యమంలో వచ్చిన గుణాత్మక మార్పుకు సంకేతం పీపుల్స్‌వార్ ఏర్పడటం తప్ప '69లోని పోరాట వారసత్వమే కాదు. అదే విప్లవ పార్టీ. అందుకే మన పార్టీకి 27 సంవత్సరాలని చెప్పుకుంటున్నాం. ఇంకా సరిగ్గా చెప్పుకోవాలంటే 1925లో పుట్టిన భారత కమ్యూనిస్టు పార్టీ నిజమైన వారసులం మనమే. అంటే పార్టీ వయస్సు 70 సంవత్సరాలని చెప్పుకోవడం కూడ సరైందే. సామ్రాజ్యవాదాన్ని, వలసపాలనని వ్యతిరేకిస్తూ స్వాతంత్ర్యపోరాటం లేదా జాతీయోద్యమం సాగుతున్న కాలంలో పార్టీ పుట్టింది. అయితే జాతీయోద్యమానికి కాంగ్రెసు పార్టీ విద్రోహం, వలసపాలకుల మారిన రాజనీతితో నామమాత్ర స్వాతంత్ర్యం రాగా, '47ల తర్వాత (ఉమ్మడి) కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం అలాగే '60ల నాటికి మార్క్సిస్టు పార్టీ నాయకత్వం వర్గపోరాటానికి తిలోదకాలిచ్చి రివిజనిస్టులుగా మారిపోవడంతో పోరాటవారసత్వంలో ఆవిర్భవించిన విప్లవ పార్టీయే భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు) పార్టీ. కనుక పార్టీకి 70 సంవత్సరాలు నిండాయని చెప్పుకోవడం సముచితమైనదే.

1969 నాటికి ప్రపంచంలో చైనా కేంద్రంగా అంతర్జాతీయ సోషలిస్టు క్యాంపు ఉండింది. 1969 లో పార్టీకి నయా రివిజనిజంతో తెగతెంపులు చేసుకున్న పోరాట నాయకత్వం పునాది అయితే '80 నాటికి కా. మావో మరణానంతరం చైనా రివిజనిస్టు కేంపులోకి జారిపోవడంతో అంతర్జాతీయంగా ప్రపంచంలో ఎక్కడా సోషలిస్టు దేశాలు లేదా సోషలిస్టు క్యాంపు లేని స్థితి. అలాంటి నేపథ్యంలో ఏర్పడిన పీపుల్స్‌వార్ పార్టీకి కరీంనగర్-ఆదిలాబాద్ రైతాంగపోరాటాల నుండి ఉద్భవించిన నగ్జల్బరీ తరం యొక్క ఉడుకు రక్తం జీవం అందించింది.

పార్టీలో అంతర్గతంగా సంభవించిన రెండు సంక్షోభాల కాలంలో యావత్ పార్టీ సైద్ధాంతికంగా పోరాట పథాలమైన నిలబడింది. పీడిత ప్రజల ఆశాజ్యోతిగా తనని తాను కాపాడుకుంది. ఉద్యమం భౌతికంగా నష్టాలు పొందినా వర్గపోరాటంలో రాటుతేలింది. శత్రువు నెదిరించడంలో ఉక్కుశక్తిగా నిలిచింది. ప్రజల విశ్వాసాన్ని చూరగొనడంలో బోల్షివిక్ పార్టీ వారసులుగా వన్నె కెక్కింది. అమరుల రక్తం ఇంకకుండా పోరాటాన్ని సాగిస్తోంది.

అలా అనేక విజయాలు సాధిస్తూ పురోగమిస్తున్న మన పార్టీ ముందు ప్రధానంగా రెండు కర్తవ్యాలు నిలిచాయి. ఇందులో ఒకటి, అఖిల భారత పార్టీ నిర్మాణం. రెండవది, ఉత్తర తెలంగాణ దండకారణ్యం లను ఉన్నతస్థాయి గెరిల్లా జోన్‌లుగా పెంపొందించడం.

ఈ కర్తవ్యాల నిర్వహణలో నిమగ్నమైన మన పార్టీ నవంబర్ '95లో అఖిల భారత ప్రత్యేక కాన్ఫరెన్స్ జయప్రదంగా జరుపుకుంది. పార్టీ 8వ కాంగ్రెస్ '70ల్లో జరగ్గా, 9వ కాంగ్రెస్ సన్నాహాల్లో భాగంగా జరిగిన ఈ కాన్ఫరెన్స్‌కు ఎంతో ప్రాముఖ్యత ఉంది. నిజమైన విప్లవకారులను ఐక్యంచేయగలిగిన 8వ కాంగ్రెస్ తర్వాత తిరిగి అనేక ఆటుపోట్ల మధ్య భారత విప్లవకారులను సమైక్యపరచే కృషిలో సాధించిన విజయాలతో 25 ఏళ్ల అనంతరం జరిగిన కాన్ఫరెన్స్ తన కృషిని మరింత సీరియస్‌గా కొనసాగిస్తూ అందులో సఫలంకావడానికి చేరువలోనే ఉందనిపిస్తోంది. అంతేగాదు భారత పాలక వర్గాలను ఏకాకులను చేయడానికి విశాల ఐక్య సంఘటన ప్రాతిపదికనే దేశం లోనూ, ఉపఖండంలోనూ జరుగుతున్న వివిధ జాతుల పోరాటాలతో, విప్లవ పోరాటాలతో సమైక్యం కావడానికి మన పార్టీ చేపట్టిన కృషి అన్ని రంగాలలోనూ జయప్రదం అవుతూ పీడిత ప్రజల్లో విప్లవాకాంక్షను పెంపొందిస్తుంది.

ఇకపోతే రెండవ కర్తవ్యం ఎంతో కఠినమైనది, పటుతరమైనది. భారత సాయుధ బలగాలతో తలపడుతూ ఓడిస్తూ క్రమక్రమంగా ప్రజల అధికారాన్ని, ప్రజల నియంతృత్వాన్ని, ప్రజల సంస్కృతిని పెంపొందించడానికి ప్రజాయుద్ధం ద్వారా ప్రజా సైన్యం చేపట్టే ఒక ప్రక్రియ. ఉత్తర తెలంగాణ, దండకారణ్యం లలో గత 15 సంవత్సరాల నుండి ప్రజలు తమ పోరాటాల ద్వారా తమ అధికారాన్ని గ్రామగ్రామాన ఖాయం చేసుకోడానికి చేస్తున్న కృషి ప్రత్యేక ప్రాంతాల రూపం తీసుకొని వివిధ రంగాలలో సత్ఫలితాలనిస్తుంది. తరతరాల ఫ్యూడల్ భూస్వాముల అధికారాన్ని బద్దలు కొట్టిన రైతాంగం, దున్నేవాడికే భూమి ప్రాతిపదికనే వారి పట్టా భూములు పంచుకొని పల్లెనే ప్రజలకే అధికారం అంటుంటే, 'అడవినే ఆదివాసులకే హక్కు' అంటున్నారు. గ్రామ కమిటీల నాయకత్వం లో ప్రజలు తమ సమస్యలు, తమ బాగోగులు తామే చూసుకుంటూ నిర్ణయించుకుంటున్నారు.

అయితే దీన్ని దెబ్బ తీయాలనే నేడు దండకారణ్యంలో శత్రువు సరిహద్దులు గీచి యుద్ధం చేస్తున్నాడు. అడవిని ఖాకీ బలగాల చేతుల్లో పెట్టి శాంతి భద్రతల పేరుతో అమాయక ఆదివాసులను నిలువునా హత్యచేస్తున్నాడు. గడచిరోలి, బండారా, బాలాఘాట్ డివిజన్‌లలో పెద్ద ఎత్తున హంతకదాడులు కొనసాగిస్తూ విప్లవకారులను భౌతికంగా నిర్మూలించడం పై కేంద్రీకరించాడు. పార్టీ 27వ జన్మదినం సమరోత్సాహంతో జరుపుకొన్న గెరిల్లాల్లో నేడు కనీసం అర డజను మంది కామ్రేడ్స్ మన మధ్యన లేరు. శత్రువుతో సాహసంగా పోరాడుతూ చిరునవ్వులతో ప్రజలకోసం అసువులు బాసారు. ఈ సంవత్సర కాలంలో ఎందరెందరో జైలు పాలైనారు. అరెస్టులు, చిత్రహింసలు, మానభంగాలు కొనసాగించడంలో పోలీసులదే ఇష్టారాజ్యమై పోయింది. శత్రువు రాక్షస నిర్బంధకాండను అమలుచేస్తున్నా ప్రజలు తమ విముక్తికోసం పోరాడుతూనే ఉన్నారు. అమరుల ఆశయాలు అడుగడుగునా మనలో శత్రువుపై కసినీ, ప్రతీకారాన్నీ పెంచుతూ లక్ష్యాన్ని నిర్దేశిస్తున్నాయి. ఆ త్యాగాల వెలుగులో తెగించి పోరాడుదాం. ప్రజా సైన్యం ద్వారా సైన్యాన్ని ప్రజాయుద్ధం ద్వారా యుద్ధాన్ని నిర్మూలిద్దాం. భారత ప్రజాతంత్ర విప్లవాన్ని సఫలం చేద్దాం.

ºº అమరవీరులకు జోహార్లు!

ºº సి.పి.ఐ. (యమ్.యల్) (పీపుల్స్‌వార్) జిందాబాద్!

ºº మార్క్సిజం-లెనినిజం-మావో ఆలోచనా విధానం వర్ధిల్లాలి!

ºº ప్రపంచ సోషలిస్టు విప్లవం వర్ధిల్లాలి!

ºº సామ్రాజ్యవాదం నశించాలి!

---

కా. లెనిన్ 128వ జయంతికి విప్లవ జేజేలు!

సంఘీభావం

## కెన్‌సారోవివా చిరంజీవి - చిరస్మరణీయుడు

నైజీరియా పోరాట చరిత్రలో 10 నవంబర్, 1995 ఒక విషాదకరదినం. నైజీరియాలోని 5 లక్షల ఓగోనిలాండ్ ప్రజలు తమ ప్రియమైన నాయకుడు, పర్యావరణవాది, రచయిత కూడా అయిన కెన్‌సారోవివా ను కోల్పోయిన రోజు. పశ్చిమాఫ్రికాలోనే అత్యంత జనసంఖ్య కలిగిన (9 కోట్లు) నైజీరియాలో అధికారంలోనున్న శానీ అబాచా మిలటరీ నియంతృత్వ ప్రభుత్వం ప్రముఖ మానవ హక్కుల కార్యకర్త కూడా అయిన కెన్‌సారోవివాతో పాటు మరో 8 మందిని ఉరితీసిన రోజు. సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటం ఒక గొప్ప కార్యకర్తను నష్టపోయిన రోజు. ప్రజల కోసం ప్రాణాలర్పించిన పోరాటకారునికి జోహార్లర్పిస్తూ, ఓగోనిలాండ్ ప్రజల సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటం జయప్రదం కావాలనీ ఆశిద్దాం.

కెన్‌సారోవివా 1941 లో 10 అక్టోబర్ నాడు రివర్స్ స్టేట్స్ రాష్ట్రంలో జన్మించాడు. 1960 వరకు బ్రిటన్ వలసగా ఉన్న నైజీరియాలో సాగిన జాతీయ ఉద్యమంలో కెన్‌సారోవివా పాల్గొన్నాడు. 'విముక్త్యానంతరం' ఉపాధ్యాయ వృత్తిని చేపట్టాడు. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత ఆఫ్రికా ప్రజల్లో వెల్లుబికిన స్వాతంత్ర్య ఆకాంక్ష ఫలితంగా సామ్రాజ్యవాద సంకెళ్ళనుండి అనేక దేశాలు 'విముక్తి పొందినా' వాటి భల్లూకపు పట్టు సడల లేదన డానికి అక్కడ ముందుకు వస్తున్న నయా వలస విధానాలు, మిలటరీ ప్రభుత్వాలే ప్రబల తార్కాణం. నైజీరియాలో 1983 లో జరిగిన సైనిక తిరుగుబాటుతో సైనికపాలన ఆరంభమైంది. 1993లో ఎన్నికలు జరుగుతాయని ఎదురు చూడగా, చివరి క్షణంలో మళ్ళీ సైన్యం జోక్యంతో ప్రస్తుత అబాచా గద్దెనెక్కాడు. 1996 మార్చి చివరి వారం లో ఎన్నికల తంతు ముగించి, తన పాలనకు 'ప్రజాస్వామ్య' లేబిల్ అంటించుకున్నాడు.

ఆంగ్లో-డచ్ కు చెందిన 'షెల్' కంపెనీ చేపట్టిన చమురు వెలికితీతల వల్ల ఓగోనిల్యాండ్‌లో నైజర్ డెల్టాగా పిలవబడే నైజర్ నదీ పరీవాహక ప్రాంతంలోని సారవంతమైన పొలాలన్నీ పట్టిపోయాయి. మత్స్య సంపద నాశనమై జీవితాలు దుర్భరమైనాయి. పర్యావరణ సమస్య తీవ్రంగా ముందుకు రావడమే గాకుండా తాగునీటి సమస్య కలు షితం గావడంతో ప్రాణాంతకమైనది. ఈ సమస్యలు 5 లక్షల ఓగోని ప్రజల జీవన్మరణ సమస్యగా పరిణమించగా, ప్రజలు తమ జీవన హక్కుల కోసం నిరసనోద్యమాన్ని అహర్నిశంగా చేపట్టారు. ఫలితంగా, 1990లో కెన్‌సారోవివా అధ్యక్షుడిగా "ఓగోని ప్రజ మనుగడోద్యమం" (మూవ్‌మెంట్ ఆఫ్ ది సర్వైవల్ ఆఫ్ ది ఓగోని పీపుల్-మోసోప్) రూపు దిద్దుకుంది. శాంతియుత నిరసనోద్యమంగా ప్రారంభమైన మోసోప్ 1993 జనవరికల్లా తీవ్ర ప్రతిఘటన దశకు చేరుకుంది. "ఓగోని ప్రాంతం ఓగోనిలదే (స్వయం నిర్ణయాధికారం), బహుళజాతి షెల్ కంపెనీ తీసే చమురు నిక్షేపంలో 'స్థానిక ప్రజలకు వాటా ఉండాలి' 'పర్యావరణ వినాశనాన్ని అరికట్టాలి' లాంటి నినాదాలు ముందుకు వచ్చాయి. మోసోప్ ఒక పోరాట పతాకను కూడా నిర్ణయించుకుంది. ఇదంతా సామ్రాజ్యవాదుల బహుళజాతి కంపెనీలకు, వారికి సేవచేసే నైజీరియా ప్రభుత్వానికి కన్నెర్ర అయింది. షెల్ తో మిలాఖతైన నైజీరియా నియంతల సర్కార్ దోపిడి విధానాలను కెన్‌సారోవివా స్పష్టంగా తన మాటల్లో ప్రపంచానికి ఇలా తెలియ చేస్తున్నాడు:

"1958 నుండి ఓగోని ప్రజలకు వ్యతిరేకంగా తాను విజయవంతంగా ప్రారంభించిన పర్యావరణ యుద్ధంలో భాగంగా, తాము ప్రారంభించిన మానవ సంహారాన్ని పరిపూర్తి చేయడానికి కంపెనీ నైజీరియాలోని సెక్యూరిటీ ఏజెన్సీలకు రక్షణ సుంకాన్ని చెల్లిస్తోంది. 126 ఓగోని గ్రామాలుంటే, 30 గ్రామాలను మిలటరీ పాలకులు పూర్తిగా తగులబెట్టారు. చిన్నా, పెద్దా అనే భేదం లేకుండా అన్ని గ్రామాలకు పనిగట్టుకొని మిలటరీ వెళ్ళింది; ఓగోని ల్యాండ్‌లో వ్యాపారం సాగే పరిస్థితి మరి లేదు. వ్యవసాయ భూములు ధ్వంసం చేయబడ్డాయి. పాఠశాల లేవీ పనిచేయడం లేదు. మార్కెట్లన్నీ క్రమబద్ధంగా దాడులు జరుగుతున్నాయి. గాయపడిన వారినీ, లైంగిక దాడులకు గురైన వారినీ చికిత్సచేసే ఆసుపత్రులు లేవం"టూ తన ఆవేదనవ్యక్తంచేస్తూ పోరాటాన్ని తీవ్రతరం

చేయడంతో 1993 లో కొంతకాలం 'షెల్' సంస్థ మూతపడవలసి కూడా వచ్చింది. దీనితో, ప్రభుత్వం తన అణచివేత విధానాలను మరింత తీవ్రతరం చేసింది.

నైజీరియా ప్రభుత్వానికి తమ ఆదాయంలో 90 శాతం చమురు క్షేత్రం నుండే లభిస్తుంది. ఈ శుద్ధి చేయబడిన బంగారం లాంటి చమురు మొత్తంగా అమెరికా, పశ్చిమ యూరప్ దేశాలకు ఎగుమతి అవుతుంది. అమెరికా మరియు పశ్చిమ యూరప్ దేశాలు ముఖ్యంగా బ్రిటన్ తన దేశంలో తయారైన విలాస వస్తువులు నైజీరియా కులీన వర్గంకోసం తరలిస్తూ, చమురు నిల్వలను దిగమింగుతోంది. ఈ ఏడాది బ్రిటన్ 600 మిలియన్ డాలర్ల ఎగుమతులు చేసి నైజీరియాను కొల్లగొట్టింది. ప్రపంచ చమురులో 5 శాతం చమురును ఉత్పత్తి చేస్తున్న నైజీరియా ఐ.యం.యఫ్. మరియు ప్రపంచ బ్యాంకు నిర్దేశించే వ్యవస్థీకృత ఆర్థిక విధానాల గాడిలో పయనిస్తూ సంక్షోభంలో కొట్టుమిట్టాడుతుంది. అంతర్జాతీయ విపణిలో నైరా విలువను దిగజారుడు చేస్తూ వస్తున్న ఆర్థిక విధానాల ఫలితంగా 1983లో ఒక డాలర్ 1.5 నైరాల విలువ చేయగా నేడు 50 నైరాలకు పడిపోయింది. ఐ.యం.యఫ్. మరియు ప్రపంచ బ్యాంకు విధానాల ఫలితంగా కరెన్సీ మారకంలో వస్తున్న డివాల్యుయేషన్ (దివాళావేషం) నేడు 'గ్లోబలైజేషన్'లో మూడవ ప్రపంచ దేశాలను వేధిస్తున్న ఒక తీవ్ర సమస్యగానే కొనసాగుతుంటే, మరోవైపు నిరుద్యోగం, అధిక ధరలు, ద్రవ్యోల్బణం విచ్చలవిడిగా రాజ్యమేలుతున్నాయి. నైజీరియాలో 90 శాతం ద్రవ్యోల్బణం కరాళ నృత్యంచేస్తూ ప్రజల మూలుగులను పీలుస్తూంది. విదేశీ అప్పులు సరేసరి. 1985లో 14 బిలియన్ డాలర్లుగా వున్న విదేశీ రుణభారం 1995 నాటికి 30 బిలియన్ డాలర్లకు పెరిగి స్విస్ బ్యాంకుల్లో నియంతల నిల్వలను ఏకధాటిగా పెంచేస్తున్నాయి. ఇలా ఎక్కడికక్కడే నైజీరియా ప్రజలను, వనరులను నిలువు దోపిడి చేస్తున్న బహుళజాతి సంస్థలు, సైనిక పాలకులకు 'మోసోప్' కార్యకలాపాలు చెంపపెట్టులా తయారయ్యేసరికి, భవిష్యత్ అగమ్యగోచరమై ప్రశ్నార్థకంగా సవాలైంది.

ఓగోని ప్రజలపై, మోసోప్ సంస్థపై, కెన్‌సారోవివా పై ప్రతీకార చర్యలు, నిర్బంధ విధానాలు, అణచివేత తీవ్రమైంది. ఒక మోసోప్ కార్యకర్త మాటల్లో చెప్పాలంటే "ఆ ప్రాంతమంతా అత్యంత క్రూరరూపమైన మార్షల్ లా క్రింద వుంది..... తమ చిత్తం వచ్చిన రీతిలో వ్యవహరించేందుకు సైనికులకు అనుమతి ఇవ్వబడింది" అంటాడు. నిర్బంధ హస్తాన్ని చాచిన అబాచా ప్రభుత్వం 1993లో కెన్‌సారోను నాలుగుసార్లు అదుపులోకి తీసుకుంది. అయినా ఉద్యమం పురోగమిస్తూనే ఉండింది. 1994 మే నెలలో 'మోసోప్' తలపెట్టిన ఒక ప్రజా ప్రదర్శన సందర్భంగా జరిగిన ఘర్షణల్లో నలుగురు ఓగోని విద్రోహులైన పోలీసు అధికారులు చావగా, ఆ నేరం కెన్‌సారోవివా కు, మోసోప్‌కు ప్రభుత్వం అంటగట్టింది. 13 మందిని అరెస్టుచేసింది. 17 మాసాలు జైలులో ఉంచి, సాధారణ న్యాయస్థానాల్లో కాకుండా ప్రత్యేక మిలటరీ ట్రిబ్యునల్‌లో విచారించింది. ఈ ప్రహసనం జరుగుతున్న కాలంలో జైలు నుండి రహస్యంగా రాసిన వివా ఉత్తరం ప్రపంచ ప్రజలకుఅనేక విషయాలను తేటతెల్లం చేసింది. "తనను ఉరితీయడం ఖాయమనీ, ఎందుకంటే, అప్పీలు చేసుకునే అవకాశమే లేనపుడు ప్రభుత్వం నియమించిన ట్రిబ్యునల్ చేసేది ప్రభుత్వం చెప్పే దొంగ సాక్ష్యాల మీద ఆధారపడే కదా శిక్ష వేసేది" "నా వేదనంతా బ్రిటిష్‌వాడి కనుసన్నలలో ఓగోని జాతి ప్రజల వినాశనం జరిగిపోతున్నందుకే" అన్నాడు. "నా జాతి హక్కుల కోసం, నా జాతి ఆశలకు ప్రతినిధిగా నేనెప్పుడూ జీవించే ఉంటాను. నేను లంచానికి బలై చనిపోతున్నాను తప్ప నిజంగా చనిపోవడం లేద"ని లేఖలో పేర్కొన్నాడు. మోసోప్ ఉద్యమాన్ని వేర్పాటువాద ఉద్యమంగా పేర్కొన్న సైనిక సర్కార్ ఆ నాయకుడికి కోర్టులో డిఫెన్స్ వకీళ్ళను కూడ భారం చేసింది. సాక్ష్యులను కొనేసింది లేదా బెదిరించింది. అంతిమంగా ప్రజాయోధులకు మరణదండన విధించింది. ఒక్క 1995లోనే 93 మందిని పొట్టన పెట్టుకున్న ఆ (అ) న్యాయమూర్తులకు పౌరుల జీవితాలు సామ్రాజ్యవాదుల ప్రయోజనాల ముందు ఈకకన్నా తేలికైనవే. కానీ, ప్రపంచ చరిత్రలో నియంతలకు, వారి యంత్రాంగానికి ప్రజలు తగిన రీతిలోనే బుద్ధి చెప్పి శిక్షిస్తారనే అన్ని పోరాటాలల్లో నిరూపితమవుతుంది. ప్రజలు అజేయులు. ఇక్కడ సోరెన్ కీర్కుగార్డ్ వ్యాఖ్యానాలు గుర్తుతెచ్చుకోవడం అవశ్యం. " "నియంత మరణంతో వాడి పాలన అంతమవుతుంది, అమరవీరుని మరణంతో

అతని పాలన ఆరంభమవుతుంది" అన్న వాక్కు వాస్తవం, సత్యం.

10 నవంబర్ 1995 తెల్లవారు ఝామున పోర్ట్ హార్కోర్ట్ నగరమంత మిలటరీ కవాతుల మధ్య నలిగిపోయింది. శతఘ్నులు మోహరించబడినాయి. కెన్‌సారోవివా మరో ఎనిమిదిమంది పోరాటకారులు పోర్ట్ హార్కోర్ట్ జైల్లో ఉరికంబాలకు వేళ్లాడబడ్డారు. భౌతికంగా వారిని పీడిత ప్రజల నుండి, ఓగోని ప్రజల నుండి, నైజేరియా పాలకులు వేరుచేశారు. కానీ వీవా రచనలు, సందేశాలు సామ్రాజ్యవాదుల వినాశానికి మనలను సదా ఉద్యుక్తులను చేస్తూనే ఉంటాయి.

"అంతర్జాతీయ సభ్య ప్రపంచానికి విజ్ఞప్తి చేస్తున్నాను. వారు వెంటనే ఓగోనిల్యాండ్ కు సహాయం అందజేయడమే గాకుండా, తాము ఈ విషయంలో జోక్యం చేసుకుని అంతర్జాతీయ ట్రిబ్యునల్‌ను ఒకదాన్ని ఏర్పాటుచేసి ఓగోని ప్రజలపై హత్యాకాండ జరుపుతున్న వ్యక్తుల్ని, కంపెనీని కూడా విచారణ జరిపి శిక్షించాలి. నాకేమయినా, చివరికి న్యాయం జరిగేట్టు చూడండి" అన్న కెన్‌సారోవీవా నిర్వహించిన సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటం ఒంటరిపోరాటం కాదనీ, దేశాలు స్వాతంత్ర్యాన్ని, జాతులు విముక్తిని ప్రజలు విప్లవాన్ని కోరుకుంటున్నారనే,, సాధించి తీరుతారని నిరూపిద్దాం.

కెన్‌సారోవీవా ఉరితీతపై ప్రపంచ ప్రజలు, అనేక దేశాలు తమ తీవ్ర నిరసనను వ్యక్తంచేశారు. నైజేరియాను జూనియర్ ప్రపంచకప్ పోటీల్లో పాల్గొనకుండా అభ్యంతరం చెప్పడమే గాకుండా, ఆఫ్రికాల్లో మహా ఆటగాళ్లయినా నైజేరియా ఫుట్‌బాల్ క్రీడాకారులను ఆ దేశంలో జరిగే టోర్నమెంట్ల నుండి దక్షిణాఫ్రికా బహిష్కరించింది. ఆ ప్రాంతంలో వ్యాపార నిషేధాన్ని ప్రకటించింది. ఆ దేశ అధ్యక్షుడు మండేలా ఒక ప్రకటనలో అబాచా ఆగడాలను అరికట్టాలంటే అమెరికా, బ్రిటన్‌లకే సాధ్యం అంటూ పెంటగన్ ఆధిపత్యాన్ని ఒప్పుకోక తప్పలేదు. అమెరికా, బ్రిటన్ మిగతా సామ్రాజ్యవాద దేశాలు కంటితుడుపు ప్రకటనలు చేస్తూనే, మరునాటినుండి నైజేరియా సైనిక పాలకులకు ముఖ్యంగా అమెరికా, బ్రిటన్‌లు తమ హంతక వ్యాపారం ద్వారా ఆయుధాలను అందించసాగాయి మరోవైపు, అదే రోజు న్యూజిలాండ్‌లోని ఆక్లాండ్‌లో 54 కామన్వెల్త్ దేశాల ప్రభుత్వాధినేతల సమావేశం (ఛోగమ్) జరిగింది. సభ్యదేశమైన నైజేరియాను బహిష్కరిస్తూ, తీవ్రమైన చర్యలు చేపట్టడం అని కాకుండా, తాత్కాలికంగా రెండేళ్ళ సస్పెన్షన్ ప్రకటించి చేతులు దులుపుకొని సంతాప సందేశాలు అందించారు. దీనితో మూడవ ప్రపంచ దేశాలపై పెరుగుతున్న బహుళ జాతి సంస్థల, సామ్రాజ్యవాదుల పట్టు, ఇక్కడి దేశాధినేతల దిగజారుడుతనం, తాకట్టు స్వభావానికి ఇదో మచ్చు తునక. ప్రజల ఒత్తిడి మూలంగా అమెరికాతో సహా 15 దేశాలు నైజేరియా నుండి తమ రాయబారులను ఉపసంహరించుకొని, సంబంధాలు తెంచుకుంటున్నట్టు ప్రకటిస్తూ తమ నిరసనను వ్యక్తం చేయాల్సి వచ్చింది. ఏప్రిల్ చివరి వారంలో లండన్‌లో సమావేశమైన ఐక్యరాజ్య సమితి సభ్యదేశాలైన ఎనిమిది దేశాలు నైజేరియాలో మానవ హక్కుల హననంపై స్పందిస్తూ సభ్య సమాజం నుండి వెలివేయాలని కోరుతూ అంతిమంగా అమెరికా, బ్రిటన్‌ల చేతిలో తమ తీర్మానాన్ని పెట్టాయి. ఉరిశిక్షలు అమలు జరిగిన 150 రోజుల వరకు కూడా కనీసం ఒక నిజ నిర్ధారణ కమిటీని పంపడానికి ఐక్యరాజ్య సమితి ని అనుమతించని 'వీటో' దేశాలైన అమెరికా, బ్రిటన్‌లు నైజేరియాలో పౌరహక్కుల కోసం తమ చమురు వ్యాపార లాభాలను వదులుకుంటాయా?

ఐక్యరాజ్య సమితి కి చెందిన మానవ హక్కుల సంఘం ఓగోని ల్యాండ్ పర్యటించినప్పుడు (ఏప్రిల్ మొదటి వారం) ప్రజల్లో వ్యక్తమయిన తీవ్ర నిరసనను మిలటరీ నియంతలు అరెస్టులు, కాల్పుల ద్వారానే అణచివేశారంటే నేటి బేరకారు లాంటి యు.ఎన్.ఒ. నిజ నిర్ధారణ సంస్థల మైనం తెలుసుకోవచ్చు.

అమెరికా, ఇతర సామ్రాజ్యవాద దేశాల ఆధిపత్యం రోజురోజుకు మూడవ ప్రపంచంలో బలపడుతుంది. గ్లోబలైజేషన్ పేరుతో తమ లాభాలను పెంచుకోవడానికి సామ్రాజ్యవాదం ప్రజల ఉనికినే సవాలు చేస్తుంది. ప్రచ్ఛన్న యుద్ధం ముగిసినదంటూనే నిత్యం ప్రజలను యుద్ధం మధ్య నిలిపి వుంచే విధానాలనే సామ్రాజ్యవాదం చేపడుతుంది. ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాల విప్లవోద్యమానికి తీరని ప్రమాదంగా సామ్రాజ్యవాదుల అణచివేత విధానాలు ముందుకు వస్తున్నాయి. 1961 లో ఘనాలో లుముంబాను హత్యచేసారు. 1973లో చిలీలో అలెండీని హత

మార్చారు. బహుళజాతి సంస్థల ఇష్టాయిష్టాలపై ప్రభుత్వాలు నిలబడుతున్నాయి. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత అమెరికాలో ముమియా అబు-జమేల్ చట్టపరంగా ఉరికంబం ఎక్కించబోతున్న తొలి వ్యక్తి. క్లింటన్ ఆసియా పర్యటనలో భాగంగా పసిఫిక్ రిమ్‌లో ఒక లక్ష సైన్యం ఉండితీరాలంటూ శాసించాడు. మరో క్షేత్ర హిందూ మహా సముద్రం 'శాంతి మండలం' అన్న నినాదం దశాబ్దాలైనా అమలవడం మాట అటుంచి అమెరికా ఆధిపత్యానికి కేంద్రంగా నిలుస్తుంది. 1966లో డిగోగార్షియాలో ఆధిపత్యం సంపాదించిన అమెరికా దాన్ని మిలటరీ స్థావరంగా మార్చి భారీ ఆయుధాలతో నింపివేసింది. వీరి అడుగుజాడల్లోనే భారత విస్తరణవాదులు నడుస్తున్నారు.

హిందూ మహాసముద్రం పరివాహక ప్రాంతంలో ఇండియా అతి పెద్ద దేశం. సైనిక శక్తిలో అమెరికా, రష్యాల తర్వాత ప్రపంచంలో భారత నౌకాదళం మూడవది. సుమారు 150 కి పైగా ఆయుధ నౌకలున్నాయి. ఇండియాకు ఉన్న దాదాపు 1,50,000 చదరపు మైళ్ళ సముద్ర తీర ప్రాంతంలో భారత్ తన కార్యకలాపాలను కొనసాగిస్తూ పొరుగు దేశాలకు ప్రమాదకరంగా తయారవుతోంది.

కెన్‌సారోవివాను గుర్తుచేసుకోవడం ముమియా ప్రాణాలను కాపాడడానికి నడుం బిగించడమే. వీరి ప్రాణాలను కాపాడటం కోసం పోరాడడం సామ్రాజ్యవాద వినాశనానికి నడుంబిగించడమే. దోపిడీ పాలక వర్గాలను, సామ్రాజ్యవాదాన్ని నిర్మూలించేంత వరకు మనం చేపట్టే ఏ పోరాటానికైనా ప్రమాదం తప్పదు. అందుకే ప్రపంచకార్మిక వర్గం మరింత జాగరూకతతో పీడిత ప్రజల పోరాటాలతో మమేకమవుతూ సామ్రాజ్యవాదానికి గోరీ కట్టినపుడే పౌరహక్కులు, అసలైన పర్యావరణం ఊపిరి పోసుకుంటుంది.

సాహిత్యంలో అంతర్జాతీయ నోబుల్ బహుమతికి ఎన్నికైన కెన్‌సారోవివా, 1995 సంవత్సర శాంతిప్రియుడిగా అంతర్జాతీయ ఇందిరాగాంధీ బహుమతి అందుకోవడానికి కూడా ఎన్నికై, అందుకోలేకపోయిన తొలిగ్రహీత. దక్షిణ నైజీరియాలోని ఓగోనిల్యాండ్‌లో ఆంగ్లో-డచ్‌కు చెందిన 'రాయల్ షెల్' చమురు సంస్థ దోపిడిని అరికట్టడానికై పోరాడుతూ ప్రాణాలర్పించిన ధన్యజీవి కెన్‌సారో.

నైజీరియా జనాభా - 9 కోట్లు తెగలు - 250 భాషలు - 200
కెన్‌సారో వివా జననం - 10 అక్టోబర్ 1941
కెన్‌సారో వివా కెరీర్ — అధ్యాపకుడు, రచయిత, ప్రముఖ మానవ హక్కుల కార్యకర్త
కెన్‌సారో వివా అరెస్టు - మే 1994.
కెన్‌సారో వివా మరణం - 10 నవంబర్ 1995 వయస్సు - 55 సం.లు
కామన్వెల్త్ సభ్య దేశాలు - 52
నైజీరియా కరెన్సీ - నైరా ; ద్రవ్యోల్బణం - 90 శాతం 50 నైరాలు 1 డాలరు
నైజీరియా విదేశీ రుణ భారం - 30 బిలియన్ డాలర్లు
నైజీరియా సైనిక నియంత - శానీ అబాచా.

oo కెన్‌సారో వివా అమర్ హై. నైజీరియా ప్రజల పోరాటం ఒంటరి పోరాటం కాదు.
oo సామ్రాజ్యవాదం నశించాలి. ప్రపంచ సోషలిజం వర్ధిల్లాలి.

---

"సామ్రాజ్యవాదం మరియు మనిషిని మరో మనిషి దోపిడిచేసే వ్యవస్థ ఉన్నంతకాలం యుద్ధాలకు భూమిక ఉంటుంది. ఎంతో శాస్త్రీయమైన అధ్యయనం చేసిన తరువాత లెనిన్ కనుగొన్న వాస్తవమైన సూత్రమిది".

(సిపిసి, అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమం యొక్క సాధారణ పంథాపై చర్చా వేదిక, పేజీ 239)

హవాలా రాకెట్

## సరళీకృత ఆర్థిక విధానాల పర్యవసానమే ఎడతెగని కుంభకోణాలు

గత ఆరు మాసాల నుండి దేశం కుంభకోణం వార్తలతో అట్టుడికి పోతూంది. ఒక వైపు ఎన్నికల హాలాహాలం, శేషన్ గారడీలు మరోవైపు కుంభకోణాల వార్తలు. పెటీబూర్జువా, పట్టణ మధ్యతరగతి ప్రజల ఊపిరిసలుపుకోనీయడం లేదు. "ముందు దగా, వెనక దగా కుడి ఎడమల దగా దగా" అంటూ ప్రజా కవి శ్రీశ్రీ రాసిన చందంగా మారిన నేటి సమాజంలో పాలకవర్గాలవైపు, పార్లమెంటు ఎన్నికలవైపు పెరుగుతున్న అసహ్యత వ్యతిరేకత ఫలితంగా రాజకీయ పార్టీలన్నీ 'క్లీన్ చిట్' లేబుళ్ళతో ప్రజల ముందుకు రావాలని తెగతంటాలు పడుతున్నాయి. కుంభకోణాల ఆరోపణలతో పత్రికల్లో పేరు అగుపడిందంటేనే సదరు నేతలకు పార్టీ టికెట్టు కేటాయించడానికి కూడా ఎన్నికలు పార్టీలు సాహసించడం లేదు. భారతీయ జనతా పార్టీ మరో అడుగు ముందుకు వేసి అద్వానీకి వైకై కొత్త రథయాత్ర బాధ్యత అప్పగించి దేశం మీదికి వదిలి బరువు దించుకుంది. 'రాజకీయాలు నేరపూరితం' వై ఓరా కమిటీ తన నివేదికలో చెవుల ఇల్లు కట్టుకున్నట్టు సెలవిచ్చినా ఏ ఒక్క రాజకీయ పార్టీ కూడా ఖాతరు చేయడం లేదు సరికదా ఓటరు సహనాన్ని పరీక్షిస్తున్నాయి. 11వ లోక్‌సభ ఎన్నికల్లో 100 మంది, నేరచరిత్రులు కల్గి, ఒక్క ఉత్తరప్రదేశ్‌లోనే ఓట్ల మైదానంలోకి వచ్చి పోటీకి నిల్చినారు. ఇది ఇలా వుండగా "పారిశ్రామికవేత్తల నుండి ఎన్నికల చందాలు తీసుకోకుండా ఏ ఒక్క రాజకీయ పార్టీ కూడా మనలేదని" అన్ని పార్టీల అధినేతలు ఐక్యంగా బజార్లోకొచ్చి బహిరంగ ప్రకటనలు ఇస్తూ ముసుగులో గుద్దులాటకు కాలం చెల్లిపోయిందని ఓటరుకు 'విజ్ఞప్తి' చేస్తున్నారు.

తమిళనాడులో పేదప్రజలకు పంపిణీ చేయాల్సిన చీరలు, ధోవతుల్లో కుంభకోణాలు మొదలు బడిపిల్లల యూనిఫారాలు, ఆంధ్రలో కాలేజి పిల్లల పాఠ్యపుస్తకాల వరకు అన్ని రంగాలలో బ్యూరాక్రాట్లు, రాజకీయ నేతల సమైక్యతతో కుంభకోణాలు ఎన్నెన్నో పత్రికల్లో చూస్తున్నాం. రాయపూర్‌లో రైస్ మిల్లుల కుంభకోణాలు మొదలు ఢిల్లీలో రాష్ట్రపతి, ప్రధానమంత్రి వరకు స్వ-విదేశీ యజమానుల నుండి ముడుపులు దిగమింగిన ఆరోపణలే వార్తల్లో చదువుతున్నాం. చివరకు బీహారులో పశువుల దానాల్లో, పాలల్లో జరిగిన కోట్లాది రూపాయల కుంభకోణాల కూడా నిత్యం చర్చల మధ్య నలుగుతున్నాయి. ఢిల్లీలో నిర్మించిన 8,768 గృహాలను సక్రమ పంపిణీ చేయలేదనీ, ఆశ్రిత పక్షపాతం, లంచాలు చోటుచేసుకోగా 20 ఏళ్ళ వై సర్వీసులున్నా ఇళ్ళు నోచుకోని అభాగ్యులెందరో ఏళ్ళ తరబడి వరుసలో నిలబడి ఆశగా చూస్తూనే ఉన్నారు. నిజానికి ఐదేళ్ళు నిండాయంటే ఇళ్ళు ఇవ్వాలని ప్రభుత్వం నిర్దేశించింది. ప్రభుత్వం రాసుకున్న ఏ ఒక్క నియమం పాటించబడడం లేదనడానికి రాజప్రాసాదాల వంటి గృహాలను ఎందరెందరో మహానుభావులు కాలం చెల్లిపోయినా కదలడం లేదు, ఖాళీ చేయడం లేదు. పండిట్ రవిశంకర్ మొదలు వైజయంతిమాల బాలి వరకు ఇలాంటి విమర్శలు ఎదుర్కొంటూనే హాయిగా కాలం గడుపుతున్నారు. ఇక సిగ్గువిడిచిన రాజకీయ నాయకులకు నీతి ఎలావుంటుంది? ఈ కుంభకోణం వైన ఎంతగానో చర్చ జరిగితేగానీ

షీలా కౌల్ తన పదవికి రాజీనామా చివరి క్షణం వరకు సమర్పించింది కాదు. ఇలా వివిధ రంగాల్లో దోపిడీ, మోసం జరుగుతున్నది. పేదవారిని నిలువెల్లా కొల్లగొడుతున్నారు. నోరుమెదిపితే ప్రాణాలు తోడేస్తున్నారు. వారిలో అంతర్గత విభేదాల వల్ల గొడవ మరీ ముదిరితే సదరు కేసు సి.బి.ఐ.కి అప్పగించి చేతులు దులుపుకొని ప్రజల ముందు నీతులు వల్లిస్తూ 'క్లీన్ చిట్‌లు'గా ఉండిపోవాలని ప్రయత్నిస్తున్నారు.

1991లో ప్రభుత్వం ప్రస్తుత 'జైన్ హవాలా' కేసును సి.బి.ఐ.కి అప్పగించినా 5 ఏళ్ళ వరకు ప్రజలకు తెలియకుండా పోయింది. హవాలా లో కేంద్రమంత్రులు, ప్రతిపక్షాల నాయకులు ఉండడంతో ఆ కేసును

→

ముట్టుకోడానికే సిబిఐ జంకింది. పైగా ప్రధానమంత్రే దానికి ప్రత్యక్ష నాయకుడు కావడంతో ఏ కేసూ వెలుగు చూడడం లేదు. 64 కోట్ల రూపాయిలు చేతులు మారిన బోఫోర్స్ కుంభకోణంలో సిబిఐ 200 మంది సాక్షుల్ని ప్రశ్నించి, చివరకు గాలికి వదలేసింది. బాబ్రీ మసీదు కేసులో 500 మంది సాక్షులను ప్రశ్నించినా, 49 మందిపై చార్జిషీట్లు దాఖలు చేసినా కేసు ఊసే లేకుండా పోయింది. బొంబాయి పేలుళ్లలో (1993) 42 మందిని దోషులుగా సిబిఐ గుర్తిస్తే, దానిపై విచారణ జరుపుతున్న శ్రీకృష్ణ కమిషన్‌ను శివసేన-భా.జ.పా సంకీర్ణ ప్రభుత్వం రద్దుచేసి నోరు నొక్కేసింది. సెంట్ కిట్స్ కేసులో తాంత్రిక స్వామి చంద్రస్వామి, లార్రెకోల్స్, కె.ఎల్. వర్మ తదితరుల మీద ఫోర్జరీ కేసు విచారించడానికి సిబిఐ స్వీకరించినా బ్యాంకు అసలు పత్రాలు దొరకడం లేదని కేసు దేకుతుంది. కారణం స్వామి (మి-రా) పార్టీల సంబంధాలే నన్నది జగద్విదితం. ఇలా ఇన్ని కుంభకోణాల్లో ప్రభుత్వం ఒరగ బెట్టిందేమిటో దేశప్రజలకు సుపరిచితమే అయినా తాజాగా 'జైన్ హవాలా'' ఓటర్ల ముందుకు ఎందుకు వచ్చింది?

50 ఏళ్ళుగా కుంభకోణాల్లో కాంగ్రెస్‌తో పాటుగా వివిధ సందర్భాల్లో కాంగ్రెస్‌లో నుండే ఉనికిలోకి వచ్చిన ఇతర రాజకీయ పార్టీలన్నీ నిండా మునిగినా 11వ లోకసభ ఎన్నికలకు మాత్రం ఎప్పటినుండో కలలుకంటూ కస రత్తులు చేస్తున్నారు. ప్రతిపక్షాల గోల భరించలేని పివిఎన్ కు సొంత ఇంట్లోనే ముసలం బయలుదేరింది. అనేక అడ్డదారులు తొక్కితేగాని అయిదేళ్ళు నిండని కాంగ్రెసుకు 'సుస్థిర పాలన' ఏకైక నినాదం కాగా, ప్రతి పక్షాలకు 'అవినీతి' కేంద్ర నినాదంగా నిలిచింది. దీనితో ఖంగుతిన్న పివిఎన్ జైన్ హవాలా వెలికితీయాలనే సిబిఐకి పచ్చజెండా ఊపి అవినీతి (భా)జపానికి కళ్లెం వేయాలనుకున్నాడు. '93 నుండే బిజెపి భావిప్రధానమంత్రిగా అద్వానీని ముందుకు తేవడాన్ని, రాజకీయ శక్తులు/వ్యక్తులు ఎవ్వరు బిజెపి హవా లో కొట్టుకుపోకుండానూ నిరోధించడానికి జైన్ డైరీలను ప్రజలముందు వెల్లడిచేశాడు. అందులో 115 మంది అధికార, రాజకీయ నాయకుల పేర్లున్నాయి. ఇందులో నుండి ఇప్పటివరకు 26 మంది పేర్లు ఎన్నుకొని సిబిఐ చార్జ్‌షీట్లు (నేరారోపణ పత్రాలు) సమర్పించడంతో పివిఎన్ కు తల బరువు దిగినంత పని అయింది. 'భారత దేశానికి రారాజును కావాలనే, టాటా బిర్లా, అంబానీలను మించిపోవాలని'కలలుకన్న ఎస్.కె.జైన్ ముట్టచెప్పిన ముడుపుల వ్యవహారాల్లో తన పేరు ఉన్నా 'కరి మింగిన వెలగపండులా' ప్రధాని మాత్రం జైన్ ఎవరో నాకు తెలవదంటున్నాడు.

1950లలో రావు సాహెబ్ జ్యోతి ప్రసాద్ జైన్‌గా పిలువబడే సైనికోద్యోగి (ఉప సహాయక జనరల్) తన నల్గురు సంతానంతో భిలాయ్ చేరాడు. భిలాయ్ లో 1958లో జైన్ మరియు రాయ్ పేరుతో ఒక కంపెనీ ప్రారంభించి, క్రమంగా ఇతర కంపెనీలకు విస్తరిస్తూనే స్థానికంగా బలసిపోయిన కేడియా, షా, గుప్తా, మరియు ఖేటావాట్ కుటుంబాలతో పోటీపడి లక్షలు ఆర్జిస్తూ 1972 నాటికి దేశ రాజధానికి ఎగబాకాడు. అక్కడ కోట్ల విలువచేసే కాంట్రాక్టులు సంపాదించడంలో ఎన్నెన్నో అడ్డదారులు తొక్కుతూ ధీరూభాయి అంబానీ లాంటి వాళ్లను సైతం మించిపోవాలనే 'దృఢ సంకల్పంతో' జైన్ మాటల్లోనే చెప్పాలంటే 'భారతదేశానికి రారాజును కావాలి. ఈ దేశాన్ని నేనేలాలి'' అన్న లక్ష్యంతో రాజకీయ నేతల స్థాపకానికై అర్రులు చాస్తూ ఢిల్లీలో సెటిల్ అయ్యాడు. 40 సంవత్సరాల పారిశ్రామిక కుటుంబంగా 'ఖ్యాతి' నార్జించాడు. కాగా నేడు పేరుమోసిన ''జైన్ హవాలా''గా వార్తల్లో ప్రముఖంగా వినవస్తున్నది. ఈ కుటుంబంలోని పెద్దాడి పేరే - మిగతా కుటుంబం అంతా ఈ ప్రక్రియలో భాగస్వాములే. ఢిల్లీలో 40 కోట్ల విలువ చేసే అద్దాల మేడలో, అట్లాగే భిలాయ్ లోని పూర్వీకుల రాజప్రాసాదంలో ఇలాంటి అనేక రహస్య ఒప్పందాలన్నింటికి సంతకాలు జరిగిపోయేవి. ఇందుకు ఈ కుటుంబాలు పాటించే పుట్టిన రోజు, పెళ్లి, చావు, షష్ఠిపూర్తి లాంటి వేడుకలు అనుమానానికి ఇసుమంతయినా తావివ్వని వేదికలవుతున్నాయి. ఆ లాభాల వేటలో చెల్లించే ముడుపుల వివరాలన్నీ సునీల్ కుమార్ జైన్ తన ఉద్యోగి జె.కె.జైన్ చేత డైరీల్లో రాయిస్తూ, కంప్యూటర్ ఫ్లాపీల్లో రికార్డు చేయించాడు.

1991 మే నాలుగు నాడు ఢిల్లీలోని జె కే జైన్ ఇంటిపైద దాడి జరిపిన సిబిఐ కి ఈ డైరీలు దొరికి పోయాయి. డైరీల్లో 115 మంది పేర్లు వెల్లడవుతున్నాయి. అమీర్‌భాయి అనే మధ్యవర్తి ద్వారా వివిధ విదేశీ కాంట్రాక్టుల ఫలితంగా తనకు చేరిన కమిషన్ (హవాలా) డబ్బుల్లో నుండి తాను డబ్బులు చెల్లించిన దేశ నేతల అందరి పేర్లు సంకేత పదజాలంలో అందులో రాయబడి ఉన్నాయి. మాజీ రాష్ట్రపతి వెంకటరామన్ మొదలు

చంద్రస్వామి వరకు నాయకులు, బాబాలు, మంత్రులు, ప్రధాన మంత్రులు, గవర్నర్లు, పార్లమెంటు, అసెంబ్లీ ప్రతినిధుల వరకు, రాజకీయ ప్రపంచమంతా ఇందులో ఉంది. 50 ఏళ్ళ "స్వతంత్ర భారతం"లో అన్ని పార్టీల నేతలు ఇరుక్కున్న ఉమ్మడి కేసు ఇదేనంటూ పత్రికలన్నీ చెంగలిస్తూ, తాటికాయంత అక్షరాలతో, ముఖచిత్రాలతో ప్రజల ముందుకు రాడుస్తున్నాయి. ఇంకా నిజం చెప్పాలంటే 65 కోట్లు ఏం ఖర్మ. జైన్ వెలగబెట్టిన 3500-4000 కోట్ల కాంట్రాక్టుల్లో 10-11 శాతం కమీషన్‌లు దిగమింగుతూ ముడుపులు చెల్లించబడ్డాయంటున్న వివరాల ప్రకారం లెక్కలు తీస్తే 350-400 కోట్లు ఉంటాయనీ కూడా పత్రికలే సెలవిస్తున్నాయి. తన లాభాలకు ఆటంకాలుగా నిల్చినవారినీ తుదముట్టించడంలో కూడా జైన్ అందెవేసిన చెయ్యే. యశోధరన్ అనే భిలాయ్‌కి చెందిన ఒక మేనేజర్‌తో పాటు, ఛత్తీస్‌ఘడ్ గనుల స్థానిక సంఘం నాయకుడు రాడికల్ ట్రేడ్ యూనియనిస్టుగా పేరొందిన శంకర్ గుహా నియోగిని హత్యచేయడం వెనుక జైన్ హస్తం కూడా ఉందని భిలాయ్ నినదిస్తోంది. ఇలా వీరి లాభాల వేటలో ఎన్ని ప్రాణాలనైనా తొడి పడగలెత్తడానికే వీరు కృషి చేస్తుంటారని వీరి చరిత్ర తెలుపుతూంది.

పివిఎన్ సరళీకృత ఆర్థిక విధానాల ప్రణాళికా అంటూ 'గ్లోబలైజేషన్'లో భాగంగా గ్లోబల్ కాంట్రాక్టర్లు ఎంతమంది జైన్‌లను సృష్టించి ఎక్కడెక్కడ విడిచి పెడుతున్నారో కాలమే తేల్చాల్సి ఉంది. నేడు ఎస్.కె.జైన్ చెల్లించుకున్న ముడుపుల్లో మూడుపాళ్ళు విదేశీ ఒప్పందాలు కుదర్చడంలో చేతికి చిక్కిన డబ్బులేనట. "స్వీడన్‌కు చెందిన అస్సానా, ఫ్రెంచ్ విద్యుత్ సంస్థ అల్‌స్తాం, సోవియట్ ఎంటర్‌ప్రైజ్ త్యాజాప్రోయెలు" హబీబ్ అమీర్ (అమీర్‌భాయి) అనే హవాలా డీలర్ మధ్యవర్తిత్వం ద్వారా జైన్‌కు చేర్చిన డబ్బులేనట. ప్రస్తుతం అమీర్‌భాయి దేశమంతా వెతికినా, బొంబాయి గాలించినా దొరకడం లేదట. ప్రపంచంలోని సిఐఎ, కెజిబి ల సరసన పేరున్న సంస్థగా చెప్పుకుంటూ 1858 మంది స్టాఫ్‌ను కలిగిన సిబిఐ ఒక సాధారణ నేరస్థుణ్ని పట్టుకోలేకపోతుందనడం సిగ్గుచేటు. హవాలా కేసు సిబిఐ కి బదిలీ అయిన కొద్ది వారాల్లోనే ఆ సంస్థ డిఐజి శర్మ హవాల అధినేత ఎస్.కె.జైన్ సహచరుడి నుండి పది లక్షలు లంచం స్వీకరిస్తూ పట్టుబడినాడంటే కుంభకోణాల కేసులు ఎలా నడుస్తాయో వేరే చెప్పాల్సిన అవసరమే లేదు.

1982 నుండి తాంత్రిక చంద్రస్వామి (గాడ్‌మ్యాన్) మీద అనేక ఆరోపణలు వస్తున్నా అతడిపై నాయకమ్మన్యులు ఈగ వాలనీయడం లేదు. భారత ప్రభుత్వానికి న్యూస్‌ప్రింటు సరఫరా కేసులో ప్రవాస భారత పెట్టుబడిదారుడైన పాఠక్ నుండి లక్ష అమెరికన్ డాలర్లు దిగమింగాడనే కేసు, సెయింట్ కిట్స్ ఫోర్జరీ కేసు, బబ్లూ శ్రీవాస్తవకు ఆశ్రయం ఇవ్వడం లాంటి దేశంలో తీవ్ర సంచలనం సృష్టించిన అన్ని కేసులో నిందితుడైన చంద్రస్వామి ప్రపంచ ఆయుధ విక్రేత కషోగీతో అంటకాగుతున్నాడని దేశం కోడై కూసినా కనీసం సిబిఐ అరెస్టు కూడా చేయలేదు సరికదా తన నియమాలనే ఉల్లంఘించి వాడి ఎయిర్ కండిషన్డ్ రాజప్రాసాదంలోనే వాడిని ఇంటర్వ్యూ చేసిందంటే రాజకీయ నేతల, బ్యూరాక్రాట్లు, నేర ప్రపంచ బాబాల మధ్య సంబంధాలు ఎంత బలంగా రూపొంది రాజ్యమేలుతున్నాయో అర్థంచేసుకోవచ్చు. పైగా 'ఉల్టా చోర్ కోత్వాల్ కోడాటే' అన్నట్లు "నామీద నేరాలుంటే నన్నెందుకు వదలిపెడుతున్నార"ని గాడ్‌ఫాదర్ దబాయింపుల వెనుక ప్రధానమంత్రుల 'హస్తము' ఉన్నదని విడిగా రాయాల్సిన అవసరం లేదు.

కాంగిరేసు నేత విషయం సంకటంలో పడి ఇంటా బయటా పలుకుబడి కోల్పోతూ, రానున్న 11వ లోక్‌సభ ఎన్నికల్లో కుప్పకూలిపోయే పరిస్థితి ఎదురుగానున్న తరుణంలో గట్టెక్కడానికి గడ్డిపోచలా ఎంచుకున్న తతంగమే ఈ కుంభకోణ వ్యవహారం. 1991లో ఈ కుంభకోణం వెలుగులోకి వచ్చినప్పటికీ ఇప్పటివరకు ఇసుమంతైనా ముందుకు సాగని ఈ కేసు దర్యాప్తు ప్రస్తుతం రోజుకో సంచలనాత్మక వార్త సృష్టిస్తున్నట్లు ముందుకు సాగడానికి కారణమేమిటంటే తాను అధికారంలోకి వచ్చింది మొదలు అవినీతి కుంభకోణాలతో నిలువెల్లా మునిగిపోయిన కాంగ్రెస్ పార్టీ, అవినీతికే మారుపేరుగా మారిన కాంగ్రెస్ పార్టీ, రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజల ముందు ఏకాకిగామారే పరిస్థితులు తలెత్తడంతో, తమ పార్టీ కాంగ్రెస్ మాత్రమే అవినీతి పాలు కాలేదంటూ తమతోపాటు తమను మించి ప్రతిపక్షాలు' కూడా ఎలాంటి మినహాయింపులు లేకుండా 'అవినీతిలో భాగస్తులేనని, ప్రజలముందు బహిర్గతపర్చడమే పివిఎన్ ఉద్దేశ్యం. రానున్న ఎన్నికల్లో నినాదాలే కరువయిన ప్రతిపక్షాలు అవినీతినే ప్రధానంనినాదంగా

ముందుకు తీసుకురావడానికి సన్నద్ధమవుతున్న సమయంలో ఈ కుంభకోణాలలో ప్రతిపక్ష పార్టీలు కూడా ఇరుక్కొన్న విషయాలు బహిర్గతమవడంతో వాటికి గొంతులో వెలక్కాయ పడినట్టయింది.

ఒకే దెబ్బతో రెండు పిట్టలను కొట్టిన చందంగా ఒక వైపు ప్రతిపక్షాలను బహిర్గతంచేస్తూనే, మరోవైపు తన పార్టీలో రోజురోజుకు తీవ్రతరమవుతున్న అసమ్మతి ముసలాన్ని అణచివేయడానికే రానున్న ఎన్నికల సమయంలో అసమ్మతి నాయకుల నోళ్ళు మూయించడానికే ఈ తతంగాన్ని ముందుకుతీసుకురావడం పివిఎన్ అసలు పన్నాగం. సిబిఐ ని నేరుగా, చూస్తున్న ప్రధానే స్వయంగా 1991 అనంతరం జైన్ నుండి 3 కోట్లు దిగమింగాడని జైనే చెబుతున్నా, తన మంత్రివర్గంలో నుండి అనేకమంది మంత్రులు, ప్రతిపక్షనేత అద్వానీ, ఢిల్లీ ముఖ్యమంత్రి ఖురానా ఇతర ప్రధాన నిందితులందరూ తమ పదవులకు తిలోదకాలు ఇవ్వాల్సి వచ్చినా, నరసింహారావు మాత్రం నిసిగ్గుగా పదవిని త్యజించాల్సిన అవసరంలేదనే దబాయించుకున్నాడు.

మనదేశంలోని కుంభకోణాల చరిత్రను వెలికితీయాలంటే కనీసం 40 సంవత్సరాల వెనక్కి వెళ్ళాల్సివస్తుంది. 1957లో ఎల్.ఐ.సి. పెట్టుబడులలో 3 కోట్లు గల్లంతయిన కేసులో అప్పటి ఆర్థికమంత్రి టి.టి. కృష్ణమాచారి పదవికి నీరాజనాలు పలికాడు. 1964లో పంజాబ్ ముఖ్యమంత్రి ప్రతాప్‌సింగ్ ఖైరన్ కుటుంబీకులు అక్రమ సంపాదనతో నొమ్ముచేసుకున్నారనే దాస్ కమీషన్ తీర్పువల్ల పదవికి ఉద్వాసన చెప్పాడు. 1971లో విస్తృత ప్రాచుర్యం పొందిన నగర్‌వాలా కేసు ఈ కోవలోనిదే. ఇందిరాగాంధీ స్వరంతో మోసగించి 60 లక్షలు స్టేట్ బ్యాంక్ నుండి డ్రా చేసాడన్న అభియోగం నగర్‌వాలా కేసు ఉదంతం. 1970లో కువో ఆయిల్ కుంభకోణంలో ఇందిరమ్మ పీకల మీదికి రాగా, నేడు జైన్ చిట్టాలో ఇరుక్కున్న శివశంకరే వకాల్తా తీసుకొని గండం గట్టెక్కించాడు. 1974లో ఇందిరాగాంధీ అనుంగబంటు, బాంబులకు బల్యైపోయిన లలిత్ నారాయణ మిశ్రా (బీహార్ ముఖ్యమంత్రి) దిగుమతి లైసెన్సుల కుంభకోణంలో ఇరుక్కుని గట్టెక్కించబడ్డవాడే. 1982కు వస్తే, సిమెంటు కుంభకోణంలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.ఆర్ అంతులే మునిగిపోయి దశాబ్దంకాలం కనుమరుగై తిరిగి నేడు పివిఎన్ మంత్రివర్గంలో 'క్లీన్ చిట్'తో ఆరోగ్య మంత్రిగా ప్రత్యక్షమయ్యాడు. ఇతడే 'ఇందిరా ప్రతిష్టాన్' పేరుతో దేశంమీద పడి డబ్బులు దండుకున్నాడు. ఉనికిలో లేని 'చుర్హట్ శిశు సంక్షేమ సంస్థ' పేరుతో ముఖ్యమంత్రి అర్జున్ సింగ్ 5కోట్ల 50 లక్షలు కాజేసినా అడిగిన నాధుడే లేడు. ఫెరా నియమాలను ఉల్లంఘించాడన్న నేరంపై 1987లో ఆర్థికమంత్రి వి.పి.సింగ్ కొంతకాలం చర్చల్లో నలగ్గా, అదే సంవత్సరం స్వీడన్‌తో జరిగిన 16 వేల కోట్ల బోఫోర్స్ ఒప్పందాల్లో 64 కోట్లు దివంగత రాజీవ్ ఖాతాలో నేటికీ భద్రంగా రికార్డయి ఉన్నాయి. ఇదిలా ఉండగా, మరోవైపు అదే సంవత్సరం జెకోస్లోవేకియా పిస్తోళ్ళ కొనుగోలు వ్యవహారం సిబిఐ వెలికి తెచ్చింది. నాణ్యతలేని తుపాకులను దేశానికి అంటగట్టారన్న ఆరోపణంటే అది ఏదో నాటకీయంగా జరిగిన వ్యవహారం కాదు కదా! 1991 లో అరుణ్ నెహ్రూ ఆంతరంగిక భద్రతా వ్యవహారాల మంత్రి గా 2,500 కోట్ల ఏయిర్ బస్ వ్యవహారంలో 200 కోట్లు స్వాహాచేసారని ఫ్రాన్స్, అమెరికా సంస్థలు చెప్పినా కేసు ఫైళ్ళు ముందుకు కదల లేదు.

ఇక నిర్దిష్టంగా పివిఎన్ ఆర్థిక విధానాల భాగోతం చూస్తే కుంభకోణాలు ఏ మోతాదులో అడ్డూ అదుపు లేకుండా పెరిగిపోతున్నాయో తెలుస్తుంది. ప్రస్తుతం టెలికమ్యూనికేషన్స్, విద్యుత్ రంగం, చమురు మొ. రంగాల్లో విపరీతమైన పెట్టుబడులకు దేశం ఆహ్వానం పలుకుతోంది. ఊట చెరువుల్లా ఈ రంగాలు ఆకర్షిస్తున్నాయి. ప్రపంచీకరణలో భాగంగా బహుళ జాతి కంపెనీలు మూడవ ప్రపంచ దేశాలపై విరుచుకుపడుతున్నాయి. తమ సంక్షోభాలనుండి గట్టెక్కడానికి ఈ దేశాల్లోని వనరులన్నింటిని కాజేయాలనే దురాశతో దాడిచేస్తున్నాయి. 1970ల తర్వాత 'రీగనోమిక్స్' మూడవ ప్రపంచ దేశాలను నిలువెల్లా కొల్లగొడుతుంది. 1991లో 531 కోట్ల రూపాయల విలువగలిగిన విదేశీ పెట్టుబడులు తర్వాత ఐదేళ్ళ కాలంలో 112 రెట్లు పెరిగాయి అంటే 1 లక్షా 23 వేల 150 కోట్ల రూపాయిల పెట్టుబడులు తరలివచ్చాయన్నమాట. పివిఎన్ ఆర్థిక సరళీకృత విధానాలతో ఏటా 1500 కొత్త కంపెనీలు పురుడుపోసుకుంటున్న ఈ దేశంలో జైన్ అవలంబించిన శాతాల లెక్కపాటిస్తే ఎంతలేదన్నా 12 వేల కోట్ల మేర హవాలా రాకెట్ అవతారమెత్తి ఉండాలి. ఒక్క పివిఎన్ ఆర్థిక విధానాలే ఏం ఖర్మ? రేపు కేంద్రంలోకి ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా ఈ రేటులోనే పెట్టుబడులను ఆకర్షిస్తాయని ఘంటాపధంగా నేతలందరూ గద్దె లెక్కి ఉపన్యాసా

తీస్తున్నారు. ఇంత పెద్ద ఎత్తున లాభాలున్న వ్యవహారాన్ని 'ఏ మూర్ఖుడు' వదులుకుంటాడు? మహారాష్ట్రలోని సంకీర్ణ ప్రభుత్వ నేత మొదలు కాంగ్రెసేతర ప్రతిపక్ష ముఖ్యమంత్రులు లేచిందే పరుగన్నట్టు జోరుపట్టుకొని -పోలో మంటూ విదేశీపర్యటనలు చేస్తూ పెట్టుబడులను ఆకర్షించడానికి తెగతంటాలుపడుతున్నారంటే ఆషామాషీ వ్యవహారం కాదు. ఇంతేగాదు, ఈ 'ప్రజానాయకులు' అందరూ తమ వెంట 'జైన్ బ్రదర్స్'లను విమానాల్లో వెంటేసుకొనే వెళ్ళుంటారని కూడా స్వయంగా జైన్ వెల్లడించాడు. ఒక సందర్భంలో స్పెయిన్ రాజు అంత్యక్రియలకు భారత రాష్ట్రపతితో పాటు తాను హాజరయ్యానని జైన్ చెప్పుతున్నాడు.

ఈ నేపథ్యంలో '91 అనంతరం వెలుగులోకి వచ్చిన కుంభకోణాలను చూద్దాం. 1993లో రైల్వేమంత్రి సికె జాఫర్ షరీఫ్ ఆసియన్ బ్రౌన్ బోవేరికి బి.హెచ్.ఇ.ఎల్.లో 190 మిలియన్‌ల వ్యవహారంలో గడ్డికరిచాడనే నిలదీస్తూ, దేశ రాజధానిలో, పార్లమెంటులో రాజీనామాలక్కై ఎంత అల్లరిచేసినా పీఠం వదలలేదు. మరింత ముందు కెళ్ళితే 1992లో సెక్యూరిటీల కుంభకోణంలో 5 వేల కోట్లు హర్షద్ మెహతా ఎలా రాబట్టగలిగాడో తెలిసిందే. దేశం లోని బ్యాంకులనే కాకుండా కనీసం 35 విదేశీ బ్యాంకుల సంబంధంలో కోట్ల రూపాయిలు పంచుకున్నారు. ఇందులో తన స్వహస్తాలతోనే ప్రధానమంత్రికి కోటి రూపాయిలు చెల్లించుకున్నానని హర్షద్ మెహతా నెలవిచ్చినా పివిఎస్ మౌనంగా కాలాన్ని దాటేశాడు. '91 తర్వాత పివిఎస్ కు 3 కోట్లు ముట్టాయని జైన్ మొత్తుకుంటున్నా పివిఎస్ ఉలుకుపలుకు లేకుండా రోజులు లెక్కపెడుతునాడు. బోఫోర్స్ వ్యవహారంలో ... సోలంకిని బలిపశువును చేసిన ఘనుడు. సెక్యూరిటీల వ్యవహారంలో చిదంబరం రామేశ్వర్ ఠాకూర్, శంకరానందలు ఎందరినో ఎరచేస్తూ తన రాజకీయ చతురతను ప్రదర్శిస్తున్నాడు. 1994లో చక్కెర దిగుమతుల్లో కోట్లాది రూపాయిల కుంభకోణాలు జరిగాయని వెలుగులోకి రాగా, జ్ఞానప్రకాశ్ కమిటీ దోషులుగా కల్పనాథ్ రాయ్‌ను వేలెత్తి చూపినా ఫలితం శూన్యం. కిలో ఒక్కంటికి 20 రూపాయిలతో మార్కెట్లో చక్కెర కొనుక్కున్న జనాల్లో వీరికి పేసమెత్తు విలువ లేకుండా పోతున్నా హవాలా అండదండలతో తులతూగుతున్నారు. అజిత్‌సింగ్, బిజూపట్నాయక్‌లపై కూడా ఈ కాలంలో డబ్బులు కాజేసిన ఆరోపణలు రికార్డయినాయి. వీటన్నింటిని తలదన్ని గడచిన పార్లమెంటు సమావేశాల్లో (నవంబర్ '95) టెలికాం కుంభకోణం పెద్ద సంచలనాన్ని సృష్టించింది. సుఖ్‌రాం తన సొంత రాష్ట్రానికి చెందిన "హిమాచల్ ఫ్యూచరిస్టిక్ కమ్యూనికేషన్స్ లిమిటెడ్"కు ఆశ్రిత పక్షపాతంతో కాంట్రాక్టులు అంటగట్టాడన్న ఆరోపణన్నే నిలదీశారు. ఫలితంగా ప్రభుత్వ బొక్కసానికి 60 వేల కోట్ల చిల్లుపడుతుందని లెక్కలు తేల్చినా, పివిఎస్ సుఖ్‌రాం ను వదలలేదు సరికదా నిర్ణయంపై గట్టిగా నిలబడాలని ప్రోత్సహించాడు. తన మైనార్టీ ప్రభుత్వాన్ని నిలబెట్టుకోవడానికి అవిశ్వాస తీర్మానాలను అధిగమించడానికి ఒక్కో యం.పి.కి పివిఎస్ 50 లక్షలు చెల్లించాడనే, ఫిరాయింపు చట్టానికి చెల్లు చీటీ ఇచ్చి ప్రధానమంత్రి పదవి నిలుపుకోవడానికి నానాగడ్డి కరిచాడనే రుజువులు, సాక్ష్యాలతో లోకం నిందించినా జవాబివ్వని పివిఎస్ తనను ఆదుకునే ఏ ఒక్క వ్యక్తినైనా వదులుకొని అధికారం వెలగబెట్టే పరిస్థితిలో లేడు. ఇలా ఎక్కడికక్కడ డబ్బు వ్యవహారం రోజో వింతలా వెలుగులోకి వస్తుంటే పట్టణ మధ్యతరగతి ప్రజల్లో ఉత్కంఠత పెరుగుతుంది. డొక్కశుద్ధి లేని జనాల్లో గూడుకట్టుకున్న అసహ్యత బద్దలవకపోదు. ఒకవైపు ఈ వ్యవహారాలన్నీ ఇలా చర్చలోకి వస్తుంటే '95 డిసెంబర్‌లో పురులియా ఆయుధాల వ్యవహారం తెరముందుకొచ్చింది. తమ నిర్దోషిత్వం ప్రజల్లో నిరూపించుకోవాలనే అన్ని స్థాయిల్లోని అధికారులు, రాజకీయ నాయకులు అనేక ప్రకటనలు గుప్పించారు. షరా మామూలు అన్నట్టుగానే విదేశీ 'హస్తం' పై అందరూ విరుచుకుపడ్డారు. కానీ ఈ సమయంలోనే అవమానాలు భరించలేక బందిపోటుగా మారిన 67 సం.ల పంచంసింగ్ మార్చి 10వ తేదీ నాడు ఇచ్చిన ఇంటర్వ్యూలోని మాటలు చూస్తే ఆయుధాలు వ్యవహారం లోతుపాతులు అర్థమైతాయి. "కొందరు రాజకీయ నాయకుల అండదండలతో మిలటరీ కి చెందిన ఆయుధాలను కొంతమంది వ్యక్తులు చంబల్ లోయకే వచ్చి ఇచ్చి వెళ్ళేవారు. బంగ్లాదేశ్ నుండి .303 రైఫిల్స్, ఎస్ ఎల్ ఆర్ తుపాకులు, డైనమేట్లు, అధునాతన హ్యాండ్ మైనింగ్ బాంబులు, మెషిన్‌గన్‌లు సరఫరా అయ్యేవి. హెలికాప్టర్‌లో తెచ్చి ఇచ్చేవారు" అంటూ "ఏ ఎన్నికలు వచ్చినా రాజకీయ నాయకులు పూలమాలలు వేసి మా సహాయం కోరేవారు" అని కూడా అంటున్నాడు. ఈ బందిపోటు తన 500 మంది సహచరులతో 1972లో లొంగిపోయినా, నేడు కర్నాటక, తమిళనాడు బలగాలను సవాలుచేస్తున్న వీరప్పన్ వ్యవహారాలు

కర్ణాటక, తమిళనాడు మంత్రులతో ముడిపెట్టుకొని వెంటవెంటనే వెలుగుచూస్తున్నాయి. ఇలా మొత్తం మీద దేశాన్ని బందిపోట్లు, వారి నాయకులు వెరసి 'నేర ప్రపంచం' రాజ్యమేలుతుంది.

ప్రైవేటు ఆస్తులతో కోట్లకు పడగలెత్తడానికి అవకాశం ఉన్న ఆర్థిక వ్యవస్థలన్నింటా ఇదే వరస. సామ్రాజ్య వాద శిబిరంలో అగ్రరాజ్యంగా నిలబడిన అమెరికా చరిత్ర చూసినా అనేక కుంభకోణాలు కనపడుతాయి. ప్రస్తుతం అధికారంలోనున్న బిల్ క్లింటన్ 'వైట్ వాటర్' ఉదంతంలో తనకు గల సంబంధాలపై కోర్టుకు హాజరై స్టేట్ మెంట్ ఇస్తున్నాడంటే, అధికారంలోనున్న అధ్యక్షుడి భార్య కోర్టులో జ్యూరీ ముందుకు వచ్చి స్టేట్‌మెంట్ ఇవ్వడం అమెరికా చరిత్రలోనే అపూర్వమైనదని వైట్ హౌస్ గాబరా పడిపోతోంది. దక్షిణ కొరియాలో 1980-88 వరకు గల అధ్యక్షపదవి వెలగబెట్టిన చున్ దు హూ ఆన్ నిన్న మొన్నటి నాడు తన నిర్దోషిత్వాన్ని రుజువు చేసుకోవలసిన దుస్థితిలో కోర్టుకు హాజరయ్యాడు. జపాన్‌లోకి వస్తే మాజీ ప్రధానులు కోట్లకొలదీ యెన్‌లను దిగమింగి పదవులు వదలుకున్నవారే. సిఐఎ, కెజిబి లు ప్రపంచవ్యాప్తంగా తను వల విసిరి దేశ విదేశాల నేతలకు కావలసినంత డబ్బులు పంచి తమ ప్రపంచాధిపత్య వ్యూహంలో పావులుగా వాడుకున్న ఘటనలు అనేకం ఉన్నాయి. ఈ మధ్యనే పోలండ్ మాజీ అధ్యక్షుడైన వెక్‌వాలేసా కె.జి.బి. ఏజెంటుగా వ్యవహరించాడన్న ఆరోపణపై బోనులో నిలబడ్డాడు. ఇటలీ మాజీ ప్రధాని బెర్లొస్కోని తన మీడియా సామ్రాజ్యాన్ని నిలబెట్టుకోవడానికి ఎలాంటి గడ్డి కరచి పదవీభ్రష్టుడయ్యాడో ప్రజలు ఇంకా మరచిపోలేదు. బంగ్లాదేశ్‌లో 8 ఏళ్ల కఠినకారాగార శిక్షలు అనుభవిస్తున్న మాజీ అధ్యక్షుడు ఎర్షాద్ పై ఇలాంటి ఆరోపణలు కోకొల్లలు. దుబాయిలో ఆశ్రయం తీసుకున్న దావూద్ ఇబ్రహీం అన్ని రాజకీయ పార్టీలకు తన ఉల్హా నేచే దందాల్లో నుండే చందాలు ఇచ్చేవాడినని, పవార్-చవాన్‌లు ఇద్దరూ దొంగలేనని తన బాధ వెలిబుచ్చాడు. ఇలా రాస్తూపోతే ఒక ఉద్గ్రంథమే అవుతుంది.

సమాజంలో దోపిడికి అవకాశం ఉన్నంత వరకు ఇలాంటి కుంభకోణాలు జరుగుతునే ఉంటాయి. పాలక వర్గాల్లోని ముఠా తగువులు వాటి అవసరాల మేరకు తరచుగా ఇలాంటి ఘటనలను ప్రజల ముందుకు తెస్తుంటాయి. 'కాలిరిగి వాత పెట్టాలన్నట్లు' ఎన్నికల సమయం అందుకు ఒక మంచి అవకాశంగా కూడా అని భావిస్తుంటాయి. తమ అధికార కుమ్ములాటలో భాగంగా నిందారోపణలతో ఓట్లను అడుగుతుంటాయి. అధికారంలో ఉన్న పార్టీయే తిరిగి గద్దె నెక్కితే కుంభకోణాల గొడవ అంతా సదురుకుంటుంది. అలా కాకుండా, కొత్త గ్రూపులు అధికారంలోకి వస్తే ప్రారంభంలో కొంతకాలం విచారణ సంఘాల హంగామాలో మునిగిపోతాయి. అధికారంలో సదురుకోగానే మళ్లీ యథావిధిగా కుంభకోణాలు జరుగుతూనే ఉంటాయి. కుంభకోణాలు, ప్రభుత్వాల మార్పిడి - విచారణా సంఘాలు - మళ్లీ కుంభకోణాలు ఈ చక్రం ఇలా పరిభ్రమిస్తూనే ఉంటుంది. దోపిడీ వర్గాలకు అధికారం కట్టబెట్టినంతకాలం కనీస మార్పు కూడా ఆశించ లేము. అందుకే దోపిడికి అవకాశం లేని నూతన సమాజాల నిర్మాణంలోనే వ్యక్తి లాభాలకు, సొంత ఆస్తికి అవకాశం ఉండదు. సామ్రాజ్యవాదుల నాశనంతోనే గ్లోబలైజేషన్ విధానాలకు గోరి కట్ట బడుతుంది. మూడవ ప్రపంచ దేశాల్లో నూతన ప్రజాతంత్ర విప్లవాల ద్వారానే అవినీతి కుంభకోణాలపై ప్రజల తీర్పు అక్షరాల అమలవుతుంది. అందుకే తెగించి పోరాడి దోపిడి వ్యవస్థను రూపుమాపుదాం.

0 0 0

---

"విప్లవ పారిశ్రామిక వర్గ పార్టీ లేనిదే, అవకాశవాదరహిత పార్టీ లేనిదే, రాజీబేరగాళ్లతోను, లొంగుబాటు దార్లతోను, ~~[illegible]~~ సమాధానపడని పార్టీ లేనిదే, పెట్టుబడిదారీ వర్గం పట్ల, దాని ప్రభుత్వాధికారం పట్ల విప్లవ వైఖరిని ప్రదర్శించే పార్టీ లేనిదే, శ్రామికవర్గ విప్లవ విజయమూ, శ్రామిక వర్గ నియంతృత్వ విజయమూ అసాధ్యమని, ప్రప్రథమంగా పార్టీ చరిత్ర మనకు బోధించుతుంది."

(సోవియట్ కమ్యూనిస్టు పార్టీ (బొల్షివిక్) పేజీ 249,

6-9 పేరాలు)

ప్రకటన

## జులై 28 నుండి ఆగస్టు 3 వరకు "అమరవీరుల స్మారక వారం" జరపండి !

జులై 28 భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు-లెనినిస్టు) నిర్మాత, నాయకుడు అయిన కామ్రేడ్ చారుమజుందార్ అమరుడయిన రోజు. గత 17 సంవత్సరాలుగా ఆంధ్ర, దండకారణ్యాల్లో పోరాట ప్రజానీకానికి జులై 28 అమరుల స్మారకదినం గా సుపరిచితమైనది. ఆ రోజు ప్రజానీకానికి పోరాట ప్రేరణ, స్ఫూర్తి నిచ్చే రోజుగా మారగా, పాలకవర్గాలకు గుండెల్లో గుబులు పుట్టించేదిగా తయారయింది. అందుకే జులై 28 స్మారక దినానికి వారం రోజుల ముందు నుండే ఉద్యమప్రాంతమంతటా పోలీసులు తీవ్రంగా గాలింపులు జరుపుతూ, స్మారక సభలను అడ్డుకోవడం ప్రారంభించారు. సంఘ నాయకత్వాన్ని, సంఘసభ్యులను అరెస్టుచేయడం, సభలు జరుపుకుంటున్న ప్రజలపై దాడులు చేయడం, స్థూపాలను కూల్చివేయడం తదితర రూపాల్లో పోలీసులు స్మారకసభలకు అడ్డునిలవడంతో మారిన పరిస్థితుల రీత్యా ఫారెస్టు కమిటీ (ఎఫ్.సి), కేంద్ర ఆర్గనైజింగ్ కమిటీ (సి.ఓ.సి) గత సంవత్సరం జులై 28 నుండి ఆగస్టు 3 వరకు అమరుల స్మారక వారం జరపాలంటూ తీర్మానించాయి.

ఫారెస్టు కమిటీ, కేంద్ర ఆర్గనైజింగ్ కమిటీల నిర్ణయాన్ని అనుసరించి గత సంవత్సరం నుండే "అమరుల స్మారక వారం" జరుపుకోవడం మొదలయ్యింది. ఈ సంవత్సరం కూడ దండకారణ్యమంతటా స్మారక వారం పెద్ద ఎత్తున జరపాలి. ఈ సందర్భంగా వాల్‌పోస్టర్లు, కరపత్రాలు, బ్యానర్లతో పాటు ఊరేగింపులు, రాత్రిపూట కాగడాలతో ఊరేగింపులు, సభలు-సమావేశాలు ఎక్కడికక్కడ విస్తృతంగా జరపాలి. ఉన్న స్థూపాలకు రంగులువేసి అలంకరించడం, కొత్త స్థూపాలను నిర్మించడం, అమరవీరుల కుటుంబాలను కలవడం, అమర వీరుల జీవిత చరిత్ర పుస్తకాల్ని విస్తృతంగా ప్రజానీకంలోకి తీసుకెళ్ళడం చేయాలి. అమరవీరుల కుటుంబాలకు ఆర్థికంగా, హార్దికంగా ఆదుకోవడానికి ప్రజానీకాన్ని సన్నద్ధం చేయాలి.

వీటన్నింటిద్వారా అమరుల కలలు సాఫల్యం చేయడం కోసం ప్రజానీకాన్ని తయారుచేయాలి. అమరులు నడిచిన మార్గంలో కార్మిక, కర్షక, విద్యార్థి, మేధావి వర్గాన్ని నడిపించడానికి, వారి రాజకీయ లక్ష్యాన్ని ప్రచారం చేయాలి. అమరుల కలలు కన్న నవ సమాజ స్థాపనకై తుదివరకు పోరాడతామంటూ ప్రజానీకం, దళాలు శపథం చేయాలి.

- అమరవీరులకు జోహార్లు !
- అమరవీరుల ఆశయాలను ముందుకు తీసుకుపోదాం !

| | |
|---|---|
| ఉత్తర తెలంగాణ | 28 |
| ఆంధ్ర | 5 |
| దండకారణ్యం | 8 |
| 1. బాలాఘాట్ | 7 |
| 2. గడ్చిరోలి | 1 |
| యం.సి.సి. | 10 |
| ఇతర విప్లవపార్టీలు | 1 |

1996 జనవరి - ఏప్రిల్ మధ్యకాలంలో ప్రాణాలుబాసిన అమరవీరులకు విప్లవజోహార్లు!

స్పెషల్ జోనల్ కమిటీ
దండకారణ్యం
భా.క.పా. (మా-లె) (పీపుల్స్‌వార్)

ప్రకటన

## ఉరిశిక్షలు రద్దుచేసి బీహార్ రైతులను విడుదల చేయాలి !

భూస్వామ్య అరాచకాలకు బీహార్ పెట్టింది పేరు. పీడిత, అమాయక రైతాంగంపై మధ్యయుగాల భూస్వామ్య అణచివేత విధానాలు నేటికీ యధేచ్ఛగా కొనసాగుతున్నాయి. ఒకవైపు భూస్వామ్య వర్గాలు తమ ప్రైవేటు సైన్యాలను పోషిస్తూ గ్రామీణ రైతాంగాన్ని ఊచకోత పాలుచేస్తూనే, మరోవైపు ఆ పాలకవర్గాలు ప్రభుత్వ యంత్రాంగం మద్దత్తుతో రైతాంగాన్ని దారుణంగా శిక్షిస్తున్నాయి.

భూస్వామ్య విధానంతో విసిగి వేసారిన రైతాంగం గత రెండున్నర దశాబ్దాలుగా విప్లవోద్యమంతో మమేకమవుతూ పోరాడుతున్నారు. వీరోచిత త్యాగాలతో భారత విప్లవోద్యమానికి వన్నెతెస్తూ, వ్యవసాయ విప్లవాన్ని పురోగమింప చేస్తున్నారు. రివిజనిజం, నయా రివిజనిజంల నడ్డివిరిచి సాయుధ పోరాటాన్ని ఎజండా మీదికి తెచ్చిన నక్సల్బరీ వారసత్వాన్ని 1980ల వరకు ఎత్తిపట్టి, ఆ తదనంతర కాలంలో పార్లమెంటు ఎన్నికలకు, పాలకవర్గాల సేవలకే అంకితమైన లిబరేషన్ విద్రోహాల నిజస్వరూపాన్ని బహిర్గతం చేస్తూ బీహార్ రైతాంగం భూస్వామ్య సవాలుచేస్తోంది. నిజమైన విప్లవకారుల నాయకత్వంలో తెగించి పోరాడుతూ ఢిల్లీ పాలకవర్గాలకు వణుకు పుట్టిస్తున్నారు.

తరతరాలుగా భూస్వామ్య రాక్షస ! హత్యాకాండను అనుభవిస్తున్న బీహార్ రైతాంగం తమ ప్రతిఘటనోద్యమంలో భూస్వామ్య కుటుంబాలను శిక్షించడం అనివార్యమైంది. రోజురోజుకు తమ మనుగడకే ప్రమాదంగా పరిణమిస్తున్న భూస్వామ్య గుండా విధానాన్ని నిరోధించడంలో భాగంగా 1987 లో దలేల్ చాక్, బాఘౌరా లలో వందలాది రైతాంగం కొన్ని సాయుధ దాడులు నిర్వహించింది. ప్రజా తీర్పును అమలుచేయడంలో భాగంగా కంటక భూస్వామ్య కుటుంబాలను, వారు పెంచి పోషిస్తున్న ప్రైవేటు సైన్యాలను ఖతం చేశారు. ఆ కుటుంబాల పీడ వొరగడ చేసుకున్నారు.

దీనితో బీహార్ రాష్ట్ర పోలీసులు వందలాది మంది రైతులను అరెస్టుచేశారు. తొలినుండి బీహార్ రైతాంగం ప్రభుత్వ అణచివేతను, నిర్బంధాన్ని ఎదుర్కొంటూనే తమ పోరాటాలను పురోగమింపచేస్తున్నారు. కాంగ్రెస్ నుండి జనతా దళ్ వరకు పాలకవర్గ పార్టీలన్నీ విప్లవోద్యమాన్ని అణచివేయడంలో పోటీపడుతున్నాయి. మరీ ముఖ్యంగా 1990ల నుండి కేంద్ర ప్రభుత్వ నేతృత్వంలో అణచివేత విధానాలు కొనసాగుతున్నాయి. దేశవ్యాప్తంగా సంఘటిత మవుతున్న రైతాంగ పోరాటాలను నామరూపాలు లేకుండా చేయాలనే పథకాలతో మరీ ముఖ్యంగా ఆంధ్ర-బీహార్-దండకారణ్యంలలో కేంద్ర బలగాలే రంగం మీదికి వచ్చాయి. నాసా, మీసా, టాడా లాంటి రాక్షస చట్టాలే కాకుండా ఉరిశిక్షలు కూడా అమలవుతున్నాయి. మరోవైపు బూటకపు ఎన్‌కౌంటర్లతో ప్రజలను హత్యచేస్తున్నారు. నక్సల్బరీ శ్రీకాకుళ పోరాటాల నేపథ్యంలో తెలంగాణాలోని కరీంనగర్-ఆదిలాబాద్, జిల్లాల్లో భూస్వామ్య దోపిడీ విధానాలతో పోరాడుతూ భూస్వాములను శిక్షించిన కామ్రేడ్స్ భూమయ్య, కిష్టాగౌడ్‌లకు 1975 జూన్‌లో "భారత న్యాయవ్యవస్థ" ఉరిశిక్ష విధించి హత్యచేసింది. నేడు తిరిగి అదే "న్యాయవ్యవస్థ" బీహార్‌లో 8 మంది పీడిత రైతులకు ఉరిశిక్ష విధించింది. జిల్లా సెషన్స్ జడ్జి విధించిన ఉరిశిక్ష (1994) రద్దుచేయాలనే ఒకవైపు భారత ప్రజలు డిమాండ్‌చేస్తుంటే మరో వైపు పాట్నా హైకోర్టు జనవరి '96లో ఆ ఉరిశిక్షలను ఖాయం చేసి తన 'వర్గన్యాయాన్ని' చాటుకుంది.

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్కిస్టు-లెనినిస్టు) (పీపుల్స్‌వార్) దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ ఈ ఉరిశిక్షల రద్దుకై డిమాండ్ చేస్తోంది. పోరాట రంగంలో నిలిచిన బీహార్ పీడిత రైతాంగంపై ప్రభుత్వం బనాయించిన కేసులన్నింటినీ ఖండిస్తూ, వాటినన్నింటిని ఉపసంహరించుకోవాలనీ డిమాండ్ చేస్తుంది.

కార్మిక, కర్షక, విద్యార్థి మరియు మేధావుల్లారా !

నేడు ప్రపంచవ్యాప్తంగా చెలరేగుతున్న విప్లవోద్యమాలను తుదముట్టించడానికై ఒకవైపు సామ్రాజ్యవాదం మరోవైపు బడా భూస్వామ్య దళారీ బూర్జువా పాలక వర్గాలు అన్ని విధాల కుమ్మక్కు అవుతున్నాయి. రైతాంగం,

కార్మికవర్గంపైన హంతకదాడులు చేస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగానే 'పౌరహక్కులు' హననం సర్వసాధారణమైపోయింది. పాలకవర్గాలు నిర్వచించిన రాజ్యాంగ పరిధిలో కూడా పౌరజీవనానికి భద్రత లేకుండా పోయింది. అధికధరలు, నిరుద్యోగం ఆర్థికలేమితో అలమటిస్తున్న ప్రజానీకం తమ న్యాయమైన డిమాండ్లకోసం కూడా తుపాకి గుళ్ళ నెదుర్కొంటూ పోరాడవలసి వస్తుంది. ప్రమాదకరంగా పరిణమిస్తున్న పర్యావరణం మొదలు పౌరహక్కుల వరకు దేన్ని ప్రశ్నించినా జైళ్ళు నోళ్ళు తెరచుకుంటున్నాయి. ఉరికంబాలు ఆహ్వానిస్తున్నాయి.

పశ్చిమాఫ్రికాలోని నైజీరియాలో ఓగోని ప్రజాపోరాట నాయకుడు, పర్యావరణవాది, పౌరహక్కుల ఉద్యమ కార్యకర్త అయిన కెన్‌సారోవివాను ఆంగ్లో-డచ్ సామ్రాజ్యవాదంతో కుమ్మక్కైన అబాచా ప్రభుత్వం ఉరితీసింది. ఆఫ్రికా ప్రజల ప్రతినిధి, నల్లవాళ్ళ పోరాట నాయకుడైన ముమియాకు అమెరికా ప్రజాస్వామ్యం ఉరిశిక్ష విధించి రోజులు లెక్కబెడుతూంటే, లాటిన్ అమెరికాలోని పెరూ విప్లవోద్యమ నాయకుడైన కా. అబిమెయిల్ గుజ్మన్ గొంజాలోను కటకటాల్లోనే హత్య చేయడానికి మిలటరీ నియంత ఫ్యూజిమోరి ప్రభుత్వాన్ని అమెరికా గైడ్ చేస్తుంది. మన దేశంలో పౌరహక్కుల నడిగి పాలకవర్గ దాడులకు ఎందరెందరో అసువులు బాసారు. గోపి రాజన్న, జాపలక్ష్మారెడ్డి, డా. రామనాథ, నర్రా ప్రభాకర్‌రెడ్డి నుండి షెల్లో చర్ (మణిపూర్), జలీల్ అందరాబీ (కాశ్మీర్) ల వరకు అనేకమంది మేధావులు తమ ఆశయాలకు అంకితమైన వారే. వీరందరి ఆశయాలను తుదకంటా కొనసాగించాల్సిన బాధ్యత పీడిత ప్రజానీకం పైనే ఉంది. లాఠీ గోళీలతో 'ప్రజాస్వామ్యాన్ని' రక్షిస్తున్న ఈ హంతక వ్యవస్థ నిర్మూలనకై నడుం బిగించి పోరాడాల్సిన అవసరం మన ముందుంది. 'నిషేధాలు' 'హత్యలు'తో పోరాటాలను అణచివేయలేరని నిరూపించాలి.

కావున, న్యాయమైన డిమాండ్ల కోసం పోరాడుతున్న ప్రజలతో, ప్రజాపోరాటాలతో మరింత మమేకమవుతూ ప్రజలపై అమలవుతున్న రాక్షస నిర్బంధకాండను ఖండిస్తూ, న్యాయమైన ప్రజాపోరాటాలను ఎత్తిపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

"చెఱసాలలు ఉరికొయ్యలు వెలుగును బంధించ లేవు
ప్రతి నిముషం పోరాడే ప్రజలను భయపెట్ట లేవు"

- బీహార్ రైతుల ఉరిశిక్షలు రద్దుచేయాలి !
- టాడా కేసులన్నీ ఉపసంహరించుకోవాలి !
- ఆంధ్ర-బీహార్-దండకారణ్య రైతాంగ పోరాటాలు వర్ధిల్లాలి.
- విప్లవకారుల ఐక్యత వర్ధిల్లాలి.
- సామ్రాజ్యవాదం నశించాలి. దున్నేవాడికే భూమి చెందాలి.

స్పెషల్ జోనల్ కమిటీ,
దండకారణ్యం
సి.పి.ఐ. (యం.యల్) (పీపుల్స్‌వార్)

తేది : 1 ఫిబ్రవరి 1996

"నియంత మరణంతో వాడి పాలన అంతమవుతుంది,
అమరవీరుని మరణంతో అతని పాలన ఆరంభమవుతుంది"

— నోరెన్ కీర్కు గార్డు

# మిస్ చావో ఆత్మహత్య

## 1919

ఎవరైనా ఒకరు ఆత్మహత్య చేసుకున్నారంటే దాన్ని పూర్తిగా పరిస్థితులే నిర్ణయిస్తాయి. చావుని వెతుక్కోవడమే మిస్ చావో అసలు ఉద్దేశమా? దానికి విరుద్ధంగా బతుకుని వెతుక్కోవడమే ఆమె ఉద్దేశం. కానీ దానికి బదులు ఎదురైన పరిస్థితులు ఇవి: 1. చైనా సమాజం 2. చాంగ్షాలో నాన్‌యాంగ్ వీధిలోని చావో కుటుంబం 3. చాంగ్షాలో కాంజువాన్ వీధిలోని వూ కుటుంబం - అంటే ఆమె ఇష్టపడని భర్త కుటుంబం. ఈ మూడు పరిస్థితులూ మూడు ఇనుప వలల్లో చిక్కుకుపోయిన ఆమె వీలైనన్ని విధాల జీవితాన్ని అన్వేషించి విఫలమైంది. ఆమె జీవితాన్ని కొనసాగించడానికి మార్గమే లేకపోయింది. జీవితానికి విరుద్ధమైనది - చావు కాబట్టి చావక తప్పదని మిస్ చావో అభిప్రాయపడింది..... ఒక వేళ ఈ మూడు పరిస్థితుల్లో ఏ ఒక్కటైనా ఇనుప వల కాకున్నట్టయితే లేదా ఒక్క వలయినా తెరచుకుని వుంటే మిస్ చావో చావకపోయేది. 1. మిస్ చావో తల్లిదండ్రులు ఆమెను బలవంతపెట్టకుండా, ఆమె కోరికకు తలవొగ్గివుంటే, ఆమె చనిపోయేది కాదు. 2. మిస్ చావో తల్లిదండ్రులు ఆమెను బలవంతపెట్టకుండా, కాబోయే భర్త కుటుంబానికి ఆమె తన అభిప్రాయాన్ని వివరించే వీలుకల్పించి వుంటే, ఆమె అతన్ని "ఏ" ఎందుకు నిరాకరిస్తోంది అన్నది చెప్పుకోనిచ్చివుంటే, ఆమె కాబోయే భర్త కుటుంబం ఆమె అభిప్రాయాన్ని ఆమోదించి, ఆమె వ్యక్తి స్వేచ్ఛను గౌరవించినట్టయితే, మిస్‌చావో చవకపోయేది; 3. ఆమె తల్లిదండ్రులు, కాబోయే భర్త తల్లిదండ్రులూ ఆమె స్వాతంత్ర్యాన్ని ఆమోదించకపోయినా, సమాజంలో ఆమెని సమర్థించే బలమైన గ్రూపు ప్రజాభిప్రాయం ఏర్పడివున్నా, పుట్టింటి నుంచి పారిపోయి వేరేచోట ఆశ్రయం పొందటాన్ని అప్రతిష్టాకరమైనదిగా గాక, గౌరవప్రదమైనదిగానే పరిగణించే నూతన సమాజం నెలకొనివున్నా మిస్ చావో చనిపోయి ఉండేది కాదు. ఈనాడు ఆమె చనిపోయిందంటే, ఆమె మూడు ఇనుప వలల (సమాజం, ఆమె కుటుంబం, భర్త కుటుంబం) నడుమ బలంగా బంధించబడింది. కాబట్టి అలా జరిగింది. ఆమె జీవితాన్ని కొనసాగించడంలో విఫలమై చివరికి చావుని ఆశ్రయించింది.

నిన్నటి సంఘటన ముఖ్యమైనది. తల్లిదండ్రులే పెళ్ళి సంబంధాలను ఖాయపరిచే హేయమైన పద్ధతి వల్ల, అంధకార బంధురమైన సామాజిక వ్యవస్థ వల్ల, వ్యక్తి స్వేచ్ఛ హరించివేయబడడం వల్ల, జీవిత భాగస్వామిని ఎంచుకునే స్వేచ్ఛ లేకపోవడం వల్ల ఆ సంఘటన అలా జరిగింది. ఆసక్తి వున్నవాడు ఈ సంఘటనకు సంబంధించి అన్ని అంశాలనూ వ్యాఖ్యానిస్తారనీ, తన జీవిత భాగస్వామిని, కాపాడతారని ఆశిద్దాం.

ఆమె కుటుంబ సభ్యులు, కాబోయే భర్త కుటుంబ సభ్యులూ కూడా సమాజంతో ముడిపడి ఉన్నారు. ఆ రెండు కుటుంబాలూ సమాజంలో భాగమే. ఈ రెండు కుటుంబాలూ ఒక నేరం చేశాయని మనం అర్థంచేసుకోవాలి. కానీ ఆ నేరానికి మూలం సమాజంలోనే ఉంది. ఆ రెండు కుటుంబాలూ తమంత తాముగావే నేరం చేశాయన్నది నిజమే కానీ ఆ నేర ప్రవృత్తి వారికి సమాజం నుంచే సంక్రమించింది. సమాజం మంచిదైవుంటే ఆ కుటుంబాలు ఆ నేరాన్ని చేయాలనుకున్నా వారికి ఆ అవకాశం చిక్కేదే కాదు.....

మన సమాజంలో కొన్ని పరిస్థితులు మిస్ చావో మరణానికి కారణమయ్యాయి. కాబట్టి ఈ సమాజం చాలా ప్రమాదకరమైనది. అది మిస్ చావోని చంపగలిగింది. అది ఇంకా మిస్ చీ, మిస్ లీ, మిస్ సన్‌లను కూడా చంపవచ్చు. అది స్త్రీలను పురుషులనూ కూడా చంపగలదు. మనల్ని బలిపశువులుగా మార్చేటటువంటి, మనల్ని చావుదెబ్బతీయగలిగేటటువంటి ఈ ప్రమాదకరమైన సమాజం పట్ల మనమందరం అప్రమత్తంగా ఉండాలి. మనం గొంతెత్తి నిరసన తెలపాలి. ఇంకా చనిపోని మనుషులను హెచ్చరించాలి. మన సమాజంలోని లెక్కలేనన్ని దురాగతాలను ఖండించాలి....

మనం వివాహ సంస్కరణలకు అనుకూలంగా కేంపెయిన్ నిర్వహిస్తే పెళ్ళి గురించిన మూఢ నమ్మకాలను మొదట నిర్మూలించాలి. అన్నింటికంటే, ముఖ్యంగా వివాహాలు వధూవరుల ఇష్టం, అవి ముందే నిర్ణయింపబడ్డాయనే నమ్మకాన్ని నిర్మూలించాలి. ఈ నమ్మకాలను తొలగిస్తే ఏ కుంటిసాకు వెనకన్నైతే తల్లిదండ్రులు పెళ్ళి సంబంధాలను

కుదర్చగలుగుతున్నారో అది అదే సమయంలో అదృశ్యమైపోతుంది. అప్పుడు 'భార్యాభర్తల మధ్య అన్యోన్యత లేకపోవడం' అనే అవగాహన వెంటనే సమాజంలో తలెత్తుతుంది. భార్యాభర్తల మధ్య అన్యోన్యత అనే అవగాహన లోపించడం అనే అవగాహన తలెత్తడంతోనే కుటుంబంలో విధ్వంసాన్ని తీసుకువచ్చే అసంఖ్యాక సైన్యం రూపొందుతుంది. అప్పుడు వివాహ స్వేచ్ఛ, ప్రేమించే స్వేచ్ఛ చెడ్డవని ఊహిస్తాయి.

(కాక, 'నిజమైన వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవడం కోసం ప్రేమపడడం')

ఆత్మహత్యల పట్ల నా వైఖరి ఏమిటంటే - దాన్ని తిరస్కరించాలి. మొదటగా, జీవితాన్ని అన్వేషించడమే మనిషి లక్ష్యం కావాలి. అసమ సహజసిద్ధమైన ఈ వైఖరికి భిన్నంగాపోయి చావుని కోరుకోకూడదు. సమాజం ప్రజలను నిరాశ, నిస్పృహలకు గురిచేయడం వల్ల ఆత్మహత్యలు సంభవిస్తున్నాయనేది నిజమే అయినా, మన కలల్ని పండించుకోవడం కోసం, మనం ఆ సమాజానికి వ్యతిరేకంగా పోరాడాలి... మనం పోరాడుతూ చనిపోవాలి... మూడవది, తమ జీవితాలను ధైర్యంగా త్యాగం చేసిన వారిని ప్రజలు గౌరవిస్తున్నారంటే అర్థం వారు ఆత్మహత్యను యథాతథంగా గౌరవిస్తున్నారని కాదు. నిజానికి, పాశవికమైన అధికారాన్ని ప్రతిఘటించాలనే సాహసోపేతమైన శక్తి ఏదైతే ఒక వ్యక్తిని ఆత్మహత్యకు పురిగొల్పినదో ఆ శక్తినే ప్రజలు గౌరవిస్తారు.

ఆత్మహత్య చేసుకోవడం కన్నా పోరాటంలో చావడం ఎంతో మేలు! పోరాట లక్ష్యం 'ఇతరులచేత చంపబడడం' అవుతుంది. ఒక వ్యక్తి తన శక్తినంతా వెచ్చించినా ఆ లక్ష్యాన్ని సాధించలేకపోతే, అతను చనిపోయే వరకు పోరాడి జీవితాన్ని త్యాగం చేస్తే, అప్పుడు అతను ఈ భూమ్మీద అందరికంటె సాహసవంతుడవుతాడు. అతనికి ఎదురైన విషాదం ప్రజల మనసులపై బలమైన ముద్రవేస్తుంది!...

§ మావో రచనలు - 6వ సంపుటి §

§ నేటికీ దేశంలో అడుగడుగునా స్త్రీలపై అత్యాచారాలు, ఏదో సాకుతో మహిళలను హత్యచేయడం సర్వసాధారణమై కొనసాగుతుంది. కుటుంబ హింస, రాజ్య హింస స్త్రీని వేధిస్తున్నాయి. స్త్రీల పోరాట దినంగా విప్లవ క్యాంపుల్లోని మహిళలు 8 మార్చి పాటిస్తున్న నేపథ్యంలో ఈ వ్యాసం ఉపయోగపడుతుందని అందిస్తున్నాం. మన కే.ఎ.ఎమ్.ఎస్. పరిష్కరిస్తున్న సమస్యలలో పెళ్ళి సమస్యలు ప్రధానమైనవి. ఆదివాసీ సంప్రదాయాలలో భాగంగా కూడా స్త్రీ ఇష్టాన్ని తెలుసుకోకుండానే పెళ్ళిళ్ళు జరుగుతున్నాయి. ఫలితంగా స్త్రీలు కాపురాలు విడిచివెళ్ళడం, లేదా అక్కడక్కడ ఆత్మహత్యలకు పాల్పడుతుండడం చూస్తున్నదే. కనుక ఈ సమస్య పరిష్కారం సామాజిక విప్లవంతో ఎలా ముడిపడి ఉందో అర్థంచేసుకోవడానికి ఈ వ్యాసం తోడ్పడుతుంది. §

---

## అమరావతి జైలు అవస్థలు

నేరం రుజువైన వారిపట్ల వ్యవహరించే తీరులోనే అమరావతి జైల్లోని టాడా ఖైదీల పట్ల వ్యవహరిస్తున్నారు. భార్యాభర్తలను కలపడం అటుంచి మహాక్రూరంగా, అమానుషంగా నేరారోపణ చేయబడిన వారిపట్ల అధికారుల ప్రవర్తన ఉంటుంది. గిరిజ మరియు పవన్ భార్యాభర్తలు కానీ జైలులో వారిని కలసుకోవడానికి అనుమతించడం లేదు. ఇద్దరినీ విడిగా ఒంటరి గదులలో నిర్బంధించారు, ఇద్దరూ మానసిక వైపరీత్యానిక గురైన పరిస్థితుల్లోనే ఉన్నారు. గిరిజ ఒంటిమీద ఏ దుస్తులుండినవో నేటికీ అవే దుస్తులున్నాయి. పోలీసులు మరియు జైలు అధికారులు భద్రతా కారణాల రీత్యా కనీసం గుడ్డలు కూడా జైల్లో వారికి అందనివ్వడం లేదు. పవన్ కుమార్ పరిస్థితి దాదాపు ఇదే. ఇద్దరూ ఒకరి నొకరు కలుసుకోవాలనే ఆరాటపడుతున్నప్పటికే అధికారుల దృష్టిలో వాళ్ళిద్దరూ నక్సలైట్లు, అలాగే 'వాళ్ళిద్దరూ కలసుకోవడం అత్యంత ప్రమాదకరం అంటున్నారు అధికారులు, పోలీసులు.

'ఆదివాసీలపై టాడా' సౌజన్యంతో—

ప్రచురణ — పుణ్య ప్రసూన్ వాజ్‌పాయ్ 1995

## పోరాట స్ఫూర్తితో 8 మార్చి 'మహిళా దినం'

గడ్చిరోలి జిల్లాలో తీవ్ర నిర్బంధం కొనసాగుతూంది, మహిళలపై అమానుషమైన మానభంగాలు, అత్యాచారాలు జరుగుతున్నప్పటికీ బతుకు మార్పుకై ప్రజలు చేపట్టిన పోరాటం ఎన్నో ఆటుపోట్ల మధ్యనే కొనసాగుతోంది. పోరాట వారసత్వానికి ప్రతీకగా నిలిచిన 8 మార్చి మహిళాదినాన్ని గెరిల్లాలు ఎంతో ఉత్సాహం గా జరుపుకున్నారు. ప్రజలకు గెరిల్లాలకు మధ్య సజీవ సంబంధాలు లేకుండా చేయాలని విప్లవకారులను మాయంచేయడం, ఎన్‌కౌంటర్లలో స్త్రీ-పురుష భేదం లేకుండా హత్యలుచేయడం మొదలైన హంతకదాడు లెన్ని జరిగినప్పటికీ విప్లవ సాంప్రదాయాలన్నింటిని మొక్కవోని దీక్షతో ఉద్యమ నిర్మాణంలో నిమగ్నమైన గెరిల్లాలు, ప్రజలు అత్యంత ఉత్సాహంగా కొనసాగిస్తున్నారు.

ఏటపల్లి ప్రాంతంలో విప్లవకారులు మార్చి 8 న సమావేశంకాగా కా. జెన్ని ఎర్రజెండా నెగురవేసింది. గ్రామాలలో క్రాంతికారీ ఆదివాసీ మహిళా సంఘటన్ (కె ఎ ఎమ్ ఎస్) ను ఏర్పర్చుకొని సామాజిక రుగ్మతలన్నింటిపై పోరాడుతుంటే ప్రభుత్వం సహించలేకపోయింది. ఊరూరా క్యాంపులు పెట్టి అడవంతా ఖాకీమయం చేసింది. ప్రజల కాళ్ళకు బంధాలు వేయాలని వెర్రి కలలు కంటోందని కా. జెన్ని ఎంతో ఉద్వేగంగా మాట్లాడుతూ, మహిళలు నిజమైన విప్లవ గెరిల్లాలుగా తీర్చిదిద్దబడాలి. దళాల్లో సైతం కొనసాగుతున్న (ఏ మేరలో నైనప్పటికీ) పురుషాధిక్య ధోరణులను ఎదిరిస్తూనే స్త్రీ-పురుషులలో నిజమైన ఐక్యతను, కామ్రేడ్లీ సంబంధాలను నెలకొల్పుకోవాలి అని కోరింది. నేడు విప్లవ మహిళా దినంగా పాటిస్తున్న తాను గత 20 ఏళ్ళుగా ఎంతో 'మురిపెంగ' పెంచుకోక తప్పని తలనీలాలను శుభ్రంగా తోటి గెరిల్లాల స్పందనతో వదిలించుకున్నాననీ, ఈ పురుషాధిక్య పితృస్వామ్య సమాజంలో ఇంకెన్నెన్నో వదిలించుకోవలసినవి మహిళా గెరిల్లాల ముందు ఉన్నాయనీ, గెరిల్లా జీవితం అందుకు ఒక చక్కని అవకాశం కూడానని పేర్కొంది.

అనంతరం కా. సరిత మాట్లాడింది. మహిళలు సంఘాలలో పనిచేస్తూ చైతన్యవంతులవుతూ విప్లవ గెరిల్లాలుగా సాయుధమై పోరాడుతున్నారనడానికి మా జీవితాలే ప్రత్యక్ష ఉదాహరణలు అంది. సమాజంలో మహిళలపై తీవ్రమైన అణచివేత కొనసాగుతుందంటూ, వెనుకబడిన ఆదివాసీ సమాజంలో మరింత వెనుక బడిన సాంప్రదాయాల చాటున ఆదివాసీ మహిళ అధికార్ల లైంగిక దోపిడీ మొదలు సమస్త పితృస్వామిక భావాలకు బందీయై నిలిచింది అంటూ ఎంతో ఆవేశంగా ప్రసంగించింది. ఒకవైపు ఆ భావాలతో తెగించి పోరాడుతున్న మహిళ, తత్సమయంలోనే రాజ్యహింసను కూడా జీవన్మరణ పోరాటంలో త్యాగాల సాంప్రదాయాలతో ఎదిరిస్తోందని వివరిస్తూ, డివిజన్ ఉద్యమంలో నేలకొరిగిన మహిళలను పేరుపేరున గుర్తుచేసింది. ఆ తర్వాత కా. సుశీల మాట్లాడింది. "పోరాటాకాశంలో సగమైన స్త్రీ" పాత్రను సముచితంగా వివరించింది. చివరగా కా. నీలిమా ప్రసంగిస్తూ, దేశంలో గత రెండు దశాబ్దాలుగా స్త్రీల సమస్యలు తీవ్రంగా చర్చించబడుతున్నాయన్నారు. పెట్టుబడిదారీ దేశాలలో రెండవతరం ఫెమినిజం '60 లలో ముందుకొచ్చినా మన దేశంలో కాస్త ఆలస్యంగానే ఎజెండా మీదికి వచ్చిందన్నారు. ఫెమినిజం స్త్రీల సమస్యను ఎంత తీవ్రంగా ముందుకు తెస్తుందో, వాటి పరిష్కారం కూడా అంతే ఏకపక్షంగానే ఉంటూ మౌలిక సామాజిక మార్పులను, స్త్రీ సమస్యలను జోడించడంలో విఫలమవుతోందన్నారు. అంతేకాదు, నేడు దేశంలో స్త్రీల చైతన్యాన్ని నిర్వీర్యంచేయడానికి పాలకవర్గాలు అన్ని రంగాలలో ముఖ్యం గా ఎన్నికల భాగోతంలో 33శాతం రిజర్వేషన్స్ స్త్రీలకు కల్పిస్తామంటూ, జాగృతమవుతున్న స్త్రీని మరోసారి ఎన్నికల రొంపిలోకే లాగుతూ ఆ బుడుగులో ముంచేస్తున్నాయన్నారు. ఆ విధంగా అసలైన మనువు వారసులుగా, పితృస్వామ్య ధ్వజారోహులుగా మాత్రం తమ స్థానాన్ని పదిలంగా నిలుపుకుంటున్నారని చెబుతూ, స్త్రీ నిజమైన విముక్తి 'విప్లవ యుద్ధం'తోనే, సామ్యవాదంతోనే - దోపిడీరహిత సమాజంతోనే ముడిపడివుందంటూ ముగించారు.

కా. జోగన్న అధ్యక్షత వహించిన ఈ సభ అంతర్జాతీయ గీతంతో ముగిసింది. సాయంత్రం పక్క గ్రామం

లోని ప్రజలతో కలసి సాంస్కృతిక కార్యక్రమాలు జరుపుకున్నారు.

టిప్రాఘుడ్ ప్రాంతంలోని విప్లవకారులు మార్చి 8న సమావేశమై, దండకారణ్య విప్లవోద్యమంలో మూడవ వంతుగా మహిళలున్నారు కనుక 'మహిళా దినోత్సవం' ను నిజమైన స్ఫూర్తితో ఎలా అర్థంచేసుకోవాలో విశ్లేషించుకున్నారు. ఈ దినం మహిళలు తమ హక్కుల కోసం 'పోరాడే దినం'గా జరుపుకోవాలి. అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా పోటీ పడుతున్న మహిళా కామ్రేడ్స్‌ను మరింత జాగృతంచేయడానికి పార్టీ తీవ్రంగా కృషి చేస్తున్నది. స్త్రీ చైతన్యం ఫెమినిజం లాంటి వక్రమార్గాలు పట్టకూడదు. మన పురుష కామ్రేడ్స్ మహిళల ఎడల తమలో జీర్ణించుకుపోయివున్న చిన్నచూపు ని పోగొట్టు కోడానికి తీవ్రంగా కృషి సల్పాలి. ఆ మార్పుకి మహిళా కామ్రేడ్స్ కూడా అవసరాలను బట్టి హెచ్చరిస్తూ సవరించే బాధ్యత చేపట్టాలి అని చెప్పుకున్నారు.

సాయంత్రం గ్రామస్థులతో కలసి సమావేశం జరిగింది. కా. సమిత ఎర్రజెండా నెగురవేయగా ఉద్యమంలో తమ జీవితాలను ధారపోసిన మహిళా కామ్రేడ్స్‌ని స్మరిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు.

కా. వనిత అధ్యక్షత వహించిన దీనిలో ఆమె మాట్లాడుతూ, మహిళల కోసం ప్రత్యేకంగా ఏర్పాటైన మహిళా సంఘం (కెఎఎమ్ఎస్) లో సమీకృతం కావాల్సిన అవసరం వివరించారు. కా. స్వప్న మాట్లాడుతూ, మహిళలు ఇంట్లోంచి బయటకు రావాలి. ఈ సమాజాన్ని అర్థంచేసుకోవాలి... మహిళలు కూడ "మేం తక్కువ, మాకు ఏమీ తెల్వదన్న" ("బారామో-మాట్ వున్నోం") అనే తప్పుడు అభిప్రాయం పోగొట్టుకోవాలని అన్నారు.

కా. నర్సింగ్ మాట్లాడుతూ, మేం పార్టీలోకి రాకముందు స్త్రీలు మాట్లాడితే పురుషులు వాళ్ళను దబాయించడం చూశాం. కానీ నేడు తద్భిన్నంగా చూస్తున్నాం. మనుషులను గౌరవించడం చూస్తూ, నేర్చుకుంటూ, నేర్పుతున్నాం అన్నారు. పురుషులు మహిళల్ని స్వతం మీటింగులకు తీసుకురావడానికి కృషిచేయాలన్నారు. కా. దివాకర్ మాట్లాడుతూ, జనాభాలో సగంగవున్న మహిళలు పోరాటంలో పాల్గొనకుండా విప్లవం విజయవంతం కాదన్నారు.

తర్వాత కా. చందర్ షా మాట్లాడుతూ, వర్గ సమాజంలో ప్రభుత్వం మరియు దోపిడీ వర్గాలు ఈ వ్యవస్థను కాపాడే ప్రయత్నంలో భాగంగా స్త్రీలను పక్కదారి పట్టించడానికిగాను 'మహిళా దినోత్సవం' జరుపుతున్నాయనీ, దీనికి ప్రత్యామ్నాయంగా మహిళలు తమ హక్కుల కోసం 'పోరాడే దినం'గా జరుపుకోవాలని వివరించారు.

అనంతరం అంతర్జాతీయ గీతాలాపనతో జెండా అవనతం చేసారు.

∞ ∞ ∞ ∞

ఉత్తర బస్తర్ డివిజన్లో కేస్కల్ ఏరియా కుడిపేల్లో 7 గ్రామాల నుండి 100 మంది, కోటీకుర్రెల్ లో 6 గ్రామాల నుండి 300 మంది, కోయలీబెడ ఏరియా అల్పరస్ లో 100 మంది మహిళలు పాల్గొని మార్చి 8 'మహిళా దివస్' జరుపుకున్నారు.

కొండగాం ఏరియాలో కూడ మార్చి 8న 'అంతర్జాతీయ మహిళా దినం' ఉత్తేజంగా జరుపుకున్నారు. 16 గ్రామాల నుండి 1000 మంది మహిళలు ఆలువాడ అనే గ్రామంలో సమావేశమైనారు. సభ నినాదాలు, సందేశాలు కొండకోనల్లో నుండి లోతట్టు అడవుల్లో నుండి మైదానాల్లోకి మైకులు అందించాయి. అలాగే చోటే డోంగాల్ రేంజిలో తోండావేడ అనే గ్రామంలో చుట్టుపక్కల 8 గ్రామాల నుండి మహిళలు పిల్లలతో సహా 200 మంది జమయినారు. అంతర్జాతీయ మహిళాదినం ప్రాముఖ్యతను అర్థంచేసుకొని, తరతరాల ఆచారాలకు తమపై జరుగుతున్న అత్యాచారాలు అణచివేతకు, పురుషాధిపత్యానికి గల అంతసుంబంధాన్ని గ్రహించారు. మహిళల విముక్తికీ, ఇష్టంలేని పెండ్లిళ్లకు వ్యతిరేకంగానూ పోరాడడమే మార్గమని ఆ సమావేశంలో మహిళలందరు గ్రహించారు. ఈ సందర్భంలో మాసినార్ గ్రామంలో పేదరికంతో పెండ్లిచేసుకోకుండా మాము ఇంట్లోవున్న ఒక జంటకు ఇంటికి అర్థ కిలో బియ్యం జమచేసి పెండ్లి జరిపించారు. తూర్పు మెట్టలో కూడా 30 మంది మహిళలు అంతర్జాతీయ మహిళాదినం జరుపుకున్నారు.

సోనేపూర్ రేంజి (అబూజ్‌మాడ్) లో 5 గ్రామాలకు చెందిన మహిళలు 130 మందితో సహా 200 మంది ప్రజలు పాల్గొనగా మార్చి 8 'అంతర్జాతీయ మహిళా దినం' జరుపుకున్నారు. బలవంతపు పెండ్లిళ్ళు చేయవద్దనీ, బిడ్డల వయస్సులో మనసుతో సంబంధం లేకుండా పెద్దలు కల్పుత్తాగవద్దనే గుర్తించిన చైతన్యంతో

పొందడంతో పాటు సమావేశంలో మహిళలకు సంబంధించిన అన్ని సమస్యలను చర్చించినారు. ఏరియాలోని అన్ని **గ్రామాలకి కెఎయంయస్ నిర్మాణం విస్తరించి పోరాటం సాగించడం ద్వారానే స్త్రీ సమస్యలు పరిష్కారం సాధ్యమన్న** అవగాహనతో ఉత్సేజకరంగా సమావేశం ముగించుకున్నారు.

కె ఎ యం యస్ మహాసభలు:

ఉత్తర్ బస్తర్‌కి చెందిన కొండగాం రేంజి కెఎఎమ్ఎస్ మొదటి మహాసభలు కా. పుల్‌బత్తి హాలులో జరిగాయి. కా. రసాయి జెండా ఎగరవేయగా, కా. రాంసింగ్ స్థూపావిష్కరణతో మహాసభలు ప్రారంభమైనాయి. మూడు రోజులపాటు ఉత్సాహంగా జరిగిన ఈ మహాసభల్లో రాజకీయ తీర్మానం, కెఎయంయస్ ప్రణాళిక, వర్క్ రిపోర్టులపై చర్చలు జరిగి వాటిని ఆమోదించారు. స్త్రీ సమస్యలు ప్రత్యేకంగా చర్చించారు. అయిదుగురితో కూడిన రేంజి కమిటీని ఎన్నుకున్నారు. , అధ్యక్షులు కా. సుకోంతి ఉపన్యాసం, చివరగా కా. చమిలి జెండా దించడంతో మహాసభలు విజయవంతంగా ముగిసాయి.

తీర్మానాల్లో ముఖ్యమైనవి కొన్ని:

1. గోటుల్ సంబంధాలు కొనసాగించిన వారి మధ్య పెళ్ళిళ్ళు జరపాలి. పెళ్ళిళ్ళకు నోచుకోని దగ్గర కనీసం జీవన భృతి ఇప్పించాలి.
2. యువకులు కుప్పల్సు (జుట్టు) కత్తిరించుకోవాలి.
3. స్త్రీపురుషులు సమానులే. స్త్రీపురుష భేదం నశించాలి.
4. గ్రామ గ్రామాన కె ఎ యం యస్ ల నేర్పరచాలి.

దక్షిణ బస్తర్ డివిజన్‌లోని పామేడ్ రేంజిలో 'అంతర్జాతీయ మహిళాదినం' మార్చి 8న కెఎఎమ్ఎస్ ఆధ్వర్యంలో విజయవంతంగా జరుపుకున్నారు. పోస్టర్లు కరపత్రాలతో పాటు ముందుగా 2,3 రోజులు కేంపెయిన్ నిర్వహించిన ఫలితంగా పెక్కు గ్రామాలనుండి 200 మంది మహిళలు రాచపాడులోని సమావేశానికి హాజరయ్యారు.

కమ్యూనిస్టు ఇంటర్నేషనల్‌కు చెందిన మహిళా సభ్యురాలు క్లారాజెట్కిన్ నేతృత్వంలో 85 సంవత్సరాలక్రితం శ్రామిక మహిళల కోసం 'అంతర్జాతీయ మహిళా దినం' మార్చి 8 నాడు జరుపుకోవాలని నిర్ణయించారు. అందువల్ల నేడు కొండకోనల్లో కూడా పోరాడుతున్న శ్రామికవర్గ మహిళకు ఒక పోరాటదినం, అంతర్జాతీయ వేదికకు ఒక ప్రాతిపదిక ఉన్నాయన్న విషయం మనలాంటి వారికి ఎంతో ధైర్యాన్ని, విశ్వాసాన్ని కలిగిస్తోందని కా. అజిత్ పేర్కొన్నారు. కెఎ ఎమ్ఎస్ లోని ప్రతి మహిళా పోరాటంలో చైతన్యవంతురాలు కావాలని కా. గంగక్క పిలుపునిచ్చారు.

దక్షిణ బస్తర్ డివిజన్ కిష్టారం రేంజి (కుంట ఏరియా) సింగన్‌మడుగు గ్రామానికి చెందిన ఒక యువతిని భార్యా నల్గురు పిల్లలున్న ఒకతను లోబర్చుకోవాలని వెంటపడ్డాడు. దీనితో ఆ యువతి తన సమస్యను కెఎఎమ్ఎస్ ముందుకు తేవడంతో ప్రజాపంచాయితీ నిర్వహించి హెచ్చరించి వదలిపెట్టారు. ఆమెను బలవంతంగా పెండ్లిచేసుకోవాలనే కోర్కెతో తిరిగి ప్రయత్నించాడు. ఈసారి నల్గురు యువకులకు కల్లుపోయించి ఆమె నెత్తుకు రావడానికి వారం రోజుల నుండి ప్లాను వేసి, ఒక రోజు సంత నుండి వస్తుండగా మీదపడి గుడ్డలూడుతుండగా కూడా లాక్కుపోయారు. అయినా ఆ యువతి తర్వాత తప్పుకొని వచ్చి డిఎకెఎమ్ఎస్, కెఎఎమ్ఎస్ లకు చెప్పింది. దీనితో మూడు గ్రామాల ప్రజలు పాల్గొనగా ప్రజాపంచాయితీ జరిగింది. వారి తీర్పు మేరకు ఆ 5 గురికి దేహశుద్ధిచేసి ఆమె బట్టల కోసం 500 రూ. లు వసూలు చేసారు. మరోసారి అలాంటి ప్రయత్నం చేస్తే తీవ్రంగా శిక్షించాల్సి వస్తుందని హెచ్చరించి వదిలారు.

ఆదివాసుల ఆచారం ప్రకారం దసరా సమయంలో కొడ్తల (కొత్త అన్నం) పండుగ వస్తుంది. ఈ సందర్భంగా స్త్రీపురుషులు "లందా" త్రాగి రాత్రంతా ఆటలు పాటలతో ఉల్లాసంగా గడుపుతారు.

కంచెల్ గ్రామంలో (బాసగుడెం ఏరియా) ఈ పండుగ రోజు పొజ్జే పేరు గల చెల్లి లంద త్రాగి

ఆడిపాడి ఆదమర్చి పడిపోయింది. దారిని పోతున్న నంగాల్, బుద్రాల్ లు ఆదే అదనుగా ఎంచి అచేతనంగా పడివున్న ఆ చెల్లెను పక్కనున్న పొదల చాటుకి లాక్కుపోయి అత్యాచారం చేశారు. ((బుద్రాల్ గతంలో కూడ ఆమెను వేధించిన ., అలాగే నంగాల్ కూడా గతంలో ఇద్దరు ముగ్గురు అమ్మాయిల వెంటబడిన చరిత్ర గల వాళ్ళే)).

రాత్రి జరిగిన ఘటన గూర్చి అమ్మలక్కలు చాటుమాటుగా అనుకుంటుంటే చిన్న పొజ్జె 'ప్రజాపంచాయితీ జరుపుతారని, తనపై జరిగిన అత్యాచారానికి తననే నిందిస్తారనే, దీనితో పదిమందిలో తలవంచుకోవలసి వస్తుం ద'ని భావించి మర్నాటి పగలు పొలంలో ఉరిపోసుకుని ఊపిరి విడిచింది.

ఈ ఘటన కెఎఎమ్ఎస్ దృష్టికి రాగానే రేంజి కమిటీ సమావేశంలో చర్చించారు. 15 గ్రామాల ప్రజలను ముఖ్యంగా మహిళలందరినీ కూడగట్టి అత్యాచారాలు సాగించిన వారికి బుద్ధిచెప్పి, అక్కల్లో ఆత్మవిశ్వాసం కలిగించాలని నిర్ణయించారు. ఆ ప్రకారం నూరు మంది అక్కలతో సహా 300 మంది ప్రజలు జమయినారు. ప్రజాపంచాయితీలో "దుర్వాసన్"చేసి ((గుండు కొట్టించి)) తప్పు ఒప్పించారు. తిరిగి 'ఇలాంటివి ఎప్పుడూ చేయం' అని అక్కల అన్నల కాళ్ళు మొక్కించి పొజ్జె కుటుంబం వారికి రెండు జతల గొడ్లను ఇప్పించారు.

దక్షిణ బస్తర్ జిల్లా కుంట తాలూకా గొల్లపల్లి రేంజి గచ్చనపల్లి గ్రామానికి చెందిన బోడేను అదే గ్రామానికి చెందిన మొడియం జోగాలు అనే యువకుడు పెండ్లిచేసుకోవాలనుకున్నాడు. అందుకుగాను నల్గురు యువకులకు కల్లు త్రాగించి పంపగా వారు . . అడ్డువచ్చిన అమ్మాయి తండ్రిని కొట్టి ఇంటినుండి ఆమెను ఎత్తుకుపోయారు. తల్లితండ్రులను ఒప్పించడం కోసం వెంటనే కొంత ధాన్యం, లంద, కల్లు, పంది, మేక, కోళ్ళను తీసుకొని వచ్చారు. కాని తల్లితండ్రులు, వాటిని స్వీకరించలేదు. ఈ లోగా తప్పించుకుని వచ్చిన ఆ యువతి జరిగిన కథంతా కెఎఎమ్ఎస్ ముందు చెప్పడంతో ప్రజాపంచాయితీ జరిగింది. దానిలో ఆ యువకునికి రెండు చెంప దెబ్బలు వేసి మిగతా వారిని హెచ్చరించి వదిలారు.

ఉత్తర్ బస్తర్ డివిజన్ కొండగాంవ్ రేంజి వయనార్ గ్రామంలో పెళ్ళికాని 'సుక్కు' అనే యువతికి సంవత్సరం వయసున్న కొడుకు ఉన్నాడు. ఆమె గర్భవతి కాగా మేనమామ వాళ్ళు తీసుకుపోయారు గాని పిల్లవాడి పుట్టుకకు కారకుడైన యువకుడు తీసుకువెళ్ళలేదు ఇటీవలి రేంజి మహాసభలోని తీర్మానానుసరించి గ్రామ కెఎఎమ్ఎస్ ఆ యువతి యువకులిద్దరినీ ఒకచోట చేర్చి విచారించగా ఆ యువకుడు సుక్కు ను తీసుకుపోవడానికి సుముఖత వ్యక్తంచేసి తీసుకుపోయాడు. అలాగే జార అనే గ్రామంలో కచిరి అనే యువతి కూడ గోటుల్ సంబంధాల్లో బిడ్డను కని అనాధగా మిగిలిపోయింది. కెఎఎమ్ఎస్ చొరవతో సంబంధాలు పెట్టుకున్న ఆ యువకుడి దగ్గర నుండి ఒక ఎకరం భూమి ఇప్పించారు. ఇలా పలు గ్రామాల్లో యువతుల సమస్యలు పరిష్కరించబడడంతో కెఎఎమ్ఎస్ దీక్షాచిగా తమ జీవితాల్లో అండగా నిలుస్తుందని మహిళాలోకం దానిచుట్టూ సమీకృతం కావడానికి ముందుకొస్తున్నారు.

జారవాహి ((అబూజ్‌మాడ్)) గ్రామంలో సంఘసభ్యుడైన ఉడ్లో, సుక్రాం గాండో వద్ద డబ్బులు తిని కల్లు త్రాగి అదే గ్రామంలోని పిట్టేకల్ పారకు చెందిన తన మేనకోడలు 'అయితే'ను బలవంతంగా తీసుకుపోయాడు. సుక్రాం గాండోని పెండ్లి చేసుకోవాలనే పక్కపారలోని ఇంటిలో ఒక రాత్రంతా అతనితోపాటు బంధించాడు. ఆమె ఈ బలవంతపు పెండ్లిని వ్యతిరేకించి తప్పించుకొని ఇంటికి వచ్చింది గాని, వారి ఆచారాల ప్రకారం ఇది మామూలే గనుక, ఎవరికీ చెప్పకుండా ఉండిపోయింది. ఈ విషయం వారం తిరిగే సరికి అందరికీ తెలిసి ప్రజాపంచాయితీ జరగ్గా ఆమె నిర్భయంగా తన మనసు విప్పి అంతా చెప్పింది. . తల్లితండ్రులతో సహా పెద్దమనుషులనుకునే వారంతా అమ్మాయిని తిట్టడంతో, దళం వారి సంస్కృతి రివాజుల్లోని లోపాన్ని అర్థంచేయించి స్త్రీలను అణచిపెట్టడం సరైంది కాదని తెలియజెప్పి సుక్కుడూ ని శిక్షించి అతని సంఘ సభ్యత్వాన్ని రద్దుచేశారు.

జారవాహి గ్రామంలో 10 మంది స్త్రీలపై మంత్రాలు చేస్తున్నారని ఆరోపణచేసి ఎనిమిది మంది వద్ద ఒక్కో

ఎద్దు, పంచాయితీ పేరుతో 20, 30 గ్రా.లు వసూలుచేసి తిన్నారు. దీనికి గ్రామపెద్దలు నాయకత్వం వహించారు కెఎమ్ఎస్ మహిళా దివస్ నాడు ఆ గ్రామంలో ఉన్న ఈ సమస్యను చేపట్టింది. దండుగలు వసూలుచేసి తినడం కోసం అలాగే స్త్రీలను అణచిపెట్టడం కోసం ఇదంతా మంత్రాలు పేరుతో చేస్తారనే, రోగానికి అసలు కారణం వివరించారు. ఇది పెద్ద మనుషులు చేసిన కుట్రకాబట్టి వారిచే ఆ పదిమంది మహిళలకు గ్రామస్థులకు క్షమాపణ చెప్పించి నష్ట పరిహారంగా రు.3,000 లు ఇవ్వాలని తీర్పుచెప్పారు.

ప్రతాప్‌పూర్ రేంజి (ఉత్తర్ బస్తర్) కట్‌గాంవ్ కు చెందిన గాయితా (పూజారి) బుకీలు పద్దామి, పటేల్ రైజు పద్దామి లు ఇద్దరు కలసి తమ గ్రామం పక్క గ్రామాల్లో మొత్తం 12 మంది మహిళలపై (లైంగిక) అత్యాచారం చేసారు. మరికొందరిని భార్యలుగా మార్చుకున్నారు. తగాదాలు రాగానే పురుషాధిపత్యంతో తన్ని తరిమేసేవారు.

ఇదే గ్రామానికి చెంది, భర్త జైలుకెళ్ళిన నల్గురు పిల్లల తల్లి మైనిబాయిని బుకీలు బెదిరించి లొంగ దీసుకొని మహారాష్ట్ర ఏటపల్లి ఏరియాకు పారిపోయాడు. కొన్ని సంవత్సరాలు గడిపి ఆమెను కూడ వదలివేసి తిరిగి గ్రామం చేరాడు. మైనిబాయిదే 10 ఎకరాల భూమి అక్రమంగా ఆక్రమించుకున్నాడు. ఆ తర్వాత పటేల్ రైజు ఆమెతో సంబంధాలు పెట్టుకోగా అబ్బాయి పుట్టాడు. ఇద్దరు పిల్లల తల్లి అయిన సొంత భార్యను ఉరి వేసి చంపి ఆమె చనిపోయినట్లు ప్రచారం చేసిన క్రూరుడు రైజు.

ఇలా వీరి అరాచకాలకు అంతం లేకుండా 'దేవుని కోడె' ల్లా తిరుగుతూ మహిళల పాలిట రాక్షసుల్లా తయారైన పెత్తందార్లు వీళ్ళు. ఇటీవలనే గెరిల్లా దళ కార్యకలాపాలు విస్తరించగా, ఇది దళం ముందు తీవ్ర సమస్యగా నిలిచింది. వీళ్ళను శిక్షించాలని దళం నిర్ణయించింది. అయితే బుకీలు దొరికాడు కాని పటేల్ దొరక లేదు. గ్రామంలో 200 మంది ఆడ-మగ రాగా, వారి ముందు వీడిని విచారించారు. తప్పులను నిరాకరించిన వీడ్ని ప్రజలు తీవ్రంగా దేహశుద్ధి చేసారు. భూమిలేని మైనిబాయికి 10 ఎకరాలు వాపసు ఇప్పించారు. వీని గాయితా పదవిని రద్దుచేశారు. చివరికి మేక, పందిని దండుగ కట్టి ప్రజలంత సమిష్టిగా తిన్నారు. ఈ ఉత్సాహంతో మహిళలు కెఎమ్ఎస్ లో సంఘటితమవుతున్నారు. ∞

---

"ఆంధ్రప్రదేశ్ జైళ్ళలో బ్లాక్ డే పాటించండి!"

– పీపుల్స్‌వార్ ఖైదీల పిలుపు

నిజామాబాద్ జిల్లాలో పీపుల్స్‌వార్ సానుభూతిపరులైన క్రిష్ణవేణి, గంగామణి లను పోలీసులు వివస్త్రలను చేసి అసభ్యంగా ప్రవర్తించడానికి నిరసనగా జైళ్ళలోని రాజకీయ ఖైదీలు ఫిబ్రవరి 22 నాడు (గురువారం) 'బ్లాక్ డే' గా పాటించాల్సిందిగా పీపుల్స్‌వార్ రాజకీయ ఖైదీలు అప్పారావు, బాలకృష్ణ, సుధాకరరెడ్డిలు పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 22నాడు ఉత్తర తెలంగాణా బంద్‌ను విజయవంతం చేయాలని వారు కోరారు. ఇటీవలే అర్ధరాత్రి సమయంలో 15 మంది సాయుధులైన జిల్లా పోలీసులు క్రిష్ణవేణి ఇంటిపై దాడిచేసి ఆమెను అరెస్టుచేశారని విమర్శించారు. పోలీసుల భయానికి గ్రామం బయట పడుకున్న గంగామణిని కూడా అరెస్టుచేసి, గ్రామస్థుల ముందే వీరిద్దరిని చిత్రహింసలకు గురిచేసారని అన్నారు. వీరిని నిజామాబాద్ తీసుకెళ్తూ మల్లారంగండి వద్ద ఆపి సాయుధ పోలీసులు వివస్త్రలను చేసి, బూతుపదజాలంతో దూషిస్తూ, శారీరక హింసలకు గురిచేసారని అన్నారు. ఎలాంటి నేరారోపణలు లేని గంగామణిని అక్రమంగా అరెస్టుచేశారని జైలు నుంచి విడుదలయినప్పటి నుంచి కృష్ణవేణి ఇంటివద్దనే ఉంటున్న విషయం జిల్లా ఎస్పీ అనూరాధకు తెలిసినప్పటికీ ఎలాంటి వారంటు లేనప్పటికీ అరెస్టు చేసిందన్నారు.

---

## ప్రతిజ్ఞలకు సలాం కొట్టిన 'ప్రజా' గాయకుడు।

§ 25 ఏప్రిల్ 1996 నాటి రేడియో వార్తల్లో గద్దర్ రాజీనామా వార్త వెలువడింది. తాను ఎంత 'సదురుకు పోదామనుకున్నా' పార్టీ నాయకత్వం 'సదురుకోనీయడం' లేదనీ కక్ష సాధింపు కొనసాగిస్తున్నందున రాజీనామా ఇస్తున్నానని ప్రకటించాడు. 'ప్రజల కోసమే' పాడుతానని రాస్తానని కూడా ప్రకటించాడు. గద్దర్ "సదురుకోవడానికి' కావలసినంత అవకాశం ఇచ్చింది పార్టీ అతన్ని సరిదిద్దడానికి ఆంధ్ర రాష్ట్ర 14వ కాన్ఫరెన్స్ తీవ్రంగా చర్చించి అతనికి ఈ లేఖను అందించింది. పాఠకుల అవగాహన కోసం అందిస్తున్నాం§

డియర్ కామ్రేడ్! తేది: 01.9.95

రెడ్ శాల్యూట్స్.

జులై 21-22 §1994§ తేదీల్లో సమావేశమైన జె.ఎన్.ఎమ్.సెల్ సమావేశంలో మీపై కొన్ని విమర్శలు పెట్టి, వాటిపై ఆత్మవిమర్శ చేసుకోవాలని కోరాము. అందులో,

1. ట్రస్ట్ తరఫున స్కూలు నిర్మాణం కోసం వసూలుచేసిన విరాళాలపై ఆత్మవిమర్శ చేసుకుని, ఆ స్కూలు నుండి కా.విమలతో సహా మీరు బయటకు రావాలనీ, ఆ స్కూలుతో ఎలాంటి సంబంధం కలిగివుండరాదనీ కోరాము.

2.ఢ1991 నుండి, మీరు లీగల్‌గా వుంటున్నప్పటి నుండి పార్టీని సంప్రదించకుండా, సెల్‌కు ఎలాంటి సమాచారం లేకుండా మీకు ఇష్టమొచ్చిన రీతిలో సభలకు, సమావేశాలకు వెళ్ళడం, సాంస్కృతిక ప్రదర్శనలు ఇవ్వడం పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించడమేననీ - వీటిపై ఆత్మవిమర్శ చేసుకోవడానికి పి.సి.తరఫున, సెల్ తరఫున మిమ్మల్ని కోరడం జరిగింది: ఈ విమర్శలపై పది రోజుల్లోగా ఆత్మవిమర్శ రాతపూర్వకంగా పంపుతానని మీరు ఆ సమావేశంలో చెప్పారు. ఆ తర్వాత మీ నుండి ఎలాంటి ఆత్మవిమర్శ రాలేదు. కా.ప్రభాకర్ ద్వారా మీ ఆత్మవిమర్శపై మీరు పంపాల్సిన విషయాన్ని గుర్తుచేస్తున్నప్పటికీ మీ నుండి ఎలాంటి సమాధానం రాలేదు. మీ ఆత్మవిమర్శకు బదులుగా 26.10.1994న మీరు కా.శ్యామ్‌కు పంపిన ఉత్తరంలో "జె.ఎన్.ఎమ్.సెల్ బాధ్యతలకు రాజీనామా చేస్తున్నట్లు" గా తెలియజేసారు. మీరు పంపిన ఏకవాక్య ఉత్తరాన్ని పి.సి.లో చర్చించి జె.ఎన్.ఎమ్. ~~సెల్ సమావేశంలో మీ రాజీ~~నామా విషయాన్ని చర్చించి ఫైనలైజ్ చేయాలనుకున్నాము. ఆ తర్వాత 1995 ఏప్రిల్‌లోపు పి.సి.నుండి మీకు రెండు ఉత్తరాలు పంపాము. అందులో 'మీ ఆత్మవిమర్శను రాసి పంపమనీ, స్కూలు నుండి మీ ఇద్దరూ బయటకు రావాలని కోరుతూ - మీ రాజీనామా విషయం చర్చించటానికి సెల్ సమావేశానికీ, ఆ సందర్భంగా జరిగే రాజకీయ తరగతులకు హాజరు కావాలని' మిమ్మల్ని కోరుతూ ఉత్తరాలు పంపాము. దీనికి జవాబుగా 'రాజకీయ తరగతులకు హాజరు కాలేననీ, సెల్ సమావేశానికి హాజరవుతాననీ' కా.కిరణ్ ద్వారా మీరు చెప్పి పంపారు. మీరు ఆ సమావేశానికి రావడానికి వీలుగా కా.కిరణ్ మీతో అపాయింట్‌మెంట్లు పెట్టుకున్నాడు. మీరు ఆ తేదీలకు రాలేదు. ఆ తర్వాత జరిగిన సెల్ సమావేశంలో 'మీరు లోపల సమావేశం పెడితే రాలేననీ, బయట సమావేశం ఏర్పాటుచేస్తే వస్తాన'ని మీరు చెప్పినట్లుగా మిమ్మల్ని కలసిన కామ్రేడ్స్ చెప్పడంతో, మీరు సమావేశానికి హాజరై విషయాలు చర్చించుకోవడం అవసరమన్న ఉద్దేశ్యంతో సమావేశం స్థలం మీరు కోరిన విధంగా ఏర్పాటుచేసి మీకు అపాయింట్‌మెంట్లు పెట్టాలని సెల్‌లో నిర్ణయించుకుని, దానికి అనుగుణంగా మిమ్మల్ని కాంటాక్ట్‌చేసి అపాయింట్‌మెంట్లు పెట్టాము. ఆ అపాయింట్‌మెంట్లకు కూడా మీరు వస్తానని చెప్పి వాటికి కూడా రాలేదు. దానితో సెల్ సమావేశం మీరు లేకుండానే జరిగింది. అందులో యీ దిగువ పేర్కొన్న తీర్మానాలని చేసి మీకు పంపాము.

" 1. సెల్ బాధ్యతల నుండి రాజీనామా చేస్తున్నామని కా. సుదర్శన్ పి.సి.ఎస్.కు రాసిన ఉత్తరాన్ని సెల్

చర్చించి, సెల్ కార్యదర్శిగా కా. సుదర్శన్ రాజీనామాను ఆమోదించడం జరిగింది.

2. జె.ఎన్.ఎమ్. ప్రచురణలుగా ఇటీవల మూడు పుస్తకాలు వచ్చాయి. 1. మా పల్లె 2. పాటలు-ఆటు పోటులు 3. డప్పు శాస్త్రం. ఈ ప్రచురణల విషయంలో కా. సుదర్శన్ సెల్‌లో చర్చించలేదు. సెల్ అనుమతి లేదు. ఇకపై సెల్ అనుమతి లేకుండా జె.ఎన్.ఎమ్. ప్రచురణలుగా ఏ పుస్తకాన్నీ ప్రచురింపరాదు.

3. 1994 నుండి అమ్మకాల కోసం అమ్మిన 12 ఆడియో క్యాసెట్స్ అమ్మగా వచ్చిన నాలుగున్నర లక్షల రూ.ల అకౌంట్స్ వివరాలు, మరో మూడు క్యాసెట్స్ (కారంచేడు-నక్సల్బరీ వీరులు....) వాటి అమ్మకపు వివరాలు ఎంత?

- జె.ఎన్.ఎమ్. పుస్తకాల ప్రింటింగ్‌కు అయిన ఖర్చు ఎంత? నిల్వవున్న పుస్తకాల వివరాలు.
- కమీషన్‌తో అమ్మిన ఆడియో క్యాసెట్స్ వివరాలు, వచ్చిన కమీషన్ ఎంత?

పై వివరాలు కా. సుదర్శన్ సెల్‌కు రాసి పంపించాలి. నిల్వవున్న డబ్బుని సెల్ కే అందించాలి. "

పై విషయాలన్నీ కూడా ఇటీవల జరిగిన 4వ రాష్ట్ర మహాసభ చర్చించి దాని తరపున మీకు ఉత్తరం పంపాలని నిర్ణయించడం జరిగింది. ఈ దిగువ పేర్కొన్న విషయాలను , ఏకగ్రీవంగా ఆమోదించి పంపుతున్నది.

"1. 1991 నుండి పార్టీని కాంటాక్టు చేయకుండా, తాను చేస్తున్న కార్యకలాపాలను పార్టీకి రిపోర్ట్ చేయకుండా పార్టీ నిర్వహించే రాజకీయ తరగతుల కోసం సెల్ సమావేశాలకోసం పెట్టిన అపాయింట్‌మెంట్‌లకు రాకుండా, పార్టీ క్రమశిక్షణకు ఏ మాత్రం కట్టుబడకుండా బాధ్యతారహితంగా, నిర్మాణ అరాచకత్వంతో మీరు వ్యవహరించారు.

2.. పార్టీ పలుకుబడిని, వనరులను మీరు స్వప్రయోజనాలకోసం వాడుకున్నారు.

ఎ. పార్టీ పలుకుబడిని వినియోగించుకుని 'అమరవీరుల పిల్లల కోసమనీ, దళితుల పిల్లలకోసమనే' పేరుతో మీరు విరాళాలు వసూలుచేసి సుమారు నలభై లక్షల రూ.ల విలువపైన స్కూలు బిల్డింగ్‌ను కట్టించారు.

బి. పార్టీతో సంప్రదించకుండా స్కూలు నిర్వహణలో మీరు కూరుకుపోయారు.

సి. ఆడియో క్యాసెట్స్ అమ్మగా వచ్చిన నాలుగున్నర లక్షల రూ.లను లెక్కచెప్పకుండా వాడుకుంటూ, సెల్ కామ్రేడ్స్ ఎన్నిసార్లు అడిగినా వివరాలు చెప్పకుండా డబ్బంతా పార్టీకి ఇచ్చానని మీరు బుకాయించారు.

డి. సెల్‌తో సంబంధం లేకుండా, పార్టీకి తెలుపకుండా, జె.ఎన్.ఎమ్. ప్రచురణల పేరుతో మీరు అనుకున్న పుస్తకాలు ప్రింట్ చేయించారు.

ఇ. విప్లవోద్యమం కోసం రాసిన పాటలను సినిమాలకు అమ్ముకున్నారు.

ఎఫ్. పార్టీ అనుమతితోనే సినిమాకు పాటలు రాయడం, పాడడం చేస్తున్నట్లుగా ప్రచారం చేసుకుంటున్నారు.

జీ. పార్టీ అనుమతి లేకుండా వివాదాస్పదమైన సభలకు (ఉదా. కాంగ్రెస్ పార్టీ ఆర్గనైజ్ చేసిన, కోట్ల విజయభాస్కరరెడ్డి ఏర్పాటుచేసిన కులసభలకు, గవర్నర్ పాల్గొనే సభలకు) వెళ్ళడం - ఇలాంటివాటికి వెళ్ళకూడదని చెప్పినప్పటికీ ఏమాత్రం లెక్కచేయకుండా నిర్మాణ క్రమశిక్షణకు మీరు కట్టుబడి ఉండలేదు.

హెచ్. పార్టీలో, ప్రజాసంఘాలలో పనిచేస్తున్న కార్యకర్తలను మీరు వర్గదృక్పథం వీడనాడి కులంపేరుతో దూషిస్తున్నారు.

ఐ. జె.ఎన్.ఎమ్. కార్యకర్తల పుస్తకాలను పార్టీ అనుమతి లేకుండా, ఆ కామ్రేడ్‌కు సైతం చెప్పకుండా మీరు పుస్తకాలు ప్రచురించడం, జె.ఎన్.ఎమ్. నిధుల నుండి వేల రూ.లు పార్టీ అనుమతి లేకుండా మీ సొంత నిర్ణయంతో వారికి యిస్తూ వారిలో వివిధ రకాల తప్పుడు పద్ధతులు అలవర్చటానికి ప్రయత్నించారు.

జె. పార్టీపై నమ్మకం లేదనీ, పార్టీ నాయకత్వంపై విశ్వాసం లేదనీ, పార్టీ సానుభూతిపరుల వద్ద మీరు పార్టీ నాయకత్వాన్ని లెక్కచేయకుండా మాట్లాడుతున్నారు.

3. జననాట్య కళామండలి అనే సంస్థను మీరు స్థాపించి, దానికో ప్రణాళిక-నియమావళిని రచించి, ఆ పేరుపై వేదికలపై మీరు ప్రదర్శనలు ఇస్తూ జె.ఎన్.ఎమ్.కు సమాంతరంగా మరో కళాసంస్థను నడిపిస్తున్నారు.

4. అంబేద్కర్ విద్యానికేతన్ (ఎ.వి.ఎన్) ట్రస్ట్ పేరుపై, 'మ్యూజియమ్ ఆఫ్ మ్యూజిక్' అనే పేర ఒక సంస్థను మీరు పెట్టి ప్రభుత్వం నుండి 35 లక్షల రూ.ల గ్రాంటు కోసం ప్రయత్నించారు.

5. జె.ఎన్.ఎమ్. నిర్వహణలో మొదటినుండి బ్యూరాక్రటిక్‌గా వ్యవహరిస్తూ, కామ్రేడ్స్ నుండి వస్తున్న విమర్శలను మీరు ఏ మాత్రం స్వీకరించకుండా, అలా విమర్శించినవారిపై కక్షసాధింపు పద్ధతిని చేపట్టారు."

పై విషయాలపై మీ నుండి తగిన సంజాయిషీ, ఆత్మవిమర్శను కోరాలని కాన్ఫరెన్స్ అభిప్రాయపడింది. మీ మీ ఆత్మవిమర్శతో పాటు స్కూల్ బిల్డింగ్ కోసం వసూలుచేసిన మొత్తం నిధుల లెక్కలను కూడా పార్టీకి చూపించి, స్కూలు నుండి, ట్రస్ట్ నుండి మీ రిద్దరూ పూర్తిగా బయటకు రావాలనీ, అలాగే ఆడియో క్యాసెట్స్ అమ్మకం డబ్బు నాలుగున్నర లక్షల రూ.ను పార్టీకి వెంటనే పంపించాలనీ, ఈ విషయాలపై మీ నుండి ఈ ఉత్తరం మీకు అందిన ఆరు నెలలలోగా తగిన సంజాయిషీ రానిపక్షంలో మీ పార్టీ సభ్యత్వాన్ని రద్దుచేయాలనీ, అలాగే ఈ ఆరునెలల కాలం మీ పార్టీ సభ్యత్వం సస్పెన్షన్‌లో ఉంటుందని కాన్ఫరెన్స్ ఏకగ్రీవంగా తీర్మానించింది.

కామ్రేడ్ !

మీరు గత రెండు దశాబ్దాలుగా విప్లవోద్యమంలో భాగంగా, సాంస్కృతిక రంగ కర్తవ్యాలను నిర్వర్తించారు. ప్రజలకు సేవచేయడానికి అనేక కష్టనష్టాలను అనుభవించారు. మీరు చేసిన సేవలను, త్యాగాలను మీరే సొమ్ము చేసుకుని, ఏ నిర్మాణ క్రమశిక్షణకు కట్టుబడి వుండకుండా, విప్లవ సాంస్కృతిక రంగంలో ప్రజల నుండి వచ్చిన గుర్తింపును, పేరు ప్రతిష్ఠలను, పార్టీ పలుకుబడిని దుర్వినియోగం చేశారు. ఇది పార్టీకీ, మీ విప్లవకర జీవితానికీ నష్టదాయకమైనది. పార్టీ నుండి, మీ తోటి కామ్రేడ్స్ నుండి మిమ్మల్ని సరిచేయడానికి పెట్టిన విమర్శలను ఏ మాత్రం లెక్కచేయకుండా మీరు అంతకంతకూ ప్రజలకు, విప్లవానికి దూరమైపోతున్నారు. ఇప్పటికైనా మీరు చేసిన తప్పులను గ్రహించి, తగిన ఆత్మవిమర్శ చేసుకుని, ప్రజలకు సేవచేయడానికై విప్లవ సాంస్కృతిక రంగంలో మీ కర్తవ్య నిర్వహణకు సిద్ధం కావాలి. అమరవీరుల ఆశయం కోసం మీరు చేసిన ప్రతిజ్ఞలను నిలుపుకోవాలని మేము కోరుతున్నాం.

SASBAN
Book No ..........

ఆంధ్రప్రదేశ్ 14వ కాన్ఫరెన్స్.

"ఒక రచయితకు గానీ, కళాకారుడికి గానీ మనసులో ఉండే ఉద్దేశాన్ని పరిశీలించేప్పుడు మనం, అతను పైకి చెప్పేదాన్ని గాక అతని చర్యకు సమాజంలోని ప్రజలపై ఎలాంటి ప్రభావం ఉన్నదీ పరిగణిస్తాం. మనసులో ఉండే అభిప్రాయాలకూ, ఆశయాలకూ కొలబద్ద సామాజిక ఆచరణా, దాని ఫలితమూనూ". — మావో

"శ్రామికవర్గానికీ, పెట్టీబూర్జువా వర్గానికి భేదం ఏమిటో స్పష్టంగా తెలియని కామ్రేడ్‌లు మనలో ఇంకాఉన్నారు. కమ్యూనిస్టు పార్టీలో సభ్యులుగా చేరి, పూర్తిగా పార్టీతో కలవక, సిద్ధాంతాలతో అసలే కలవనివారు చాలామంది ఉన్నారు. సిద్ధాంతాల దృష్ట్యా పార్టీతోకలవనివారి బుర్రలో దోపిడీచేసే వర్గాల తాలూకు చెత్త చాలా ఉంటుంది; శ్రామికవర్గ సిద్ధాంతం గాని, కమ్యూనిజం గాని, పార్టీ గాని వారికి ఎంతమాత్రమూ తెలియదు. "శ్రామికవర్గ సిద్ధాంతమా? పాతచింతకాయ పచ్చడి !" అనుకుంటారు. దాన్ని సంపాదించటం తేలికగాదని వారికి తెలియదు; కొందరిలో కమ్యూనిస్టు వాసన కొంచెంకూడా వారు బతికి ఉండగా కలగదు, చివరకు వారు పార్టీని వదలిపోతారు. అందుచేత, మన పార్టీలోనూ, అనుయాయులలోనూ అధిక సంఖ్యాకులు శుభ్రమైనవాళ్ళూ, విశ్వసనీయులు అయినప్పటికీ, మనం విప్లవోద్యమాన్ని మరింత పటిష్ఠవంతంగా వృద్ధిచేసి, విజయం శీఘ్రతరం చెయ్యాలంటే, మనం పరిస్థితిని సిద్ధాంత రీత్యానూ, నిర్మాణదృష్ట్యానూ కూడా చక్కబరచటానికి తీవ్రకృషి జరపాలి. నిర్మాణరీత్యా పరిస్థితిని చక్కబరచాలంటే ముందుగా సిద్ధాంతదృష్ట్యా చక్కబరచాలి. శ్రామిక వ్యతిరేక సిద్ధాంతాలకు విరుద్ధంగా శ్రామిక సిద్ధాంతంతో ప్రతిఘటించి పోరాటం సాగించాలి". — మావో.

## "సామ్రాజ్యవాద సంక్షోభ ఫలితమే ఫ్రాన్సు కార్మికవర్గం సమ్మె 'ట' పోట్లు"

ఫ్రాన్సులో జరుగుతున్న సమ్మెలు ఫ్రాన్సు మూలాలను గుర్తుచేస్తున్నాయి. 1648, 1789 ఫ్రాన్సు విప్లవాలు గుర్తొస్తాయి. 1648 లో బూర్జువా వర్గం ఆధునిక ప్రభువర్గంతో కలసి రాజరికానికి వ్యతిరేకంగా, ఫ్యూడల్ ప్రభు వర్గానికి వ్యతిరేకంగా, అధికారంలో ఉన్న మతానికి వ్యతిరేకంగా పోరాడింది. 1789లో బూర్జువా వర్గం ప్రజలతో కలసి రాజుకూ, ప్రభు వర్గానికీ, అధికారంలో వున్న మతానికీ వ్యతిరేకంగా పోరాడింది.

"ఫ్రెంచి భీభత్సమంతా బూర్జువా వర్గ శత్రువులైన నిరంకుశత్వం మీదా ఫ్యూడలిజం మీదా కింది వర్గాల ప్రజలు తమ సహజ ధోరణిలో పగతీర్చుకోవడం తప్ప మరేమి కాదు" అంటాడు మార్క్స్. "1648 విప్లవమూ, 1789 విప్లవమూ కేవలం ఇంగ్లీషు విప్లవమూ కేవలం ఫ్రెంచి విప్లవము కావు. అవి యూరప్ ఖండానికంతటికీ వర్తించే విప్లవాలు" అని కూడా మార్క్స్ పేర్కొన్నాడు.

ఇంగ్లాండులోని బూర్జువా విప్లవమూ, పారిశ్రామిక విప్లవ ప్రారంభమూ, ఉత్తర అమెరికా స్వాతంత్ర్య యుద్ధమూ, ఫ్రెంచి బూర్జువా విప్లవమూ ప్రపంచ చరిత్రలో ఒక నూతన అధ్యాయానికి ప్రారంభం చేశాయి. 18వ శతాబ్దపు ఫ్రెంచి బూర్జువా మహా విప్లవం ఫ్రాన్సులో మాత్రమే ఫ్యూడల్ వ్యవస్థను నిర్మూలించ లేదు. యూరప్‌లోని ఇతర దేశాల్లో కూడ ఫ్యూడల్ వ్యవస్థ విచ్ఛిత్తికి ప్రారంభోత్సవం చేసింది.

ఆ తర్వాత శతాబ్ద కాలం జరిగిన అనేక కార్మికుల సమ్మె పోరాటాలు, తిరుగుబాట్లు పర్యవసానంగా (రెండవ పునఃస్థాపన) 1871 మార్చి 18 నాడు పారిస్ కమ్యూన్ ఏర్పడింది. పారిస్ కమ్యూన్ 72 రోజులు మాత్రమే ఉండింది. కార్మిక పేటల్లోని చివరి బారికేడు (మార్గావరోధం) మే 28 న పడిపోయింది. ఆ స్వల్ప వ్యవధిలో అది అమలుజరిపిన చర్యలు దానికి కార్మిక శ్రేయస్సు పట్ల వుండిన భక్తిశ్రద్ధలకు తార్కాణం. ఆ నాడు పారిస్ కమ్యూన్ ఓటమికి కారణాలేమిటో నేటి కార్మికవర్గం సదా గుర్తుంచుకోవాలి.

1. నిజమైన విప్లవ పార్టీ లేకపోవడం
2. రైతాంగంతో మైత్రి నెలకొల్పుకోలేకపోవడం
3. శత్రు గూఢచారులు, విద్రోహులపై ఎలాంటి చర్యలు తీసుకోబడకపోవడం
4. ప్రగతి వ్యతిరేక పత్రికలను, ప్రతీఘాత విప్లవాన్ని అరికట్టడానికి సకాలంలో కమ్యూన్ పూనుకోకపోవడం
5. ఫ్రెంచి బ్యాంకులో వున్న విస్తారమైన డబ్బు కమ్యూన్ జప్తు చేసుకోలేదు. ఆ డబ్బు వర్సెల్స్‌కు బూర్జువాలు తరలిస్తూంటే అడ్డుపడకపోవడం

— ఇవే ప్రధానంగా పారిస్ కమ్యూన్ ఓటమికి కారణాలు.

ఎలాంటి విచారణ లేకుండా 30 వేల మంది కమ్యూన్ సభ్యులు ఊచకోతకు గురై ప్రపంచానికి అనేక గుణపాఠాలు అందించారు. "యూరప్ అంతటా అది సోషలిస్టు ఉద్యమాన్ని రేపింది. అంతర్యుద్ధపు శక్తిని నిరూపించింది..... సోషలిస్టు విప్లవ లక్ష్యాలను స్పష్టంగా నిర్ణయించుకోవాలనీ, యూరోపియన్ కార్మికవర్గానికి కమ్యూన్ నేర్పింది" అంటాడు కా. లెనిన్. ఆనాటి కమ్యూన్ నుండే (కమ్యూనార్డు) యూజీన్ పాటేర్ అనే కార్మికుడు నేడు మనం పాడుకుంటున్న అంతర్జాతీయ (ఇంటర్నేషనల్) గీతాన్ని అందించాడు. ఇంతటి సుదీర్ఘ, గొప్ప చరిత్ర కలిగిన ఫ్రాన్సు కార్మికవర్గం నేడు మరొక్కసారి వీధుల్లోకి వచ్చింది. తన సమ్మె పోరాటాల ద్వారా ఫ్రాన్సు ప్రభుత్వాన్ని సవాలు చేస్తుంది — "పోరాడితే పోయేది బాధలు మాత్రమే" నన్న మార్క్స్ మాటలను ఈ తరం కార్మిక వర్గం సదా గమనంలో ఉంచుకొని రాజీలేకుండా పోరాడినపుడే అనేక విజయాలు సాధిస్తుంది.

ఫ్రాన్సులో జరిగిన సమ్మెకు కారణం ఏమిటి?


రెండు అగ్రరాజ్యాలు నెలకొన్ననాడు వాటిల్లిన పరిణామాల నేపథ్యంలో ప్రచ్ఛన్న యుద్ధం ముగిసిందంటున్న తర్వాత సామ్రాజ్యవాదుల మధ్య కుమ్మక్కు, పోటీల తీవ్రతరం ఫలితంగా అనేక వ్యాపార ఒప్పందాలు, కూటములు ఏర్పడుతూ ప్రపంచాన్ని తమ మధ్య పునఃవిభజించుకోవాలనే ఏర్పాటు జోరుగా పోటీపడుతున్నాయి. ప్రపంచ మార్కెట్లలో పోటీని తట్టుకోవడానికి, పోటీలో ముందుండడానికి ఎడతెగని ప్రయత్నాలు ముమ్మరంగా కొనసాగుతున్న ఫలితంగా

ఎక్కడికక్కడే వ్యాపార కూటములు ముందుకు వస్తున్నాయి. నాఫ్టా, అంజూస్, ఇ.యు.లు అందులో ముఖ్యం కాగా సాప్టా లాంటి పిల్ల ఒప్పందాలు కూడా ప్రాంతీయ స్థాయిలో ఎక్కడికక్కడే చోటుచేసుకుంటున్నాయి. ఈ కూటములను పటిష్ఠపరచుకోవడంలో భాగంగానే ఆ యా దేశాలు చేపడుతున్న ప్రజా వ్యతిరేక ప్రభుత్వ సంస్కరణల తతంగాల పర్యవసానమే ఫ్రాన్స్‌లో వెల్లుబికిన సమ్మె పోరాటాలు.

గత సంవత్సరం (మే '95)లో అనేక వాగ్దానాలుచేసి అధికారానికి వచ్చిన కన్సర్వేటివ్ అధ్యక్షుడు యాక్ షిరాక్‌కు ఫ్రాన్స్ సమ్మె పోరాటాలు ఊపిరి సలుపుకోనీయడం లేదు. నిరుద్యోగాన్ని తొలగిస్తా, పన్నుల వడ్డింపు ఉండదు, వడ్డీరేట్లు కుదిస్తాననే గొప్ప హామీలతో పదవి నలంకరించిన వెన్వెంటనే యూరోపియన్ యూనియన్ సంధి షరతులు అర్జంటుగా ప్రభుత్వం ముందుకు వచ్చాయి. ఫలితంగా రిపబ్లికన్ పార్టీప్రధాని అల్లెయిన్ జుప్పే జిడిపి లో ప్రజాసంక్షేమ కార్యక్రమాలపై 30 శాతం కోతను ప్రతిపాదించగా, షిరాక్ మరో నాలుగడుగులు ముందుకేసి 34 శాతం ప్రకటించి సమ్మెలు మినహా కార్మికవర్గానికి మార్గాంతరం లేకుండా చేశారు.

పారిశ్రామిక దేశాలలోని సంపన్న దేశాల జాబితాలో ఫ్రాన్స్ 4వ స్థానం ఆక్రమిస్తుందనీ, ఎయిరోస్పేస్, ఎలక్ట్రానిక్స్, టెలికమ్యూనికేషన్స్ మరియు సాఫ్ట్‌వేర్ లాంటి హై-టెక్ రంగాలలో ముందంజలోనున్న దేశంగా గొప్పలు చెప్పుకునే ఆ దేశం ఇంటా-బయటా తీవ్ర సంకట పరిస్థితులనే ఎదుర్కోవలసి వస్తున్నది.

అమెరికా జిడిపి తో సరిసమానమైన జిడిపి ని ఇ.యు. కలిగివుంటున్నప్పటికీ, అమెరికా కేవలం ఏటా 9 బిలియన్ డాలర్లు మాత్రమే (315 బిలియన్ల రూపాయిలు) వర్ధమాన దేశాలకు అప్పుపెడుతుంటే మేము 31 బిలియన్ డాలర్ల వరకు (1085 బిలియన్ రూ.లు) భరిస్తున్నామని సగర్వంగా చెప్పుకుంటున్న ఇ.యు. వ్యవస్థాపక సభ్యదేశమైన ఫ్రాన్స్ ఎలాంటి పరిస్థితి ఎదుర్కొంటుందో చూడాలి.




సంపన్న పారిశ్రామిక దేశాల్లో ఎక్కడాలేని విధంగా ఫ్రాన్స్‌లో 12 శాతం నిరుద్యోగం తాండవిస్తుంది. దినదినం పెరుగుతున్న నిరుద్యోగం, ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తత చూస్తుంటే 1968 మే నాటి విద్యార్థి-కార్మిక తిరుగుబాట్లు తలంపుకొస్తున్నాయి. కానీ, అల్లెయిన్ జుప్పే ధీమాగా "ఫ్రాన్స్ మినహా ప్రపంచంలో మరెక్కడైనా ఇంత హాయిగా ఉండగలరా" అంటూ ప్రశ్నిస్తున్నాడు. తన సంస్కరణలను ససేమిరా వెనక్కితీసుకునేది లేదని మొరాయిస్తున్నాడు. కానీ, నిజానికి నేడు తక్షణంగా సంస్కరణలను ప్రవేశపెట్టాల్సిన అవసరం ప్రభుత్వానికి ఏ మొచ్చింది?

15 దేశాలను కలిగివున్న యూరోపియన్ యూనియన్‌లో జర్మనీతో పాటుగా ఫ్రాన్స్ కూడా ఒక ముఖ్య సభ్య దేశం. 1991 మాస్ట్రిట్చ్ సంధి ఒప్పందాలు ప్రకారం 1999 నాటికి సింగిల్ యూరోపియన్ కరెన్సీని ఏర్పర్చాలి. అందుకు సభ్య దేశాలు ప్రధానంగా ఆర్థికరంగంలో మూడు షరతులను పూర్తిచేయాల్సి ఉంది.

1. సభ్యదేశాల జి.డి.పి.లో బడ్జెటు లోటు 3 శాతంకి మించకూడదు.- అన్నది ఒకషరతు. కాగా ఫ్రాన్స్ బడ్జెటు లోటు 6 శాతంగా ఉంది. మరోమాటలో చెప్పాలంటే 83.6 బిలయన్ డాలర్ల లోటును 46 బిలియన్లకు తగ్గించాలి. (అంటే 2,905 బిలియన్ రూ.లను సగానికి సగం తగ్గించాలన్నమాట.)
2. సభ్యదేశాల ప్రభుత్వ అప్పులు జి.డి.పి.లో 60 శాతం మించరాదు.
3. ఉమ్మడి యూరోపియన్ కేంద్ర బ్యాంక్ విధించిన వడ్డీరేట్లతో, ఇతర ఆర్థిక విధానంతో సభ్యదేశాల విధానాలు సమ్మిళితం కావాలి.

ఈ షరతులను పూరించడంలో భాగంగా యాక్‌షిరాక్ ప్రభుత్వం ప్రజాసంక్షేమ నిధులను 230 బిలియన్ల

ఫ్రాంకులకు (43 బిలియన్ల డాలర్లు) తగ్గించింది, 50 లక్షల ప్రభుత్వోద్యోగుల వేతనాలను కుదించడమేగాకుండా మాజీ సోషలిస్టు మిట్టరాండ్ హయాంలో కొనసాగిన 37.5 సంవత్సరాలుగా వున్న రిటైర్‌మెంటు కాలాన్ని 40 సంవత్సరాలు పూర్తవుతేగాని పూర్తి పెన్షన్ దొరకని విధంగా వృద్ధాప్యం లో అధిక భారం మోపారు. అధిక పన్నులు విధించడమే గాకుండా ఆరోగ్య సేవా రంగాలలో కోత విధించారు. ఇలా ఎక్కడికక్కడే ప్రజలపై పెనుభారాన్ని మోపుతున్న ప్రభుత్వం, మరోవేపు ఇతర ప్రభుత్వాలకైతే 5 సం.లలో కూడా బడ్జెటు లోటు పూరించుకోవడం సాధ్యం కాదుగాని మా ప్రభుత్వం కేవలం రెండున్నర సంవత్సరాల్లోనే అనగా 31.12.'97 లోగానే మాస్ట్రిచ్ షరతులను పూర్తిచేయగలదని నిస్సిగ్గుగా ప్రకటిస్తోంది.

అయితే, కార్మికవర్గం చేతులు ముడుచుకోలేదు. అమెరికా వీధుల్లో నికృష్ట పరిస్థితుల్లో కన్నుమూస్తున్న జనం మాదిరిగా మేం చావదలచుకోలేదని కార్మికులు ఆక్రోశిస్తూ, అల్లెయిన్ జుప్పెకు తమ సమ్మెల ద్వారా జబాబు ఇస్తున్నారు. 24 నవంబర్ 1995 నాడు ప్రభుత్వోద్యోగులు ఒక రోజు సార్వత్రిక సమ్మె నిర్వహించి ఆ తర్వాత కాలంలోని సమ్మెల ఆరంభానికి నాంది పలికారు. అవే ప్రభుత్వాన్ని నీళ్ళు మింగనియ్యకుండా చేసిన డిసెంబర్-జనవరి నెలల్లో వరుసగా మూడు వారాలు సాగిన సమ్మెలు. (24 రోజులు)

రోడ్డు, రైల్వే ట్రాన్స్‌పోర్టు కార్మికులు సమ్మెలోకి దిగడంతో ఫ్రాన్సులో రోడ్లన్నీ స్తంభించిపోయి, సైకిళ్ళు ఇతర సాధనాలు అనివార్య వాహనాలైనాయి. అస్థిపంజరాలు ఆస్పత్రుల్లో వేచిచూడాల్సి వచ్చింది. విమాన సేవలు నిలిచిపోగా, ఫోన్ కరెంటు లైనులు తెగిపోయాయి. పాఠశాలలు గేట్లు తెరవలేదు. ఇలా ఎక్కడికక్కడే అన్ని రంగాల వారు ప్రభుత్వ సంస్కరణలపై తీవ్రంగా స్పందిస్తూ వీధుల్లోకి వచ్చారు. తూర్పు ఫ్రాన్సులో గని కార్మికులు పోలీసులతో వీధి పోరాటం చేశారు. పారిస్‌లో విద్యార్థులు పోలీసులతో తలపడ్డారు. పారిస్ ఆర్లే విమానాశ్రయం వద్ద పోలీసులు సమ్మెదారులపై భాష్పవాయువు ప్రయోగించి కాల్పులు జరిపారు. పోలీసులు ఎన్ని ఆటంకాలు ఏర్పర్చినా, కార్మికులను వీధుల్లోనే చిత్రహింసలు పాల్పేసినా మార్సెల్లెస్ నగరంలో లక్ష మంది కార్మికులు తమ నిరసన వ్యక్తం చేశారు. ప్రధాని అల్లెయిన్ జుప్పె పలుకుబడి ప్రభావం ఉందన్నట్లుగా చెప్పే బోర్డాక్స్ లో 50 వేల మంది కార్మికులు ప్రదర్శన జరిపారు. ఫ్రాన్సు సమ్మెపై సర్వే జరుపగా 60 శాతం ప్రజలు సమ్మెకు తమ అండదండలందజేస్తున్నట్లు ప్రకటించారు. అప్పటికే అల్జీరియా సాయుధ మిలిటెంట్ల బాంబు పేలుళ్ళతో, ప్రతీకార చర్యలతో తలకొరివిలా తయారైన పాలకవర్గానికి తాము తలపెట్టిన న్యూక్లియర్ పరీక్షలు ప్రపంచ ప్రజల తీవ్ర నిరసనను ఎదుర్కోవలసి వచ్చిన నేపథ్యంలో సమ్మెలు నిజంగా 'సమ్మెట' పోటులాగానే తయారైనాయి.

" ప్ర పం చ కా ర్మి క ది నం 'మే డే వర్థిల్లాలి!' "

మొత్తం కార్మికవర్గంతో కమ్యూనిస్టుల సంబంధం ఏ విధంగా ఉంటుంది ?

1. కమ్యూనిస్టులు ఇతర కార్మికవర్గ పార్టీలకు వ్యతిరేకమైన మరొక ప్రత్యేక పార్టీగా ఏర్పడరు.
2. కార్మికవర్గ సమష్టి ప్రయోజనాలకు భిన్నంగా, విడిగా కమ్యూనిస్టులకు ఏ ప్రయోజనాలు లేవు.
3. వాళ్ళు కార్మికవర్గ ఉద్యమాన్ని తమకు నచ్చిన మూసలో పోతపోయడానికి ఏ సొంత ఒంటెత్తు సూత్రాలనూ ముందుకు తీసుకరారు.

— మార్క్సు - ఏంగెల్స్ (కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక)

కేవలం ఫ్రాన్స్ పరిస్థితే కాదు ఇది. సామ్రాజ్యవాద శిబిరంలోని ఏ దేశాన్ని కదపినా ముఖ్యంగా జి-7 దేశాల్లో ఏ దేశాన్ని పలకరించినా పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఏమీ లేవు. అభివృద్ధి చెందిన పారిశ్రామిక దేశాలలో నిరుద్యోగుల సంఖ్య 35 మిలియన్‌లకు చేరుకుంది. ఒక్క ఉమ్మడి జర్మనీలోనే 45 లక్షల మంది ఉన్నారు. జర్మన్ ఛాన్సలర్ హెల్మెట్ కోల్ '96 ఏప్రిల్ చివరి వారంలో ప్రజాసంక్షేమ నిధులపై కోత తప్పదని ప్రకటించి 50 అరబ్ మార్కుల కోత విధించడంతో 50 వేల మంది కార్మికులు 28 ఏప్రిల్ నాడు బ్రహ్మాండమైన నిరసన ప్రదర్శన జరిపారు.

ప్రపంచ కార్మికదినం సందర్భంగా దేశ వ్యాప్త నిరసన ప్రదర్శనలకు కార్మికవర్గం సన్నద్ధమవుతోంది. ఇలా తూర్పు యూరపులో (ఇ.యు.లో) ని రెండు ప్రధానమైన దేశాలు పరిస్థితి ఎలా వుందో అర్థంచేసుకోవచ్చు. ఇది 1930 ల గొప్ప సంక్షోభం నాటికంటే అత్యధిక సంఖ్య అని అంటున్నారు. యూరోపియన్ శ్రామశక్తిలో 10వ వంతు నిరుద్యోగం తాండవిస్తోంది. మరీ ముఖ్యంగా, ఒ.ఇ.సి.డి (ఆర్గనైజేషన్ ఫర్ ఎకనామిక్ కో-ఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్) దేశాలలో నిరుద్యోగం 1970-90 ల మధ్యకాలంలో మూడింతలుగా అంటే 3.2 శాతం నుండి 10 శాతానికి పెరిగింది. ముఖ్యంగా యూరప్‌లో మరీ ఎక్కువగా గోచరిస్తుంది. స్పెయిన్ శ్రామశక్తిలో 20 శాతం వుండగా, ఫ్రాన్స్‌లో 12 శాతం ఉంది. ఇంకా, నిజంగా చెప్పాలంటే ఈ అంచనాలు తక్కువగానే ఉన్నాయనాలి. ఎందుకంటే, పాక్షిక కాలం ఉద్యోగస్తులు, కోతవేటుకు బలవుతున్నవారు ఇందులో చేర్చబడనే లేదు.

దీర్ఘకాల నిరుద్యోగుల సంఖ్య విపరీతమవుతూ వరుసగా పెరుగుదల రేటునే సూచిస్తుంది. యూరప్ వ్యాప్తంగా, మొత్తం నిరుద్యోగులలో ఏడాదికాలం మించిన వారు మూడొంతులుండగా, జర్మనీలో సగం, ఇటలీలో నాల్గింట మూడొంతున్నారు. అస్తవ్యస్తమైన ఇటలీ బడ్జెటును పట్టాలెక్కించాలనే పథకాలతో బెర్లుస్కనీ కన్సర్వేటివ్ సంకీర్ణ ప్రభుత్వం పెన్షన్లు, తదితర సాంఘిక సేవలకై నిధులను పెద్ద ఎత్తున తగ్గించివేసినందుకు 1994 చివర్లో వరసగా రోమ్‌లో సుమారు 10 లక్షల మంది నిరసన ప్రదర్శనలు జరిపారు. ఫ్రాన్స్‌లో 1990లో మొత్తం నిరుద్యోగులలో దీర్ఘకాల నిరుద్యోగుల సంఖ్య 40 శాతం ఉండింది. అప్పటినుండి పరిస్థితులు మరీ దిగజారుతున్నాయి. ఫ్రాన్స్‌లోని శ్రామశక్తిలో కనీసం పార్ట్ టైం ఉద్యోగం కూడ లేనివారు ప్రతి ఎనమండుగురిలో ఒకరు నిరుద్యోగులన్నమాట. అందులో ప్రతి 20 లో ఒకరు ఏడాది కాలం పైగా ఇలాంటి జీవితాలను వెళ్ళదీస్తున్నవారే. నిరుద్యోగ యువతలో 15-24 వయస్సువారు మొత్తం శ్రామశక్తిలో ఐదవ వంతు ఉన్నారు. ఈ పరిణామాలన్నీ ఫ్రాన్స్ కార్మిక లోకాన్ని అశాంతికి, క్రోధాగ్నికి గురిచేస్తుంటే, ఫ్రాన్స్ ప్రధాని అలెన్ జుప్పే నూతన పథకాలు వారిని బజార్లో కీడ్చినాయి.

నేడు ప్రపంచంలోనే 120 మిలియన్‌ల మంది (12 కోట్లు)(రిజిష్టర్డ్ నిరుద్యోగులుండగా 700 మిలియన్‌ల మంది (70 కోట్లు) కనీస ఉపాధిలేని వారని అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐ.యల్.ఓ) సగర్వంగా ప్రకటిస్తోంది.

పశ్చిమ యూరప్, ఉత్తర అమెరికా జనాభాల్లో 10-15 శాతం దారిద్ర్యంలో మ్రగ్గుతున్నారు. అమెరికాలో 37 మిలియన్‌ల ప్రజలకు ఆరోగ్య భీమా రక్షణే లేదు. 13 శాతం ప్రజలు అంటే 31 మిలియన్‌లు దారిద్ర్యరేఖ దిగువన నివసిస్తున్నవారు. 1973 నుండి 1978 వరకు అమెరికాలో సగటు వేతనాలు 1.6 శాతంపడిపోగా 1979-93 మధ్య కాలంలో 9.6 శాతం పడిపోయాయి. 1996 మార్చి మొదటివారంలో జనరల్ మోటర్స్ లోని వేలాదిమంది కార్మికులు సమ్మెలకు దిగారు. అయితే, ఇక్కడ గుర్తించాల్సిన మరో అంశం ఏమంటే, నైపుణ్యం గల శ్రామికులలో కన్నా నైపుణ్యం లేని శ్రామికుల్లో నిరుద్యోగ సమస్య సహజంగానే తీవ్రమవుతుంది. రేషనలైజేషన్ (పరిశ్రమల సక్రమ వ్యవస్థీకరణ) పేరుతో జరిగే ఆటోమేషన్ కూడా ఇలాంటి నిరుద్యోగాన్ని మరియు సాధారణ నిరుద్యోగ సైన్యాన్ని ఎంతగానో పెంచేస్తుంది. ఈ సమస్యలన్నీ ఇలా వుండగా వాటి మూలాలను సామ్రాజ్యవాద సంక్షోభంలో అనగా ఆ యా దేశాల సాంఘిక, ఆర్థిక, రాజకీయ రంగాలలోని అస్తవ్యస్తతల్లో చూడడంలో విఫలమైతున్నవారు 'అల్ట్రా నేషనలిజం' (అతివాద జాతీయవాదం) ప్రాబల్యంలో పడిపోతూ, విదేశస్తులకై తీవ్రవ్యతిరేకతతో దాడులకు దిగుతూ పక్కదారులు పట్టడం నిత్యం వార్తల్లో వింటున్నదే.

పెట్టుబడిదారీ దేశాలు సంక్షోభం నుండి బయటపడడానికి 1930లలో కీన్స్ సిద్ధాంతాన్ని ఆశ్రయించాయి. ప్రైవేటు పెట్టుబడి ముందుకురాకపోవడం వలన ఏర్పడిన లోటును పూడ్చడానికి 'పబ్లిక్ పెట్టుబడి' (ప్రభుత్వమే పెట్టుబడుల సమకూర్చడం) పెట్టవలసిన ఆవశ్యకతను దాని ప్రాముఖ్యాన్ని కీన్స్ నొక్కి చెప్పాడు. నిరుద్యోగ సమస్యను పరిష్కరించడానికి అతడు 'వెసులుబాటు వేతన విధానం' స్థానంలో వెసులుబాటు ద్రవ్య విధానం ప్రతిపాదించాడు కానీ, ఆచరణలో ఇది ద్రవ్యోల్బణాన్ని, కరెన్సీ విలువ తగ్గిపోవడాన్ని, నిరుద్యోగ సమస్య కొనసాగడాన్ని నివారించ లేకపోయింది. ఈ వైఫల్యంతో 1980 ల నాటికి 'ఫ్రీడ్‌మన్ సిద్ధాంత'ను అంటే తిరిగి ప్రైవేటీకరణ, సరళీకృత ఆర్థిక విధానాలను ఆశ్రయించాయి. 1968లో ఫ్రీడ్‌మన్ ఇలా అంటాడు "ఆర్థిక వ్యవస్థ సమతుల్య స్థితిలో ఉండాలంటే, పెద్ద ఎత్తున నిరుద్యోగం ఉండటమనేది ఒక ఆవశ్యమైన షరతు. నిరుద్యోగం లేకపోతే ద్రవ్యోల్బణం

పెరిగిపోతుంది" అంటాడు. అందుకే "అన్-ఎంప్లాయ్‌మెంట్ ఈజ్ ది బైప్రొడక్ట్ ఆఫ్ కాపిటలిజం" అన్న పెట్టుబడి దారీ నైజం తనతోపాటే ఉనికిలోకి వచ్చింది. ("పెట్టుబడిదారీ విధానం యొక్క ఉత్పత్తి ఫలితమే నిరుద్యోగం")

సామ్రాజ్యవాదం ఏ సిద్ధాంతాలను ముందుకుతెచ్చినా, రోజురోజుకు తీవ్రతరమవుతున్న సంక్షోభం ఫలితంగా అక్కడ పెచ్చరిల్లిపోతున్న అశాంతి, దారిద్ర్యం, నిరుద్యోగం ల నుండి అవి గట్టెక్క లేకపోతుందని గత చరిత్ర అంతా స్పష్టం చేస్తుంది. వీటితో సమాజంలో తిరుగుబాట్లు రాకూడదనే పాలకవర్గాలు పెద్ద ఎత్తున "నార్కో టెర్రరిజాన్ని" (మత్తుపదార్థాల ఉగ్రవాదం) పెంచిపోషిస్తున్నది. పారిశ్రామిక దేశాల్లో ఫ్రాన్స్‌కే ఈ విషయంలో కూడా అగ్రతాంబూలం దొరుకుతుంది. నూతన ప్రపంచ వ్యవస్థ (న్యూ వరల్డ్ ఆర్డర్), ప్రపంచీకరణ (గ్లోబలైజేషన్) లు సాధారణ సంక్షోభాన్ని మరింత తీవ్రంగా ప్రజానీకంపై భారాన్ని మోపుతున్నాయి. తమ సమస్యలను మూడో ప్రపంచ దేశాలపైకి నెట్టడంతో ఆ దేశాలలో తీవ్ర సమస్యలు ఉత్పన్నమవుతూ సామ్రాజ్యవాదంపై కసితో అనేక ఉద్యమాలు పెంపొందుతున్నాయి. సామ్రాజ్య వాద దేశాలు తమ లాభాలకై మూడో ప్రపంచ దేశాలను నిలువెల్లా దోచేస్తూ, హంతక దాడులను కొనసాగిస్తుంటే ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాలు విప్లవ తుఫానులుగా వాటి దోపిడికి సవాలుగా సాయుధపోరాటాలను సైతం కొనసాగిస్తున్నాయి. అందుకే కా. మావో నిర్వచించినట్లు "ఎక్కడికక్కడే విప్లవాలు చెలరేగి యుద్ధం వాయిదా పడవచ్చు లేదా యుద్ధమే బద్దలై విప్లవాలు చెలరేగనూ వచ్చు. ఏది ఏమైనా ఇది విప్లవాల యుగం" అన్న సత్యం రోజురోజుకు పెంపొందుతున్న పోరాటాలతో మరింత నిరూపణ అవుతుంది. సామ్రాజ్యవాద దేశాలలోని కార్మిక వర్గపోరాటాలు మూడో

| దేశం | నిరుద్యోగం (శాతం) | జనాభా (కోట్లు) |
|---|---|---|
| అమెరికా | 7.0 | 25.0 |
| ఫ్రాన్స్ | 12.1 | 5.66 |
| జర్మనీ | 11.3 | 8.50 |
| బ్రిటన్ | 10.4 | 5.50 |
| రష్యా | 10.0 | 14.00 |
| జపాన్ | 2.7 | 12.50 |

ప్రపంచ దేశాలలోని ప్రజాతంత్ర ఉద్యమాలు అనుసంధానించబడే దిశలో కొనసాగుతూ అంతిమంగా సామ్రాజ్యవాదాన్ని నిర్మూలించే లక్ష్యంతో సమన్వయించడానికి కార్మికవర్గం కృషిచేయాల్సిన తరుణం నేటి పరిస్థితుల్లో గతంలో కన్నా తీవ్రంగా ముందుకొస్తుందని తాజా పరిణామాలు డిమాండ్‌చేస్తున్నాయి. ఫ్రాన్స్ కార్మికవర్గానికి, ప్రజానీకానికి చరిత్రలో గల గొప్ప అనుభవ నేపథ్యంలో, గుణపాఠాల వెలుగులో తమ పోరాటాలను మరింత మిలిటెంటుగా కొనసాగించి కార్మికవర్గ కర్తవ్యాలను పరిపూర్తిచేయడానికి నడుం బిగిస్తుందని ఆశిద్దాం. ooo

ప్రతి ఏటా '18 ఫిబ్రవరి'

'సంఘీభావ దినం'

పాటించండి.

అఖిల భారత ప్రజాప్రతిఘటన వేదిక నిర్వహించిన అంతర్జాతీయ సెమినార్ (ఢిల్లీ) పిలుపు

## ఉత్తర బస్తర్ డివిజన్‌లో పోలీసు నిర్బంధం

(అక్టోబర్ '95 సంచిక నుండి ప్రారంభించిన 'నిర్బంధం' శీర్షికలో ముందుగా దక్షిణ బస్తర్‌లోని మద్దేడ్ దళ ఏరియా నిర్బంధం, జనవరి '96 సంచికలో గడచిరోలి నిర్బంధం, వరుసగా ఇచ్చి ప్రస్తుతం ఉత్తర బస్తర్ వివరాలు అందిస్తున్నాం. పెంపొందుతున్న ప్రజాపోరాటాలు పోరాడుతున్న ప్రజలపై శత్రువు అమలు చేస్తున్న నిర్బంధ విధానాలను నిర్దిష్టంగా అధ్యయనం చేస్తూ, వాటిని ప్రజల్లో ఎండగట్టడానికి, దండకారణ్య నిర్బంధంపై స్పష్టమైన అంచనాకు రావడానికి ఉపయుక్తంగా ఉంటుందని ఆశిస్తున్నాం.)

ఉత్తర బస్తర్‌కు పోరాట విస్తరణ 1988లో జరిగింది. విప్లవోద్యమ విస్తరణను అరికట్టాలనే పథకాలతో శత్రువు రంగంలోకి దిగాడు. విప్లవకారులను హత్యచేయడం ద్వారా విప్లవోద్యమం ఉత్తర బస్తర్‌లో కాలూనలేదని భావించి ఎన్‌కౌంటర్స్ ప్రారంభించాడు. కా. రాందాద, లక్ష్మి లు మొదటి దాడిలో అమరులు కాగా, శత్రువు ఏర్పరచుకున్న ఇన్ఫార్మర్ల వ్యవస్థ మూలంగా తర్వాత క్రమంలో కా. అజిత్ అసువులు కోల్పోగా, గత సంవత్సరం కేస్కల్ దళంపై జరిగిన పోలీసు దాడి నేపథ్యంలో కా. పూలబత్తి అమరురాలయింది.

విప్లవోద్యమాన్ని అణచడానికి భౌతికంగా విప్లవకారులను హత్యచేసే విధానాలను అమలుచేస్తున్న పోలీసులు మరోవైపు ఆదివాసీ రైతాంగంపై తీవ్రమైన అణచివేత విధానాలు కొనసాగిస్తున్నారు. పోలీసు బలగాలను పెంచుకొని అడవిలో, గ్రామాల్లో విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టి, గస్తీ ముమ్మరం చేశారు. అరెస్టులు, మానభంగాలు, చిత్రహింసలు, కోర్టు కేసులు సాధారణమైనాయి. '95 నవంబర్ నుండి జనవరి '96 మధ్య పోలీసుల దాడులు ఎలా సాగాయో చూద్దాం.

కేస్‌కల్ ప్రాంతంలోని అనేక గ్రామాల్లో పోలీసులు గస్తీ తిరిగారు. ముఖ్యమైన గ్రామాలపై 18 సార్లు దాడిచేసి 13 మందిని అరెస్టు చేశారు. కొండగాంవ్ ప్రాంతంలో 14 సార్లు దాడిచేసి 22 మందిని అరెస్టు చేశారు. '96 జనవరి నుండి '96 మార్చి వరకు కోయిలబేడ ప్రాంతంలో అనేక దాడులు నిర్వహించిన పోలీసులు కామ్‌టేడ గ్రామ సర్పంచ్‌ను అరెస్టు చేశారు. బూటకపు ఎన్‌కౌంటర్ సన్నాహాలు అన్నీ పూర్తిచేసి చివరిక్షణంలో సర్పంచ్ సుఖాలు నరోటిని వదలేశారు.

పోలీసుల చర్యలన్నింటిలో ఇన్ఫార్మర్లు అనేవిధాల ఉపయోగపడుతున్నారు. ఇన్ఫార్మర్ల సహాయంతో అడవి గాలింపు జరుగుతుంది. దళ మకాం లపై దాడులు నిర్వహిస్తున్నారు. ముఖ్యమైన కామ్రేడ్స్ యొక్క ఫోటోలు చూసి, వారి గూర్చి ఇతర వివరాలు పోలీసుల ద్వారా తెలుసుకుంటున్న ఇన్ఫార్మర్లు, వారి సంచారాలపై జాతీయ రహదారిపై గల బస్టాండుల వద్ద కాపలా వుంటూ ప్రయాణాలపై నిఘా వేస్తున్నారు. ముఖ్యమైన ఇన్ఫార్మర్లు పోలీసుల నిత్య సంబంధాల్లో ఉంటూ వారి అనుచరులతో గ్రామాలనుండి సమాచారం సేకరిస్తున్నారు. గ్రామాల్లో నుండి పారిపోయిన ఇన్ఫార్మర్లు సంతల వద్ద అడ్డలు వేస్తున్నారు. లొంగిపోయిన పార్టీ, దళ కార్యకర్తలను ఇన్ఫార్మర్ల సమన్వయ యంత్రాంగంలో పోలీసులు వాడుకుంటున్నారు. అడవిపై, గ్రామలపై, పట్టులేని పోలీసులు ఇన్ఫార్మర్ల సహాయంతో కదలుతున్నారు. ప్రజల లోటుపాటులు తెలియని పోలీసులు ఇన్ఫార్మర్లతో తెలుసుకుంటున్నారు. శత్రు నిర్బంధంలో ఇన్ఫార్మర్ల యంత్రాంగం కీలకమైన కర్తవ్యాలు నిర్వహిస్తుంది.

విప్లవ కార్యక్రమాలను అరికట్టడానికి బూర్జువా నాయకులు కూడా పోలీసుల మద్దత్తుతో రంగంలోకి వస్తున్నారు. జిల్లా పంచాయితీ అధ్యక్ష, కాంగ్రెస్ పార్టీ నేత మహేంద్ర 'ఖర్మ' ప్రారంభం నుండి కత్తికట్టి తిరుగుతున్నాడు. అక్టోబర్‌లో కేస్కల్ నుండి దొడాయి (డొలార్) వరకు పాదయాత్ర జరిపాడు. పోలీసులు తడవకొకసారి ముందుకుతెచ్చే 'జనజాగరన్' అభియాన్‌లో భాగంగానే ఇది జరిగినా, ఇలాంటి వాటితో విసిగిపోయిన ప్రజలు వీడిని లక్ష్యపెట్టలేదు. షరా మామూలే అన్నట్టు వీడి సభలలో పోలీసు ఉన్నతాధికారులు తమ సహజ బాణీలో ప్రభుత్వ సంస్కరణలపై ఉపన్యాసాలిచ్చారు.

విప్లవ కార్యకర్తలకై (దళం) పోలీసుల గాలింపులు:

డివిజన్‌లో పోలీసులు ముఖ్యంగా రెండు పద్ధతుల్లో దాడులకు ఉపక్రమిస్తున్నారు.

ఎ. కాలినడకతో సాధారణ పెట్రోలింగ్, కూంబింగ్‌లు:

పోలీసులు గ్రామాల్లోకి వస్తున్నప్పుడు వాహనాలు వాడడం లేదు. అత్యవసరంగా వాడాలనుకున్నప్పుడు వీల్నైన మేరకు తగ్గించి రాత్రులందే వాడుతున్నారు. అదనపు బలగాలను తరలించాల్సి వస్తే, అడవి అంచుల వరకు వాహనాల్లో తెచ్చి దిగబెడుతున్నారు. అవసరం అనుకుంటే అనుమానిత ప్రాంతాల దగ్గర పోలీసులను వాహనాల్లో నుండి దింపేసి, ఖాళీ వాహనాలను ముందు పంపిస్తున్నారు. అలాగే రాకపోకలకు ఒకే దారి వాడడం లేదు. '96 జనవరి నుండి '96 మార్చి మధ్య కోయిలబేడలో 9, కేస్ కల్ లో 7, కొండగాంవ్‌లో 8 బ్యాచ్‌లు 3 నుండి 10 గ్రామాల పరిధిలో 12 నుండి 30 సంఖ్యతో కాలినడకన గస్తీలు తిరిగాయి.

అడవిలో గాలింపులు:

12 నుండి 30 వరకు సంఖ్యలో ఒక్కో బ్యాచ్ ఉంటుంది. నీటి తావుల వద్ద వెతుకుతున్నారు. దళ సమాచారం చేరిన పక్షంలో 200 మంది పోలీసులు 8 నుండి 12 బ్యాచ్‌లుగా విడిపోతూ, పరిసర ప్రాంతాలు గాలిస్తున్నారు. అడవిలోనే వంట చేసుకుంటూ 2-3 రోజులు మకాం వేస్తున్నారు. కొండగాం లో దళ సమాచారం దొరికిన 5 సందర్భాల్లో, విడిగా 9 సందర్భాల్లోనూ, కోయిలబేడలో దళ సమాచారం చేరి 8 సార్లు, అనుమానంతో 5 సార్లు ఇలాంటి దాడులు, గాలింపులు చేశారు.

గాలింపుల సందర్భంగా గతంలో ఖాకీ డ్రెస్సులే ధరించిన పోలీసులు ప్రస్తుతం కేమోఫ్లేజ్ డ్రెస్సులు (ఛీతా డ్రెస్) వాడుతున్నారు. దళాల నిర్దిష్ట సమాచారం ఉంటే ఉన్నతాధికారులే దాడులకు నాయకత్వం వహిస్తున్నారు. ప్రత్యేకంగా ఏర్పరిచిన కమాండో ఫోర్సులను దించుతున్నారు.

గతంలో విడివిడిగా చేపట్టిన వివిధ ఆపరేషన్‌ల సందర్భంగా (ఆపరేషన్ బైసాక్, ఆపరేషన్ బైలాడిలా, ఆపరేషన్ గోదావరి మొ.వి) డివిజన్ మొత్తంగా పెద్ద ఎత్తున బలగాలతో గాలింపు చర్యలు చేపట్టేవాడు. కానీ, ప్రస్తుతం నిర్దిష్టంగా పరిమిత ప్రాంతాన్ని (ఒక దళం ఏరియా) మాత్రమే ఎంచుకొని విస్తృతంగా గాలిస్తున్నాడు. పోలీసులు తమ కదలికలు ప్రజలకు కూడా తెలపకూడదనే అనేక జాగ్రత్తలు తీసుకోవడమే గాకుండా, ప్రజలను పక్కదారి పట్టించడానికి గ్రామాల్లో నుండి తాము వెళ్ళే రూట్ బహిర్గతం కాకుండా ఉండడానికి తప్పుడు రూట్లు గురించి చర్చిస్తున్నారు.

బి. అంబుష్‌లు:

ఇన్ఫార్మర్ల సహాయంతో అంబుష్‌లు (మాటు దాడి) నిర్వహిస్తున్నారు. దళాలు రోడ్డు క్రాస్ (దాటడం) చేస్తాయని తెలిసిన దగ్గర రోడ్డు నుండి రెండు కిలో మీటర్ల దూరంలో పోలీస్ బ్యాచ్‌లు మాటు దాడికి కూచుంటున్నాయి. కొండగాం ఏరియాలో దండవండి వద్ద మట్టిరోడ్డు నుండి 10 నిముషాల దూరంలో మాటుదాడికి కూచొని దళంపై ఫైరింగ్ చేయగా, దళం ప్రతిఘటిస్తూ తప్పుకుంది. దళం సమాచారం చేరిన వెంటనే నిర్దేశిత స్థలాల్లో పెక్కు బ్యాచ్‌లు ఇలా కూచుంటున్నాయి. ఏదో బ్యాచ్ వలలో దళం చిక్కుతుందనే ప్లాన్‌లో భాగంగా, మిలటరీ ఎత్తుగడల రీత్యా ఇలా జరుగుతుంది. రోడ్డు పక్కల్లో కాపలా కాస్తూ 6 నుండి 9 మంది విడిగా ఈ సందర్భంలో ఒక రకంగా స్ట్రైక్ ఫోర్స్ గా వ్యవహరించడానికి సిద్ధంగా ఉంటున్నారు.

పోలీసులు అనుసరిస్తున్న జాగ్రత్తలు:

ఎ) రాత్రులందు లైట్లు వాడకుండా నడక సాగిస్తున్నారు. గస్తీలు తిరుగుతున్నారు.

బి) బూట్ల అచ్చులు పడకూడదనే అవసరమైనపుడు తీసేసి నడుస్తున్నారు.

సి) తమ రూట్ ప్రజలకు తెలవకుండానూ, తమ కదలికలు అర్థం కాకుండాను చూస్తున్నారు.

డి) దళాలను పోలిన విధంగానే డ్రెస్సులు, కిట్లు ధరిస్తున్నారు.

ఇ.) బాటల వెంట నడుస్తున్నప్పుడు బాటకు ఇరువైపుల నడుస్తున్నారు. దళాలు ఏర్పాటు చేసే అంబుష్‌లను నిర్వీర్యం చేయడానికి ఇలా చేస్తున్నారు.

ఎఫ్) ప్రయాణాల సందర్భంగా ఒకే దారి రాకపోకలకు వాడడం లేదు.

జీ) ఘటనలు జరిగిన వెంటనే ఘటనా స్థలం చేరుకోకుండా తాత్సారం (ఆలస్యం) చేస్తున్నారు. ఒకవేళ వచ్చినా, అదనపు జాగ్రత్తలతో వస్తున్నారు. బస్సురూట్లు వాడుకుంటున్నారు.

హెచ్) అడవిలోనే మకాం చేస్తున్నారు. రాత్రికూడా తిరుగుతున్నారు.

ఐ) దళాలకు కావాలసిన సరకులు చేరకుండా దుకాణాల వద్ద, సంతల వద్ద నిఘా పెడుతున్నారు.

**ఆయుధాలు – భద్రతా ఏర్పాట్లు:**

ప్రతీ బ్యాచ్ వద్ద ఒక లైట్ మిషన్ గన్ ఉంటుంది. మరి కొన్ని ఆటోమెటిక్ ఆయుధాలుంటే, అధికశాతం 303 రైఫిల్స్ ఉంటాయి. కమాండో ఫోర్సుల వద్ద అధునాతన ఆయుధాలు, గ్రెనేడ్స్ ఉంటాయి. వాకీటాకీలు సాధారణంగా బ్యాచ్‌కు ఒకటి ఉంటుంది.

పోలీస్ స్టేషన్ చుట్టూ గల గ్రామాల్లో అలికిడి కాకుండా తిరిగి వస్తుంటారు. ప్రజలకు తమ రాకపోకలు తెలవనీయడం లేదు. గతంలో అవుట్‌పోస్టులుగా ఉన్నవాటిని పోలీస్‌స్టేషన్‌లుగా మార్చారు. పోలీస్ స్టేషన్, క్యాంపు చుట్టూ 'వి', లేదా 'యూ' ఆకారంలో ట్రెంచీలు తవ్వుతున్నారు. సెంట్రీల కోసం పకడ్బందీ బంకర్లు ఏర్పాటు చేస్తున్నారు. పోలీస్‌స్టేషన్ భవనాల్లో నుండే కాల్పులు జరపడానికి వీలుగా గోడలకు రంధ్రాలు చేస్తున్నారు. భవనం చుట్టూ మైన్స్ ఉంటున్నాయి. లైట్లు ఏర్పాటు చేస్తున్నారు.

**ముగింపు:**

పోలీసులు తమ నిర్బంధాన్ని తీవ్రతరంచేస్తూ, విప్లవోద్యమాన్ని నిర్మూలించడానికి అనేక పాట్లు పడుతున్నా ప్రజల మౌళిక సమస్యలు పరిష్కారం కావడం లేదు. రోజువారీ సమస్యలతో బాధపడుతున్న పీడిత ప్రజలు సంఘటిత పడడంతో పోలీసులు చేపడుతున్న చర్యలు నిష్ఫలం అవడమే గాకుండా, పోలీసుల పీకలు తీసిన ఘటనలు మూడు స్టేషన్‌లలో జరిగి, ఐదుగురి ప్రాణాలు తోడేశాయి. ప్రజలు మాత్రం అడుగడుగునా పోలీసుల కదలికలను పసిగడుతూ దళాలను కాపాడుతూ, పోలీసులను ప్రతిఘటిస్తూ తమ పోరాటాలో తాము నిమగ్నమై పురోగమిస్తున్నారు.

| పోలీసు వివరాలు – ఉత్తర్ బస్తర్ | |
|---|---|
| పోలీసు శిబిరాలు (క్యాంపులు) | - 20 |
| పోలీసు స్టేషన్‌లు | - 19 |
| చౌకీలు .. | - 3 |
| పోలీసుల శిక్షణాశిబిరాలు | - 1 |
| తమలో తాము కాల్చుకుని చచ్చినవారు | - 5 |

**ప్రాణభీతితో ఐదుగురు పోలీసుల మరణం**

ఉత్తర బస్తర్ డివిజన్‌లో ఫిబ్రవరి - మార్చి నెలల్లో జరిగిన మూడు వేర్వేరు ఘటనల్లో ఐదుగురు పోలీసులు మరణించారు. పొట్టకూటికై పోలీసు ఉద్యోగాలు చేస్తున్న నిరుపేద పోలీసులు నిత్యం తమ భార్యాబిడ్డల జ్ఞాపకాలతో జీతపు రాళ్ళ కోసం, జీవిక కోసం అడవిలో కాలం గడుపుతున్నారు. ఉన్నతాధికారులతో అనునిత్యం అవమానాలను భరిస్తూ, విచక్షతతో చూడబడుతూ తీవ్రమైన మానసిక క్షోభననుభవిస్తున్నారు. ఎక్కడో దూరంగా కుక్కలు మొరిగినా అర్ధరాత్రి మానవాకారాలు ఎదురుపడినా తూటాలు పేలిపోతున్నాయి. ఒక్కమాటలో చెప్పాలంటే, ప్రాణభీతితో పోలీసులు

తమ నీడను చూసి తామే సెంట్రీల్లో అదిరిపోతున్నారు. ఫలితంగా జరిగిన కాల్పుల్లో ఒక కమాండెంట్‌తో సహా ఐదు గురు పోలీసులు ప్రాణభీతితో ప్రాణాలు వదిలారు. దీనితో మొత్తంగా శతృక్యాంపులో తీవ్ర చర్చ ప్రారంభమైంది. పోలీసుల ఉన్నతాధికారులు పోలీసుల మానసిక బలాన్ని నిలబెట్టడానికై నడుం బిగించారు. 27 మార్చి నాడు పత్రికా విలేఖర్లు అడిగిన ఒక ప్రశ్నకు జవాబు ఇస్తూ డి.ఐ.జి. సంత్‌కుమార్ "తెలివిలేని పోలీసులు ఇలాంటి చర్చలు చేస్తున్నారు" అన్నాడు. ఉన్నతాధికారులపై పెరుగుతున్న తీవ్ర వ్యతిరేకత కూడా ఒక ఘటనలో బలంగా పనిచేసింది. కిందిస్థాయి ఉద్యోగులపై కనీసం మనుషులుగా కూడా చూడని, నియంతృత్వ ధోరణులపై పట్టుదలతో పోరాడాలనీ, తమ ప్రజాస్వామ్య హక్కులను ముష్టి జీతపు రాళ్ళ కోసం కోల్పోవలసిన అవసరం లేదనీ, వర్గస్పృహతో జాగృతం కావాలనీ, వ్యవసాయ విప్లవోద్యమంతో మమేకం కావాలనీ, తద్వారా తమ సమస్యలను దూరం చేసుకోగల రని ఆశిస్తున్నాం. ooo

---

## విప్లవ సానుభూతిపరుడు ననుకు ఉసెండి ప్రాణాలు బలిగొన్న గట్ట పోలీసులు

గడచిరోలి డివిజన్‌లో పోలీసులు గెరిల్లా దళాలను మట్టుపెట్టడానికి ఒక ప్లాను ప్రకారమే నిరంతరం ప్రయ త్నిస్తున్నారు. అలాంటిదే రోండువాయి గ్రామంలో జరిగింది.

పోలీసులు ప్లాను ప్రకారమే నారాయణ అనే బెంగాలీని ఆ గ్రామంలో పెట్టారు. వాడు సారా అమ్ముకునే పేరుతో ఉంటూ దళం కదలికలు, సంబంధాలు గురించి తెలుసుకుంటూ గట్ట పోలీసుక్యాంపుకు చేరవేసేవాడు. వీడు గ్రామానికి రాకపూర్వం ఎన్నడూ జరగని రీతిలో 1995 ఏప్రిల్-మే మాసాల్లో రెండు సార్లు దళం వచ్చి పోగానే పోలీసులు దాడి చేసారు. గ్రామస్థులను కొట్టి లంచాలు తిని వదలిపెట్టారు. ఇది తెలిసిన దళం ఆగస్టు '95లో వీడిని పట్టుకొని గ్రామస్థుల ముందు దేహశుద్ధి చేసి ఊరు విడిచిపోవాలని తీర్పు చెప్పడంతో అంగీకరించిన బెంగాలీ వారం రోజుల తర్వాత గట్ట క్యాంపుకు వెళ్ళి రిపోర్టు చేశాడు. దీనితో రోండవాయి రైతులు గడచిరోలి అంగడికి పోతుంటే గట్ట పోలీసులు 9 మందిని అరెస్టుచేసారు. వారిలో 5గురిని 1,250/- రు.లు తీసుకొని వదలిపెట్టారు. మిగిలిన నలుగురిలో ముగ్గురిని క్యాంపులో ఉంచి భీమా ననుకును గట్ట అరుండ గుట్టలకు తీసుకుపోయి స్పృహ తప్పే వరకు కొట్టి క్యాంపుకు వాపసు తీసుకు వచ్చారు. తర్వాత ఆ ముగ్గురిని నాగపూర్ జైలుకు పంపి చావు బ్రతుకుల్లో ఉన్న ననుకును హాస్పిటల్‌లో భర్తీచేశారు.

నాగపూర్ జైలులోని ముగ్గురు బెయిల్‌పై రావడంతో పోలీసులు ననుకును హాస్పిటల్ నుండి వదలిపెట్టారు. సరైన వైద్యం అందని ననుకు ఉసెండి పోలీసులు కొట్టిన దెబ్బలతో డిసెంబర్‌లో మరణించాడు. ఇతడు '87-89ల మధ్య సంఘంలో చాల చురుగ్గా పనిచేశాడు. ఆ తర్వాత కూడ చివరిశ్వాస వరకు, విప్లవ కార్యక్రమాలకు ఏనాడూ దూరం కాలేదు.

## నిర్బంధం సాగిస్తూ లంచాలు గుంజుతున్న జారనండి పోలీసులు

ఏటపల్లి తాలూకా కసంసూర్ రేంజిలోని కొత్రి గ్రామానికి మార్చి 11న దళం వచ్చిన సమాచారం కసంసూర్ పోలీసులకు తెల్సింది. వెంటనే 25 మంది రాత్రి 8.30 గంటలకు కొత్రి గ్రామానికి వచ్చి పోలీసు పటేల్ కొడుకును పట్టుకొని ఊరికి దగ్గర్లోని నీళ్ళ తావుల వైపు, అడవిలోను దాదాపు రెండు గంటలు వెతికినారు. ఎక్కడా జాగ దొరకకపోవడంతో నిరాశా కోపాలతో గ్రామంలోకి వచ్చి యువకులను పట్టుకొని విపరీతంగా కొట్టి కసంసూర్ తీసుక పోయారు. అలా 13వ తేదీ వరకు పోలీసులు 20-25 మందితో కూడిన 5 బ్యాచ్‌లుగా నీళ్ళవాగులు, గ్రామాల చుట్టూ రాత్రి 12 గం వరకు తిరిగి, ఉదయం 5.30 గం.కే అడవికి చేరుకునేవారు. పగలు ఎండలో స్నేతం ఇలించేవారు.

అరెస్టయిన యువకులను విడిపించడానికి కలెక్టర్‌కు మెమోరాండం ఇద్దామని లిగిడి సర్పంచ్ కొత్రి గ్రామా నికి పోయి ప్రజలతో మాట్లాడాడు. ఈ విషయం తెల్సి ఎ.ఎస్.ఐ.నాయకత్వంలో సర్పంచ్‌ని అరెస్టుచేసి నాగపూర్ జైలుకి పంపిస్తామని బెదిరించి మూడు వేల రూపాయిలు లంచం తిని వదలిపెట్టారు.

## తునికాకు పోరాటాలు

ఈ ఏడాది కూడా ప్రతిసారిలాగే తునికాకు రేట్లు పెంపుదలకై దండకారణ్యంలో విస్తృతంగా ప్రజలు కదిలారు డిఎకెఎమ్ఎస్, కెఎఎమ్ఎస్ ల నాయకత్వంలో మార్చి నెలలో ర్యాలీలు తీసి ప్రదర్శనలు చేశారు. సంబంధిత అధికారులకు వినతిపత్రాలు అందజేసారు. అయినా మధ్యప్రదేశ్ ప్రభుత్వం స్పందించలేదు. దీనితో అదే నెల మార్చి చివరిలో బస్తర్ జిల్లా బంద్‌కి పిలుపునిచ్చి తమ ఐక్య శక్తిని ప్రదర్శించారు ఆదివాసీ ప్రజానీకం.

ఉత్తర్ బస్తర్ ...లో తునికాకు 100 కట్టకు 50 రూ.లు డిమాండ్ చేస్తూ నారాయణపూర్, పఖంజూర్, కొండగాం లలో ర్యాలీలు తీయాలని నిర్ణయించాయి. వీటికోసం బూర్జువా పార్టీల నేతలు, సర్పంచ్‌లు, వికాస్ ఖండ్ అధ్యక్షులు ఉపాధ్యక్షులు అందరితో కలసి సంయుక్తంగా "ఐక్య కార్యాచరణ సమితి" నేర్పరచి 25 మార్చి నాడు విజయవంతంగా ర్యాలీలు నిర్వహించి పి.ఓ., తహశీల్దార్ లకు డిమాండ్స్‌తో కూడిన విజ్ఞాపన పత్రాన్ని ఇచ్చారు. అలాగే ఆ అధికార్ల ద్వారానే గవర్నర్, కలెక్టర్లకు విడిగా కాపీలు పంపించారు.

వీటిని జయప్రదం గావించడానికి నెలరోజులు ముందునుండే 15 క్యాంపెయిన్ దళాలు విస్తృత ప్రచారం చేసాయి. కరపత్రాలు, వాల్ పోస్టర్ల ద్వారాను, బానర్లు కట్టి ఏరియా రేంజిల వారీగా సభలు నిర్వహించడం ద్వారా జిల్లా వ్యాప్తంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు.

నారాయణపూర్ ర్యాలీ పదివేలమందితో రెండు కిలోమీటర్ల దూరం సాగి, డిమాండ్ పత్రం అందించిన పిమ్మట బహిరంగ సభతో ముగిసింది. అబూజ్‌మాడ్ ఏరియా నుండి సోన్‌పూర్ కేంద్రంగా అనేక గ్రామాలనుండి మూడు వేల మంది ప్రజలు కూడా పాల్గొనడం జరిగింది. అలాగే పఖంజూర్‌లో ఏడు వేలమందితో సాగి బహిరంగ సభతో ముగిసింది. "మా కోర్కెలు పూర్తిగా నెరవేర్చండి - నెరవేర్చండి" అన్న నినాదం మార్మోగగా కొండగాం ప్రజ ర్యాలీ నిర్వహించారు. రవాణాసౌకర్యానికి ...లారీలు నుపయోగించడం జరిగింది. బహిరంగసభలో వక్తలు మాట్లాడిన వాటిలో ప్రధానమైనవి —

— గత 5 సంవత్సరాలుగా సంతలలో సరుకుల రేటు ఎన్నోరెట్లు పెరిగాయి. అయినా మధ్యప్రదేశ్ ప్రభుత్వ '89 లో ...టేకేదార్లు ఇచ్చిన రేట్లనే (30 రూ.లు) చెల్లిస్తూ పెరిగిన సరుకుల రేట్ల నిష్పత్తితో సమానంగా తునికాకు కట్టల రేటు పెంచడం లేదు. కల్లబొల్లి మాటలతో తునికాకు కూలీలపై పెత్తనం సాగిస్తోంది, తప్ప మరేంకాదు.

— 1991-95 ల నాటి బోనస్ లాభాల గురించి గాని, నాటి పంపకం విషయంగాని సరైన వాటా ప్రజలకు చెందకుండా మోసగిస్తూ 'బోనస్' పేరుతో నాటకం ఆడుతోంది.

— సహకార సమితి పేరు పెట్టుకొని కూలీలపై దోపిడీ, పెత్తనం సాగిస్తోంది తప్ప ఇంకేం ప్రయోజనం లేదు.

డిమాండ్స్ ముఖ్యమైనవి:

1. 100 కట్టలకు 50 రూపాయిలు చెల్లించాలి.
2. ప్రతి గ్రామంలోను కళ్లెం ఏర్పాటుచేయాలి.
3. కనీసం 20 దినాలయినా తునికాకు కొనుగోలు సాగాలి.
4. స్టాండర్డ్ బ్యాగ్‌కి 15 రూ.ల చొప్పున కళ్లెం మున్షీకి కమీషన్ ఇవ్వాలి.

తునికాకు బోనస్‌కై కోయల్‌బెడ ఏరియాలో డిఎకెఎమ్ఎస్ నేతృత్వంలో డిసెంబర్ 15, 19995 నాడు ర్యాలీ నిర్వహించారు. సుమారు అదే వికాస్‌ఖండ్‌లోని 150 గ్రామాలకు చెందిన ప్రజలు 5 వేల మంది పాల్గొని జీరాంతడయి నుండి కోయల్‌బెడ వరకు ర్యాలీ నిర్వహించి బహిరంగ సభ విజయవంతంగా జరుపుకున్నారు. సుమారు 700 మంది స్త్రీలు కూడా ఉత్సాహంతో పాలుపంచుకున్నారు. 'ప్రభుత్వం రేడియో, పత్రికల నిండా బోనస్ గురించి విస్తృత ప్రచారం చేస్తోందిగాని 1995 వరకు కూడ 1989 నాటి తునికాకు బోనస్ చెల్లించలేదు.

వీరికి తోడు బ్యాంకు మేనేజర్లు కూడా ప్రజలను తిప్పలుపెడుతూ మోసగిస్తున్నారని' అంటూ ప్రజలు తమ వ్యతిరేకతను తెలిపారు. విశాల ఐక్యసంఘటన నేర్పర్చడానికి డిఎకెఎమ్ఎస్ చేసిన కృషి సఫలమై, తునకాకు కూలీలందరూ సమైక్యంగా తమ శక్తిని ప్రదర్శించారు. డిమాండ్లు సాధించేవరకు గట్టిగా నిలబడాలని నిశ్చయించుకున్నారు.

## సుక్మా ర్యాలీ జయప్రదం

దక్షిణ బస్తర్‌లోని కుంట, గొల్లపల్లి కిష్టారం రేంజిలలోని 30 వేల మంది ప్రజలు ఫిబ్రవరి 4నాడు సుకుమా తహసీల్దార్ వద్దకు ఊరేగింపుగా వెళ్ళి డిమాండ్లు నామోదించాలని విజ్ఞాపన పత్రాన్ని అందించారు. తునికాకు కట్టకు 55 పైసలు ఇవ్వాలనీ రోజుకూలీ 55 రూ.లు ఇచ్చి ప్రతిగ్రామంలో కళ్ళం పెట్టాలన్న ముఖ్యమైన డిమాండ్లతో కదలిన ఆ ర్యాలీలో వివిధ పార్టీల వారు కూడా కలసిరాగా, ర్యాలీలో 8 వేలమంది మహిళలు పాల్గొనడం విశేషం. ప్రజలు తమ ప్రయాణావసరాల రీత్యా 50 లారీలను ఉపయోగించుకున్నారు. ఏరియాలోని అన్ని పార్టీల వారు తునికాకు పోరాటాన్ని సమైక్యంగా నిర్వహించాలనే విప్లవ ప్రజాసంఘాల పిలుపుతో సమైక్యం కావడానికి ముందుకొచ్చి ర్యాలీలో పాల్గొన్నారు.

జిల్లా కమిటీ పిలుపు మేరకు ఫిబ్రవరి 25న జేగురగొండ రేంజి నుండి 200 మంది, బాసగూడెం మరియు పామేడ్ రేంజిల నుండి 50 మంది పోయి తాలూకా అధికారులకు డిమాండ్ పత్రం అందించి, ప్రభుత్వ అధికారులెన్ని మాటలు చెప్పినా గత 6 సం.లనుండి ప్రజావ్యతిరేక చర్యలే అమలుచేస్తున్నారనీ, దీనితో ప్రజాపోరాటాల ద్వారానే వీరిని ఓడించాలనే దృఢ సంకల్పంతో ఉన్నారు.

## విజయవంతమైన 'బస్తర్ బంద్'

తునికాకు రేటు 100 కట్టలకు 50 రూ.లు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్‌చేస్తూ పార్టీ ఉత్తర బస్తర్ డివిజనల్ కమిటీ మార్చి 30న 'బస్తర్ బంద్'కు పిలుపు నిచ్చింది.

ఈ పిలుపు నందుకొన్న డిఎకెఎమ్ఎస్, కెఎఎమ్ఎస్ కార్యకర్తలు, పీడిత ప్రజలు బంద్‌ను విజయవంతం చేయడానికి తమ శక్తివంచన లేకుండా కృషిచేశారు. బంద్‌కు 3 రోజుల ముందు నుండే రోడ్లకు అడ్డంకులు పెట్టి, గోతులు త్రవ్వారు. ప్రజల నిరసనలో భాగంగా డోంగర్ రేంజి ముసునార్ గ్రామంలో కలప డిపో దగ్ధం అయింది. చార్‌గాంవ్‌లో ఖదాన్‌కి చెందిన డ్రిల్లింగ్ మెషిన్‌తో పాటు అనేక సామానులు, 200 లీటర్ల డీజిల్ ఆహుతయ్యాయి. జిల్లాలో ఆ రోజు ప్రధాన రహదారుల్లో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. బడుగాంవ్ (ప్రతాప్‌పూర్ రేంజి) చార్‌గాంవ్ (కోయిల్‌బెడ్) సంతలు జరగనే లేదు. డిఎకెఎమ్ఎస్ కార్యకర్తలు అబూజ్‌మాడ్ ఏరియాలో నోన్‌పూర్ రోడ్డుపై వాహనాల రాకపోకలను నిలిపివేసి బంద్‌ని విజయవంతం గావించారు. చిన్నా పెద్ద పట్టణాలన్నింటా దుకాణాలు మూసివేసారు. జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ యంత్రాంగాన్ని బంద్ కుదిపివేసింది. ఈ ప్రాంతమంతటా బంద్ మంచి ప్రభావాన్ని కల్గించి ప్రజల్లో పోరాట పటిమను పెంచింది.

బంద్

## గోవారీ ప్రజలకు జేజేలు

1994 నవంబర్ 23 నాడు నాగపూర్ అసెంబ్లీ సెషన్ ముందు 50 వేల గోవారీ ప్రజలు నిరసన ప్రదర్శన నిర్వహించారు. తమ సమస్యను జాప్యం చేయడం, నాన్చడం సహించమన్నారు. రాజకీయ లబ్ధికోసం గోవారీ ప్రజల సమస్యను నాయకులు వినియోగించుకోవడం అనుమతించలేమన్నారు. గడుచిరోలి, బండారా, చంద్రపూర్, నాగపూర్ జిల్లాల నుండి విదర్భ గోవారీలు స్త్రీలు - పిల్లలతో సహా నాగపూర్ వీధుల్లో నినదించారు. అసెంబ్లీ వద్దకు ప్రదర్శన చేరుకోగానే పోలీసులు విరుచుకుపడ్డారు. లాఠీలు, తుపాకులు నాట్యమాడినాయి. ఫలితంగా 113 మంది అసువులు బాసారు. రిజర్వేషన్ లిస్టులో నుండి అతి చిన్న పొరపాటు (ట్కైపిస్టు కామా చేర్చకపోవడం) తో వెలివేయబడ్డ గోవారీలు దశాబ్దకాలంగా బొంబాయి, ఢిల్లీల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. ఫలితం ప్రాణాల మీదికే తెస్తుంది. దోపిడీరహిత

వ్యవస్థ కోసం పోరాడుతున్న తోటి ఆదివాసులతో భుజం భుజం కలిపి వారి జీవిత మౌళిక సమస్యల అంతిమ పరిష్కారానిక్కి సిద్ధంకావాలనే బండారా/గడచిరోలి డివిజనల్ కమిటీల పిలుపు ఇవ్వడంతో ప్రజల్లో మంచి స్పందన కనపడింది. తీవ్ర నిర్బంధం ఎదుర్కొంటున్న ఆ డివిజన్‌లో 1992 అనంతరం ఇచ్చిన తొలి బంద్ పిలుపు జయప్రదం కావడం ప్రజల పోరాటాకాంక్షకు ప్రతీకగా నిలిచింది.

పార్టీ విడుదల చేసిన కరపత్రాలు అన్ని గ్రామాలకు చేరాయి. ప్రధాన కూడలుల వద్ద ఆదివాసీ జిందాబాద్ నినాదాలు పోస్టర్లు వెలిశాయి. పోలీసుల పహారా-గస్తీ తీవ్రంగా ఉన్నా రోడ్లు, వాహనాలను అనుమతించలేదు. నిరసనజ్వాలల్లో ఒక ట్రక్కు, పెద్ద మొత్తంలో వెదురు బూడిదయింది.

ప్రజలను మాయంచేసినా, ప్రజలను హత్యచేసినా, ప్రజాపోరు ఆగదన్నారు. ఇంద్రవెల్లి, మంగెరఖరి, నాగపూర్ లు పోలీసుల అమానుషత్వానికి రికార్డుగా పోరాట చరిత్ర మరచిపోనివి అన్నారు.

## బేనూర్ రేంజి డిఎకెఎమ్ఎస్ మహాసభలు

కొండగాం ప్రాంతంలోని బేనూర్ రేంజి డిఎకెఎమ్ఎస్ మొదటి మహాసభలు జనవరి '96లో కా. జయరాం హాలులో రెండున్నర రోజుల పాటు జరిగాయి. కా. పగును జెండా ఎగురవేయగా కా. సుఖలాల్ స్మృపావిష్కరణతో మహాసభలు ప్రారంభమైనాయి. 12 గ్రామాలనుండి 18 మంది ప్రతినిధులు హాజరైనారు. ప్రణాళిక, రాజకీయ తీర్మానం, వర్క్ రిపోర్టులపై చర్చ సాగింది. వీటితో పాటు ప్రత్యేకంగా బేనూర్ రేంజిలోని పోలీసు ఏజెంట్లపై నిఘా ఉంచాలని, అవసరమైనపుడు తొందరగా చర్యలు తీసుకోవాలంటూ ప్రతినిధులు మాట్లాడారు. ముగ్గురితో రేంజి కమిటీని ఎన్నుకున్నారు. ఎంతటి నిర్బంధం ఎదురైనా రహస్యంగా సంఘం పనిని కొనసాగించాలని కా. సుఖలాల్ ముగింపు ఉపన్యాసంలో కోరారు. ఇంటర్నేషనల్ గీతం పాడిన పిమ్మట కా. పేడు జెండా దించడంతో ఉత్తేజంగా జరిగిన మహాసభలు ముగిసాయి.

ప్రధానమైన తీర్మానాలు: 1. భూస్వాముల భూముల్ని పేదప్రజలకు పంచాలి.
2. వ్యవసాయ పనుల్లో రెండు రకాల కూలిరేట్లు (షావుకార్లకు వేరే, ప్రజలకు వేర్వేరుగా) అమలుచేయాలి.

/వర్ధంతి/

## 23 మార్చి "పోరాట దీక్షా దినం"

టిప్రాఘుడ్ ఏరియాలో విప్లవ గెరిల్లాలు సమరదీక్షతో మార్చి 23ని 'పోరాట దీక్షా దినం'గా భగత్‌సింగ్ వర్ధంతి సభ జరుపుకున్నారు.

కా. స్వప్న ఎర్రజెండా ఎగురవేయగా సభ ప్రారంభమైంది. బ్రిటిష్ వలస పాలనలో ఉన్న భారతదేశానికి స్వాతంత్ర్యం కావాలని పోరాడినందుకే భగత్‌సింగ్‌ను వలసప్రభుత్వం ఉరితీసింది. విప్లవకారులని ఉరితీయడాన్ని ఖండిస్తూ, ప్రజాపోరాటాల్ని ముందుకు తీసుకుపోడానికే ఈ సభ జరుపుకుంటున్నామని ఆమె ప్రారంభోపన్యాసం చేశారు. పిమ్మట అధ్యక్షత వహించిన కా. చందర్ షా మాట్లాడుతూ, 'దోపిడీ వర్గాల ప్రయోజనాలు కాపాడే నేటి ప్రభుత్వాలు కూడా తమ పబ్బం గడుపుకోడానికి భగత్‌సింగ్ వర్ధంతి జరుపుతున్నాయి. కానీ, నూతన ప్రజాస్వామిక విప్లవ విజయానిక్కై ప్రాణాల్ని సైతం లెక్కచేయక పోరాడుతున్న మనం జరుపుకోవడానికి మాత్రం విప్లవ ప్రాముఖ్యత ఉంది' అన్నారు. భగత్‌సింగ్‌తో పాటు ఉరితీయబడిన రాజ్‌గురు, సుఖ్‌దేవ్ లు కూడా గొప్ప విప్లవకారులే నంటూ వారందరి జ్ఞాపకార్థం రెండు నిమిషాలు మౌనం పాటించింది సభ. విప్లవ నినాదాల వరుసన జోహార్లు పాట, ఆ తర్వాత కా. ధరమ్ దా మాట్లాడారు. ఈ రోజు మన దేశ స్వాతంత్ర్యానిక్కై పోరాడి అమరులైన పోరాటయోధులందరినీ గుర్తుచేసుకోవాలి. 1924లో చంపివేయబడ్డ అల్లూరి సీతారామరాజు, 1941లో ఆదివాసులను సంఘటితపరుస్తూ ప్రభుత్వంచే చంపివేయబడ్డ కొమురం భీం అలాగే 1857లో గడచిరోలి జిల్లాలో సద్మెక్ బాబూరావు ... ఇలా వీరందరి నుండి మనం ప్రేరణపొందాలని ఆ కామ్రేడ్ మాట్లాడారు. ప్రభుత్వం చేస్తున్న ప్రజావ్యతిరేక చట్టాలకు నిరసన తెలుపడానికి భగత్

స్లింగ్ అసెంబ్లీలో పొగబాంబు విసిరిన నేరానికి 23 మార్చి నాడు ఉరితీయబడ్డాడు. దోపిడీ వర్గాల కోసం పనిచేసే ప్రభుత్వాలు అప్పటికీ ఇప్పటికీ ఉరితీయడం మానలేదు. అందుకే భూమయ్య కిష్టాగౌడ్ లను ఉరితీశారు. బీహార్ హైకోర్టు 8 మంది రైతాంగానికి ఉరిశిక్ష విధించి, జైలు అధికారులు అంతిమ ఘడియలు లెక్కపెట్టేట్టుగా చేసింది.

ఇటు ప్రజలపై, ప్రజా నాయకులపై ఉరిశిక్షలు అమలుచేసే ఈ హంతక వ్యవస్థను విప్లవం ద్వారా కూలదోయాలనే నేటి రోజున అంటే మార్చి 23ని "పోరాట దీక్షా దినం"గా స్వీకరిద్దాం అని ముగించారు.

## పిల్లల సదస్సు

ఆదివాసీ సమాజంలో బాలబాలికల స్థితి వివరించాల్సిన పనే లేదు. వెట్టి చాకిరి, నిరక్షరాస్యత, పసి వయస్సు లోనే పనిభారం, ఆర్థాకలి, పౌష్టికాహార లోపం, అంటురోగాలు, బాలల జీవితాలకి పర్యాయపదాలై నిలిచిపోయాయి. నిజానికి దోపిడీ వ్యవస్థ నెలకొన్న కారణంగా మూడవ ప్రపంచ దేశాల్లో ఇది తీవ్ర సమస్యగా కూడా ముందుకొస్తున్నది. ప్రభుత్వం బుల్లెట్ల వర్షాలు కురిపిస్తూ ప్రజాపోరాటాలను అణచివేస్తుంటే దానికి నిర్దాక్షిణ్యంగా బలవుతున్నది బాలలే. డొక్కలెండుకుపోయి వీధినపడ్డ బాలబాలికలు ఎందరో సామ్రాజ్యవాదులు విధించే ఆంక్షలతో కనీసం పాలపొడి అన్నం మెతుకులు దొరక్కుండా పోయి విలవిలలాడుతూ ప్రపంచం నుండి భౌతికంగా దూరమవుతున్నారు. ఇరాక్ మొదలు సోమాలియా వరకు, శ్రీలంక రువాండాల నుండి మెక్సికో వరకు కోట్ల మంది పిల్లలు అర్థాయుష్షులుగానే కన్ను మూస్తున్నారు. అనారోగ్యాలతో మరణాల పాలయ్యే వారి జీవనం చెప్పకోడానికేముంటుంది? అలాంటి బాలబాలికలను ఆర్గనైజ్ చేయడంలో భాగంగా డికె లోని కిష్టారం రేంజి విప్లవ గెరిల్లాలు 207 మంది పిల్లలను కూడదీసి వారి సామాజిక జీవితంలో ప్రాణనష్టం, ఆర్థిక దోపిడీలు ఎలా నెలకొన్నాయో వివరించి, ఆ నేపథ్యంలో విప్లవ రాజకీయాల ప్రాముఖ్యత ఎలాంటిదో అర్థంచేయించారు. ఇది బాలబాలికలపై మంచి ప్రభావం కల్గించింది. 'నేటి పిల్లలే రేపటి విప్లవకారులు'న్న ముందుచూపుతో విప్లవోద్యమం వేస్తున్న అడుగు ఇది. సత్ఫలితాల నాశిద్దాం. ○ ○

---

§ 52 వ పేజీ తరువాయి §

దారుఢ్యానికి కావలసిన వ్యాయామం, క్రీడలు, పౌష్టిక ఆహారం అందిచ్చే ప్రభుత్వాలు నేడు లేవు. పైగా తమ స్వార్థం, దోపిడీ కోసం సమాజాన్ని కలుషితం చేస్తున్నారు.

వాస్తవానికి క్రీడలను ప్రోత్సహించాల్సిందే! విశ్వమానవాళి సోదర లక్ష్యంతో అత్యద్భుతంగా క్రీడలను తీర్చిదిద్దాలి కూడా. క్రీడాకారులమధ్య పోటీలు కూడా అవసరమే. వారిలోని శక్తియుక్తులను వెలికితీయడానికి, నూతన టెక్నిక్కులను పెంపొందించడానికి అవి తోడ్పడాలి. కాని ప్రస్తుత సమాజంలో అలాంటి క్రీడలను - పోటీలను ఆశించలేము. నేడు మన దండకారణ్యంలోని ఆదివాసి యువకులెందరో వివిధ క్రీడల్లో పాల్గొంటూ ప్రాథమిక స్థాయిలో అగ్రభాగాన నిలుస్తున్నా, తర్వాత క్రమంలో ఉన్నత విద్య దొరక్కుండా పోయి క్రీడావ్యాపారంలో రాజకీయాలు నిర్వహించలేకుండాపోతూ పల్లెగడపకే పరిమితమవుతున్నది చూస్తున్నాము. దోపిడీ వ్యవస్థను మార్చడానికి నడుం బిగించిన విప్లవశక్తులతో యువతరం భుజం భుజం కలిపి నడచి, నూతన వ్యవస్థను సాధించిన నాడే వారికి ఉన్నత విద్య, విద్యతోపాటు క్రీడల్లో ప్రోత్సాహం లభిస్తాయి. సామ్రాజ్యవాదాన్ని నాశనంచేస్తేనే గ్లోబలైజేషన్ విధానాలు నిర్మూలించబడుతాయి. క్రీడలు వ్యక్తుల, సమాజాల వికాసానికి తోడ్పడగలవు. అప్పటివరకు ఒక ఆంగ్ల కవి వ్యాఖ్యానించినట్టు "11 మంది మూర్ఖులు ఆడుతుంటే, పదకొండు వేల మంది మూర్ఖులు చూసే ఆట" గానే క్రికెట్టు నిలుస్తుంది. గెలుపు - ఓటములు గ్లోబలైజేషన్‌కే చెందుతాయి.

○○

> "ప్రజలే నిజమైన వీరులు. అనేక సందర్భాలలో మనమే అమాయకత్వం గానూ, పసిపిల్లల్లాగూ వ్యవహరించుతాం. ఈ అవగాహన లేకపోతే అత్యంత ప్రాథమిక విజ్ఞానాన్ని సంపాదించడం కూడా అసాధ్యం." — మావో

## వెదురుకూపుల పోరాటం

మధ్యప్రదేశ్ ప్రభుత్వం దశాబ్దాల కాలం నుండి బస్తర్ జిల్లాలో కర్ర (గోల) వెదురు (బాంస్) కూపులు నరికిస్తూ కోట్లాది రూపాయిలు లాభం గడిస్తున్నది. ప్రజాసంక్షేమ కార్యక్రమాలు చేపట్టలేని సర్కార్, వర్షపాతం తగ్గిపోయి వ్యవసాయం తీవ్రంగా దెబ్బతినేంతగా పర్యావరణ సమస్యలను సృష్టిస్తున్న సర్కార్ కు వ్యతిరేకంగా డిఏకెఎమ్ఎస్, కెఎఎమ్ఎస్ ల నాయకత్వాన ఉత్తర్ బస్తర్ ప్రజలు కదలి, ప్రభుత్వం కర్ర నరకడాన్ని వ్యతిరేకిస్తూ పోరాటాలు చేబట్టారు.

ఇందులో భాగంగా అబూజ్‌మాడ్ రావ్‌ఘాట్ రేంజిల్లోని పెక్కుగ్రామాల ప్రజలు నవంబర్ 28న (1995) పల్లకసు గ్రామంలో సమీకృతులై ఊరేగింపు తీసి బహిరంగసభ జరుపుకున్నారు. 'అడవి మీద ఆదివాసులకే హక్కు', 'అటవీ ఉత్పత్తులకు న్యాయమైన ధర చెల్లించాలి', 'కర్ర నరకడం, రోడ్డు వేయడం నిలిపివేయాలి' అంటూ ఎలుగెత్తి నినదించారు.

## చీపుర్ల పోరాటాలు

ఛత్తీస్‌ఘడ్ మార్కెట్లలోఅమ్ముడుపోయే చీపుర్లలో అధికశాతం అబూజ్‌మాడ్ ప్రాంతం నుండి సరఫరా అయ్యేవే. షావుకార్లు గత 5 సంవత్సరాలుగా చీపుర్లకు అంగీకరించిన రేటు కిలోకి రు.9/- ఇవ్వకుండా చిత్తమొచ్చిన రేటు ఇస్తుండేవారు. గత సంవత్సరం మాత్రం ప్రజల పోరాటంతో కొన్ని చోట్ల చీపురు కట్టకు రు.9/- ఇచ్చారు.

చింతపండు, ఉసిరికాయలు, కరక్కాయ వంటి అటవీ సంపదతో పాటు సీజనులో (జనవరి నుండి మార్చి వరకు) అత్యధికంగా మార్కెట్టుకు అందించే చీపుర్ల వంటి వాటి రేటు కూడా పెంచాలని డిమాండ్ చేస్తూ, మార్చి 6 నాడు అబూజ్‌మాడ్ ప్రాంతం నుండి 360 మంది ప్రజలు నారాయణపూర్ పరియోజనాధికారి (పి.ఓ) కి విజ్ఞాపన పత్రాన్ని అందించడానికి కుతుల్ రోడ్డు నుండి వెళ్లారు. అలా వెళుతున్న వారిని పోలీసులు అడ్డగించి వెనక్కి వెళ్ళగొట్టారు. సోన్‌పూర్ రోడ్డు నుండి పోయిన మరికొందరిని కూడా ఆపేయగా, వారు పోలీసులతో ఘర్షణకు దిగారు. దీనితో గత్యంతరం లేని పోలీసులు పి.ఓ. వద్దకు ప్రజాప్రతినిధులు వెళ్ళి విజ్ఞాపన పత్రాన్ని ఇవ్వడానికి అంగీకరించక తప్పలేదు. "మీ కోర్కెలు పరిశీలిస్తాం. మీరు షావుకార్లకు వేటినీ అమ్మవద్దు. సొసైటీలకే అమ్మండి" అని చెప్పి అధికారులు సోన్‌పూర్, కోహకమెట్టల్లో ప్రత్యేక సహకార సంఘాల్ని వెంటనే ఏర్పరిచారు.

**పోరాడి సాధించుకున్న రేట్ల వివరాలు**

| సరుకు (కిలోకి) | 1991 కి ముందు (రు.లలో) | 1991 (రు.లలో) | 1996 (రు.లలో) |
|---|---|---|---|
| చీపుర్లు | 2.00 | 9.00 | 14.00 |
| తేనె | 10.00 | 28.00 | 40.00 |

చూడండి! చదివించండి!

ప్రభాత్

దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ అధికార పత్రిక

చందాలు విరివిగా సేకరించండి।

విడి ప్రతి : 5 రూపాయిలు

సంవత్సర చందా: రు.20/-

## సంక్షేమ కార్యక్రమాలతో పటిష్ఠమవుతున్న విప్లవోద్యమం

-౦-౦-౦-౦-౦-౦-౦-౦-౦-౦-౦-౦-౦--

దక్షిణ బస్తర్ ఆర్థికంగా, రాజకీయంగా, వెనుకబడియుండటంతో వ్యవసాయంలో కూడ చాల వెనుకబడి ఉంది. సాంస్కృతికంగా కూడ ఇదే స్థితి. విప్లవోద్యమం ప్రజాసమస్యలపైన, దోపిడి నుండి విముక్తి కొరకు పోరాడుతున్న సమయంలోనే ప్రజా సంక్షేమ కార్యక్రమాలు కూడా చేపట్టింది.

వ్యవసాయంలో ఉన్న ఒక్క పంటకయినా ప్రభుత్వం కల్పించిన నీటిపారుదల సౌకర్యం లేదు. మొదటిసారి డిఎకెఎమ్ఎస్ ఈ సమస్యను తీసుకొని సమిష్టి చెరువుల అవగాహన కల్పించింది. ఫలితంగా మద్దేడ్ ప్రాంతంలో 2,3 గ్రామాల్లో సమిష్టి చెరువుల నిర్మాణం పూర్తిచేసుకోవడం, బాసగూడెం కుంట ఏరియాల్లో సరిగా లేని పాత చెరువులను ప్రజలే మరమ్మత్తు చేసుకోవడం లేదా ప్రభుత్వం విడిచిపెట్టిన అసంపూర్తి చెరువుల పని పూర్తి చేసుకోవడం మొ.గు కార్యక్రమాలు సమిష్టిగా చేసుకున్నారు. బాసగూడెం ప్రాంతంలో ప్రయోగాత్మకంగా ఒక కొత్త చెరువు కూడా నిర్మించుకొని సేద్యానికి సిద్ధంచేసుకున్నారు.

కుంట ఏరియాలో 15 గ్రామాల నెంచుకొని మామిడి, సపోటాల వంటి పండ్ల మొక్కలను పంచడం జరిగింది రెండవ పంటగా శనగలను వేసే విధంగా ప్రజలను ప్రోత్సహించి స్థానిక వనరుల తోడ్పాటుతో కిష్టారం, గొల్లపల్లి రేంజిల్లోని 40 గ్రామాల ప్రజలకు ఆ విత్తనాలు అందించటంతో ఈ సారి శనగలు పండిస్తున్నారు.

మంత్రాల వంటి మూఢనమ్మకాలు ఎలా తప్పో అర్థంచేయించడంతోబాటు, ప్రజల ఆరోగ్య పరిస్థితులపై అవగాహన కల్పించి, మందులు ఏమిటి ఎలా వాడాలో వివరించారు. స్వానుభవంలో వారే దాన్ని తెలుసుకునేట్లు తోడ్పడ్డానికిగాను ప్రతి దళం ఏరియాలో అయిదేసి గ్రామాల నెంచుకొని ఆ గ్రామాల్లో సమిష్టిగా మందులు లభ్యం అయ్యేట్లు ఏర్పాటుచేయించారు. అందులో భాగంగా ఇద్దరు మహిళలతో సహా 5 గురితో కమిటీలు ఏర్పడి, వాటికి పరిసరాలు-శుభ్రత-రోగాల నుండి జాగ్రత్తలు తీసుకునే పద్ధతులు-రోగాలకు మూలం-మందులు వాడే విధానం, ఇంజక్షన్లు .... ఇలా ప్రాథమిక మెడికల్ శిక్షణ నిచ్చేట్లు చేసారు. ముఖ్యంగా స్త్రీలు ఆరోగ్య సమస్యలపై ప్రత్యేక శ్రద్ధతో అవగాహన కల్పించారు. వీటన్నిటితో ఉత్తేజితులైన ప్రజలు తామే ముందుకు రావడంతో వారికి కూడ శిక్షణ నిప్పించి కుంట ఏరియాలో 13 కేంద్రాలు ప్రారంభించి పనిచేయిస్తున్నారు. ఇవన్నీ ప్రజల ఆరోగ్యం-అవగాహనలకు ఎంతగానో ఉపకరిస్తున్నాయి.

వేసవికాలం మంచినీటి సమస్య తీవ్రంగా ఉండే బాసగూడెం, కుంట ఏరియాల్లో ఎంచుకున్న గ్రామాలలో ప్రజలను కదలించి చిన్న చిన్న బావులను త్రవ్వించే కార్యక్రమం కూడ చేపట్టారు.

౦ ౦

వెలువడింది

చదవండి ! చదివించండి !

అమరవీరుల జీవిత చరిత్రలు - 2

(పుస్తకం - హిందీ)

అమరవీరుల కుటుంబాలకు అందజేయండి

మీ ప్రాంతాల్లోని అమరుల జీవిత చరిత్రలు అందజేయండి

"ప్రజా పంచాయితీల" ద్వారా ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్న విప్లవ సంఘాలు

మంత్రాలు చేస్తున్నాడనే ఆరోపణతో వడ్డెల్ అనే అతని మాటలు నమ్మి, బోడ గుబ్బలు (కుంట ఏరియా) గ్రామ నివాసి మడ్కం ఇడియాలును అదే గ్రామానికి చెందిన సుక్కాలు, జోగాలు కలసి హత్యచేశారు. ఇది డిఎకె ఎమ్ఎస్ ముందుకు రావడంతో ప్రజాపంచాయితీ నిర్వహించింది. ప్రజల తీర్పు మేరకు వారికి దేహశుద్ధిచేసి హత్యచేసిన ఇద్దరి నుండి 10 వేల రూ.లు, వడ్డెల్ వద్ద నుండి 10 వేల రూ.లు తల ఖర్చు వసూలుచేసి కుటుంబ సభ్యులకు ఇప్పించారు.

కోయిల్‌బేడ రేంజి కొడొ సాలెబాటో గ్రామ భూస్వామి, మాజీ సర్పంచ్, షేరవేకారు, పెత్తందారు, బ్లాకు ఏరియా కాంగ్రెస్ నాయకుడు పనుకు ఉసేండి తాను సర్పంచ్‌గా ఉన్న కాలంలో మిండి గ్రామ స్కూల్ నిర్మాణం, చెరువులు టేక పట్టి (గుత్త తీసుకొని) 15 వేల రు.లు కూలీలవి ఇవ్వకుండా కాజేశాడు. ప్రజలు నిలదీసినప్పుడల్లా సర్కార్ నుండి డబ్బులు మంజూరు కాలేదంటూ దాటవేస్తున్నాడు. 'కట్‌పాచ్ 'పరగణ 30 గ్రామాల' కులపెద్ద' వీడు. మాడియా గోండు కూడ. ఈ గ్రామాల ప్రజల నుండి పండుగలు పబ్బాలు పేరన దండుగలు తినటం వీడి నిత్య కార్యక్రమం. వీడు లేనపుడు ఎలాంటి పంచాయితీ అయినా సరే ఆగిపోవలసిందే. వీడు పెత్తనంచేస్తూ ప్రభుత్వానికి, అరవింద నేతాంకు దగ్గరగా వుంటూ వ్యవహారాలు సాగిస్తున్న కీలక వ్యక్తి కూడ.

డిఎకెఎమ్ఎస్ నాయకత్వాన ప్రజాపంచాయితీ నిర్వహించి తిన్న డబ్బు లెక్కగట్టి వాపసు ఇవ్వాల్సిందిగా డిమాండ్ చేశారు. ప్రజాపంచాయితీలో తలవంచిన ఉసేండి 8 వేల రూ.లు వెంటనే ఇచ్చాడు. మిగతావి వాయిదాల ప్రకారం చెల్లించాల్సి వుండగా నిర్బంధం కారణంగా డిఎకెఎమ్ఎస్ కార్యకలాపాలు తగ్గుముఖం పట్టగా ఉసేండి మొండి మొండి చెయ్యి చూపించాడు.

1995 నుండి తిరిగి డిఎకెఎమ్ఎస్ కార్యకలాపాలు ప్రారంభంకావడంతో సెప్టెంబర్ 28, డిసెంబర్ 18 తేదీల్లో ప్రజాపంచాయితీ జరిగింది. ఈ పంచాయితీల్లో 300 మంది స్త్రీ-పురుషులు పాల్గొన్నారు. ప్రజకు చెల్లించ కుండా మిగిలిపోయిన 10 వేల రూ.ని డిమాండ్‌చేశారు. గతంలో కోయిల్‌బేడ పోలీసులతో మిలాఖత్తై నిర్బంధానికి గురిచేశాడు. దానికి కూడ ఉసేండి బాధ్యుడని ప్రజాపంచాయితీ తీర్పు చెప్పగా తలవంచిన పనుకు ఉసేండి తప్పు ఒప్పుకున్నాడు. వాయిదా ప్రకారం 10 వేలు చెల్లించి కేసులకు డబ్బులు చెల్లిస్తుండు. అలాగే రాజకీయాలన్నింటికి దూరంగా ఉండాలని, పటేల్... తదితర పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్‌చేయగా రాజీనామా పత్రాలు రాసిచ్చాడు. ప్రజాబలం ముందు తలవంచి క్షమాపణ కోరాడు.

ఈ చర్యలన్నీ చుట్టుపక్కల గల 30 గ్రామాలలోని పెత్తందార్ల, భూస్వాములపై ప్రత్యక్ష ప్రభావం చూపాయి. దోపిడీదార్ల గుండెల్లో భయాన్ని లేపింది. ఆదివాసీ రైతాంగం, పీడిత ప్రజ ఉత్తేజితులై డిఎకెఎమ్ఎస్, కెఎఎమ్ఎస్ ల నాయకత్వంలలో పోరాటాలకు సంసిద్ధులవుతున్నారు. ∞ ∞

---

"పార్టీ పాలసీని ప్రజల కార్యాచరణగా మార్చడంలో నైపుణ్యం సంపాదించాలి. మన నాయకత్వం కేడర్లే కాకుండా విస్తృత ప్రజానీకం మనం ప్రారంభించే ప్రతి ఉద్యమాన్ని ప్రతి పోరాటాన్ని అర్థం చేసుకొని జీర్ణం చేసుకొనేలా చెయ్యడంలో నైపుణ్యం సంపాదించాలి. మార్క్సిస్టు లెనినిస్టు నాయకత్వం యొక్క నైపుణ్యం ఇదే. మన పనిలో తప్పులు చేస్తామా లేదా అని నిర్ణయించగలిగేది కూడా ఇదే."

— మావో

(షాన్సి-షియాన్ దినపత్రిక సంపాదకవర్గంతో సంభాషణ - 2, ఏప్రిల్ '48)

# భూపోరాటాలతో ముందంజవేస్తున్న ఆదివాసీ ప్రజానీకం

పులింజీ-నేరొండ గ్రామాలలో సరిహద్దు భూమి తగాదాను సృష్టించిన నేరొండ టోటా మడావే అయిన పెత్తం దారు 5 సంవత్సరాలుగా పులింజీకి చెందిన 10 ఎకరాల భూమి అక్రమంగా ఆక్రమించాడు. దీనిపై కాంకేర్ కోర్టులో కేసు నడుస్తోంది. వాస్తవానికిది పులింజ్ గ్రామానికి చెందిన ముగ్గురు నిరుపేద కుటుంబాల భూమి. ఈ వాస్తవం తెలిసుని గుడ్డి కోర్టులు టోటా మడావికి అనుకూలంగా తీర్పునిచ్చాయి. ఇంతేగాక రెండు గ్రామాలపై అధికారం తనకే దక్కాలంటూ పోటీపడుతున్నాడు టోటా మడావి. ఈ సమస్య డిఎకెఎమ్ఎస్ ముందుకు వచ్చింది. సెప్టెంబర్ 12, 1995 నాడు 100 మంది స్త్రీపురుషుల ముందు పంచాయితీ జరిగింది. వాస్తవాలు పరిశీలన జరిపి ఆ ముగ్గురు రైతులకు 10 ఎకరాల భూమి వాపసు ఇప్పించారు. పెత్తందార్‌కు హెచ్చరికలు చేసి వదలిపెట్టారు.

అలాగే గుందల్ అనే గ్రామంలో డిఎకెఎమ్ఎస్ 10 సంవత్సరాలుగా బీడుపడిన 5 ఎకరాల భూమిని ఒక నిరుపేదరైతుకి ఇప్పించింది. నేండునార్ గ్రామంలో అధిక భూములు ఆపిన భూస్వామి వద్ద కూడ 5 ఎకరాలు తీసుకుని పంచింది.

కేశకల్ ఏరియా నుండి అబూజ్‌మాడ్ పైకి వలస వచ్చిన 5 కుటుంబాలకు అడవి నరికి సాగుచేసుకొమ్మని డిఎకెఎమ్ఎస్ ఆదారం కల తుంగాడు అనే గ్రామంలో 25 ఎకరాలు చూపించింది. ఇలా కోయిల్‌బెడ ప్రాంతంలో భూ పంపకాలు సాగుతున్నాయి.

పొట్ట చేతపట్టుకొని బ్రతుకు తెరువు కోసం వచ్చే ఆదివాసీలు భూములు లేక నానా అవస్థలు పడుతుంటే వారి స్థితిని ఆసరా చేసుకొని గ్రామాల్లోని పెత్తందార్లు కోళ్ళు, మేకలు, కల్లు, పైసలు గుంజుతున్నారు. ఇలా ముడుపులు చెల్లించిన వారు తమ ఇష్టంవచ్చినట్లు అడవిని నరికి సాగుచేస్తున్నారు. జగదల్‌పూర్ తహశీల్ నుండి కొండగాంవ్ ప్రాంతంలోకి అలా వచ్చిన 15 కుటుంబాలకు డిఎకెఎమ్ఎస్ నాయకత్వంలో కుటుంబానికి రెండున్నర ఎకరాల చొ.న క్రమపద్ధతిలో భూ పంపకం చేసింది. ఇకముందు గ్రామంలో ఎవర్నైనా డిఎకెఎమ్ఎస్ అనుమతి లేకుండా అడవికొట్ట రాదనీ, కొత్తవారిని పిలువరాదనీ తీర్మానించింది. ఇంతేగాక అడవి సంరక్షణలో భాగంగా డిఎకెఎమ్ఎస్ మాట పెడచెవిన పెట్టిగోలా చేరవేస్తున్నందున చోటే డొంగార్ రేంజిలోని అంబెలి గ్రామంలో ప్రజలు రావల్ సేఠ్ లారీని దగ్ధంచేసి ఉప్పు షావుకార్లను హెచ్చరించింది.

కొండగాంవ్ రేంజి మడనార్ అనే గ్రామంలో సుక్కు అనే మాజీ సర్పంచ్‌కు దాదాపు 25 ఎకరాల భూమి ఉంది. కుటుంబంలోని 5గురిలో ముగ్గురు పనచేసేవారే. చుట్టుపక్కల గ్రామాల్లోని భూపోరాటాలు చూసిన సుక్కు ముందే జాగ్రత్తపడి భూమిని అమ్ముకోసాగాడు. ఇంట్లో పనిచేసేవాళ్ళు లేకపోవడం, భూమిలేని కారణంగా పేదరికంతో మ్రగ్గుతున్న కుటుంబాలు ఉండటంతో డిఎకెఎమ్ఎస్ నాయకత్వాన ప్రజలు సుక్కు దగ్గర 6 ఎకరాలు స్వాధీనం చేసుకోవాలని తీర్మానించారు. ఆ రోజు ఊర్లో ఉండకుండా తప్పించుకున్నాడు. ప్రజలు నాగండ్లు, ఎర్రజెండాలతో ఊరేగింపుగా వెళ్ళి 6 ఎకరాలు స్వాధీనపరచుకున్నారు. 5 కుటుంబాలకు పంచి సరిహద్దు లేర్పరచగా దున్నుకోవడం ప్రారంభించారు. ఏ ఆధారం లేని యువతికి కూడ ఒక ఎకరం పంచారు. మరో ఎకరం చెక్క పంపకంజరక్కుండా మిగిలి వుంది. ప్రజల భూ పోరాటాలతో ఉత్తేజితులై ఇతర పోరాటాలకు సంసిద్ధులవుతున్నారు.

మర్దపాల్ రేంజి నెయా అనే గ్రామంలో భూస్వామి, పెత్తందార్ అయిన గణపతి ప్రజలకు తెలియకుండా గ్రామంలోని మిగులు భూములు, గ్రామం విడిచి పోయిన వారి భూములను సాగుచేసుకోవడం, వడ్డీల కింద భూములు ఆపుకోవడం లాంటి పనులుచేస్తుంటే డిఎకెఎమ్ఎస్ ప్రజల సమక్షంలో హెచ్చరించింది. కాని మానుకోలేదు. గ్రామం విడిచిపోయిన ఒక రైతుది 5 ఎకరాలు గణపతి దున్ని, వడ్లు అలకడం జరిగింది. కోతల సమయంలో డిఎకెఎమ్ఎస్ నాయకత్వంలో ప్రజలు నిలదీయడంతో తప్పించుకోవాలని చూసిండు. అయినా ప్రజలు పంట స్వాధీనపరచుకొని విత్తనాలు ఖర్చు, కష్టార్జితంకు గాను 10 ఖండ్లలో 3 క్వింటాళ్ళ వడ్లు మాత్రం ఇచ్చారు. మిగిలినవి గ్రామ ప్రజలు పంచుకున్నారు.

ఉత్తర బస్తర్ లోని బేనూరు రేంజి (కొండగాం ఏరియా) లోని బాగేషూర్ గ్రామం కల్లుబట్ పారకు చెందిన భద్రు సలామి అనే మాజీ సర్పంచు పోలీసు ఎస్పీతో నేరుగా సంబంధాలులో వుంటూ దళం కదలికలు నిత్యం చేరవేసే వాడు. డబ్బు ఆశ చూపి తన చుట్టూ మరికొందరిని ఇన్ఫార్మర్లుగా మార్చుకొని రహస్యంగా నడుపుతున్నాడు. మార్చి 3, 1995 న (కొండగాంవ్ దళంపై (డుండువాన్ ఎన్కౌంటర్కు, దాని నేపథ్యంలో అమరురాలైన కా. పూలబత్తి హత్యకు కారకుడు వీడే. అలాగే డౌల్లా రేంజిలోని డిఏకెఎమ్ఎస్ జిల్లా కమిటీ సభ్యుడు ఒకర్ని సరెండర్ చేయించింది వీడి ముఠానే. చివరికి గెరిల్లా దళం వీడిని ప్రజల సహకారంతో పట్టుకొని ప్రజా పీడ వదలించారు.

నేండేనార్ రేంజిలోని కల్మనార్ గ్రామంలో సోను డండామీ (మురియా గోండు) అనే అతను గ్రామ ప్రజలంద రికి వ్యతిరేకంగా మారి ఎవరంటే వారిని కొట్టడం, కత్తులు బాణాలతో బెదిరించడం, స్త్రీలను బలాత్కారం చేయడం ... ఇలా భయంకర వాతావరణాన్ని సృష్టించాడు. నాలుగుసార్లు హెచ్చరికలు చేసి, రెండుసార్లు కొట్టినా ప్రయోజనం లేకపోయింది. ప్రతిసారీ పోలీసులు దగ్గర తప్పుడు ఫిర్యాదులు చేసి ప్రజలకు బాధ కల్గించేవాడు. ఒకసారి హత్యానేరం మోపి వారిచే 4 వేల రూ.లు దండుగలు కట్టించాడు. తన ఇంటిని తానే తగులబెట్టుకొని గ్రామస్థులు కాల్చారని ఫిర్యాదు చేసాడు. గ్రామం నుండి ప్రజలు చేసిన ప్రయత్నం విఫలం కావడంతో తప్పని పరిస్థితుల్లో పీడ వదలించుకున్నారు.

మద్దేడ్ రేంజిలో నోమన్పల్లి బీటు నాకేదార్ ఎ.పి. తివారి పెద్ద లంచగొండి. జబర్దస్తీగా ప్రజలపై పెత్తనం చేస్తాడు. సర్కార్ అడవి నుండి ప్రజలు పూచికపుల్ల కూడా తేవడానికి వీలులేదని వాగుతుంటాడు. ఇల్లిల్లు తిరిగి కర్ర సామానులు పట్టుకుంటాడు. మూడేళ్ళుగా వీడి అరాచకాలు సాగుతూనే ఉన్నాయి. వీడి మకాం పోలీస్స్టేషన్ వద్ద పెట్టి ప్రజల చేతికి దొరక కుండా తప్పుకుంటున్నాడు. కానీ చివరకు అడవిలో వీడి ఉనికిని పసిగట్టిన ప్రజలు గెరిల్లా దళానికి సమాచారం అందించారు. దళం వీడిని '95 డిసెంబర్ మొదటివారంలో ప్రజల మధ్య విచారించి కుడి చేయి విరగ్గొట్టి బుద్ధి చెప్పి హెచ్చరించింది. ఇదే ప్రాంతంలో ముత్తపురం, మిన్కపల్లి, గ్రామాలపై అటవీశాఖ వారు '95 డిసెంబరు మొదటి వారంలో దాడిచేసి కర్ర పట్టి ట్రాక్టర్లలో తరలించుకుపోయారు. కానీ ప్రజలు సమ్మైక్యంగా వీరి దౌర్జన్యాన్ని సవాలు చేశారు. తమ కర్ర తమకు వాపస్ చేయకుంటే తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించగా ఖంగుతిన్న నాకేదారు ప్రజల డిమాండ్ను ఆమోదించాడు. ఇది తెలిసిన 'ఉడాన్ దస్తా' (ఫ్లయింగ్ స్క్వాడ్) అదిరిపడి తోక ముడిచి సదురుకొంది.

## సూరం వెంకటేశ్ ఖతం

ఐరి తాలూకా కమలాపూర్ రేంజి దామరంచకు చెందినవాడు సూరం వెంకటేశ్. వీడి తండ్రి భూస్వామి. గైరాదివాసీ కుటుంబానికి చెందిన వీరు ఆదివాసుల భూములు ఆక్రమిస్తూ పెత్తనం చేసేవారు. 1984 కమలాపూర్ మహాసభల కాలంలో ప్రజల్లో వెల్లుబికిన పోరాట చైతన్యంతో దామరంచ గ్రామ సంఘం ప్రజాసమస్యలెన్నింటినో పరిష్కరించింది. ఈ కుటుంబం దురాక్రమించిన భూములను కూడా రైతులకు ఇప్పించింది.

దీనితో కక్షగట్టిన ఈ కుటుంబం పోలీసుల సహాయంతో సంఘ నాయకులను అరెస్టుచేయించి ఊళ్ళో క్యాంపు పెట్టించారు. వీరి చర్యలను ప్రజల్లో ఎండగడుతూ దళం వీడి తండ్రిని ఖతం చేసింది. [illegible]కాలంలో వెంకటేశ్ చంద్రపూర్లో విద్యార్థి ప్రగతి సంఘటన్ తో సంబంధాలు పెట్టుకొన్నాడు. ఊరిలో సంగం మాటే చెల్లుబాటవుతుంటే, వీరంతా నోరు మెదపకుండా కట్టుబడి ఉన్నారు.

తర్వాత నిర్బంధం తీవ్రతరమైన క్రమంలో దామరంచలో పోలీస్ స్టేషన్ వెలిసింది. పోలీసుల సహాయంతో వీడికి టీచర్ ఉద్యోగం దొరికింది. కురుంపెల్లిలో ఉద్యోగం చేస్తూ రాపల్లె, కొడిశపల్లె, బ్రాహ్మణపల్లి, ఏశిలి తొండర మొదలైన గ్రామాలలో అతి నమ్మకస్థులతో ఇన్ఫార్మర్ల యంత్రాంగం ఏర్పరిచి దళానికి ప్రమాదకరంగా తయారైనాడు. అసలే లంఫెన్ స్వభావం కలిగిన వీడు పోలీసులు అప్పగిస్తున్న పనులూ నెరవేరుస్తుండడం చూసి, పోలీసులు మరింత పకడ్బందీగా వీన్ని వినియోగించుకోవాలనే దేశిలికి బదిలీ చేయించారు. అక్కడా పోలీస్ స్టేషన్ ఉంది. వీడి పనులకు

అనువైన ప్రాంతంగా ఆ ఏరియా ఉండడమే గాకుండా, విప్లవ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనే ఆ గ్రామాల్లోనే **దళాన్ని దెబ్బతీయాలనే కుట్రలు కూడా వీడి ఐడియా వెనుక పనిచేశాయి.**

కానీ, వీడి చర్యలన్నింటినీ వెంటవెంటనే పసిగడుతున్న ప్రజలు 1984 నుండి వీడి పట్ల తగు జాగరూకతతోనే వ్యవహరిస్తూ, హెచ్చరిస్తున్నారు. ఎంతచేసినా రోజురోజుకూ పోలీసులతో వీడి సంబంధాలు పెరుగుతున్నాయే తప్ప తరగడం లేనందున ప్రజలు వీడి పీడ విరగడ చేసుకున్నారు. మార్చి 13, 1996 నాడు టీచర్ సూరం వెంకటేశ్ పోలీస్ ఇన్ఫార్మర్‌గా జీవితం చెల్లించాడు.

---

ఉత్తర బస్తర్ . . .

పఖంజూర్ తహశీల్ (కోయిల్‌బెడ ఏరియా) కాందాడీ పంచాయితీలోని 'చిత్రం' గ్రామానికి చేరిన 'అబ్దుల్ హనీఫ్' పది సం.ల క్రితం అంతగడ్ టౌన్ నుండి వచ్చి కిరాణా దుకాణం పెట్టుకున్నాడు. వ్యాపారం నడుపుతూ స్థిరపడి ఊళ్ళో తనకు అనుకూలమైన సెక్షన్ ఏర్పరచుకొని, అందులోనుండి 'చందూర్ షా మడావి'ని సర్పంచ్‌గా (ఆదివాసులకే రిజర్వు చేయబడినది కావడం వల్ల) గెలిపించి ఆ కీలుబొమ్మ పేరుమీద తన పెత్తనం నడుపుతున్నాడు. దీనితో గ్రామస్థులపై అబ్దుల్ అత్యాచారాలకు అడ్డూ అదుపూ లేకుండా పోయింది. పశువులు చేనుమేస్తే పైసలు తీసుకోవడం, కొన్నిసార్లు గొడ్లను చంపడం అలాగే నొస్కాటీ బియ్యం రేట్లు పెంచి అమ్మకాలు చేయడం, గ్రామ పంచాయితీలో ఆమోదించినట్లుగా తనకనుకూలంగా రాయించుకొని దొంగ సంతకాలు పెట్టి పై అధికారులకు పంపి సౌకర్యాలు పొందడం చేసేవాడు. చిత్తరం గ్రామం అబూజ్‌మాడ్‌ని ఆనుకొని ఉండటం వల్ల వాడి దుకాణానికి వెళ్ళే మాడియా ఆదివాసులను, వారి అమాయకత్వాన్ని ఆసరాచేసుకొని తీవ్రంగా దోపిడీచేసేవాడు. నక్సలైట్లతో రాబోయే ప్రమాదాన్ని పసిగట్టిన 'అబ్దుల్' బాందే చౌకీ థానేదార్ శుక్లాతో సంబంధాలు పెట్టుకొని గ్రామంపై నిర్బంధం తెచ్చాడు.

గెరిల్లా దళం ఆ గ్రామం వెళ్ళిన మూడు సార్లూ, వెంటనే బాందే పోలీసులు గ్రామాన్ని సోదాచేసి ప్రజలను బెదిరించి వెళ్ళారు. దీనికి వీడే కారకుడు.

ఆ ఊరికి చెందిన దళ సభ్యులను దిగజార్చి సరెండరు చేయించడానికి ప్లాను రూపొందించుకొని 'మీ బిడ్డను సరెండరుకై మాట్లాడు. నేను ముందుంటాను' అని ఒక దళ సభ్యురాలి పినతండ్రితో మంతనాలు చేసాడు. ఇలా విప్లవోద్యమానికి వ్యతిరేకంగా పనిచేస్తున్నందున డిసెంబర్ 8, 1995 రాత్రి వీడిని దళం వీని ఇంట్లోనే అరెస్టుచేసి గ్రామంలో బహిరంగ సభ పెట్టి విచారణను ఏర్పాటు చేసింది. సుమారు 80 మందికి పైగా స్త్రీ పురుషులు పాల్గొన్న ఈ ప్రజాపంచాయితీలో తప్పులను చర్చించిన అనంతరం అబ్దుల్ హనీఫ్, సర్పంచ్ చందూర్ షా లకు దేహశుద్ధి చేయాలని నిర్ణయించి అమలుజరిపారు. అలాగే అబ్దుల్ దుకాణం, ఇంటిలో ఆస్తిని స్వాధీనంచేసుకొని గ్రామం నుండి పంపించాలని తీర్మానించి 35 వేల రూ.లు విలువచేసే ఆస్తి మొత్తాన్ని దుకాణాన్ని కూడా స్వాధీనపరచుకున్నారు.

కోయిల్‌బెడ : ఏరియా పానీ డూబీర్ గ్రామంలో కర్రకూపు పనులు ప్రారంభించకూడదని ప్రజలు చేసిన హెచ్చరికలు ఖాతరుచేయని ఫారెస్టు ఉద్యోగులను అక్టోబర్ 9, 1995రాత్రి గ్రామంలోనే దేహశుద్ధిచేసి హెచ్చరికలతో నారాయణపూర్‌కు తరిమారు. వారి నుండి 5 రంపాలు జప్తుచేసుకున్నారు.

అడవి నరకడానికి వ్యతిరేకంగా ప్రజలు సిక్‌సోడ్ గ్రామంలో దఫేదార్‌కు దేహశుద్ధిచేసి వెళ్ళగొట్టారు. వన విభాగ్‌కు చెందిన క్వార్టర్స్, ఇతర సామాగ్రిని ప్రజలు , దగ్ధం చేశారు.

రావ్‌ఘాట్ రేంజి (అబూజ్‌మాడ్) పల్లకసు గ్రామాన్ని 13 సం. క్రితం రూపొందించిన సోన్‌సాయ్ గావ్‌డే ఆ గ్రామ పటేల్ గా మారాడు. ఊరిలో వున్న 9 కుటుంబాల సభ్యులను ఇంతకాలం ఏదో నెపంతో కొట్టేవాడు. తిరగబడిన రైతులను గ్రామం నుండి తరిమాడు, షడ్రుకుని గ్రామ బహిష్కరణ చేసి అతని భూమి అక్రమంగా ఆక్రమించాడు. సొంత చెల్లెలి భర్త త్రాగి మైకంలో ఉండగా జీలుగ్గచెట్టెక్కించి నిచ్చెన వదలివేయడంతో పడిపోయి అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. ఈ విషయం చెల్లెలికి కూడా చెప్పకుండా పారిపోయాడు. నాటు బర్మార్లతో గర్రవెడ, కడక్‌నార్ రైతాంగాన్ని కొట్టడం, బెదిరించడం నిత్యకృత్యమైనాయి.

చైతన్యవంతులైన 15 గ్రామాల ప్రజ ఆడమగ కలసి సుమారు 230 మంది డిఎకెఎమ్ఎస్ నాయకత్వాన

పటేల్‌ను ప్రజాపంచాయితీలోకి లాగి తప్పును అంగీకరించని నోన్‌సాయ్‌కి దేహశుద్ధి చేశారు. మృతిచెందిన వ్యక్తి కుటుంబానికి 'మువాజు'గా ఎద్దును పట్టి ఇచ్చారు. వెత్త్యందారీ తనంతో కొట్టడం, తరమడం లాంటి దౌర్జన్యాలు సాగించినందుకు మరో ఎద్దును పట్టి ప్రజాపంచాయితీ సమిష్టిగా తిని హెచ్చరికచేసి బర్సార్‌ని స్వాధీనంచేసుకున్నారు. తిరిగి ఇలాంటి వాటికి తలపడితే గ్రామ బహిష్కరణ తప్పదని చెప్పారు.

బేనూర్ రేంజి — దండవండ్ అనే గ్రామంలో దాసు కులానికి చెందిన ప్రేమదాసు అనే వాడు ప్రజలను బెదిరిస్తు సంఘ వ్యతిరేక కార్యకలాపాలు సాగిస్తూ పోలీసులతో చేతులు కలిపాడు. హెచ్చరించినా ఫలితం లేకపోవడంతో వీడికి ప్రజలే దేహశుద్ధి చేశారు. మాండేక్ అనే గ్రామంలో రాంనాథ్, పటేల్ ర్మైను అనే ఇద్దరూ పోలీసులతో కలిసి తిరుగుతూ సంఘం వివరాలు అందిస్తూ సంఘంపేరుతో ప్రజలను కొడ్తుండేవారు. గ్రామ సంఘం హెచ్చరించినా వినకపోవడంతో 5 గ్రామాల ప్రజలు సుమారు 60 మంది దేహశుద్ధి చేసి హెచ్చరించి వదిలారు. అలాగే వొంగునార్‌లో దల్‌సాయ్ అనే వాడు తప్ప తాగి 'సంఘం మీటింగు నడవకూడదు. వెత్త్యందార్ల మీటింగే నడవాలి. లేకుంటే పోలీసులను తెస్తాను.' అని బెదిరిస్తుండటంతో వీడికి దేహశుద్ధి చేశారు.

జేగురగొండ ఏరియాలో ఇలింగేర్ గ్రామానికి చెందిన పెద్దలు డిఎకెఎమ్ఎస్, కెఎఎమ్ఎస్ లను వ్యతిరేకించడమే గాక గ్రామ ప్రజలందర్నీ బెదిరిస్తూ చిత్తం వచ్చినట్లు చుట్టుపక్కల గ్రామాలపై దాడులు చేస్తూ వారందరినీ భయకంపితుల్ని చేసేవారు. ఆ దాడుల్లో కోళ్ళు, మేకలు, పందులు, బియ్యం, .. ఇలా దొరికినవన్నీ ఎత్తుకెళ్ళేవారు.

గుండం, గెల్నూరు, తర్రేం, మండేవి, బెదిరే, పుల్లేం, మిల్లేం, మొ..గునవి చుట్టూవున్న 20 గ్రామాల్లో పెండ్లి, పండుగలు, కోళ్ళ పందేలు... ఇలా ఏం జరిగినా మళ్ళీ దాడి మామూలే. వీళ్ళకు పోలీసుల అండ సరేసరి.

ఈ విషయంపై ఏరియా కమిటీ గ్రామ పెద్దలకు బుద్ధి చెప్పాలని నిర్ణయించింది. ఇరవై గ్రామాల నుండి ప్రజలను, బాధితులను పిలిపించి ప్రజాపంచాయితీ నిర్వహించింది. ఏ ఏ గ్రామాలపై ఏ విధంగా దాడి చేసింది వివరిస్తూ ప్రజలందరి తీర్పు ప్రకారం ఇలింగేర్ గ్రామం నుండి దాడులకు నాయకత్వం వహించిన పెద్దలకు దేహశుద్ధి చేశారు. పొరుగు గ్రామాల నుండి తిన్న మేకలకు, పశువులకు, కేసుల కయిన ఖర్చు... వీటన్నిటినీ పెద్దలచేత దండుగ ఇప్పించడం జరిగింది. ఇకముందు సంఘం పద్ధతులకు కట్టుబడి ఉంటామని, గతంలో జరిగిన తప్పులు మళ్ళీ చేయమని ప్రజలందరికీ క్షమాపణ చెప్పినారు.

గమ్మగోడ (కుంట ప్రాంతం) గ్రామంలో ఒక యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఇది డిఎకెఎమ్ఎస్ ముందుకు రావటంతో ఆత్మహత్యకు కారకుడని తెలిసిన ఉంగాలును నిలదీయగా వాస్తవం బయటకు వచ్చింది. తప్పిపోయి వచ్చిన రెండు గేదెలు ఉంగాలు దేవాల పశువుల్లో కలసిపోయాయి. అలా కలసిపోయిన పశువుల గురించి 'నీవే బయటపెట్టావు' అని ఉంగాలు ఆ యువకుణ్ణి బెదిరించి కొట్టడంతో అతడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కనుక ఉంగాలుకు దేహశుద్ధిచేసి దిన ఖర్చు నిమిత్తం మూడు వేల రూ.లు వసూలు చేశారు.

దక్షిణ బస్తర్‌లోని జేగురుగొండ రేంజి (బాసగూడెం ఏరియా) జేగురగొండ గ్రామంలో రామ్‌సింగ్ కలారీ అనేవాడు మొదటినుండి ప్రజా వ్యతిరేకి. 1990-'91ల్లో పోలీసులు, వెత్త్యందార్లు, రాజకీయ నాయకులు పెద్ద ఎత్తున తలపెట్టిన 'జనజాగరణ్' నిర్బంధ కేంపెయిన్ లో రామ్‌సింగ్ ప్రముఖపాత్ర వహించాడు. పోలీసులతో కుమ్మక్కై నిర్బంధ చర్యలన్నింటితో పాటు అరెస్టయిన మహిళలపై అత్యాచారాలు సాగించడంలో వీడూ పాలుపంచుకునేవాడు. జేగురుగొండ పోలీసులతో ఇత్నన్‌పాడ్ అనే ఊరు వచ్చి సంఘం వాళ్ళు అనే నెపంతో ముగ్గురు అక్కలను అరెస్టు చేయించి పోలీసులతోపాటు తానూ వారిని అత్యాచారాలకు గురిచేసాడు. కొత్తగూడెం, రాయిగూడెం, కరుంగాడ్, తుమ్మల, జబ్బగట్ట.... ఇలా అనేక ఊర్లలో ప్రజలను, సంఘ కార్యకర్తలను, దళంలోకి వచ్చిన కామ్రేడ్స్ భార్యలను అరెస్టు చేయించిన ఘనత వీడిదే. పోలీసులు దళాలకి వ్యతిరేకంగా, యువతులను రేప్ చేస్తున్నారని చేసిన చేసిన ప్రచారంలో ఒక మంచి పనిముట్టుగా ఉపయోగపడినవాడు వీడు. వీడికి బంధువుల ద్వారా హెచ్చరికలు చేసినప్పటికీ ఫలితం లేకపోవడంతో ప్రజలే స్వయంగా జేగురుగొండ లో విల్లుకాండిలతో దాడిచేసారు. కాని వెంట్రుకవాసిలో తప్పించుకున్నాడు. వీడి మూలంగా ఎవరు సంతకు వెళ్ళాలన్నా భయపడే స్థితి రావడంతో ప్రజ మొత్తం వీడ్ని ఖతంచేయాలని తీర్మానించి ఫిబ్రవరి 16 నాడు సాయంత్రం వేళ పోలీసుస్టేషన్‌కు 40 గజాల దూరంలోనే ఖతంచేసి వీడ పడవేసుకున్నారు.

గడచిరోలి - అహేరి తాలూకా జిమ్మలగట్ట రేంజి సుద్దగుండ గ్రామంలో బోరుకుటి బాపు అనే వాడు ప్రజావ్యతిరేక వైఖరితో దళం ఆచూకీ పోలీసులకు అందివ్వాలని ప్రజలందరిపై వత్తిడి తెచ్చేవాడు. దానితో ప్రజలు దళం దగ్గరికి రావడమే సాధ్యంకాని పరిస్థితి ఏర్పడింది. చుట్టుపక్కల గ్రామాలపై కూడా దీని ప్రభావం పడింది. దళం ఊళ్ళోకి పోయిన రెండుసార్లు బోరుకుటి బాపు జిమ్మలగట్ట పోలీసుస్టేషన్‌కు సమాచారం అందివ్వడంతో రాత్రికి రాత్రే పోలీసులు దళం వేటకు తరలివచ్చారు. ఇలాంటి వారిని ప్రజల మధ్య ఉండడానికి అనుమతిస్తే ప్రజలకు - దళానికి ప్రమాదమని భావించి, మార్చి 8 నాడు బాపు ను ఖతంచేయక తప్పలేదు.

అహేరి తాలూకా జిమ్మగట్ట రేంజి మర్రిపల్లి గ్రామంలో మదనయ్య మడావి (సర్పంచ్) "దళం దగ్గరికి ఎవ్వరూ పోవద్దనీ, ఊరు విషయాలు పార్టీతో చెప్పొద్దని" బెదిరించడం చేసేవాడు. కా. సిడాం లచ్చన్న 1985లో రేంజి కమిటీలో పనిచేసి బయటకు వచ్చి అరెస్టయి విడుదలయినాడు. పోలీసులకు దొరకకుండా తప్పించుకు తిరుగుతుంటే సర్పంచ్ అతన్ని పట్టించే ప్రయత్నంచేసి విఫలమయ్యాడు. దీనిపై దళం హెచ్చరించి విడిచిపెట్టింది. అయినా ప్రయత్నం విడవకుండా చివరకు పట్టించడంతో మార్చి మాసంలో దళం వీడికి దేహశుద్ధి చేసి లచ్చన్నను విడిపించుకు వచ్చే బాధ్యత నీదేనని హెచ్చరించి వదలిపెట్టింది.

## ప్రభుత్వ నిర్బంధాన్ని గేలిచేస్తూ అక్రమ పన్నులను వ్యతిరేకిస్తున్న ప్రజ

గత సెప్టెంబర్ నెలలో కూర్ఖెడ తాలూకా (టిప్పాగడ్ ఏరియా) లోని ఊరేల గ్రామస్థులు జాగ పన్ను వసూలుచేయడానికి వచ్చిన కోత్వాలును తరిమికొట్టారు.

అడవినే ఆధారం చేసుకుని బతికే ఆదివాసులకు అడవిలో ప్రవేశం నిషేధం చేస్తూ, అటవీప్రాంతం నుంచి కోట్లాది రూపాయిలు దండుకుంటున్న ప్రభుత్వం నిర్బంధంగా మళ్ళీ పన్నులు వసూలు చేస్తున్నది.

గ్రామ గ్రామాన డిఎకెఎమ్‌ఎస్ శాఖలు ఏర్పడి ప్రభుత్వ అక్రమ వసూళ్ళను మొదట్లో, '93 వరకు, బందు పెట్టారు. కాని పోలీసుల సంఖ్యను పెంచి తీవ్రమైన నిర్బంధం తో ప్రజలను లొంగదీసుకోవాలనే ప్రయత్నం చేస్తున్నారు ప్రభుత్వ నిర్బంధాన్ని గేలిచేస్తూ సంఘటితమవుతున్న ప్రజ గతంలో సాధించిన విజయాలను కాపాడుకుంటూ మరిన్ని విజయాలకై పోరాట బాటలో సాగుతున్నారు.

పన్నులు వసూళ్ళకై వచ్చిన కోత్వాలును గ్రామ ప్రజలు అందరూ ఒకచోట జమ అయి నిలదీశారు. "ఎప్పుడూ వెలగకుండా ఉండే ఈ కరెంటు స్తంభాలను కూడా తీసుకుపోండి. మీరు కల్పించే బూటకపు నౌకర్లూలు మాకేమీ వద్దు. మేం పన్నులు కట్టం" అని తెగేసి చెప్పారు. దీనితో కోత్వాలు తోక ముడిచి జారుకున్నాడు.

ఎప్పటికీ సంఘటితంగా సాగాల్సిన అవసరం గుర్తించిన ఊరేల గ్రామస్థులు సంఘ నాయకత్వంలో తమ గ్రామ అభివృద్ధిని తాము స్వయంగా కృషిచేస్తే తప్ప సాధ్యంకాదని గ్రహించి ఆ మార్గంలో కదలుతున్నారు. ౦ ౦

---

అటవీ సంరక్షణ

## అడవి నరకడం ఆపని కొడ్డోనార్ పటేల్‌కు శిక్ష

జగదల్‌పూర్ నుండి మురియా గోండులు (దండామేర్), నారాయణపూర్ ఆవలి నుండి గోండులు అబూజ్‌మాడ్ లోకి వలస వస్తున్నారు. అడవిని బాగా నరుకుతున్నారు. దీన్ని ఆపాలనీ కొత్తవాళ్ళను రానీయవద్దనీ గత రెండు సంవత్సరాల నుండి ప్రచారం సాగిస్తూ కొత్తవాళ్ళను వెళ్ళగొట్టడం జరిగింది. అలా 15 కుటుంబాల్ని వెళ్ళగొట్టినా మళ్ళీ 5 కుటుంబాల్ని తీసుకువచ్చి కొడ్డోనార్ పటేల్ బొడ్డు ముదియాల్ అడవి నరికించాడు. నాలుగు గ్రామాల ప్రజ సమక్షంలో పంచాయితీ జరిగింది. అడవి ప్రాముఖ్యతను గుర్తించి రక్షించకుండా ఇలా నరికివేతకు కారకుడైన పటేల్ తిరిగి అలా చేయకుండా వుండేందుకు అతని ఒక ఎద్దును తీసుకుని పంచాయితీలో పాల్గొన్న వారంతా తిన్నారు. ఇకముందు ఎవరైనా ఇలా వ్యవహరిస్తే ఆర్థికంగా నష్టపరిచి ఊరినుండి వెళ్ళగొడ్తామని హెచ్చరించారు.

౦ ౦ ౦



This book belongs to
*SASBAN*

## క్రికెట్ క్రీడలో గ్లోబలైజేషన్ గెలుపు

సామ్రాజ్యవాద లాభాల వేటలో 'స్వేచ్ఛా మార్కెట్' అన్నదే ఏకైక నినాదం. తమ సరకుల మార్కెట్లును విస్తరించుకోవడానికీ, బహుళ జాతి కంపెనీల లాభాలను కాపాడ డానికీ అన్ని మార్గాలను సుకరం చేయడమే సామ్రాజ్యవాద నీతి. ప్రస్తుతం 'గ్లోబలైజేషన్' (విశ్వీకరణ, భూమండలీకరణ, భౌగోళీకరణ) పేరుతో మూడవ ప్రపంచదేశాలను బ్రెట్టన్ ఉడ్ (అమెరికా) సంస్థలు తమ గుప్పిట్లో బంధిస్తూ, ఎమ్.ఎన్.సి. (బహుళజాతి కార్పొరేషన్లు)లకు టి.ఎన్.సి. (దేశాంతర కార్పొరేషన్లు)లకు అనేక రుణాలను చేకూరుస్తున్నాయి. ఇందులో భాగంగానే 'పిల్కాం' (పాకిస్థాన్, ఇండో లంకా కమిటీ) క్రికెట్ క్రీడలను బహుళ జాతి కార్పొరేషన్‌లకు, సమ్మిళిత మీడియా శక్తులకు వంద మిలియన్ డాలర్లకు ధారాదత్తం చేసింది. ఆరవ విశ్వకప్ క్రికెట్ పోటీలను నిర్వహించడానికి ముందుగా పాకిస్థాన్ అనేక విఫల ప్రయత్నాలు చేయగా, ఆ అవకాశం ఇంగ్లాండుకే పోతుందన్న చివరి క్షణంలో మూడు దేశాల (పాకిస్థాన్, ఇండియా, శ్రీలంక) బడా బూర్జువా కుటుంబాలు రంగంలోకి దిగి ఆ పోటీలకు ఉపఖండాన్నే రణరంగంగా మార్చడంలో సఫలమైనాయి. భారత ఉపఖండంలో జరగడం ఇది రెండవసారి.

> భారత జట్టుకు మానసిక స్థయిర్యాన్ని ఇచ్చేందుకు పోటీల స్పాన్సర్‌లో పాల్గొన్న 'కోకోకోలా' సంస్థ నెల రోజుల నుండే 'భారీ బ్యాట్' యాత్ర నిర్వహించింది. ఈ బ్యాట్ దేశవ్యాప్తంగా 4,500 కి.మీ. ప్రయాణించేసి వేలాది సంతకాలు సేకరించింది. ఈ 'బెస్ట్ ఆఫ్ లక్ బ్యాట్' బొంబాయి, హైదరాబాద్, మద్రాస్ ల గుండా ఫిబ్రవరి 11నాడు ఈడెన్ గార్డెన్ చేరుకుంది. ఈ బ్యాట్ పొడవు 31 అడుగులు, వెడల్పు 5 అడుగులు, బరువు 850 కిలోలు. అయితే చివరకు మాస్టే మ్యాచ్ లో ఇండియా టీం ఓడిపోయింది. అయితే బ్యాట్‌తో పాటు కోకోకోలా బాటిల్స్ దేశమంతా తిరిగాయి.

14 ఫిబ్రవరి నుండి 17 మార్చి వరకు 33 రోజులు 6వ విశ్వకప్ క్రికెట్ పోటీలు జరిగాయి. ఇందులో 12 దేశాలు పాల్గొన్నాయి. భారత్, పాకిస్థాన్, శ్రీలంక, వెస్టిండీస్, ఇంగ్లండ్, న్యూజీలండ్, ఆస్ట్రేలియా, జింబాబ్వే, దక్షిణాఫ్రికా మొదలైన దేశాలు పాతవేకాగా, ఈసారి కొత్తగా పోటీల్లోకి దిగిన దేశాలు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, కెన్యా మరియు హాలండ్ లు. ఈ 12 దేశాల నుండి 168 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. మొత్తంగా 37 ఆటలు జరిగినాయి. ఇందులో భారతదేశంలో 17, పాకిస్థాన్ 16 కాగా మిగిలిన 4 శ్రీలంకలో జరిగాయి. 260 గంటలు జరిగిన మ్యాచ్‌లకు టి.వి.ల్లో 400 గంటల ప్రసారాలు జరగ్గా 200 కోట్ల ప్రపంచ టీవీ ప్రేక్షకులు చూశారట. వివిధ స్టేడియంల్లో జరిగిన ఈ మ్యాచ్‌లను 12 లక్షల షైగా ప్రత్యక్ష దర్శకులు కూడా చూడగలిగారట, ఇకపోతే రేడియో శ్రోతలు, పత్రికా పాఠకులు సరేసరి. ఎలక్ట్రానిక్ మీడియా మూలమూలకు విస్తరించుకపోయిన ఈ రోజుల్లో క్రికెట్ వార్తలు చేరని చోటంటూ లేదు. ఈ పోటీలకు ఫిబ్రవరి 11 నాడు కలకత్తాలోని ఈడెన్ గార్డెన్స్‌లో 'వైభవంగా' ప్రారంభోత్సవం జరిగింది. భారత రాష్ట్రపతి చేతుల మీదుగా జరిగిన ప్రారంభోత్సవానికి కెప్టెన్ బాధ్యతలు నిర్వహించిన క్రీడాకారులు మరియు ప్రపంచవ్యాప్తంగా ఎందరెందరో అధికారులు, రాజకీయవేత్తలు యీకార్యక్రమానికి హాజరైనారు. 90 నిముషాలు జరిగిన ఈ కార్యక్రమాన్ని నిర్వహించే బాధ్యతలు 1990లో విశ్వకప్ ఫుట్‌బాల్ పోటీల కార్యక్రమాలను నిర్వహించిన ఇటలీ కి చెందిన 'హాఫ్‌మూన్ ఇమేజ్ కన్‌సల్టెంట్స్' సంస్థకు అప్పగించగా 8 కోట్ల రూపాయిల బిల్లు అందజేశారు.

క్రికెట్ ముగింపు కార్యక్రమాలు కరాచీలోని గడాఫీ స్టేడియంలో జరిగాయి. విజేత జట్టుకు చెందిన శ్రీలంక క్రీడాకారులకు 6వ విశ్వకప్‌ను పాకిస్థాన్ ప్రధాని బెనజీర్ బుట్టో 30 కోట్ల నగదు రాశితో పాటుగా అందజేశారు.

క్రికెట్ ఆడేదెలా?

క్రికెట్టు ఆట ఇంగ్లాండ్‌కు చెందినది. దీని పుట్టుక 1830 లో జరిగిందంటారు. క్రికెట్టు ఆటకు 22మంది కావాలి. ఒక్కో జట్టులో 11 మంది ఉంటారు. ఒక జట్టులోనుండి ఒకరు బంతి విసురుతుంటే (బౌలింగ్ అంటారు) ప్రత్యర్థి జట్టులో నుండి ఒకరు బంతిని బ్యాట్‌తో కొడుతారు(బ్యాటింగ్ అంటారు). ఇలా కొట్టిన బంతిని విసిరిన జట్టువారు అందుకోవాలి (ఫీల్డింగ్ అంటారు): ఆరు సార్లు బంతిని విసిరితే ఒక 'ఓవర్' అంటారు. 6వ విశ్వకప్ పోటీల్లో 50 ఓవర్లుగా ఆటను నిర్ణయించారు. ఇందులో ఎవరు ఎక్కువ పరుగులు చేస్తే వారే గెలిచినట్టు. వీటిని 'వన్ డే మ్యాచ్' అంటారు. (ఒకరోజు ఆట). దీనికి భిన్నంగా టెస్ట్ మ్యాచ్‌లు జరుగుతాయి. ఒక జట్టులోని బ్యాట్స్ మెన్‌లు మొత్తంగా అవుటయ్యేలోగా చేసిన అధికమొత్తం పరుగులను బట్టి గెలుపు-ఓటములు నిర్ణయించబడతాయి. ఒక రకంగా చెప్పాలంటే మన పల్లెల్లో 'చిర్రగోనే'లాగే ఆడుతారని చెప్పుకోవచ్చు. బ్రిటన్ వ్యాపారంతో, సామ్రాజ్య వాద సంస్కృతితో మన దేశానికి దిగుమతైన ఆటల్లో క్రికెట్ ఒకటి. మాజీ కమ్యూనిస్టు దేశాలు, అమెరికా మినహా క్రికెట్ ఆటను ఆడే పశ్చిమ యూరప్ దేశాలు గ్లోబలైజేషన్‌తో పోటీపడుతూ మూడవ ప్రపంచ దేశాల్లోకి విస్తరింప చేస్తున్నాయి.

క్రికెట్టు - మార్కెట్టు:

నేటి సమాజంలో ఆటలు - ఆటగాళ్ళ జీవితాలు మార్కెట్టుతో ముడిపడిపోయినాయి. కళలు, కళాకారులు వ్యాపారమయమైనారు. దోపిడీ సమాజం నేపథ్యంలోనే జరిగిన క్రికెట్టు విశ్వ కప్ పోటీలను చూడాలి. ఈ క్రీడల నిర్వహణలో 100 వివిధ నగరాల్లోని స్టేడియం లను మరమ్మత్తుచేయడానికి 25 కోట్ల రూపాయిలు 'పిల్కాం' అందజేసింది. క్రికెట్ మ్యాచ్‌ల నిర్వహణ పుణ్యమా అంటూ అనేక స్టేడియంలు ఫ్లడ్‌లైట్లను అమర్చుకొన్నాయి. ఈ పోటీలో అస్సాం స్టేడియం ఎన్నిక కాకపోవడంతో స్థానిక క్రికెట్ అసోసియేషన్‌వారు హైకోర్టు కెక్కారంటే, క్రికెట్ నిర్వహణతో ఒనగూడే లాభాలు ఏ మోతాదులో ఉంటాయో గమనించవచ్చు. ఇది ఇలా ఉండగా, క్రీడాకారులకు 'బహుమతి'పేరుతో చెల్లిస్తున్న కాసులు కూడా తక్కువేం కాదు. విశ్వకప్ ప్రారంభించిన 1975లో బహుమతులక్కై చెల్లించిన డబ్బు 9 వేల పౌండ్లు, కాగా, 1996లో జరిగిన 6వ విశ్వకప్ నాటికి ఇది 2 లక్షల పౌండ్లకు (1 పౌండు 53 రూపాయిలకు సమానం) పెరిగింది. ఈ రాశి పెంచాలని ఇండియన్ క్రికెట్ క్లబ్ డిమాండ్ చేస్తుంది. విశ్వకప్ మార్కెట్ వ్యవహారాలు చూసే సంస్థ "ఇంటర్నేషనల్ మేనేజిమెంటు గ్రూపు". ఇదే సంస్థ విడిగా విజేత క్రీడాకారులందరికి తలా 2.5 లక్షల పౌండ్లు కూడా చెల్లిస్తోంది.

క్రీడాకారుల రాబడులు దీనిలో ఇలా ఉండగా, వ్యక్తులుగా తాము వివిధ సంస్థలతో చేసుకున్న ఒప్పందాల ద్వారా కూడా కోట్లాది రూపాయిలు గడిస్తున్నారు. రీబాక్ సంస్థవారి బూట్ల అమ్మకాలకై హజరుద్దీన్ (భారత జట్టుకెప్టెన్) సంతకంచేసి 30 లక్షలు పొందాడు. మిగతా ఆటగాళ్ళు తమ పరిధిలో తాము డబ్బులు గడిస్తున్నారు. అయితే గ్లోబలైజేషన్ మోసాల్లో రీబాక్ ఫలితాలు తనను ఎలా విషమపరిస్థితిల్లోకి నెట్టాయో నాసిరకం బూట్లు బుద్ధి చెప్పాయి. చిచ్చరపిడుగు పేరుతో క్రికెట్టు రంగంలో నిల్చిన సచిన్ టెండూల్కర్ అనేక వ్యాపార సంస్థలతో కుదుర్చుకున్న ఒప్పందాలతో విపరీతంగా డబ్బు గడించి ప్రపంచంలోనే అత్యంత సంపన్న క్రికెటర్‌గా ముందుకు వస్తున్నాడు.

నేడు మార్కెట్టులో చెప్పులు మొదలు తలటోపీల వరకు, తలపిన్నులు మొదలు చెడ్డీల వరకు క్రీడా - కళాకారుల బొమ్మలతో ఉంటే బ్రహ్మాండమైన గిరాకి ఉంటుందన్న 'నాగరికత'ను సృష్టిస్తున్న వ్యాపార సంస్థలు క్రీడా - కళాకారులకు తమ సంస్థల్లో అన్ని హంగులతో కూడిన సౌకర్యాలకు లోటులేని ఉద్యోగాలు ఇచ్చి పెంచిపోషిస్తూ లాభాలు గడిస్తున్నాయి. ప్రస్తుత విశ్వకప్ పోటీలలో 'విల్స్' పేరుతోనున్న దుస్తులు (లాగోస్) ధరించి క్రీడాకారులు దర్శనమిచ్చినందుకు ఆ సిగరెట్ సంస్థ 'ఇండియన్ టొబాకో కంపెనీ' ఒక్క జట్టుకు 6 లక్షల 10 వేల రూపాయిలు చెల్లిస్తుంది. క్రీడాకారుల ఆదాయ రాబడులు ఇలా వుండగా, క్రీడాభిమానుల క్రేజీ (వెర్రి) మార్కెట్టులో ఎలా లాభాలకు పోతునవుతుందో బ్లాక్‌మార్కెట్ల వ్యాపారంతో బోధపడుతుంది. 400 రు.లు విలువ చేసే టిక్కెట్టును స్టేడియం వద్ద బ్లాక్‌మార్కెట్టులో 5 వేల రూ.లకు కొంటున్నారంటే దీని ప్రభావం అర్థంచేసుకోవచ్చు.

క్రికెట్ ఆట అడుగడుగునా వ్యాపారీకరించబడింది. మైదానాల నుండి హోటల్ గదుల వరకు ప్రేక్షకుల్ని నెత్తిన్నే చేతులు పెట్టడమే క్రికెట్ వ్యాపారంలోని లాభాల రహస్యం. 1975లో ప్రారంభమైన 'విశ్వకప్' పోటీలను వరుసగా మూడు పర్యాయాలు "ప్రుడెన్షియల్ అష్యూరెన్స్ కంపెనీ" పేరుతో నిర్వహించగా, 1987లో 'రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్' పేరు మీదుగా నడిచాయి. అందుకే 'రిలయన్స్ విశ్వకప్' అన్నారు. 1992లో జరిగిన 5వ విశ్వకప్ పోటీలు "బెన్సన్ అండ్ హెడ్జెస్" పేరు మీదుగా ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ లు సంయుక్తంగా నిర్వహిస్తే, ఈ సారి ఐ.టి.సి. (ఇండియన్ టొబాకో కంపెనీ) తన ఖరీదైన 'విల్స్' సిగరెట్ పేరుమీదుగా నిర్వహించింది. ఇలా నిర్వహించడాన్నే స్పాన్సర్ చేయడం అంటారు. ఈ హక్కులు పొందడానికి పోటీలో డబ్బులు చెల్లించాలి. 1987లో రిలయన్స్ సంస్థ స్టేడియంలోని ప్రచార హక్కులతో సహా 5 కోట్ల రూపాయిలకే పొందగా, దశాబ్దకాలంలో పెరిగిన గ్లోబలైజేషన్ పోటీ తీవ్రతరంలో భాగంగా నేడు 37 కోట్ల రూ.లకు స్పాన్సర్ చేశారు. కాగా ఈసారి మైదానంలో ప్రచార హక్కు కూడా ఈ సంస్థకు దక్కలేదు. విడిగా టెండర్లు పిలవడంతో 'కోక్' పేరుతో ప్రఖ్యాత కోకా-కోలా సంస్థ తన సాఫ్ట్ డ్రింక్ అమ్మకాలకై 30 లక్షల డాలర్లు (1 డాలరు 35 రు.కు సమానం) చెల్లించింది. తమ సంస్థయొక్క సరకుల అమ్మకానికి విపరీతమైన ప్రచారం కల్పించడానికే 'స్పాన్సర్' చేయడంలో బహుళ జాతి సంస్థలు పోటీపడుతున్నాయి. క్రికెట్ ఆట ప్రసారాలను అమెరికాకు చెందిన 'వరల్డ్‌టెల్' సంస్థ 63 కోట్ల రూపాయిలు చెల్లించి గెల్చుకోగా, పోటీలోకి దిగిన దూరదర్శన్ 'ప్రజాస్వామ్యం' పేరుతో కోర్టు కెక్కినా ఫలితం దక్కలేదు. స్టేడియం లోపలి హక్కులకు గుజరాత్‌కు చెందిన గోకుల్ ఫైనాన్స్ 15 కోట్ల రూ.లు చెల్లించింది. ఫలితంగా ఈ సంస్థ తనకు 55 లక్షల రు.లు చెల్లించిన వారికే తమవ్యాపార బోర్డులను పెట్టుకునే అనుమతినీ ఇస్తుంది. జిందాల్ ఫిల్మ్‌కు చెందిన 'ఫ్యూజీ' సంస్థకు చిత్రనిర్మాణ హక్కులు దొరకగా, వీసా ఇంటర్నేషనల్‌కు విశ్వకప్ అధికారిక కార్డులు ఇచ్చే హక్కులు చేజిక్కాయి. భారతదేశంలో ఇండియన్ ఎయిర్‌లైన్స్, పాకిస్థాన్‌లో పాకిస్థాన్ ఎయిర్‌లైన్స్ వారికి తమ దేశపు హక్కులు దొరికాయి. ఇలా ఎక్కడికక్కడే ప్రతిచే ప్రపంచ మార్కెట్లలో తమ లాభాలను అధికంచేసుకోవడానికి, దేశవిదేశాల్లో తమ సరకులకు విస్తృత ప్రాచుర్యం లభించడాని డాలర్లతో పోటీ పడ్డారు. సాధారణ సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్న సామ్రాజ్యవాదం తమ పెట్టుబడులను ఉత్పాదక రంగాలకు తరలించకుండా, పడిపోతున్న లాభాల రేటును నిలబెట్టుకోవాలన్న వ్యాపార పోటీలో భాగంగా "అనుత్పాదక" రంగాలను (సర్వీసు-టూరిజం) ఎంచుకుంటున్నారనడానికి క్రీడల వ్యాపారీకరణ ఒక చక్కని ఉదాహరణ.

## ఐ.టి.సి. దోపిడీ - పాలకవర్గాల దాసోహం:

200 సంవత్సరాలు భారతదేశాన్ని ప్రత్యక్షంగా దోచుకున్న బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి చెందిన ఇంపీరియల్ టొబాకో కంపెనీ, 1947 తర్వాత 'ఇండియన్ టొబాకో కంపెనీ'గా పేరు మార్చుకొన్నది. 1921లో విదేశీవస్తు బహిష్కరణ పిలుపుతో జాతీయోద్యమ కాలంలో మూలపడిన ఈ సంస్థ స్వాతంత్ర్యానంతరం భారత పాలకవర్గాల పొత్తుతో ఇండియనైజ్(భారత్ పేరును సంతరించుకున్నదై) అయి తిరిగి రంగంమీదికి వచ్చింది. నేడు దేశంలో అత్యధిక లాభాలు గడిస్తున్న 500 కంపెనీలలో ఐ.టి.సి. అగ్రస్థానాన నిలిచింది. నిముషానికి 7 వేల సిగరెట్లు తయారుచేసే ఆధునిక యంత్రాలను కలిగిన ఇలాంటి బహుళ జాతి (మల్టీ నేషనల్) సిగరెట్టు కంపెనీల మూలంగా బీడీ పరిశ్రమ తీవ్రంగా దెబ్బతింటుంది. తమ లాభాలను ఇబ్బడి ముబ్బడిగా పెంచుకుంటున్న సిగరెట్టు సంస్థలు మినీ సిగరెట్లను (59 మి.మీ. పొడవు) కూడా తయారుచేస్తూ, వాటికి ఆయా దేశాల పాలకవర్గాల నుండి పన్నులరాయితీలు పొంది, చౌకగా మార్కెట్లో గుప్పిస్తుండటంతో ఆ పోటీలో బీడి పరిశ్రమ నిలదొక్కుకోలేకపోతోంది. ఫలితంగా మన దేశంలో 60 లక్షల బీడి కార్మికులు జీవనోపాధి కోల్పోతున్నారు. (కునికాకు కూలీలు ఇందులో చేర్చబడలేదు) 'పొగతాగడం నిషేధం' అంటూ తెగప్రచారంచేయిస్తున్నపాలకవర్గాలు బహుళజాతి పొగ సంస్థల మోచేతినీళ్ళు తాగుతూ వారి అంతులేని లాభాలకోసం రాయితీలు కల్పించడం, క్రీడలను స్పాన్సర్ చేయడానికి అనుమతించడం గర్హనీయం. 'ఆరోగ్యానికి హానికరం' నినాదాలతోనే సిగరెట్టులను అనుమతించడం అంటే ప్రజల జీవితాలతోచెలగాటమాడడమే అవుతుంది. ఇలా ప్రజల్ని వంచిస్తూ, వాటి విస్తృత(విష)ప్రచారానికి వీలుకల్పించడం పాలకవర్గాల దాసోహానికి నిదర్శనం.

## క్రీడల్లో కమ్యూనిలిజం:

పాకిస్తాన్-భారత్ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ సందర్భంగా "క్రికెట్ హింస కాదు – శాంతి", 'ప్రపంచకప్ పరమార్థం సెక్యులరిజం' 'పాకిస్తాన్ క్రీడాకారులకు సుస్వాగతం' వంటి నినాదాలతో గల బ్యానర్లు, అట్టముక్కలు చిన్నస్వామి స్టేడియం (బెంగుళూరు)ను కప్పేశాయి. అంటే హిందూ మతోన్మాద భయాలు ఎంత బలంగా ఉన్నాయో చూడండి. నిజానికి పాకిస్తాన్ క్రీడాకారులు భారతదేశంలో ఆడడమే తీవ్ర ప్రమాదాలతో కూడినదిగా పరిణమిస్తోంది. అందులో బొంబాయిలో ఆడాలంటే మాత్రం మరీ హడలిపోతారు. శివ సైనికులు శాసిస్తున్న బొంబాయిలో (ప్రస్తుతం ముంబాయి గా పేరు మార్చారు) బాల్ థాకరే హుకుంలతో ఎన్నెన్నో సార్లు అనేక క్రీడలు రద్దయినాయి. కేవలం క్రీడాకారులు పాకిస్తానీయులు (ముస్లింలు) కావడమే కారణం. మరోవైపు ప్రస్తుతం శివసేన నేత, మహారాష్ట్ర ముఖ్యమంత్రి మనోహర్ జోషి బొంబాయి క్రికెట్ సంఘానికి అధ్యక్షుడే గాకుండా, భారత క్రికెట్ కంట్రోల్ బోర్డుకు ఉపాధ్యక్షుడు కూడా. 1987లో ముంబాయి వాంకడే స్టేడియం తవ్వి శివసైనికులు ఆట రద్దు చేయించారు.

6వ విశ్వ కప్ పోటీల సందర్భంగా హిందూ మతోన్మాద శక్తులు తమ శక్తివంచన లేకుండా పాకిస్తాన్‌పై విషం కక్కడంలో మునిగిపోయాయి. ఒకవైపు ఆట జరుగుతుండగ, మరోవైపు వేలాదిమంది ప్రేక్షకుల మధ్య సంఘ్ పరివార్ శక్తులు నిలిచి "పాకిస్తాన్ హాయ్, హాయ్", "భారత్ మాతాకీ జై", "గోమాతాకీ జై" అని నినదిస్తుంటారు. ఈ నినాదాలివ్వడానికి మైదానంలో ఆడుతున్నవారు పాకిస్తానీయులే కానవసరం లేదు. వీరి లక్ష్యమంతా క్రికెట్ కామెంట్రీతో పాటు ప్రపంచ శ్రోతలకు తమ నినాదాల 'సందేశాలు' అందడమే. ఇంతేగాకుండా, పాకిస్తానీ క్రీడాకారుల మనోబలాన్ని దెబ్బతీసి వారిని ఓటమికి గురిచేయడం కూడా. ఇదంతా వీరి కుట్రలో భాగమే. 9 మార్చి 1996 నాడు పాకిస్తాన్-భారత్‌ల మధ్య బెంగుళూర్‌లో జరిగిన మ్యాచ్ సందర్భంగా "టికెట్లన్నీ ముస్లిములే కొనివేశారనీ, స్టేడియంలో పాకిస్తానీ జండా ఎగురవేస్తార"నీ తీవ్ర ప్రచారం చేస్తూ, ఇరుదేశాల మధ్య జరిగే ఒక యుద్ధంలా వాతావరణాన్ని సృష్టించి, ఆట రద్దుచేయాలని నానారభస చేశారు.

ఇది ఇలా వుండగా పాకిస్తాన్ ముస్లిం ఛాందసవాదులు విశ్వకప్ పోటీల్లో పాకిస్తాన్ ఓటమికి 'ఆడదాని పరిపాలనే' కారణమంటూ లంకించుకున్నారు. అక్కడి 'క్రీడాభిమానులు' ఓటమిని జీర్ణించుకోలేక 'కౌమే మాతం' పాటించడంతో లాహోర్‌లో దిగాల్సిన ఆటగాళ్ల విమానం కరాచీలో దిగిపోయింది. కెప్టెన్ అక్రం దిష్టి బొమ్మలు తగులబెడుతూ 'ప్రాణగండం' తప్పదంటూ ఫోన్ కాల్స్ చేశారు. కలకత్తా సెమీఫైనల్స్‌లో శ్రీలంక చేతిలో ఓటమిపాలైన భారతజట్టు గతి ఇంతే అయింది. ఇక్కడి క్రీడాభిమానులు స్థానబలంతో మరింత ముందుకుపోయి లంక జట్టును ఆడకుండావే చేశారు. ఫలితంగా కలకత్తా ప్రజల వేలాది సంతకాలతో అర్జున రణతుంగే (లంక కెప్టెన్)కు క్షమార్పణ పత్రం అందజేయాల్సి వచ్చిందంటే ఎలాంటి పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయో చూడండి. పాకిస్తాన్ జట్టును ఓడించిన భారత జట్టును అభినందనలతో ముంచెత్తిన వారే, శ్రీలంక చేతిలో ఓడిపోయిన వార్త విన్న వెంటనే భారత ప్రధానమంత్రితో సహా అందరూ జట్టు మనోబలాన్ని దెబ్బతీసే చర్యలు చేపట్టారు. తమ దేశాల ఓటమిని ఓర్చుకోలేని ఒక పాకిస్తానీ యువకుడు కాల్చుకొని చనిపోగా, ఇద్దరు బెంగాలీలు గుండె ఆగి చనిపోయారు. తమ దేశ జట్ల ఓటమికి కారణాలను విచారించడానికి ఇంగ్లాండ్, వెస్టిండీస్, ఇండియా మరియు పాకిస్తాన్ క్రికెట్ బోర్డులు ఆదేశించాయి. హవాలా యుగంలో డబ్బు కక్కుర్తికి ఓటమి నాశ్రయించి ఉంటారని పత్రికలు వ్యాఖ్యానించడం కూడా సహజంగానే జరిగిపోయింది. కాని, పోటీలో తమ దేశం గెలువాలని ప్రతివారు కోరుకోవడంలో తప్పులేకపోయినా, ఒకే ఆటలో పాల్గొన్న జట్లన్నీ అంతిమ విజయం సాధించలేవనే స్పృహ కోల్పోవడమే మూర్ఖత్వం. ఇలాంటి వారిలో "ఓటమి విజయానికి తల్లి లాంటి"దనే చైతన్యం ఇంకెక్కడుంటుంది? క్రీడలను కావాలనే పక్కదారి పట్టిస్తూ పబ్బం గడుపుకునేవారికి జరిగే పరిణామాలతో నిమిత్తం ఉండదు.

### క్రీడల్లో 'రాచరికం'

ఢిల్లీలోని తమ రాయభార కార్యాలయంలో పాటలు పాడవలసిన అబీదా పర్వీన్‌కు భారత ప్రభుత్వం అక్రమంగా వీసా నిరాకరించడం వల్ల, మరో కుంటిసాకుతో 18 సంవత్సరాల లోపు క్రీడాకారుల ఇండియన్ హాకీ బృందాన్ని పాకిస్తాన్ తమ దేశంలో ఆడడానికి అనుమతించలేదు.

క్రీడలన్నింటిలో రాజకీయాలు విచ్చలవిడిగా రాజ్యమేలుతున్నాయి. ఇక్కడొక అంశాన్ని గమనిస్తే అదెంత వాస్తవమో తెలుస్తుంది. 1894లో ఒలంపిక్ క్రీడలు ప్రారంభమైనాయి. ఆ సందర్భంగా రాసుకున్న చార్టర్‌లో దుష్ట రాజకీయాలనుండి దూరంగా ఉంచాలన్నది ఒక అంశం. కానీ వంద సంవత్సరాల చరిత్రను పరిశీలిస్తే క్రీడల్లో రాజకీయ ఆధిపత్యమే కనపడుతుంది. భారత హాకీ బోర్డు అధ్యక్షులుగా పోలీసు ఉన్నతాధికారి కె.పి.ఎస్. గిల్ ఉండడం, భారత క్రికెట్ బోర్డు అధ్యక్షుడుగా గ్వాలియర్ రాజు మాధవరావు సింధియా, ఉపాధ్యక్షుడిగా శివసైనిక నేత జోషి ఉండడం యాదృచ్ఛికం కాదు. ఇలాంటి పరిస్థితుల్లో ఆటగాళ్ళుగా ఎన్నికకావడమైనా, తొలగించబడడమైనా వీరి చేతుల్లోనే ఉంటుంది. ఫలితంగా ఆరోగ్యవాతావరణం లేకుండా పోతుంది. విశ్వకప్ రాజకీయ పోటీల ఫలితంగా మషూర్ ఆటగాళ్ళెందరో రాజీనామా లిచ్చారు. భారత ఆటగాడు మనోజ్ ప్రభాకర్, పాకిస్థాన్ ఆటగాడు జావిద్ మియందాద్, వెస్టిండీస్ కెప్టెన్ రిచర్డ్సన్ లు ఈ సందర్భంగా ముఖ్యులు.

రాజకీయాల్లో నేరప్రవృత్తి పెరుగుతున్నట్లుగానే వ్యక్తి ప్రతిష్ఠ కోసం క్రీడల్లో కూడా నేర ప్రవృత్తి పెరుగుతోంది. తామే గెలువాలన్న తలంపుతో స్టామినా (సామర్థ్యం) పేరుతో మత్తుపదార్థాలకు బానిసలుకావడం మొదలు దుష్ట ప్రయత్నాలతో ప్రత్యర్థి జట్టును దెబ్బతీసే వరకు జరుగుతోంది. టెన్నిస్ క్రీడాకారిణి మోనికాసెలెస్ ను ఆట మైదానంలోనే కత్తితో పొడిస్తే, సెక్సువల్ (లైంగిక) గొడవల్లో ప్రఖ్యాత అథ్లెట్స్ మైక్‌టైసన్, మైఖేల్ జాక్సన్‌లు కటకటాలు కటాయించారు. 1994 సంవత్సరం సాకర్ కప్ పోటీ (ప్రపంచ ఫుట్‌బాల్) సందర్భంగా అర్జెంటీనా ఆటగాడైన మారడోనా మాదక ద్రవ్యాల కేసులో అరెస్టుగావడం ఇందులో భాగమే.

## క్రీడలు - ఫలితాలు:

మన దేశ క్రీడల కన్నా దిగుమతైన క్రీడల మూలంగానే అనేక అనర్థాలు చోటుచేసుకుంటున్నాయి. ముఖ్యంగా గత కొద్దికాలంగా (రెండు దశాబ్దాలుగా) క్రికెట్ ఆట పట్టణ విద్యార్థి యువకుల మీద, మధ్యతరగతి ఉద్యోగస్థుల మీద తీవ్ర దుష్ప్రభావాన్ని కలిగిస్తుంది. దీనికి తోడు ఎలక్ట్రానిక్ మీడియా (అడ్ మీడియా - అడ్వర్‌టయిజ్‌మెంట్ మీడియా) అంటే టీ.వీ.లాంటివి చిన్న పిల్లల చదువు, భవిష్యత్‌ను కూడా ప్రభావితం చేస్తుంది. అక్టోబర్ నుండి ఏప్రిల్ వరకు జోరుగా సాగే క్రికెట్ సీజన్‌లో నగర వాతావరణం అంతా ఇదే గబ్బుకొడుతుంది. ట్రాన్సిస్టర్ రేడియోలను చెవులకు కట్టేసే రోజులు వెనక్కిపోతుంటే, కేబుల్ టీ.వీ.ప్రసారాలు పిచ్చెక్కిస్తున్నాయి. ఆఫీసులకు సెలవు చీటీలు పంపిస్తూ, క్లాసు రూం లకు పంగనామాలు పెడుతూ ఆట చూడడానికి టిక్కెట్టు కొనడమే గాకుండా గెలుపు-ఓటములపై పందెం కాస్తూ జేబులు ఖాళీ చేసుకుంటున్నారు.

వ్యక్తుల మధ్య, దేశాల మధ్య, ప్రజల మధ్య సుహృద్భావ వాతావరణానికి సంబంధాలకు కేంద్రం కావాల్సిన క్రీడలు తద్భిన్నంగా తయారవుతున్నాయి. సామ్రాజ్యవాద దేశాలు తమ మాట చెల్లని దగ్గర వ్యాపార నిషేధాలు ఎలా విధిస్తుంటాయో, క్రీడా నిషేధాలను కూడా అమలుచేస్తున్నాయి. ముఖ్యంగా ప్రపంచవ్యాప్తంగా చెలరేగుతున్న జాతుల పోరాటాలను అప్రతిష్ఠపాలుచేయడానికి కూడా క్రీడల బహిష్కరణ ఒక సాకుగా ముందుకొస్తున్నది. శ్రీలంకలో ఆడడానికి నిరాకరిస్తూ ఎల్.టి.టి.ఇ.ని కారణంగా ఆస్ట్రేలియా, వెస్టిండీస్ జట్లు చూపడం అందుకు తాజా ఉదాహరణ గతంలో పంజాబ్, ప్రస్తుతం కాశ్మీర్‌లో సైతం అక్కడి ఉద్యమాలపై బురద చల్లడానికి కమ్యూనల్ ఫాసిస్టు శక్తులు క్రీడలను వినియోగించుకుంటున్నాయి.

## ముగింపు:

రోజు రోజుకు పీడిత ప్రజల బతుకులు మరీ దారుణంగా తయారవుతున్నాయి. పూటగడవని కుటుంబాల్లోని పిల్లలు బడికి పోలేని పరిస్థితులే దాపురిస్తున్నాయి. వెళ్ళిన వారికైనా ఆట పాటలతో సమయం ఉల్లాసంగా గడిపే వయస్సైనా అవకాశాలు మాత్రం నిరుపేదల జీవితాల్లో కానరావు. పట్టణ యువకులు, గ్రామీణ యువకులు పొట్ట కూటి కోసమే అహర్నిశలు శ్రమించాల్సి వస్తుంది. ఇక క్రీడల మాటెక్కడ? వారి జీవితాల్లో ఉల్లాసం హుళక్కే. కాగా మధ్యతరగతి కుటుంబాల యువకులు, విద్యార్థులు, వెసులుబాటుగానున్న కుటుంబాల వారు శ్రీఘ్రంగా తప్పు తోవ పట్టడానికి వీలునిచ్చే అనేక సామాజిక రుగ్మతల మధ్య పెరుగుతున్నారు. దేశంలో ఎదిగే పిల్లలందరికి శరీర

(కొరవ 39వ పేజీలో)

## జాతుల పోరాటాల సమైక్యతే ఖగోళీకరణకు కరకు జబాబు

(ఫిబ్రవరి 16 నుండి 19 వరకు ఢిల్లీలో జరిగిన అంతర్జాతీయ సెమినార్ "జాతుల సమస్య"పై అక్కడి పత్రికలు వ్రాసిన రిపోర్టుల ఆధారంగా 'ప్రభాత్' పాఠకులకు దీన్ని అందిస్తున్నాం. )

ఢిల్లీలో 'జాతుల సమస్య'పై జరిగిన నాలుగు రోజులసెమినార్ జయప్రదంగా ముగిసింది. ఢిల్లీలోని షా ఆడిటోరియం సెమినార్ జరిగిన నాలుగు రోజులు జాతుల పోరాటాల స్వదేశీ విదేశీ ప్రతినిధులతో, నైజీరియా మానవ హక్కుల నేత కామ్రేడ్ కెన్‌సారో వీవా స్మృతిలో 'ఐక్యతకు చిహ్నం'గా నిలిచింది. విముక్తి పోరాటంలో వివిధ జాతుల మధ్య సమైక్యతావసర అవగాహనతో అంతర్జాతీయ స్థాయిలో జరిగిన మొట్టమొదటి సమావేశాన్ని జయప్రదం చేయ డానికి ప్రముఖ మేధావులు, ప్రజాస్వామిక వాదులతో ఆహ్వాన సంఘం ఏర్పడింది. ఇందులో సేవానివృత్త న్యాయమూర్తి కృష్ణ అయ్యర్, న్యాయవాది తార్కుండే, అస్సాం పౌరహక్కుల నాయకుడు అజిత్ సింగ్ ముయాన్ ప్రముఖులు కాగా ప్రొఫెసర్ మనోరంజన్ మహంతి అధ్యక్షతన ఏర్పడిన దీనిలో అనేకమంది మానవహక్కుల కార్యకర్తలు కూడ ఉన్నారు.

హిందూ ఫాసీవాదం( ), గాట్ నర్మదా బచావ్ ఆందోళన్, కేంద్ర నూతన ఆర్థిక విధానాలు మొదలైన అనేక సమస్యలపై గతంలో సెమినార్లునిర్వహించిన అఖిల భారత ప్రజాప్రతిఘటనా వేదిక (ఎ.ఐ.పి.ఆర్.ఎఫ్.) పురోగమనంలో, భూస్వామ్య వ్యతిరేక సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాల సమైక్యతా లక్ష్యంతో ఏర్పడిన సంస్థ ప్రయాణంలో ఇదొక ముందడుగు. మైలురాయి కూడా.

సెమినార్ నిర్వహణను విఘ్నం గావించడానికి ఢిల్లీలోని బిజెపి, కేంద్రంలోని పివి ప్రభుత్వాలు, 'సంఘ పరివార్' మతతత్వ శక్తులు అన్నీ ఎన్నో ఆటంకాలు కల్పించినప్పటికీ ఢిల్లీలో "ఏక్‌హీ రాస్తా ఏక్‌హీ రాస్తా — నక్సల్‌బరీ ఏక్‌హీ రాస్తా" (ఒకటే మార్గం ఒకటే మార్గం — నక్సల్‌బరీ మార్గం ఒక్కటే), "కాశ్మీర్ ప్రజలారా పోరాడండి — మీ అండ మేమున్నాం", "కాశ్మీర్ నుండి భారత సేనలు వైదొలగాలి", "ఆజాద్ అస్సాం పోరాటం వర్ధిల్లాలి" ... అంటూ భారత్ ఉపఖండంలోని జాతుల సమైక్యతకు చిహ్నంగా నినాదాలు మార్మోగాయి.

అమెరికా (రివల్యూషనరీ కమ్యూనిస్టు పార్టీ), ఫిలిప్పైన్స్ (నేషనల్ డెమోక్రాటిక్ ఫ్రంట్), బెల్జియం (వర్కర్స్ పార్టీ), నేపాల్ (అఖిల నేపాల్ మహిళా సంఘ్), పాకిస్థాన్ (ట్రేడ్ యూనియన్), చైనా, శ్రీలంక, భూటాన్, కుర్దిస్తాన్, నైజీరియా, అస్సాం, మణిపూర్, మిజోరాం, నాగాలాండ్, కాశ్మీర్ (జెకెఎల్ఎఫ్, జమైతె ఇస్లామి, అఖిల పక్ష హుర్రియత్ కాన్ఫరెన్స్), పంజాబ్, జార్ఖండ్, ఉత్తరాఖండ్, బోడోలాండ్, డార్జిలింగ్ హిల్స్, ఛత్తీస్ ఘడ్, మరియు ఆంధ్ర-బీహార్-హర్యానా-దండకారణ్యం-మహారాష్ట్ర-మధ్యప్రదేశ్-కర్నాటక-పశ్చిమ బెంగాల్ ల నుండి 700 మంది ప్రతినిధులు హాజరుకాగా కెన్‌సారో వీవా హోల్ ఉద్యమాల ఊపిరులతో పోరు సందేశం వినిపించింది. హర్యానాకు చెందిన 'దిశ' సంస్థ వారు పాడిన పాటతో ప్రపంచవ్యాపిత జాతుల పోరాటాల ఐక్యతా కేంద్రంగా సెమినార్ ప్రారంభమైంది.

1. షబ్బీర్ షా (జమాతె ఇస్లామి, కాశ్మీర్) అనారోగ్య మూలంగా రాలేకపోయారు.
2. యాసీన్ మల్లిక్ (జెకెఎల్ఎఫ్) అనివార్య కారణాల వల్ల రాలేకపోయారు.
3. పెరూ కమ్యూనిస్టు పార్టీ ప్రతినిధి రాలేకపోయారు.
4. రాజిక్ (బెలూచిస్తాన్ "పీపుల్స్ నేషనల్ పార్టీ" అధ్యక్షుడు, బెలూచ్ విద్యార్థి సంఘం మాజీ అధ్యక్షుడు) భారత ప్రభుత్వం వీసా నిరాకరించడంతో రాలేకపోయారు.

ఫిబ్రవరి 16 మొదటి రోజు ప్రొఫెసర్ మనోరంజన్ మహంతి మాట్లాడుతూ, "మార్కెట్ ఆర్థికత (ఎకానమీ) లో భాగంగా జాతుల అణచివేత కొనసాగుతోందన్నారు. ఖగోళీకరణ (గ్లోబలైజేషన్) లో భాగంగానే జాతుల పోరాటాలను అర్థంచేసుకోవాలనీ, ప్రపంచవ్యాప్తంగా చెలరేగుతున్న జాతుల పోరాటాల మధ్య సమైక్యత ఏర్పడడమే ఖగోళీకరణను

దెబ్బతీస్తుందని స్వదేశీ విదేశీ ప్రతినిధులకు ఆహ్వానం పలికిన తర్వాత ఉపన్యసించారు.

చైనాపై విస్తృత అధ్యయనం కొనసాగించిన అమెరికా రచయిత విలియం హింటన్ (77 సం. లు) సెమినార్ ప్రారంభించారు. చైనాలో "ఫాన్‌షెంగ్" పేరుతో సుపరిచితమైన విలియం హింటన్ ఫాన్‌షెన్, షెన్‌ఫాన్, గ్రేట్ రివర్స్ మొదలైన నవలల్లో చైనా పరిణామాలను ప్రపంచానికి అందించిన జ్ఞానంతో అనుభవంతో మాట్లాడారు. "ప్రపంచ వ్యాపితంగా చెలరేగుతున్న జాతుల విముక్తి పోరాటాలన్నీ చైనా విప్లవానుభవం నుండి నేర్చుకోవల్సింది ఎంతో ఉంద"న్నారు. కా. మావో నాయకత్వంలోని చైనా కమ్యూనిస్టు పార్టీ జపాన్ సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాన్నీ, వ్యవసాయ విప్లవాన్నీ సమన్వయించిందన్నారు. జాతుల పోరాటాలు సమాజంలోని ప్రధాన వైరుధ్యాన్ని గుర్తించాలన్నారు. చైనా విప్లవంలో ప్రధాన వైరుధ్యం, ఐక్యసంఘటన, భూపంపక కార్యక్రమాలు ప్రధాన భూమిక వహించాయన్నారు. రాజకీయాల్లో ఆధిపత్యం కలిగిన మావో మరణానంతరం చైనా అన్ని రంగాలలో బూర్జువాల పట్టు బలపడిందన్నారు. అమెరికాకు బద్ధవ్యతిరేక దేశమైన చైనాలో తాను కేవలం నాయకులను మాత్రమే కలుసుకొని ఇంటర్వ్యూ చేయలేదనీ, క్రిందివరకు వెళ్ళి భూ సంస్కరణలను తెలుసుకున్నానన్నారు. యూనిసెఫ్ (యు ఎన్ ఐ సి ఇ ఎఫ్ - ఇది ఐక్యరాజ్య సమితికి చెందిన సాంస్కృతిక ఆర్థిక సంస్థ) తరఫున ఉలాన్ బటార్ (మంగోలియా)లో పనిచేస్తున్న హింటన్ సెమినార్ పై స్పందిస్తూ 'ఐక్యత'ను మనసారా వాంఛించారు.

ఆ తర్వాత మాట్లాడిన ప్రజాప్రతిఘటనా వేదిక అధ్యక్షుడు గోరు మాధవరావు, సంస్థ కృషిని సభకు వివరించారు. తమ సంస్థ 1992లో కలకత్తాలో ఏర్పడిందనీ, ఆనాటి నుండి పోరాట మార్గంలోనే కొనసాగుతోందన్నారు. తమ సంస్థ ప్రజాతంత్ర ఉద్యమంకోసం అంకితమైందన్నారు. 'దేశంలోని ప్రతి రంగంలో సంక్షోభం తాండవిస్తున్న'దంటూ, 'ప్రజాపోరాటాలను వర్గపోరాటంతో సమన్వయించడానికి కృషి తీవ్రతరం కావాల్సి ఉంద'న్నారు. ఈ సమస్యలన్నింటిని చర్చించడానికి విశాల ప్రాతిపదిక గల ఒక వేదిక ఉండాలన్నారు.

పిదప సంస్థ ప్రధాన కార్యదర్శి విజయకుమార్ ఆర్య మాట్లాడారు. 'దేశాలు స్వాతంత్ర్యాన్ని, జాతులు విముక్తిని కోరుతున్నాయి. ప్రజలు విప్లవాన్ని కోరుతున్నారు' అంటూ, 'ప్రపంచంలో ఎక్కడెక్కడో పోరాడుతున్న వారందరిని ఈ వేదిక ఐక్యం చేస్తుం'దన్నారు. స్వయం నిర్ణయాధికారంతోనే జాతుల అసలు సమస్య ముడిపడి ఉందన్నారు. ప్రపంచంలో నిజానికి పీడక పీడిత జాతులే కలవంటూ, మా వేదిక ప్రపంచంలోని పీడిత జాతుల పోరాటాలకు అండగా నిలుస్తుందన్నారు.

సంస్థ కార్యనిర్వాహక సభ్యుడు సంస్థ తరఫున "గ్లోబలైజేషన్, స్ట్రక్చరల్ అడ్జస్ట్‌మెంట్ మరియు జాతుల పునరుజ్జీవనం" పై పేపరు సమర్పించారు. ఆ సందర్భంగా, సైనికదాడులు, రాజకీయ జోక్యం మరియు ఆర్థికంగా చేయి మెలిపెట్టే ఎత్తుగడలతో సామ్రాజ్యవాదులు 1990ల నుండి "నూతన ప్రపంచ వ్యవస్థ" (న్యూ వరల్డ్ ఆర్డర్) మాటున దోచుకోవడం విపరీతంగా పెరిగిపోయిందన్నారు. ఫలితంగా ప్రపంచ పరిస్థితి ఎలా ఉందో తడిమారు. మెక్సికో-చియపాస్, నైజీరియా-ఓగోని ప్రజల పోరాటం, ఐరే, ఇథియోపియా, సూడాన్ మరియు ఉపఖండంలోని జాతుల పోరాటాలను వివరిస్తూ, మూడవ ప్రపంచంపైన గ్లోబలైజేషన్ యొక్క మృత్యువాతను పేర్కొన్నారు. విదేశీ పెట్టుబడుల్లోని బోగస్ ఎంత ఉందంటే ప్రతీ 70 డాలర్లలో కేవలం ఒక డాలరు మాత్రమే నేరుగా ఉత్పత్తి రంగంలో వినియోగిస్తుంటే, మిగతా మొత్తం స్పెక్యులేషన్ రంగం (సట్టాబాజి)లోకి తరలిస్తున్నారన్నారు.

> విదేశీ పెట్టుబడులలో ప్రతీ 70 డాలర్లలోని కేవలం ఒక్క డాలరు మాత్రమే ప్రత్యక్ష పెట్టుబడులపై ఖర్చవుతుంటే, మిగతా 69 డాలర్లు సట్టా బాజీ (స్పెక్యులేషన్ వ్యాపారం)లోనే చేతులు మారుతున్నాయి.

ఫిబ్రవరి 17, సెమినార్ రెండవరోజున కెన్యా రచయిత, నైరోబి యూనివర్సిటీలో మాజీ ఆంగ్ల ప్రొఫెసర్, ప్రస్తుతం అమెరికాలో ప్రవాస జీవితం గడుపుతూ న్యూయార్క్ యూనివర్సిటీలో సాహిత్యం బోధిస్తున్న గూగివా -

ధీయాంగో ప్రసంగించారు. భారత ప్రభుత్వం కల్పించిన అనేక ఆటంకాలను అధిగమించి గూగి అలస్యంగానైనా 'కెన్సారో వీవా హాల్'లో అడుగుపెట్టారు. ఆయన మాట్లాడుతూ, వలసవాదాన్ని సామ్రాజ్యవాదాన్ని తీవ్రంగా విమర్శించారు. అత్యంత శక్తివంతమైన యూరప్, అమెరికా, జపాన్ లు జి-7 (గ్రూప్-7 లేదా 7 దేశాల సముదాయం) సమావేశాల ద్వారా సమకాలీన ప్రపంచంపై తమ విధానాలను రుద్దుతున్నాయన్నారు. ఆఫ్రికా ఖండంలో వలసవాదం రాకముందు జాతుల సమైక్యత ఉండింది కానీ, వలసవాదుల "విభజించి పాలించు" విధానం మూలంగా 4, 5 యూరప్ శక్తుల మధ్య ఆఫ్రికా అణచివేయబడిందన్నారు. ఆఫ్రికా జాతులకు నామమాత్ర స్వాతంత్ర్యం వచ్చినా, వలస వాద శక్తులకు లొంగడం తప్పడం లేదన్నారు. వర్గపోరాటం, జాతుల పోరాటం ద్వారానే నిజమైన విముక్తి లభిస్తుందన్నారు.

చివరి రోజు ముగింపు ఉపన్యాసంలో భాషా విషయాలపై మాట్లాడారు. రచయితలు ప్రజల భాషలోనే రాయాలని, కళాకారులు వలసాధిపత్య వ్యతిరేక ప్రజల భావాలకు 'అద్దంపట్టాల'న్నారు. తాను రాసిన ప్రసిద్ధమైన వలసవాద వ్యతిరేక నవలలు 'పేటల్స్ ఆఫ్ బ్లడ్' (నెత్తుటి పురేకులు), 'ఎ గ్రేన్ ఆఫ్ వీట్' (గోధుమ గింజలు) ప్రజల భాషలలో రాయడం ద్వారా సామ్రాజ్యవాదులకు కంటగింపుగా తయారయ్యాయని అనుభవపూర్వకంగా వివరించారు. తాను 'గికుయూ' (కెన్యా) భాషలో రాసిన ఆ నవలలు పోరాటప్రజల కందకుండా నిషేధించిన ప్రభుత్వం, అవే నవలలను ఆంగ్ల భాషలో మాత్రం అభ్యంతరం లేకుండా అనుమతించిందన్నారు.

తర్వాత చికాగో నుండి వచ్చిన అమెరికన్ విప్లవ కమ్యూనిస్టు పార్టీ ప్రతినిధి రేమండ్ లోట్టా మాట్లాడారు. ఆఫ్రికా మరియు స్వైరుతే ఆదివాసులను అలాగే అనేక జాతులను అణచివేసిన నెత్తుర్లతో రంగులద్దుకున్న చరిత్ర అమెరికా దన్నారు. ప్రముఖ మావోయిస్టు, ఆర్థికవేత్త అయిన రేమండ్ లోట్టా "అమెరికా సమాజంలో ఆఫ్రో-అమెరికన్ ల సమస్య" పై పేపరు సమర్పించారు.

> అనేక జాతులను అణచివేసిన నెత్తుర్లతో
> రంగు లద్దుకున్న చరిత్ర అమెరికాది
> \- రేమండ్ లోట్టా

పిదప "లిబరేషన్ టైగర్స్" ప్రతినిధి ఇలానంద్ మాట్లాడారు. తమిళ పులులు కొనసాగిస్తున్న పోరాటం న్యాయమైందన్నారు. వారు 'ఉగ్రవాదులు కాదు నిజమైన స్వాతంత్ర్య సిపాయిలు' అన్నారు. లంకలో మితిమీరిన అణచివేత సాగుతోందన్నారు. 'తమిళులను ఉద్యోగాల్లో తగ్గిస్తున్నారు. వారి ప్రజాస్వామ్య ఆకాంక్షలను ఉక్కుపాదాల కింద అణచివేస్తున్నారు. 1948 నుండి ఈ అణచివేత సాగుతోంది. శ్రీలంక తమిళులపై సింహళ సర్కార్ బౌద్ధ ధర్మాన్ని రుద్దుతోంది. శ్రీలంక ప్రభుత్వానికి అమెరికా సంపూర్ణ మద్దతుంది. పాకిస్తాన్ సమర్థన సరేసరి. కాగా భారత ప్రభుత్వం కూడా తమిళ పులల పై అణచివేత కోసం శ్రీలంక ప్రభుత్వానికి పూర్తి అండదండలందిస్తూ, మతిలేని విధానాలు ఎన్నుకుంటూ "దన్నారు.

అఖిల నేపాల్ మహిళా సంఘం ప్రతినిధి పాశీలా యామి మాట్లాడుతూ, భారత విస్తరణవాదాన్ని ఖండించారు. నేపాల్ ఆంతరంగిక విషయాల్లో భారతదేశం జోక్యం చేసుకుంటూ అక్కడి ఉద్యమాన్ని అణచడానికి అన్ని విధాలా తోడ్పడు తోందన్నారు. ఇండో-ఆర్యన్ జాతులను అణచడం మూలంగా నేపాల్‌లో జాతుల సమస్య ఉత్పన్నమవుతోందన్నారు. పిదప పాకిస్థాన్ (బెలూచిస్తాన్) నుండి వచ్చిన కరమతలి తమ పేపరును చదివి వినిపించారు. పాకిస్తాన్‌లో 15 శాతం బెలూచిస్తాన్ భూభాగం ఉందన్నారు. తర్వాత శివసుందరన్ మాట్లాడారు. "సమకాలీన ప్రపంచంలో జాతుల సమస్య ఒక మండుతున్న సమస్య, ఒక సంక్లిష్టమైన సమస్య కూడా" అన్నారు.

సెమినార్ మూడవ రోజున కాశ్మీర్ పీపుల్స్ కాన్ఫరెన్స్ నాయకుడు అబ్దుల్ ఘనీలోన్ మాట్లాడారు. ప్రభుత్వం కొనసాగిస్తున్న దుష్ప్రచార క్యాంపెయిన్‌ను ఖండించాలన్నారు. భారత ప్రజలతో కలిసి ఉమ్మడి వ్యూహం రూపొందించు కోవాలనే ఆశతో మీ మధ్యకు వచ్చానని 40 వేల త్యాగాల కాశ్మీర్ ప్రతినిధి అన్నారు. గత 8 సం.లుగా కాశ్మీర్‌లో

మృత్యువుతో పోరాటం జరుగుతోందన్నారు. 'ఆజాద్ కాశ్మీర్ సాధించుకోవడమా లేక చావడమా' అన్నదే నేటి తరం ప్రజల మౌలిక సమస్య అన్నాడు. తమ శాంతియుత సమస్య భారత బలగాల జోక్యంతో సాయుధ సమస్యగా పరిణమించక తప్పలేదన్నారు. 1948 నుండి కాశ్మీర్ చరిత్రను సంగ్రహంగా వివరించారు. కాశ్మీర్ ప్రజల హక్కులను గుర్తించాలన్న, ఐక్యరాజ్య సమితి లాంటి సంస్థలు మధ్యవర్తిత్వం నెరపాలన్నారు. భారత ప్రభుత్వం దశాబ్దాల వాగ్దానాలకు చెల్లు చీటి ఇచ్చి కాశ్మీరీల స్వయం నిర్ణయాధికారాన్ని మంట గలిపిందన్నారు. మా సమస్య ఇండో-పాక్ (భారత-పాకిస్థాన్) సమస్య కానేకాదు. కాశ్మీర్ సమస్య కాశ్మీరీలదే నన్నారు. అక్కడ 'ప్లెబిసైట్' (ప్రజాభిప్రాయ సేకరణ) నిర్వహించాలన్నారు.

తదనంతరం సెమినార్‌లో కాశ్మీర్‌లో మానవ హక్కుల హననం, ఈశాన్య భారతంలో అమలవుతున్న రాక్షస చట్టాలను వక్తలు ఖండించారు. అస్సాం, నాగాలాండ్ లలో కనిపిస్తే కాల్చివేత మరియు హవల్దార్ స్థాయి అధికారులు కూడా ఎవరినైనా 'మిలిటెంట్లు' పేరుతో కాల్చి చంపే ప్రత్యేక అధికారాలు కలిగిన విశేష హక్కులను కల్పిస్తున్న

> వీసా నిరాకరణతో నేను నా భార్య చాలా నిరాశ చెందాము. ప్రచ్ఛన్న యుద్ధం ముగిసిన తర్వాత ప్రపంచ పరిస్థితుల్లో సెమినార్ నిర్వహిస్తున్న "జాతుల సమస్య మరియు డీ కొలొనైజేషన్" అంశాలు చాలా ప్రాధాన్యత కలిగినవి. వీసా నిరాకరణకు నిజానికి ఏ కారణమూ లేదు. కుంటి సాకులు తప్ప. సెమినార్ వివరాలు తెలుసుకోడానికి అమెరికాలోని ఇండియన్ కాన్సులేట్ (భారత రాయబార కార్యాలయం) వారికి వారం రోజులెందుకో అంతు చిక్కడం లేదు! ఎవరికైనా వీసా కావాలంటే పగలు 1 గం.కు దరఖాస్తు చేస్తే, సాయంకాలం 4.30 గం.కు వీసా వస్తుంది.
>
> — నిర్వాహకులతో న్యూయార్క్ నుండి 'గూగీ' టెలిఫోన్ లైనుపై.

చట్టాలను నిరసించారు. ఇక్కడి ప్రజల్లో యీ చట్టాలు భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నాయన్నారు.

ఫిబ్రవరి 19, చివరిరోజు జాతుల పోరాటాలు సాగిస్తున్న అనేక సంస్థలను కలుపుకొని "సమన్వయ కమిటీ" నేర్పరిచారు. దిగువ పేర్కొన్న తీర్మానాలు చేశారు.

1. కాశ్మీరీలకు స్వయం నిర్ణయాధికారం ఇవ్వాలి.
   భారత బలగాలను వెంటనే వెనక్కి తీసుకోవాలి.
   - బూటకపు ఎన్‌కౌంటర్లను నిలిపివేయాలి.
2. ఏప్రిల్ 8, '96 నాడు దేశవ్యాపితంగా 'నిర్బంధ వ్యతిరేక దినం' పాటించాలి.
3. ఫిబ్రవరి 18 ప్రతి సంవత్సరం "సంఘీభావ దినం" (భాయిచార దివస్ లేదా సాలిడారిటీ డే) పాటించాలి.
4. జవహర్ లాల్ నెహ్రూ యూనివర్సిటీలో కాశ్మీర్ పోరాటాలను సమర్థిస్తూ జరిగే సెమినార్ లన్నింటినీ నిషేధించాలన్న, జె.ఎన్.యు. విద్యార్థులు-అధ్యాపకులు ఆ పోరాటం పట్ల తమ సంఘీభావాన్ని వ్యక్తపరచడాన్ని జాతి విద్రోహచర్యగా పేర్కొంటూ ఫిబ్రవరి 15 నాడు 'సంఘ్ 'సంగ్ పరివార్' విద్యార్థి సంస్థలు చేసిన ప్రతిపాదనలను ఖండించాలి.
5. పాట్నా హైకోర్టు బీహార్‌లోని 8 మంది విప్లవ రైతాంగం, మరో ముగ్గురు రైతులకు విధించిన ఉరిశిక్షలు రద్దుచేయాలి.
6. రాజకీయ ఖైదీలను బేషరతుగా విడుదలచేయాలి. విచ్చలవిడి అరెస్టులను నిలిపివేయాలి. రైతాంగంపై మోపిన కేసులన్నింటిని ఎత్తివేయాలి.

సెమినార్‌కు హాజరైన ఇతర వక్తలు చివరి రోజు ప్రసంగించారు. అజిత్ భుయాన్ (అస్సాం) మాట్లాడుతూ "ప్రభుత్వ సంస్థలే అసలైన సిసలైన ఉగ్రవాద కేంద్రాలు"న్నారు. నేటి అస్సాం పరిస్థితుల్లో అక్కడి యువకులముందు ప్రతిఘటించడం మినహా గత్యంతరం లేకుండా పోయిందన్నారు. పిదప ఈశాన్య రాష్ట్రాల ప్రతినిధి సచేతన్

మాట్లాడుతూ బ్రిటిష్ రాజ్యం, ఆ తర్వాత భారత ప్రభుత్వం దురాక్రమణల కారణంగా స్నేహం, స్వేచ్ఛా పిపాసులైన మా ప్రజల్లో అశాంతి నెలకొందన్నారు. అలాగే కుర్దిస్తాన్ వర్కర్స్ పార్టీ ప్రతినిధి ఇల్హాన్ కిసిల్ హాస్ మాట్లాడుతూ టర్కిష్ ప్రభుత్వం మా ఓపికను పరీక్షిస్తోందన్నారు. మేం కాల్పుల విరమణ పాటించినప్పటికీ ప్రభుత్వ దాడులు కొనసాగుతూనే ఉన్నాయన్నారు.

కర్నాటక నుండి జయప్రకాశ్, కాశ్మీర్ నుండి జెకెఎల్ఎఫ్ ఉపాధ్యక్షుడు జావాద్ మీర్, జార్ఖండ్ ప్రతినిధి భాస్కర్ విశ్వాస్, పంజాబ్‌కు చెందిన దర్శన్ పాల్, బెల్జియం ప్రతినిధి జోకుట్జియార్ మొ. వారందరూ తమ తమ అభిప్రాయాలను వెల్లడించడమో లేదా షరతులను స్పష్టంచేయడమో జరిగింది.

అడుగడుగునా ఆటంకాలు ఎదురైనా, సెమినార్ నాలుగు రోజులూ అత్యంత ఉత్సాహపూరితంగా జరిగి పోరాట సాంప్రదాయాలతో ముగిసింది. భారత గూఢచారి విభాగం వారు హాల్ చుట్టూతా పొంచి ఉండి హాల్‌లో ప్రవేశించడానికి అనేక విఫల ప్రయత్నాలు చేశారు. నిర్వాహకులు గుర్తించిన వారికే ప్రవేశానుమతి లభించడంతో వారి ఆటలు చెల్లలేదు. ఢిల్లీలో మొత్తంగానే ఈ విభాగంవారు అంతర్జాతీయ ప్రతినిధులను వెంటాడినారు. న్యూయార్క్ నుండి గూగి సెమినార్‌కు హాజరుకాకూడదనే మన దేశంయు వ్యవహారాల శాఖ మహా చెడ్డ ప్రయత్నాలు చేసింది. బెలూచిస్తాన్ నుండి రాజిక్‌ను ఢిల్లీలో అడుగుపెట్టనివ్వనే లేదు. ఈ వైఖరిని ఖండిస్తూ ఢిల్లీలోని విద్యార్థులు, మేధావులు పౌరహక్కుల నాయకులు నిరసన ప్రదర్శన జరిపితే కాని గూగికి వీసా పుట్టింది కాదు. గూగి మాటల్లో చెప్పాలంటే "30 ఏళ్ల రాజకీయ జీవితంలో సాగిన నా విదేశీ పర్యటనల్లో నాకు వీసా లభించకపోవడం ఇది రెండవ సారి. దక్షిణ ఆఫ్రికాలో శ్వేత జాత్యహంకార ప్రభుత్వం రోజుల్లో మొదటి సారి నిరాకరించబడింది." అన్నారు. ఇంతేకాదు, ఢిల్లీలో సెమినార్‌ను విఫలం చేయడానికి మతతత్వ సంఘ్ పరివార్ శక్తులు రాజకీయ గూండాలు చేసిన ప్రయత్నాలను నిర్వాహకులు వాలంటీర్ల పోరాట పటిమతో సాగనివ్వ లేదు. భారత బలగాలతో, సామ్రాజ్యవాద శక్తులతో ప్రపంచ వ్యాపితంగా తలపడుతూ తెగించి పోరాడుతున్న ఉద్యమకారులను ఏ శక్తీ అడ్డ లేదని నిరూపించిన ఢిల్లీ సెమినార్ చరిత్రలో ఒక సాక్షిగా నిలుస్తుందని ఆశిద్దాం.

ం ం ం

---

గూగి జంట స్థూప సందర్శన

గూగి ఎవాథి యాంగో, ఆయన భార్య కలసి ఆంధ్రలో పర్యటించిన రెండురోజుల్లో హైద్రాబాద్, వరంగల్ యూనివర్శిటీల్లో ప్రసంగించిన అనంతరం కరీంనగర్ జిల్లా హుస్నాబాద్‌లో 'ఇంట్లో నిర్మించిన "అమరవీరుల స్థూపాన్ని" గూగి జంట చూసి వినమ్రంగా జోహార్లు అర్పించారు. విముక్తి పోరాటాలకు అమరుల స్థూపాలు శాశ్వత నిదర్శనాలన్నారు. ఇక్కడ ఉద్యమం గూర్చి వింటుంటే మా కెన్యాలోని 'మౌ మౌ' ప్రాంతంలోని రైతాంగ ఉద్యమం గుర్తుకొస్తోందన్నారు. ఇక్కడి ఉద్యమం తీవ్రమైన అణచివేతను ఎదుర్కొంటుందనీ, తన పరిశీలనలో వెల్లడైందన్నారు. ఐతే ఇలాంటి ఉద్యమాలు నిలబడి భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా మారుతాయని చరిత్ర శాసిస్తోందన్నారు. మారుమూల ప్రాంతంలో ఎత్తైన స్మారక స్థూపాన్ని నిర్మించి ఉద్యమకారులను స్మరించుకోవడం ఎంతో సంభ్రమాశ్చర్యాలను కలిగిస్తుందంటూ అమరుల స్మృతులతో ఉద్యమం బలపడుతుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉవ్వెత్తున లేస్తున్న పోరాటాలపై పాలక వర్గాలు ఉక్కుపాదం మోపుతున్నాయంటూ, దానిని ఎదుర్కొనేందుకు సమైక్యవేదికలు ఏర్పడుతున్నాయని గూగి తెలిపారు. ఉత్తర తెలంగాణా — కెన్యా గ్రామీణ ప్రాంతాల మధ్య ఎంతో సారూప్యత ఉందన్నారు. జెరెవా గూగి ఉత్తరతెలంగాణ పోరాటాల గుర్చి తెలుసుకొని ఎంతగానో ఉత్సాహం పొందారు.

---

"జాతుల విముక్తిని మాత్రమే కోరేవారు అంతటితో ఆగిపోతారు కాని విప్లవాన్ని కూడా కాంక్షించేవారు మరింత పురోగమిస్తారు." – విప్లవకవి రచయిత వరవర రావు

"తీవ్ర విభేదాలున్నా విభిన్న లెనినిస్టు గ్రూపులు ఇలా మరింత చేరువవుతున్నాయి." – వరవరరావు

సమీక్ష

# ప్రజా మిలీషియా వర్ధిల్లాలి !

## జీవిత యుద్ధంలో బతుకుకోసం పోరాటం !

— నీలిమా

'కంకార్డ్ దీవి మిలీషియా మహిళలు' నవలలో కాంకర్డ్ దీవి ప్రజల జీవితాలు అర్థమవుతాయి. అంతేగాకుండా కాంకర్డ్ దీవికి చైనా భూభాగంలో భౌగోళికంగా ఉన్న ప్రాముఖ్యత కూడా అర్థమవుతుంది. కాంకర్డ్ దీవికి 1950 శీతాకాలంలో విముక్తి సైన్యం చేరుకుంటుంది. ఆ తర్వాత ఆ పక్క దీవులు అర్థ తెర, తూర్పు తీరం విముక్తమవుతాయి.

'కంకార్డ్ దీవి మిలీషియా మహిళలు' నవలలో సముద్రంపై ఆధారపడిన మత్స్యకారుల బ్రతుకులతో పాటు ముఖ్యంగా విముక్త్యానంతరం ఆ దీవిలోని మహిళల ఎదుగుదల తెలుస్తుంది. ఆ దీవిలోని పేద మత్స్యకారులను స్థానిక భూస్వామ్య పాలకవర్గ కుటుంబం ఎలా దోపిడికి గురిచేస్తుందో అర్థమవుతుంది. నవలలో మొదటినుండి చివరి వరకు హోయ్‌సియా జీవితం అర్థమవుతుంది. నవలలో 34 అధ్యాయాలు 214 పేజీలలో ఉన్నాయి. క్లుప్తంగా హోయ్‌సియా జీవితం చూద్దాం.

చైనా తూర్పు తీర ప్రాంతంలో గల కంకార్డ్ దీవిలోని ఒక నిరుపేద మత్స్యకారుల కడుపున పుట్టిన హోయ్‌సియా, పుట్టిన వెంటనే సముద్రం పాలవుతుంది. చైనాలోని ఆ నాటి పరిస్థితుల్లో ఆడపిల్ల పుట్టిన వెంటనే బకెట్లో ముంచి సముద్రంలో విడిచేసే వారనీ, మగపిల్లాడయితే సంతోషంగా పెంచుకునేవారనీ హోయ్‌సియా అంటుంది. అలా వదలివేయబడిన హోయ్‌సియా - తన పెత్తండ్రి సాహసంతో తిరిగి ఇల్లు చేరుతుంది. సముద్రం పాలయిన పిల్ల దొరికిందన్న సంతోషంతో ఆ తండ్రి పెట్టిన పేరే హోయ్‌సియా “సముద్రం మీద సూర్యోదయం”. ఈనాటికీ మన భారతదేశంలో, ఇంకా చెప్పాలంటే ప్రపంచం మీదనే ఆడ శిశువులు ప్రపంచాన్ని చూడకుండానే ఎందరెందరో కన్ను మూస్తున్నారు. బీహార్ లాంటి వెనుకబడిన ప్రాంతాల్లోనయితే దారుణంగా మంత్రసానులే పిల్ల బొడ్డుతాడు “మాయ” మెడకు చుట్టి చంపుతుంటే, లండన్‌లాంటి చోట్ల నూతన వైద్య పరీక్షలతో భ్రూణహత్యలు చేస్తున్నారు. ఫలితంగా నేడు ప్రపంచంలోనే స్త్రీ - పురుషుల మధ్య ఎంతటి అసమతుల్యం 'వర్ధిల్లుతుందో' జనగణనాలే నెలవిస్తుంటే, ఈ ఘోరకలి ఎటు దారితీస్తుందోనన్న భయం వెంటాడుతుంది. 1991 జనగణనాల ప్రకారం భారతదేశంలో స్త్రీ జనాభా 48.1 శాతం, అంటే దాదాపు 'ఆకాశంలో సగం' 2 కోట్ల లోటుతో నడుస్తుందన్న మాట.

హోయ్‌సియా జీవితం పసితనం నుండే బాధామయం. జ్ఞానం తెలిసీతెలియని వయస్సులోనే హోయ్‌సియా తండ్రిని, పెత్తండ్రిని, వరుసైన అన్న రాక్‌ను, వాళ్ళ తల్లిని కోల్పోతుంది. వీరందరు గ్రామ పెద్ద, భూస్వామి, దోపిడీదారుడైన చెన్ అఘాయిత్యాలను, జులుం దౌర్జన్యాలను ఎదిరించి ప్రాణాలొడ్డినవారే. అందరినీ కోల్పోయిన హోయ్‌సియా జబ్బుతో మంచంపట్టి రోజులు లెక్కిస్తున్న తల్లిపై ఆధారపడి బతుకడం కూడ గిట్టని చెన్‌గాడు వాళ్ళ కంటూ మిగిలిన 'సొంత ఇల్లు'ను కూడా కబ్జా చేసుకోవడంతో దిక్కుతోచని ఆ తల్లీబిడ్డలు చివరకు ఊరి చివర శిథిలమై దయ్యాల నిలయంగా మారిన ఓ గుడిలో తలదాచుకుంటారు. ఊళ్ళో వాళ్ళనభిమానించే ఏ పేదకడప లోనైనా, చివరకు టెషూ తాత దగ్గరనైనా ఉండడానికి ఆ తల్లీకూతుళ్ళు అంగీకరించలేదు. కారణం తమను వెంటాడుతున్న చెన్ మూలంగా ఆ కుటుంబాలు సమస్యల పాలు కాకూడదనే పీడిత జన పక్షపాతమే తప్ప మరేం కాదు. కానీ నిజానికి ఆ చిన్న దీవిలో ఎన్నెన్నో అమాయక జీవాలు చెన్‌గాడికి లేదా వాడిచే పెంచిపోషించబడుతున్న 'నల్లగాలి' “సముద్ర దొంగలు” చేత సముద్రం వాత పడినవే. ఎంతో మంది స్త్రీలు చెన్‌గాడి లైంగిక దోపిడికి బలైనవారే.

దేవాలయంలో తలదాచుకునే నీడ దొరికినా, పొట్టగడవని తల్లీ కూతుళ్ళు అడుక్కుతినే పరిస్థితి దాపురిస్తుంది. ఆ దరిద్ర్యం అంతిమంగా తల్లి ప్రాణాలను తోడేస్తుంది. ఈడెరుగని 14 ఏళ్ళ హోయ్‌సియాను ఎంతో ఆప్యాయంగా టెషూ తాత చేరతీస్తాడు. ఆనాటికి టెషు తాత ఆకూ అలముతో పొట్టపోసుకుంటూ, చివరి ఘడియలు లెక్కిస్తూ, 70 ఏళ్ళ చైనాకు సజీవ సాక్ష్యంగా, కంకార్డ్ దీవి గాథలకు ప్రతినిధిగా కొనవూపిరితో కొనసాగుతున్నాడు. అక్కడికి చేరిన హోయ్‌సియా జీవితం త్వరలోనే తాను ఊహించని మార్పులకు లోనవుతుంది. “దిక్కు మొక్కు లేని జనం, ఒక్కొక్కరు అగ్ని కణం” అన్నట్టుగానే హోయ్‌సియా మిగిలిన బాల్యం, ఆపై ఎదిగిన యవ్వనం నవల ద్వారా

తెలుస్తుంది. ఈ మాత్రానికే అయితే అందరమ్మాయిల లాగానే హోయ్‌సియా జీవితం దొర్లిపోయేదే, ఆ నవల చదవాల్సి నంతటి ప్రాముఖ్యత కూడా ఏమీ గోచరించేది గాదు, కానీ ఆ దీవికి చేరిన విముక్తి సైన్యం, చైనా కమ్యూనిస్టు పార్టీ ఆ ప్రజల జీవితాల్లో తెచ్చిన పెనుమార్పులను ఆ నవల ప్రపంచానికి అందిస్తుంది. ఇంతే అయితే కూడా విముక్తి చైనాలోని లక్షలాది గ్రామాల్లో ఇది ఒకటిగా పరిగణించబడేదే తప్ప అంతకు మించిన గొప్పతనం ఏముండేది కాదు, కానీ పెకింగ్ కు 1000 లీ ల దూరం (దాదాపు 400 కి.మీ.)లో నున్న కంకార్డ్ దీవి నుండి కా. హోయ్‌సియా చేరుకొని, 1960 లో జరిగిన జాతీయ ప్రజా మిలీషియా మహాసభలో పాల్గొనడం వెనుక గల చరిత్ర నవల మనకు అందిస్తున్నందుకు ఆ నవల మనం తప్పనిసరిగా చదవాలి.

ఆంధ్రా, దండకారణ్యాలలోని రైతాంగాన్ని, ఆదివాసీ ప్రజానీకాన్ని మన పార్టీ గత రెండు దశాబ్దాలుగా సమరానికి సిద్ధం చేస్తుంది. ప్రపంచ సోషలిస్టు విప్లవాన్ని భారతదేశంలో నూతన ప్రజాస్వామిక విప్లవాన్ని, జయప్రదం చేయడానికి భారత కార్మికవర్గ అగ్రగామి దళం నడుం బిగించింది. నిర్దిష్టంగా మార్క్సిజం-లెనినిజం-మావో ఆలోచనా విధానం వెలుగులో ఎర్రసైన్యంతో తెల్లసైన్యాలను ఓడించాలనే గెరిల్లా జోన్స్, స్థావరప్రాంతాల నేటి లక్ష్యంతో సాయుధ బలగాలను సమీకరిస్తున్న మన పార్టీ నాయకత్వంలో కనీసంగా 100 దళాలు పనిచేస్తున్నాయి. పోరు శంఖం ఊదుతున్నాయి. డుడుం మోగిస్తున్నాయి. జడుంగ వాయిస్తున్నాయి. మందుపాతరలను దట్టిస్తున్నాయి. భారత పీడిత ప్రజల ఆశాకిరణంగా ఆదర్శంగా నిలిచాయి. తరతరాలుగా "జీవన సమరం" సాగిస్తున్న పీడిత తాడిత జీవితాలకోసం అసమానమైన త్యాగాలతో అగ్రభాగాన నిలిచాయి. పితృస్వామ్య సమాజంలో 'మనువు' అణచివేతలతో దినమొక గండంగా కన్నీళ్లతో 'ఖర్మ' భూమిలో వేదనలనుభవిస్తున్న మహిళాలోకం 'అడవి అన్నలను' ఆశ్రయిస్తుంది. ఆ పోరుబిడ్డలు పోరాటానికి వస్తున్నారు. సమాజంలో జీర్ణించుకుపోయిన పురుషాహంకార, పురుషాధిక్య భావాలను పుట్టుకతోనే నరనరాన జీర్ణించుకున్న, పురుషుల మధ్యనే నేటి విప్లవ స్త్రీ తన విముక్తి ఉద్యమానికి బాటలు వేసుకుంటుంది. ఆడపిల్ల పుట్టుకే పనికిరాదన్న దుస్సాంప్రదాయ నీడల్లో జన్మించి మృత్యువు వాతపడకుండా భారంగా జీవిస్తూ, తన మీద తనకే నమ్మకం లేని న్యూనతాభావాల మధ్య నలిగిపోతున్న స్త్రీ నేడు భారత విప్లవోద్యమంలో సాయుధ (పోరు)(మ)(హిళ)(వు)తుంది.

ఈ నేపథ్యంలో ఈ నవలను చదవాలి. ఒకే ఆశయానికి, ఒకే లక్ష్యానికి త్యాగనిరతితో పనిచేస్తున్న వారు కామ్రేడ్లీ సంబంధాలను, విప్లవ ఆప్యాయతలను ఎలా కలిగి ఉంటారో "పొద్దు పొడుపులో పొగబండి" కబుర్లు మనకు తెలుపుతాయి. మూడు రోజుల ప్రయాణంలో హోయ్‌సియా తన చిన్నారి దీవిని ఎంతో ప్రేమతో తను ప్రేమిస్తున్న తోటి వారికి వివరిస్తుంది. అదే 'కంకార్డ్ దీవి మిలిషియా మహిళలు' నవలగా లీజు-చింగ్ కలం నుండి వెలువడగా, నేటి మన అవసరాలకు తగినట్టుగా నవత తెలుగీకరించి నాది. నూతన కర్తవ్యాలతో ముందుకెలుతున్న మన గెరిల్లా బలగాలను భావపరంగా మరింత సుసంపన్నం చేయడానికి సకాలంలో (ఆగస్టు '95) మహిళా మార్గం తన బాధ్యతగా పుస్తకాన్ని ప్రచురించింది. కాకపోతే ధర 40/- రు:లు ఎలా రావాలబ్బా? అన్నదే సమస్య. బయటి మార్కెటు రేటుతో ఎలాగూ పోల్చుకోలేని మనకు ఇదే పెద్ద ధర కదా.

నవలలో మనకు మహిళల పట్టుదల అర్థం అవుతుంది. 'పోరాడితే పోయేది ఏమి లేదు బాధలు మాత్రమే' అన్నట్టు మహిళలు తమపై కొనసాగుతున్న అణచివేత, చిన్న చూపులను ఎలా ఎదిరిస్తూ పోరాట ప్రతిభను పెంచుకుంటారో మొత్తం నవలలో పూసల్లో దారంలా ప్రతి అధ్యాయంలో స్ఫురిస్తుంది.

'నేను - మా అయ్య' అధ్యాయంలో చైనా సమాజంలో ఆడ శిశువులను చంపెయ్యడం మాత్రమే లేదు పసిగుడ్డును కాపాడుకోలేని కన్న తల్లుల ఆవేదన, సముద్రానికి బలిచేస్తున్న తండ్రుల మూగవేదన "ఎందుకలా ఏడుస్తావు? ద్వేషపూరితమైన ఈ లోకాన్ని వదలిపో? నా దారిన నువ్వు పో. కష్టాలు, కడగండ్లు తప్ప జీవితంలో ఏమీ ఉండదు" అన్న మాటలు గుండెలను పిండేస్తాయి.

నవలలో అందించిన చిత్రాలు కథకు తగిన విధంగా రసవత్తరంగా ఉన్నాయి... మరచిపోకుండా ఉన్నాయి. హోయ్‌సియాలో తమను చూసుకునేలా స్ఫురిస్తున్నాయి. ఇంతేగాకుండా ప్రతి అధ్యాయానికి తగిన పేరుపెట్టి, ఆ పేరులోనే మొత్తం అధ్యాయం ఒక్క మాటలో ముందుకు తేవడం రచనా కౌశల్యానికి గీటురాయి.

'ఇనుప తక్కెడ రహస్యం'లో సముద్ర జీవాల వ్యాపారంలో మత్స్యకారుల వేట ఫలితంతో చెన్ పడగలు విప్పుతుంటే ప్రజలు తమ నిరసన వ్యక్తం చేస్తారు. ప్రతిఘటిస్తారు. ఏ ఫలితాలెదురవుతాయో తెలిసినా వెనుకాడరు.

కష్టం చెమటై కారుతుంటే
........
తూకాలకీ, ధరలకీ వాళ్ళు కనికట్టు వేస్తారు
మనమేమో అప్పుల ఊబిలో
ఉప్పటి కన్నీటిని మింగేస్తాం -

అన్న చరణాల్లో ఎంతటి వ్యథ ఉందో చూడొచ్చు. అటవీ ఉత్పత్తులను అమ్ముకుంటున్న ఆదివాసీ జీవితాలకు పోలును అన్వయిస్తే పీడిత ప్రజల చుట్టరికం సిద్ధాంతం వెలుగులో అల్లుకుపోతుంది. "సముద్రపు కొంగరెక్కలు తెల్లగా ఎందుకు ఉంటాయంటే" మనసార ప్రేమిస్తున్న తనవాన్ని తన నుండి దూరం చేస్తే "పక్షినై నిన్ను చేరుకుంటా, వేటలో నిన్ను కలుసుకుంటా" అంటూన్న అమరప్రేమను కథగా వలలు అల్లుకునే దీవి మహిళలు తమ పిల్లలకు చెప్పుకోవడంతో తెలుస్తుంది.

'గంగపుత్రుల కుటుంబాలు' చెన్ పైశాచికత్వానికి ఎలా బలవుతున్నాయో తెలుసుకోవడానికి దీవిలోని ఒక్కొక్క ఇల్లు ఒక్క సజీవ సాక్ష్యంగా అగుపడతాయి. 'మరణం తప్పని జీవితాలకు' బలి మరణాలే రాజ్యమేలుతుంటే చెన్ పాపాలు చిట్టాకు ఎక్కుతున్నాయనే టొషు తాత మనస్సాక్షిగా రికార్డు చేస్తున్నాడు. ముఖాన్ని రెప్పలు చాటున, భారాన్ని పెద వుల మాటున పళ్ళ బిగువుతో అదిమిపడుతూ భవిష్యత్తుపై నమ్మకంగా ఉంటాడు — టొషు తాత. ఆయనతో హోమ్ సియా.

"గంపెడు బియ్యం — బిందెడు నీళ్ళు" 1950 శీతాకాలంలో దీవి విముక్తిని చూపిస్తుంది. కొమింగ్ టాంగ్ తోక ముడుస్తుంది. విముక్తి సైన్యానికి — పల్లెకూ విడదీయరాని బంధుత్వం ఏర్పడుతుంది. హోమ్-సియా జీవితానికి యుద్ధం పరిచయం అవుతుంది. సైనికులు చుట్టా లవుతారు. నేటి మన పోరాటంలో తారసిల్లుతున్న హోమ్‌సియాలే 'రాంసాహు'లు. వాంగ్‌ఫా ఎంత బుద్ధోడైనా (వృద్ధుడైనా) వర్గకసితో బందిపోటు పీకనులిమి బంధూకును చేత బట్టి ముద్దెట్టుకుంటాడు. జీవితంలో తన తుపాకిని ఎన్నడూ వదలడానికి సిద్ధపడడు. (భావితరాలపై విశ్వాసం కుదిరిన్నాడే తప్ప).

'ప్లాటూన్ లీడర్ ఫాంగ్ కథ' అమరవాణి వినిపిస్తుంది. తన సహచర భాగస్వామిని కి చివరి క్షణంల్లో ఉత్తరం రాస్తూ "చిరునవ్వుతో, గర్వంగా మరణిస్తాను. బాధపడవద్దు. కన్నీటిని కత్తులుగా మార్చుకొని, మరింత పటిమతో ధైర్యంతో రేపటి విజయం కోసం పోరాడు."...... "వాడు విప్లవం కోసం పుట్టాడు. విప్లవం కోసం పోరాడాలి. వాడికి నా తుపాకి ఇవ్వవూ..." అంటూ తన బాబును ఉద్దేశిస్తూ అందజేస్తున్న సందేశం ప్రతి తండ్రి గుర్తుంచుకోతగింది. భావి తరాల భవిష్యత్తును చక్కదిద్దడానికి, తన నెత్తుటి వారసత్వాన్ని స్వీకరించేలా తన వాళ్లను కోరని వారు విప్లవానికి చేసే సేవ పాక్షికమే అన్న సత్యం లీ జంగ్-షెంగ్ మాటల్లోనే అర్థంచేసుకోవాలి.

శత్రువు తలపెట్టిన సంస్కరణల భ్రమలు నూతన తరాన్ని ఎంతగా ప్రభావితం చేస్తున్నాయో మన ఆచరణలో నిత్యం చూస్తున్నాం. ఆ బూటకత్వాన్ని ఎండగడుతూ "వర్గ అన్నదమ్ముల మధ్యా, విప్లవ కామ్రేడ్ల మధ్యా వుండే ప్రేమను మించిన గొప్పది ఇంకేం లేదు" అని అడుగడుగునా నినదిద్దాం.

"అన్నం గిన్నెలో తుఫాను" కరువు నిధుల పంపకంలో ఎవరికి ఎలా ప్రాధాన్యత ఇవ్వబడుతుందో ఒకవైపు అర్థమవుతుంటే, విప్లవ విద్రోహులు (రెండో నెంబర్ కుక్క, అతడి భార్య కంపు) దొరికిన ప్రతి అవకాశాన్ని వినియోగ పరచుకుంటూ పీడిత ప్రజల ఐక్యతను దెబ్బతీయడానికి చేసే కుట్రలు విశదమవుతాయి. అలాగే "వ్యక్తి చెప్పిన దాన్ని విని ఊరుకోకు. పక్క వాళ్ళని కూడా అడుగు. ఏదన్నా నిర్ణయించుకోలేనపుడు, నలుగురిలోనూ చర్చించు" అంటూ సమస్యల వలయం లో ఇరుక్కుపోయిన నాయకత్వానికి, అలాగే తమకు సర్వస్వం తెలుసుననే మిడిసిపాటు గల వారెవ రికైనా నవల అందించే ఈ నాలుగు వాక్యాలు అనుసరణీయం. ఎవరితోనూ మాటపడడం సహించని హోమ్‌సియా లాంటి వారిని కంపులాంటిది అపనిందలకు గురిచేస్తే, కన్నీరు పెట్టడం అనేది వారి మతినం లేని హృద్యాంతరాలను

తెలుపుతుంటే, బాధ్యత గల విప్లవకారులు "విప్లవకారుడు కన్నీళ్ళు కార్చడు నెత్తురు కారుస్తాడు" అన్న మాటలతో బోల్షివిక్ స్పిరిట్ నింపడం ఎంతో గొప్ప విషయం.

'చక్కని దృష్టికి స్పష్టమైన బుర్ర' లో నావ బలం తెరచాపలోనూ, మనిషి బలం హృదయంలోనూ ఉందంటూ" ప్రజా మిలీషియా పెట్టేపుడు ఆడోళ్ళకెందుకు చెప్పలేదు? .. అని ప్రశ్నించే దీవి మహిళా చైతన్యం, పట్టుదల తెలియొస్తాయి. ఇంకా చెప్పాలంటే ... ప్రజా మిలీషియా అంటే ఏమిటో, దాని కర్తవ్యాలు బాధ్యతలు ఏమిటో బోధపడడమే గాకుండా, అది అర్థంకానంతటి బ్రహ్మ పదార్థం ఏమీ కాదన్నంత తేలికగా నవలలోని పాత్రలు స్పష్టంచేస్తాయి. అలాగే భార్యాభర్తలను అర్థంచేసుకోడానికి నవలలోని రెండు పాత్రలు చక్కగా కుదిరాయి.

అహాంగ్, అహాంగక్క ఇద్దరాలు మొగలు. ఇద్దరిమధ్య గల సఖ్యత, రెండు స్వభావాల్లోనూ తమ తమ వ్యక్తిత్వాలను నిలుపుకోవాలనే తపన, ముఖ్యంగా భర్తలో 'మగ' గబ్బుతో కూడిన తప్పుడు భావాలు కనిపిస్తే, కపటంలేని స్త్రీ పాత్రలో భార్య భర్తను సవరించడానికి తీసుకునే చొరవ కనబడుతుంది. ఈ అనుభవం లేని హోయ్‌సియా వీరిద్దరి మధ్య ఇరుక్కొని అవాక్కయిపోయి తమాయించుకుంటుంది. నిజంగా ఒక నూతన మానవుడు ఉద్భవించడానికి ఎంతటి పోరాటం అవసరమో జీవితాల్లో అర్థం కాని వారికి తన పాత్రల ద్వారా నవల సహాయాన్నందిస్తుందని నిర్భయంగా చెప్పొచ్చు.

'లిఖిత సందేశం' లో చదువనూ, రాయనూ నేర్చుకోడానికి రాజకీయాలకీ సంబంధం ఉంది అని చెప్తుతుంటే కేవలం అక్షరాలు నేర్చుకోవడానికి కాక, సిద్ధాంతాన్ని అధ్యయనం చేయడానికి చదువు ఉపయోగపడాలి అన్న జీవితసత్యం కూడా చూస్తే మన దళాల్లో తమలో తామే గున్ గుణాయించుకుంటూ అక్షరం ... అక్షరం పేర్చుకొని శ్రద్ధతో చదివే అక్కలే గుర్తొచ్చారు. దీవిలోని మహిళా మిలీషియాకు కలిగిన చదువు నేర్చుకోవాలనే పట్టుదల మగాళ్ళ మాటలతో ఎలా నీరుకారిపోతుందో చూస్తే కన్‌ఫ్యూజియస్ పై కంపరమెత్తుతుంది. హోయ్‌సియా అమాయకత్వం, అనుభవ రాహిత్యంతో చేసే ప్రతి తప్పుకు ఫాంగ్ ఎంతో బాధ్యతగా చక్కదిద్దడం, ఆత్మవిమర్శతో నిజమైన పరివర్తనకు జీవితాన్ని ఒక మంచి నాయకుడిగా నిలబెడుతుంది.

'దీని చుట్టూ దారి' చదివితే "ఆలుమగల మధ్య గొడవ రెండు శక్తుల మధ్య జరిగే యుద్ధం" అనే మాటల్లో పాత భావజాలాన్ని ఓడించడానికి చేపట్టే కృషి తెలుస్తుంది. శాస్త్రీయ అవగాహన కొరవడి స్త్రీలను వేధించేవారిని మార్చడం ఏమంత తేలికైన పనికాదు అని తెలపడానికే నవలలో ఆ మాటలు చోటుచేసుకున్నాయి.

'తుపాకులు పంచిపెట్టాక' కు వస్తే ప్లాటూన్ లీడర్‌గా మారిన హోయ్‌సియా, దీవిలోని మహిళలను మిలీషియాలోకి చేర్చడానికి ఎంతటి శ్రమపడుతుందో చూస్తే, ఎందరెందరో గ్రామీణ యువతులను మనం ఇంకా సమీకరించాల్సి ఉందన్న విషయం తక్షణం గుర్తురావడమే గాదు 'కంపు' లాంటి వారి బారి నుండి గ్రామీణ యువతులను రక్షించే బాధ్యత కూడా హోయ్‌సియా లాగ మనదేనని కూడా గుర్తొస్తుంది.

'ఆత్మ విమర్శ' లో స్త్రీ ముందంజను ఎలా అర్థంచేసుకోవాలో "అసహనంతో ఇనుము ఉక్కుగా మారదు" అన్న ఆచరణ సత్యంతో ఫాంగ్ హోయ్‌సియాకు గుర్తింపచేస్తాడు. విప్లవమార్గంలోని అడ్డంకులను తొలగించుకోవడానికి మావో మాటల్లో "ఖచ్చితంగా వుండు. త్యాగానికి వెరవకు. విజయం కోసం ప్రతి కష్టాన్నీ జయించాలి" ఫాంగ్ అందించడంతో హోయ్‌సియాలో జనించిన దృష్టి మన విప్లవాచరణకు కూడా సరిగ్గా పోలుతుంది.

"శిక్ష" అనుభవించడం తేలికే. నీ తప్పుని అర్థం చేసుకోవడమే కష్టం" అన్న నిష్ఠుర సత్యాలు కాసేపు హోయ్‌సియాను నొప్పించినా, ఆమె సరిదిద్దుకోడానికి గొప్పగా ఉపయోగపడిన అంశాలు.

'జననీ - జన్మభూమి' లో నిజంగా ఎవరి గెరిల్లా జీవితం వారికే యుసియు పాత్రలో వ్యక్తమవుతుంది. తొలినాటి సెంట్రీ బాధ్యతల్లో మనసును వెంటాడిన భావనలన్నీ కళ్ళముందు కదులాడుతాయి. మన పార్టీ అవలంబించిన పద్ధతులు హోయ్‌సియా నుండి క్లిష్టమైనా విప్లవం నేర్చుకున్నవే ననిపిస్తుంది. ప్రజా జీవితాలకు అద్దంపట్టే గొప్ప శక్తి ఒక మంచి కథకు, ఒక మంచి నవలకు ఎలా ఉందో అందులో తీర్చిదిద్దబడిన పాత్రలే తెలుపుతాయి. మళ్ళీ మళ్ళీ చదువాలనిపించేంతటి అనుభవం మన జీవితాల్లో నుండి యుసియూ లో చూస్తాం. సంప్రదాయ భావజాలం, వెనుకబడిన ఆర్థిక విధానంలోని రైతు కుటుంబాలనుండి వచ్చి సాయుధ మవుతున్న అక్కల జీవితాల్లో జరిగే ప్రతి తొలి అనుభవం వాగి

జీవిత డైరీలో భద్రంగా రికార్డవుతుంటాయనడానికి ఈ అధ్యాయం ఒక చక్కని నిదర్శనం.

'వాలు మీద పాటలు' అధ్యాయంలో మహిళా శక్తి ఎంతటిదో గుర్తించబడుతుంది. తెల్లారి లేసింది మొదలు చేపలు వేటలో పురుషులు నిమగ్నమైతే, ఉత్పత్తి పెంచే కార్యక్రమాల్లో నడుం బిగించిన స్త్రీలు పార్టీ పిలుపుకై ఎంతటి కష్టాన్నైనా భరిస్తూ "రేపటి పని ఈరోజే పూర్తి" అన్న స్ఫూర్తితో ఎలా పూర్తి చేస్తారో చూస్తే కమ్యూనిజం ప్రజల్లోని నిజమైన శక్తిని వెలికి తీస్తుందన్న అంశం ఎంతటి వాస్తవమో అర్థమవుతుంది. భవిష్యత్తుపై ఆశ ఇనుమడిస్తుంది. బాధ్యతతో తప్పులు సరిదిద్దుకొని, ఆదర్శ బాధ్యులుగా నిలవాలనిపిస్తుంది.

'అతడూ-ఆమె'లో మగవాళ్ళ ఎగతాళితనం ఎలా ఉంటుందో స్త్రీల విజయాలను సహించలేని ఉడుకుమోతుతనం ఎంత ఎంత లోతుగా ఉంటుందో చూస్తే నిజమైన కామ్రేడ్లీ భావం ఎదగడానికి ఈనాటి కామ్రేడ్లు ఒక తొలి మెట్టు మాత్రమే నన్న విషయం జీవితంలో మరుపగూడదనిపిస్తుంది.

పరిస్థితులకు తగ్గట్టు సదరుకొని తలవంచుకొని నడుచుకోవాలంటుంది సంప్రదాయ భావవాదం. తప్పులను, అన్యాయాలను ప్రతిఘటించడమే జీవితం కోరుకుంటుంది. రెండింటి మధ్య ఘర్షణే పోరాటం. పార్టీలో కూడా తప్పుడు నిర్ణయాలు చేయబడతాయనీ, వాటి ఫలితంగా హోన్సియా లాంటి వాళ్ళు బాధ్యతలు కోల్పోయి, మానసిక వత్తిడులకు లోనై తాత్కాలికంగానైనప్పటికి కొంత మనఃక్షోభకు గురవుతారనీ తెలుస్తుంది. కాని తప్పును ఎదిరించడం హోన్సియాకు బతుకు నేర్పింది. మార్క్సిజం ఆ పోరుకు మరింత పదను పెట్టింది. తనను చిన్న పిల్లగానే చూస్తూ తన భావాలను అణచడానికే తన చిన్నాన్న (గ్రామ బాధ్యుడు) ప్రతి అవకాశాన్ని వినియోగించుకుంటుంటే, చివరకు తనపై తీసుకున్న చర్య సరైనది కాదనీ, దాన్ని పరిశీలించాలనీ పై కమిటీని కోరి తన పక్షం న్యాయం ఉందనీ, ప్రజలు నిలిచారనీ నిరూపించడమే గాదు, తొందరపాటుతో నాయకత్వం చేసిన తప్పును గుర్తింపచేస్తుంది. 'ప్రమాదం' అధ్యాయం నుండి ప్రతి పార్టీ కార్యకర్త ఈ పార్టీ పాఠాన్ని అర్థంచేసుకోవాలి. చిత్తశుద్ధితో పార్టీ తీర్మానాలను అమలుచేయడం, తప్పులతో పోరాడడం నేర్చుకోవాలి. నాయకత్వాన్ని గుడ్డిగా నమ్మకూడదు. అనుసరించకూడదు. వారి వారి తప్పులతో కూడా పోరాడాలంటుంది హోన్సియా.

ఇలా ప్రతి అధ్యాయంలో అనేక అంశాలు కనపడతాయి. శత్రువు చొప్పించే ఏజంట్లుపకడ్బందీ మెకానిజం, తైవాన్‌తో చైనాకు మొదటినుండి ఉన్న ముప్పు, కేవలం ఉత్పత్తిపైనే శ్రద్ధపెట్టి ప్రజా శత్రువులను నిర్లక్ష్యం చేస్తే ఎదురయ్యే ప్రమాదాలు, ప్రజాశ్రేణుల్లోనే దాగివుండే శత్రు ఏజంట్లు, వారిని పసిగట్టే చాకచక్యత ఇలా అనేక అంశాలు తెలిసి వస్తాయి. విప్లవపోరాటాలు ఎలా ఉండాలో, వాటిని ఏ స్పిరిట్‌తో తీసుకోవాలో ప్రతిగెరిల్లా నేర్చుకోవలసింది నవలలో ఉంది.

సామ్రాజ్యవాదం ఉన్నంతవరకు ప్రజాయుద్ధం ఉంటుందన్న వాస్తవం చూస్తుంటే నేటి చైనా పాలకుల మీదనే తక్షణం యుద్ధ శంఖం పూరించడానికి అక్కడి కార్మికవర్గం ప్రజలను అలర్ట్ చేయాల్సిన అవసరాన్ని కూడా నవల హెచ్చరించిస్తుంది. ఇలా ఒక దీవిలోని ఒక తరం కథకు అందులో ప్లాటూన్, కంపెనీ స్థాయిల్లో మహిళలు కమాండర్లు గావడం అనే అంశాన్ని విప్లవిస్తున్న మనం నేర్చుకోవాలి. మన మహిళకు ఆనాటి చైనా మహిళే ఆదర్శం. మన వీర గెరిల్లాలకు విప్లవ మహిళలకు చైనా విప్లవ యుద్ధమే అనుసరణీయం. తప్పులపై పోరాడుతూ, సిద్ధాంతాన్ని అర్థంచేసుకుంటూ నిజమైన విముక్తికి మహిళ ప్రతిజ్ఞ పూనాలి.

00 మహిళా దినం 8 మార్చి వర్ధిల్లాలి — పితృస్వామ్యం నశించాలి.

00 పురుషాధిక్యత, పురుషాహంకారం — ప్రతిఘటించాలి.

00 ప్రజల ప్రజాస్వామ్యం — వర్ధిల్లాలి.

---

"ప్రస్తుత ఉత్పత్తి వ్యవస్థ రద్దుకావడంతోనే ఇదులోనుండి ఉత్పన్నమైన సమిష్టి
భార్యా వ్యవస్థ కూడా — అనగా బహిరంగ వేశ్యావృత్తి, ప్రచ్ఛన్న వేశ్యావృత్తి —
రద్దు అవుతుంది అనేది స్పష్టంగా తెలుస్తూనే ఉంది"

(కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక, మార్క్స్-ఏంగెల్స్

ఉదా: మహిళా రంగానికి చెందిన రిపోర్టులని 'పోరుమహిళ'లో వస్తున్నాయి. ప్రగతావి మిగతా శీర్షికలో,
రావచ్చు. కానీ, ఒక విషయం ఏమంటే, దండకారణ్యంలోని 3 డివిజన్ల నుండి అనేక రిపోర్టులు అందు
తున్నాయి. ప్రజాసంఘాలు అనేక సమస్యలు పరిష్కరిస్తున్నాయి. నాటినన్నింటిని పత్రికకు రాయడం ద్వారా
బాధ్యుల వద్ద సమగ్రమైన సమాచారం ఉంటూ పత్రికకు తోడ్పడుతుంది. పత్రికాభివృద్ధికి ఇది చాలా అవ
సరం కూడా.
ఇకపోతే ఆయా డివిజన్లలోని పోరాటస్థాయి, ప్రజల స్పందన, సంస్థాల కార్యక్రమాలు, శత్రునిర్బంధం
మొదలైన అంశాలను దృష్టిలో పెట్టుకొని రిపోర్టులు పత్రిక ద్వారా అందించాల్సి ఉంటుంది.
రిపోర్టులు పత్రికలో రాసేంతప్రధాన్యం మరోలా ఆలోచించకూడదు. మీ సహకారాన్ని ఎప్పటిలాగే అందించండి.

3: తాజా ఘటనలు మీరడిగినట్లు, వీలైన మేరకు, అందివ్వగలమని ప్రభాత్ (హిందీ) జనవరి '96లో తెలియజేసాం.

4. విషయ పత్రికల్లో వస్తువు ప్రధానమని మీరు పేర్కొన్నారు. గెటప్ అవసరాలు తెలిపారు. ఇంతేగాకుండా మీరు
మీ అవగాహన మేరకు మీరెన్నో విలువైన సలహాలు అందించారు. వాటిని ఎల్లప్పుడూ మా దృష్టిలో ఉంచు
కుంటూనే మెరుగులు దిద్దుకోడానికి మీ కృషితో మా కృషి జోడిస్తాం.

5. తప్పులు దొర్లుతున్నాయి. కొన్ని సందర్భాలో చాలా ప్రధానమైన అంశాల్లో కూడా తప్పులు దొర్లుతున్నాయి.
పార్టీ అవగాహనకు భిన్నమైన అర్థాన్ని ఇచ్చే రీతిలో ఉంటున్నాయి. ఇవి తప్పనిసరిగా సవరించుకుంటాము.
ముఖ్యంగా పార్టీ ప్రకటనల్లో, సైద్ధాంతిక వ్యాసాల్లో ఇలాంటివి రాకుండా చూసుకుంటాం.

6. ఇప్పుడిప్పుడే చదువు నేర్చుకుంటున్న వారికి టైపు అక్షరాలు ఎంతో ఇబ్బందిని కలిగిస్తున్న మాట నిజమే. కానీ
తప్పదు. అవకాశమున్న మేరకు ఇందులో ప్రగతి సాధించడానికి కృషిచేస్తాం.

7. ఇకపోతే సైజు విషయంలో మన స్పెషల్ జోనల్ కమిటీ (ఎస్.జడ్.సి) నిర్ణయం తీసుకుంటుంది. ఆ నిర్ణయం
మేరకు ఎలాంటి మార్పులు చోటుచేసుకుంటే అలా సంచికలు మీ చేతికి వస్తాయి.

8. భాషా విషయంలో మీ అభిప్రాయాన్ని స్వీకరిస్తున్నాం. కా. మావో మాటల్లోనే జవాబు ఇవ్వడం బాగుంటుందని
ఇక్కడ దాన్ని ఉటంకిస్తున్నాం.

> మనం భాషను ఎందుకు అధ్యయనం చేయాలి? అంతేగాక, దానిపై ఎక్కువ శక్తిని ఎందుకు కేంద్రీకరించాలి? ఎందుకంటే, భాష మీద పట్టు సంపాదించడం అంత తేలిక కాదు. దానికోసం చాలా శ్రమపడాలి. ముందు మనం ప్రజల భాష నేర్చుకుందాం. ప్రజల భాష సంపన్నమైంది. శక్తివంతమైంది. అది నిజ జీవితాన్ని ప్రతిబింబిస్తుంది.
>
> — మావో.

"ఒక వార్తాపత్రికను బాగా నడపడం, దాన్ని ఆసక్తిదాయకంగానూ, మనస్సుకు హత్తుకునేట్టు
గానూ రూపొందించడం, వార్తాపత్రికల్లో, పార్టీ యొక్క సాధారణ నిర్దిష్ట విధానాలకు సరైన
ప్రచారం ఇవ్వడం, వార్తాపత్రికల ద్వారా పార్టీకి ప్రజలతోటి సంబంధాలను పటిష్టం చేయడం —
మన పార్టీ పనిలో ఇదొక ముఖ్యమైన సూత్రప్రాయమైన సమస్య. దీన్ని తేలికగా తీసుకోగూడదు.
... దానిని చక్కగానూ సజీవంగానూ నిర్వహించాలంటే, దీన్ని చిత్తశుద్ధితో నిర్వహించాలి. వార్తా
పత్రికల విషయంలో కూడా వాటిని నడుపడానికి మనం అందరి మీద ఆధారపడాలి, ప్రజాబాహు
ళ్యం మీద, పార్టీ అంతటి మీద ఆధారపడాలి."

— మావో

## లేఖలు

ప్రియమైన కామ్రేడ్స్ !

లాల్ సలాం !

దండకారణ్యంలోని అన్ని డివిజన్‌ల పాఠకుల నుండి ఉత్తరాలు చేరాయి. రెగ్యులర్‌గా రిపోర్ట్‌లు ఉత్తరాలు మాత్రమే కాకుండా, మౌఖిక అభిప్రాయాలు కూడా వస్తున్నాయి. పత్రికలోని వివిధాంశాలపై వెంటవెంట మీ అభిప్రాయాలు పంపిస్తున్నందుకు మీకు మా కృతజ్ఞతలు అందజేస్తున్నాము. ఇంతేగాదు, పత్రిక సజీవంగా, సృజనాత్మకంగా ఉండాలనే ఆర్థాంతో పాటు, ఒక డివిజన్ పోరాటాలను మరో డివిజన్‌కు, ఒక ప్రాంతం పోరాటానుభవాలను దేశంలోని వివిధ ప్రాంతాలకు పత్రిక ద్వారా అందివ్వాలనే పోరాట అవసరాన్ని బాధ్యతతో గుర్తించి ప్రజలను జాగృతం చేయడానికి మీ పోరాటానుభవాలను క్రమం తప్పకుండా అందిస్తున్నందుకు అభినందిస్తున్నాం. ఈ కృషి ఇలాగే కొనసాగిస్తారని ఆశిస్తున్నాం.

మాకు చేరిన ఉత్తరాలన్నింటినీ పత్రికలో అచ్చువేయలేకపోతున్నాం. రాజకీయాంశాల నుండి పత్రిక గెటప్ వరకు స్థూలంగా మీరు రాసిన వాటిలోని సారాంశాన్ని మీ దృష్టికి తెస్తూ మా జవాబును జోడిస్తున్నాం. స్థలాభావమే ఇందుకు కారణంగా అర్థం చేసుకొంటూ మా కృషికి చేయూతనివ్వండి.

### పాఠకుల అభిప్రాయాలు:

1. [illegible] కారణ్యం పాఠకులకు హిందీ పత్రిక అవసరం- కానీ తెలుగు కాదు. కాబట్టి తెలుగుకు ప్రాధాన్యత ఇవ్వకుండా, రెగ్యులర్‌గా హిందీ ప్రభాత్ అందించండి.
2. [illegible] డివిజన్ రిపోర్ట్‌లన్నీ పత్రిక కెక్కడం లేదు. మీకు మా రిపోర్ట్‌లన్నీ క్రమం తప్పకుండా అందుతున్నాయా?
3. [illegible] ఘటనలు [illegible] మాకు ఎంతగానో ఉపయోగపడుతుంది. మరిన్ని అందించడానికి కృషిచేయండి.
4. [illegible] మరింత అందంగా, ఆకర్షణీయంగా ఉండేలా చూడండి. బూర్జువా పత్రికలను లోతుగా పరిశీలించండి. రాజకీయాలే (వస్తువు) మన పత్రికకు ప్రాణం, మిగతావి సెకండరీవే అయినా, వాటిని కూడా మనం గమనంలోకి తీసుకోవాలి.
5. తప్పులు చాలా దొర్లుతున్నవి, జాగ్రత్తగా గమనించండి. ముఖ్యంగా సైద్ధాంతిక రాజకీయ వ్యాసాలలో, పార్టీ ప్రకటనల్లో చోటుచేసుకోకుండా చూడాలి.
6. పత్రికను చదవడం చాలా కఠినంగా ఉన్నది. అక్షరాలు సరిగా తెలవడం లేదు.
7. పత్రిక సైజు తగ్గిస్తే బాగుంటుంది. పొడుగు ఎక్కువగా ఉండి పత్రిక నలిగిపోతుంది. 1/8 డెమ్మీ సైజులో తేగలరా?
8. పత్రికలో అక్కడక్కడ చాలా కఠిన పదాలు చోటుచేసుకుంటున్నాయి. సరళమైన భాషలో పత్రిక తేవాలి.

పై అంశాలన్నీ మీ ఉత్తరాల ద్వారా మాకు చేరినాయి. సంక్షిప్తంగా, పై వాటికి జవాబులు ఇస్తాం.

1. దండకారణ్య కమిటీ ఏ సమయంలో తెలుగు పత్రికను ప్రారంభించిందో సవివరంగా గతంలో మన పత్రికలోనే ప్రకటించింది. నిజానికి, మన దండకారణ్య కమిటీ "అధికార పత్రిక" హిందీలోనే వస్తుంది. అదే కొనసాగుతుంది కూడా. హిందీ పత్రిక మాత్రమే, మొదట్నుంచీ దండకారణ్యం (డికె) అవసరాలను పరిపూర్తి చేస్తుంది. కానీ, 'క్రాంతి' పత్రిక రెగ్యులర్‌గా అందకపోవడంతో తెలుగు 'ప్రభాత్' వెలుగులోకి వచ్చింది. ఆ మేరకే దాని అవసరం ఉంది. దండకారణ్య రెండవ కాన్ఫరెన్స్‌లో కూడా "సాహిత్యం అందివ్వడంలో ఎదురవుతున్న సాధక బాధకాలను" లోతుగా చర్చించారు. ఆ లోపం పూడ్చుకోవడం కూడా ఒక అవసరంగా పార్టీ ముందున్నందున తెలుగు సాహిత్యం అనివార్యంగా అందిస్తున్నాం.
2. రిపోర్ట్‌లు అన్నీ చేరుతున్నాయా? మా రిపోర్ట్‌లన్నీ పత్రికలో రావడం లేదు అంటున్నారు. మీరు పంపిన అన్ని రిపోర్ట్‌లు సకాలంలోనే చేరుతున్నాయి. వాటిని మేము వివిధ శీర్షికల్లో ఉపయోగిస్తున్నాం.

(కొరవ 63వ పేజీలో)